القول السديد شرح كتاب التوحيد ـ تلغو

# ఏకత్వపు బాటకు సత్యమైన మాట




شعبة توعية الجاليات في الزلفي

123

ت: ٤٢٢٥٦٥٧ ٠٦ – فاكس: ٤٢٢٤٢٣٤ ٠٦ – ص. ب: ١٨٢

# القول السديد شرح كتاب التوحيد

# ఏకత్వపు బాటకు సత్యమైన మాట

قال تعالى: ﴿وَمَا خَلَقْتُ الْجِنَّ وَالْإِنْسَ إِلاَّ لِيَعْبُدُونَ﴾ الذاريات ٥٦

అల్లాః ఆదేశం: ﴾నేను జిన్నాతులనూ, మానవులనూ నా ఆరాధన కొరకు తప్ప మరిదేని కొరకూ సృష్టించలేదు﴿. (51: జారియాత్: 56).

﴿وَلَقَدْ بَعَثْنَا فِيْ كُلِّ أُمَّةٍ رَسُوْلاً اَنِ اعْبُدُوا اللّٰهَ وَاجْتَنِبُوا الطَّاغُوْتَ ﴾ النحل ٣٦

﴾మేము ప్రతీ జాతిలోనూ ఒక ప్రవక్తను ప్రభవింపజేశాము. అతని ద్వారా అందరికీ ఇలా హెచ్చరిక చేశాము: "అల్లాఃను ఆరాధించండి. మిథ్యాదైవాల ఆరాధనకు దూరంగా ఉండండి﴿. (16: నహ్ల్: 36).

﴿وَقَضَى رَبُّكَ اِلاَّ تَعْبُدُوْا اِلاَّ اِيَّاهُ وَ بِالْوَالِدَيْنِ اِحْسَانًا ﴾ بنى اسرائيل ٢٣

﴾నీ ప్రభువు ఇలా నిర్ణయం చేశాడు: మీరు కేవలం ఆయనను తప్ప మరెవ్వరినీ ఆరాధించకండి. తల్లిదండ్రులతో మంచితనంతో వ్యవహరించండి﴿. (17: బనీ ఇస్రాఈల్: 23).

﴿ وَاعْبُدُوا اللّٰهَ وَلاَ تُشْرِكُوْا بِهِ شَيْئًا ﴾ النساء ٣٦

﴾మీరంతా అల్లాఃకు దాస్యం చెయ్యండి. ఎవరినీ ఆయనకు భాగస్వాములుగా చేయకండి﴿. (4: నిసా: 36).

﴿ قُلْ تَعَالَوا اَتْلُ مَا حَرَّمَ رَبُّكُمْ عَلَيْكُمْ اَلاَّ تُشْرِكُوْا بِهِ شَيْئًا ﴾ الأنعام ١٥١

﴾ప్రవక్తా! వారికి ఇలా చెప్పు: ﴾రండి మీకు వినిపిస్తాను, మీ ప్రభువు మీపై విధించిన కట్టుబాట్లు ఏమిటో. ఎవ్వరినీ ఆయనకు భాగస్వాములుగా చెయ్యరాదు﴿. (6: అన్ ఆమ్: 151).

ఇబ్నె మస్ఊద్ ﷺ ఇలా చెప్పారు: 'ప్రవక్త ముహమ్మద్ ﷺ ముద్ర ఉన్న ఆయతులను చూడదలుచుకున్న వారు ఈ వాక్యాలను చదవండి". (పై ఆయతులు. 6: అన్ఆమ్: 151).

عَنْ مُعَاذِ بْنِ جَبَلٍ رَضِيَ اللّٰهُ عَنْهُ قَالَ: كُنْتُ رَدِيْفَ النَّبِيِّ عَلَى حِمَارٍ فَقَالَ لِيْ: ((يَا مُعَاذ! أَتَدْرِي مَا حَقُّ اللّٰهِ عَلَى الْعِبَادِ ، وَمَا حَقُّ الْعِبَادِ عَلَى اللّٰهِ؟)) قُلْتُ: اَللّٰهُ وَرَسُوْلُهُ اَعْلَمُ، قَالَ: ((حَقُّ اللّٰهِ عَلَى الْعِبَادِ اَنْ يَعْبُدُوْهُ وَلاَ يُشْرِكُوْا بِهِ شَيْئًا ، وَحَقُّ الْعِبَادِ عَلَى اللّٰهِ اَن لاَ يُعَذِّبَ مَن لاَّ يُشْرِك بِهِ شَيْئًا )) قُلْتُ: يَا رَسُوْلَ اللّٰه! أَفَلاَ أُبَشِّرُ النَّاسَ؟ قَالَ: ((لاَ تُبَشِّرْهُمْ فَيَتَّكِلُوْا)). متفق عليه

ముఆజ్ బిన్ జబల్ ﷺ కథనం: నేనొకసారి ప్రవక్త ﷺ వెనక గాడిదపై ఎక్కి ప్రయాణం చేయుచుంటిని. "ఓ ముఆజ్! దాసులపై అల్లాః హక్కేమిటో, అల్లాఃపై దాసుల హక్కేమిటో నీకేమయినా తెలుసా?" అని ఆయన అడిగారు. 'అల్లాఃకు, ఆయన ప్రవక్తకు మాత్రమే బాగా తెలుసు' అని నేనన్నాను. అప్పుడాయన "దాసులపై అల్లాఃకున్న హక్కు; వారు అల్లాఃను మాత్రమే ఆరాధించాలి. ఆయనకు మరెవ్వరినీ ఏ మాత్రం సాటి కల్పించకూడదు. అల్లాఃపై దాసులకున్న హక్కు; ఆయన తనకు సాటి కల్పించని వారిని శిక్షించకపోవడమే" అని అన్నారు. 'అయితే ప్రవక్తా! నేనీ శుభవార్తను ప్రజలకు తెలియజేయనా?' అని అడిగాను. దానికి ఆయన "వద్దు". (అప్పుడే) ఈ శుభవార్తను ప్రజలకు తెలియజేయకు. అలా చెబితే వారు దీని మీదే ఆధారపడతారు (ఆచరణకు దూరమయిపోతారు)" అని హెచ్చరించారు. (బుఖారి, ముస్లిం).

## ముఖ్యాంశాలు:

1- జిన్నాతుల, మానవుల సృష్టి ఉద్దేశపూర్వకంగా జరిగింది.

2- ఇబాదత్ (ఆరాధన) అంటే తౌహీద్ (ఏకత్వం). ఎందుకనగా (ప్రవక్తలకు వారి జాతికి మధ్య) వివాదం ఇందులోనే జరిగింది.

3- తౌహీద్‌ను విశ్వసించనివాడు అల్లాః యొక్క ఇబాదత్ చేయడు. ఇదే భావం ఈ వాక్యంలో ఉంది. ﴾అలాగే నేను ఆరాధించే ఆయన్ని మీరు ఆరాధించరు﴿. (109: కాఫిరూన్ : 3).

4- ప్రవక్తలను పంపడంలో కూడా వివేకం కానవస్తుంది.

5- ప్రతి జాతిలో ప్రవక్తలు వచ్చారు.

6- పవక్తలందరి ధర్మం ఒక్కటే.

7- ఇందులో ఉన్న ముఖ్య విషయం ఇది: కల్పితదైవా(తాగూత్)లను తిరస్కరించనిదే అల్లాః యొక్క ఆరాధన (ఇబాదత్) పూర్తి కాదు. ఈ వివరణ ఈ ఆయతులో ఉంది: ﴾ఎవరు తాగూత్‌ను తిరస్కరిస్తారో.....﴿. (2: బఖర: 256).

8- అల్లాఃను వదలి ఎవరెవరు పూజించబడుతున్నారో వారందురూ "తాగూత్".

9- పూర్వీకుల వద్ద సూరె అన్ఆమ్ లోని మూడు "ముహ్కమ్ ఆయతుల" ఘనత, అందులో ఉన్న పది బోధనల విలువ చాలా ఉండినది. అందులో మొదటిది: "షిర్క్" నివారణ.

సూరె బనీ ఇస్రాఈల్ లో ఉన్న "ముహ్కమ్ ఆయతుల"[1]లో పద్దెనిమిది బోధనలున్నాయి. దాని ఆరంభం అల్లాః ﴾నీవు అల్లాఃతో పాటు మరొకణ్ణి ఆరాధ్యుడుగా చేసుకోకు. అలా చేసుకుంటే నిందల పాలవుతావు. స్నేహితుడూ, సహాయకుడూ ఎవడూ లేనివాడవై పోతావు﴿. (17: బనీ ఇస్రాఈల్ : 22) అని చేసి, సమాప్తం ﴾నీవు అల్లాఃతో పాటు మరొకణ్ణి ఆరాధ్యుడుగా చేసుకోకు. అలా చేస్తే నిందల పాలవుతావు). ప్రతి మేలుకూ దూరమవుతావు﴿ (17: బనీ ఇస్రాఈల్: 39) తో చేశాడు. ఆ బోధనల ప్రాముఖ్యతను అల్లాః ఇలా తెలిపాడు. ﴾ఇవి వివేకంతో నిండివున్న విషయాలు. వాటిని నీ ప్రభువు నీకు వహీ ద్వారా తెలియజేశాడు﴿. (17: బనీ ఇస్రాఈల్ : 39).

---

(1) ఏ ఆయతుల భాష సుస్పష్టంగా ఉంటుందో, వేటి భావాన్ని నిర్ణయించటంలో ఏ విధమైన సంశయానికి తావు ఉండదో ఆ ఆయతులను "ముహ్ కమ్ ఆయతులు" అంటారు.

10. "హుఖూఖె అషర" (అంటే పది హక్కులు ఆ ఆయతులో తెలుపబడ్డాయి) పేరుతో పిలువబడే సూరె నిసా ఆయతు. దాని ఆరంభం కూడా అల్లాః ﴾మీరంతా అల్లాఃకు దాస్యం చెయ్యండి. ఎవరినీ ఆయనకు భాగస్వాములుగా చేయవద్దు﴿. (4: నిసా: 36) తో చేశాడు.

11. ప్రవక్త చివరి గడియల్లో చేసిన "వసియ్యతు" వైపు ఈ పాఠంలో శ్రద్ధ చూపబడింది.

12. మనపై అల్లాః హక్కు ఏమిటో తెలుసుకోవాలి.

13. మానవులు తమపై ఉన్న అల్లాః హక్కును నెరవేర్చితే, అల్లాఃపై మన హక్కు ఏమిటో తెలుసుకోవాలి.

14. (ముఆజ్ హదీసులో వచ్చిన విషయం, అప్పుడు) అనేక సహచరులకు తెలియదు.

15. ఔచిత్యముంటే (అవసర సందర్భంగా) విద్యకు సంబంధించిన ఒక (ముఖ్య విషయాన్ని) దాచిపెట్టుట సమంజసమే.

16. ముస్లింను సంతోషపరిచే వార్త, అతనికి వినిపించడం అభిలషనీయం.

17. విశాలమైన అల్లాః కారుణ్యం పై ఆధారపడి (ఆచరణ వదలుకొనుట) నుండి భయపడాలి.

18. ప్రశ్నించబడిన వ్యక్తికి విషయం తెలియకుంటే "అల్లాహు వరసూలుహు అఅ్ లం" (అల్లాః మరియు ఆయన ప్రవక్తకే బాగా తెలుసు) అనాలి.

19. విద్య ఒకరికి నేర్పడం, మరొకరికి నేర్పడకపోవడం యోగ్యం.

20. (ముఆజ్ హదీసులో) ప్రవక్త ఎంత నమ్రత గలవారో తెలుస్తుంది. ఆయన ప్రవక్త అయినప్పటికీ గాడిద పై స్వారీ చేశారు. వెనక ఒకరిని ఎక్కించుకున్నారు.

21. వాహనంపై ఇతరులను ఎక్కించుకొనుట ఉచితమైనదే.

22. ముఆజ్ బిన్ జబల్ రజియల్లాహు అన్హు ఘనత కూడా తెలుస్తుంది.

23. (ముఆజ్) హదీసుతో ఈ విషయం (తౌహీద్) యొక్క ప్రాముఖ్యత కూడా తెలుస్తుంది.

## తాత్పర్యము:

ఈ అధ్యాయంపేరు "కితాబుత్ తౌహీద్" (ఏకత్వపు అధ్యాయం). ఈ పుస్తకంలో మొదటి నుండి చివరి వరకు ఏకదైవారాధన, దానికి సంబంధించిన ఆదేశాలు, హద్దులు, షర్తులు, ఘనత, ప్రమాణాలు, దాని నియమాలు, వివరాలు, దాని ఫలము, దాని ప్రకారం ఆచరించడం, ఇంకా అది ఏ ఆచరణ వల్ల బలహీనతకు గురి అవుతుంది. ఏ ఆచరణ వల్ల బలంగా వుంటుంది. దేని ద్వారా సంపూర్ణమవుతుంది మొదలైన విషయాలు వచ్చాయి.

### తౌహీద్ మూడు భాగాలు:

**1: తౌహీదుల్ అస్మా వస్సిఫాత్:**

అంటే: సార్వభౌమ్యాధికారి, మహాప్రతాపుడు, అద్వితీయుడైనా ఆ ప్రభువు (అల్లాః)ను మాత్రమే విశ్వసించుట. అది అల్లాః స్వయంగా తన గురించి తెలిపిన, ప్రవక్త అల్లాః గురించి తెలిపిన నామ, గుణాలను వాటి భావాలతో, వివరాలతో ఖుర్ఆన్ మరియు సహీ హదీసులో తెలుపబడిన రీతిలో అల్లాఃకు తగిన విధంలో నమ్ముట. ఏ ఒక్క దానిని కూడా తిరస్కరించక, నిరాకరించక, తారుమారు చేయక, ఇతరులతో పోలించకుండా ఉండుట.

ఏ లోపాల, దోషాల నుండి పవిత్రుడని అల్లాః స్వయంగా తెలిపాడో, అదే విధంగా ప్రవక్త ﷺ అల్లాః విషయంలో తెలిపారో దానిని యథాతథంగా నమ్ముట.

**2: తౌహీదుర్ రుబూబియ్యత్:**

సృష్టించుట, పోషించుట, నిర్వహణములో అల్లాయే అద్వితీయుడని విశ్వసించుట. సర్వ సృష్టిని పోషిస్తున్నది ఆయనే. ప్రవక్తలు, వారి అనుచరులు లాంటి ప్రత్యేక దాసులకు నిజమైన విశ్వాసం, సద్ప్రవర్తన, లాభం చేకూర్చే విద్య మరియు సత్కార్యాలు ప్రసాదించిన, అనుగ్రహించిన వాడు ఆయనే. ఈ శిక్షణయే హృదయాలకు లాభదాయకమయినది. ఇహపరాల శుభాల కొరకు అనివార్యమైనది.

3: తౌహీదుల్ ఉలూహియ్యత్: (దీనిని "తౌహీదుల్ ఇబాదత్" అని కూడా అంటారు).

సర్వ సృష్టి యొక్క ఆరాధనలకు అర్హుడు కేవలం అల్లాః మాత్రమేనని, ఆయన అద్వితీయుడని తెలుసుకోవాలి, విశ్వసించాలి. ధర్మాన్ని కేవలం ఆయనకే ప్రత్యేకించాలి. ఈ చివరి భాగం మొదటి రెండిటిని ఆవశ్యకమైనదిగా చేస్తుంది. ఉలూహియత్ (దైవత్వం) ఎలాంటి గుణం అంటే అందులో "అస్మా వ సిఫాత్" మరియు "రుబూబియ్యత్" కు సంబంధించిన అన్ని గుణాలు వచ్చేస్తాయి. ఎలా అనగా: "అస్మా వ సిఫాత్"లో అద్వితీయుడు అల్లాః మత్రమేనని, మరియు "రుబూబియ్యత్" లో అద్వితీయుడు కూడా అల్లాఃయేనని విశ్వసించిన తరువాత "ఆరాధ్యుడు" ఆయన తప్ప మరెవ్వడు కాడని విశ్వసించి, ఆయన్నే ఆరాధించుట తప్పనిసరి, అనివార్యం అవుతుంది.

ఆది నుండి అంత్యం వరకు అల్లాః ప్రవక్తలను పంపింది తౌహీదె ఉలూహియ్యత్ ప్రచారం చేయుటకే.

రచయిత (ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహ్హాబ్ రహిమహుల్లాః) ఈ అధ్యాయంలో "అల్లాః మానవుల్ని సృష్టించింది వారు ఆయన్నే ఆరాధించాలి, ఆరాధనలో శ్రద్ధాభక్తులు కేవలం ఆయనకే చూపాలి. ఇది వారిపై విధిగా ఉన్న అల్లాః హక్కు" అనే విషయాన్ని సుస్పష్టం చేసే ఖుర్ఆన్, హదీసు ప్రమాణాలను తీసుకొచ్చారు.

సర్వ ఆకాశ గ్రంథాలు, ప్రవక్తలందరూ దీని ప్రచారమే చేశారు. బహుదైవత్వాన్ని నివారించారు. ప్రత్యేకంగా ముహమ్మద్ ﷺ మరియు ఖుర్ఆన్. దీని గురించి తాకీదుగా ఆదేశించి, దానికి సంబంధించిన విషయాల్ని స్పష్టం చేశారు. ఈ తౌహీద్ లేనిదే మోక్షం, ముక్తి లేదు అని నిక్కచ్చిగా తెలిపారు.

ఈ తౌహీద్ ను విశ్వసించి, దాని ప్రకారం ఆచరించుట విధి అని ధర్మం ఆధారంగనే కాకుండా బుద్ధిని ఉపయోగించి, ప్రపంచాన్ని చూసి గ్రహించగా,

మానవుడు స్వయంగా తన శరీర అవయవాలని క్షుణ్ణంగా పరిశీలించడం ద్వారా కూడా తెలుస్తుంది.

ఈ తౌహీద్ మానవులపై విధిగా ఉన్న అల్లాః హక్కు. ఇది మత మౌలిక విష-యాలలో అత్యుత్తమమైనది, మూలము లాంటిది, ఆచరణకు పునాది లాంటిది.

## 2వ అధ్యాయం

## తౌహీద్ ఘనత, అది పాపాల విమోచనానికి ఉత్తమ సాధనం

అల్లాః ఆదేశం: ﴿ఎవరయితే విశ్వసించి, తమ విశ్వాసాన్ని "జుల్మ్" (షిర్క్) తో కలుషితం చేయలేదో, వారికే శాంతి ఉంది. వారు మాత్రమే ఋజుమార్గంపై ఉన్నవారు﴾. (6: అన్ ఆమ్ : 82).

ఉబాద బిన్ సామిత్ కథనం: ప్రవక్త ఈ విధంగా ప్రవచించారు: (1) "అల్లాః తప్ప మరొక ఆరాధ్యుడు లేడని, ఆయన ఒక్కడేనని, (2) ఆయనకు మరెవ్వరూ సాటిలేరని మరియు ముహమ్మద్ ﷺ ఆయన దాసుడు, ప్రవక్త అని; (3) అలాగే ఈసా ﷺ కూడా అల్లాః దాసుడు, ఆయన ప్రవక్త అనీ, కాకపోతే ఆయన హజ్రత్ మర్యం (గర్భం)లో అవతరించిన అల్లాః వాక్కు, అల్లాః యొక్క ఆత్మ అని; (4,5) స్వర్గనరకాలు ఉన్నాయి అన్నది యదార్థమని, ఎవడైతే సాక్ష్యమిస్తాడో ఆ వ్యక్తి కర్మలు ఎలాంటివయినా సరే అల్లాః అతడ్ని స్వర్గంలో ప్రవేశింపజేస్తాడు". (బుఖారి, ముస్లిం).

ప్రవక్త ﷺ ఇలా సెలవిచ్చారు: "అల్లాః సంతృప్తి కొరకు "లాఇలాహ ఇల్లల్లాః" చదివే వారిపై అల్లాః నరకం నిషేధించాడు". (బుఖారి, ముస్లిం).

అబూ సఈద్ ఖుద్రీ ﷺ ఉల్లేఖించారు, ప్రవక్త ﷺ ఇలా ప్రవచించారని: 'అల్లాః నాకు కొన్ని వచనాలు నేర్పు. వాటితో నేను నిన్ను స్మరిస్తాను, నీతో అర్థిస్తాను' అని విన్నవించుకున్నారు ప్రవక్త మూసా ﷺ. "ఓ మూసా!

"లాఇలాహ ఇల్లల్లాహ్" పలుకు" అని అల్లాహ్ నేర్పాడు. మూసా ﷺ అన్నారు: 'అల్లాహ్! నీ దాసులందరూ ఇదే వచనముతో స్మరిస్తారు? "ఓ మూసా! ఏడు ఆకాశాలు, నా తప్ప అందులో ఉన్న సృష్టి, ఇంకా ఏడు భూములను త్రాసు యొక్క ఒక పళ్ళెంలో, "లాఇలాహ ఇల్లల్లాహ్" ను ఇంకొక పళ్ళెంలో ఉంచితే "లాఇలాహ ఇల్లల్లాహ్" ఉన్న పళ్ళెం క్రిందికి వంగిపోవును" అని అల్లాహ్ (దాని విలువను) తెలిపాడు. (ఇబ్ను హిబ్బాన్ మరియు హాకిం సేకరించారు. హాకిం నిజపరిచారు).

అల్లాహ్ ఇలా సెలవిచ్చారని ప్రవక్త ﷺ చెప్పగా నేను విన్నాను అని అనసు ﷺ ఉల్లేఖించారు: "ఓ మానవుడా! నీవు భూమి నిండా పాపాలు చేసినప్పటికీ నాతో మరెవ్వరినీ సాటి కల్పించకుండా (చనిపోయి) నాతో కలిసినప్పుడు, నేను అంతే (భూమి నిండా) క్షమాపణలతో నీతో కలుస్తాను, (నిన్ను క్షమిస్తాను). (తిర్మిజి. ఈ హదీసు హసన్).

## ముఖ్యాంశాలు:

1. అల్లాహ్ దయ, కరుణ చాలా విశాలమైనది.
2. తౌహీద్ యొక్క పుణ్యం అల్లాహ్ వద్ద చాలా ఎక్కువగా ఉంది.
3. దానితో పాటు అది పాపాలను తూడిచివేయును.
4. సూరె అన్ ఆమ్ లోని ఆయతులో "జుల్మ్" అంటే షిర్క్ అని భావం.
5. ఉబాద బిన్ సామిత్ ﷺ హదీసులో ఉన్న ఐదు విషయాల్ని గమనించండి.
6. ఉబాద హదీసు, ఇత్బాన్ హదీసు మరియు అబూ సఈద్ ఖుద్రీ ﷺ హదీసులను కలిపితే "లాఇలాహ ఇల్లల్లాహ్" యొక్క అసలు అర్థం నీకు తెలుస్తుంది. మరియు దాని సరియైన భావాన్ని తెలుసు కొనక మోసబోయి తప్పులో పడియున్నవారి విషయం కూడా స్పష్టం అవుతుంది.
7. ఇత్బాన్ హదీసులో ఉన్న షర్తు (అల్లాహ్ ఇష్టం కొరకు)పై చాలా శ్రద్ధ వహించాలి.

8. "లాఇలాహ ఇల్లల్లాః" ఘనత తెలుసుకునే అవసరం ప్రవక్తలకు సయితం ఉండేది.
9. "లాఇలాహ ఇల్లల్లాః" సర్వ సృష్టికన్నా ఎక్కువ బరువుగలదైనప్పటికీ, దాన్ని చదివేవారిలో చాలా మంది యొక్క త్రాసు తేలికగా (విలువలేనిదిగా) ఉండును.
10. ఆకాశాలు ఏడు ఉన్నట్లు భూములు కూడా ఏడు ఉన్నవని ఋజువయింది.
11. అందులో కూడా నివసించువారున్నారు. (జీవించువారున్నారు).
12. అల్లాః యొక్క అన్ని గుణవిశేషణాలను నమ్మాలని రుజువవుతుంది. కాని "అష్ అరియ్యా" అను ఒక వర్గం వారు కొన్ని గుణవిశేషణాలను తిరస్కరిస్తారు.
13. అనసు ؓ ఉల్లేఖించిన హదీసును నీవు అర్థం చేసుకుంటే, ఇత్బాన్ ؓ ఉల్లేఖించిన హదీసు: "అల్లాః సంతృప్తి కొరకు "లాఇలాహ ఇల్లల్లాః" చదివే వారిపై అల్లాః నరకం నిషేధించాడు" లో అది కేవలం నోటితో చదవటం కాదు షిర్క్ ను వదలుకోవాలి అని కూడా అర్థం చేసుకుంటావు.
14. ఉబాద ؓ హదీసులో ఈసా ؑ మరియు ముహమ్మద్ ﷺ ఇద్దరిని "అల్లాః దాసులు, ప్రవక్తలు" అని చెప్పబడింది.
15. (ప్రతీది అల్లాః ఆజ్ఞతోనే పుడుతుంది గనుక అది అల్లాః వాక్కు. కాని ఇక్కడ) ప్రత్యేకంగా ఈసా ؑ ను అల్లాః వాక్కు అని చెప్పబడింది.
16. (ఆత్మ అల్లాః యొక్క సృష్టి అయినప్పటికీ) ప్రత్యేకంగా ఈసా ؑ ను అల్లాః యొక్క ఆత్మ అని చెప్పబడింది.
17. స్వర్గనరకాలను విశ్వసించు ఘనత కూడా తెలిసింది.
18. ఉబాద హదీసులో "కర్మలు ఏలాంటివైన సరే" అన్నదానితో (అతడు ఏకదైవోపాసకుడు అయి ఉండుట తప్పనిసరి అనే) భావం తెలుస్తుంది.
19. (ప్రళయదినాన కర్మలు తూకము చేయబడే) త్రాసుకు రెండు పళ్ళాలుండును అని తెలిసింది.
20. ఇత్బాన్ హదీసులో అల్లాఃకు "వజ్ హ్" ఉంది అని వచ్చింది. దాని అర్థం "ముఖం" (Face).

## తాత్పర్యం:

తౌహీద్ మానవులందరిపై విధిగా ఉన్నదని మొదటి అధ్యాయంలో తెలుపబడింది. ఇందులో దాని ఘనత, ఔన్నత్యం, దాని మంచి ప్రభావాన్ని మరియు దాని సత్ఫలితాన్ని తెలుపడం జరిగింది. తౌహీద్‌లో ఉన్నటువంటి వివిధ ఘనతలు, మంచి ప్రభావాలు మరే దానిలో లేవు. ఇహపరాల మేళ్ళన్నియు తౌహీద్ ఫలితము, దాని ఘనతతోనే లభించును. పాపాల మన్నింపు, వాటి విమోచనం కూడా తౌహీద్ ఘనత వలనే. దానికి ఆధారం కూడా పైన తెలుపబడింది. (దాని అనేక ఘనతల్లో కొన్ని క్రింద చూడండి).

1) ఇహపరాల కష్టాలు, విపత్తులు దూరమగుటకు ఇది గొప్ప కారణం.
2) తౌహీద్ హృదయంలో ఆవగింజంత ఉన్నా, అది నరకాగ్నిలో శాశ్వతంగా ఉండకుండా కాపాడుతుంది.
3) అది సంపూర్ణంగా ఉంటే నరక ప్రవేశం నుండే కాపాడుతుంది.
4) తౌహీద్ గల వ్యక్తికి ఇహపర లోకాల్లో సంపూర్ణ సన్మార్గం, పూర్తి శాంతి ప్రాప్తియగును.
5) అల్లాః సంతృప్తి, దాని సత్ఫలితం పొందుటకు అది ఏకైక కారణం. ప్రవక్త సిఫారసుకు అర్హుడయ్యే అదృష్టవంతుడు "లాఇలాహ ఇల్లల్లాః" నిర్మలమైన మనుస్సుతో చదివేవాడు.
6) బాహ్య, ఆంతర్య, సర్వ మాటల, కర్మల అంగీకారం, వాటి సంపూర్ణత, వాటి సత్ఫలితం తౌహీద్ పై ఆధారపడియుంది. తౌహీద్‌లో ఎంత బలం, స్వఛ్ఛత ఉంటే, అంతగా ఆ విషయాలు సంపూర్ణం అవుతాయి.
7) సత్కార్యాలు చేయడం, దుష్కార్యాల నుండి దూరముండడం తౌహీద్ మూలంగా సులభమగును. బాధ కలిగినప్పుడు తృప్తి లభించును. తౌహీద్, విశ్వాసంలో అల్లాః కొరకు స్వఛ్ఛత చూపేవాడు సత్కార్యాల పై సత్ఫలితం, అల్లాః ప్రసన్నతను ఆశిస్తాడు. కనుక అవి అతనికి చాలా

తేలికగా ఏర్పడుతాయి. దుష్కార్యాల పై ఉన్న శిక్షతో భయపడుతాడు కనుక అవి వదలుకోవడం కూడా అతనికిచాలా తేలికగా ఉంటుంది.

8) హృదయాంతరంలో తౌహీద్ సంపూర్ణమయితే అల్లాః, విశ్వాసం పట్ల ప్రేమను కలుగజేస్తాడు, దాన్ని మనోరంజనమైనదిగా చేస్తాడు. అవిశ్వాసం, దుర్మార్గం, అవిధేయతల పట్ల అసహ్యం కలిగేలా చేస్తాడు. అతన్ని సన్మార్గం పొందువారిలో చేర్చుతాడు.

9) ఏ దాసునిలో తౌహీద్, విశ్వాసం సంపూర్ణంగా ఉంటుందో అతడు అసహ్యమైన సంఘటనలను, కష్ట, బాధలను ఎంతో విశాలమైన, సంతృప్తికరమైన మనుస్సుతో సహిస్తాడు. అల్లాః వ్రాసి ఉంచిన అదృష్టంపై సంతోషంగా ఉంటాడు.

10) ఇంకా దాని ఘనత: అది మానవ దాస్యం నుంచి అతన్ని విముక్తి కలిగిస్తుంది. అతడు అల్లాః తప్ప ఇతరుల పై ఆధారపడి, వారితో భయపడుతూ ఉండడు. వారి దయదాక్షిణ్యాల వైపు కన్నెత్తి చూడడు. అతడు చేసేది వారి కొరకూ కాదు. వాస్తవానికి ఇదే నిజమైన పరువుప్రతిష్ఠ, మాన్యత. దీనితో పాటు అతడు అల్లాఃనే ఆరాధిస్తాడు. ఆయనకు తప్ప మరెవ్వరికి భయపడడు. మరెవ్వరితో కరుణను ఆశించడు. ఇలా అతడు సంపూర్ణ సాఫల్యం పొందుతాడు.

11) తౌహీద్ తప్ప ఇంకే దానికీ లభించని ఘనత: అతని మనసులో తౌహీద్, ఇఖ్లాసుతో కూడుకొని సంపూర్ణం అయితే, అతని చిన్న కర్మ కూడా అసంఖ్యాక ఫలితాన్ని పొందుతుంది. అతని మాటల, చేష్టల ఫలితం లెక్క లేకుండా పెరుగుతుంది. అబూ సఈద్ ﷺ హదీసులో వచ్చిన ప్రకారం "ఇఖ్లాసుతో కూడుకున్న అతని ఆ సద్వచనం (లాఇలాహ ఇల్లల్లాః) భూమ్యాకాశాలు, (అల్లాః తప్ప) అందులో ఉన్న సర్వం కన్నా బరువుగా ఉంటుంది". ఇలాంటి విషయమే "హదీసుల్ బితాఖ" అన్న పేరుతో ప్రసిద్ధి చెందిన హదీసులో కూడా ఉంది: "లాఇలాహ

ఇల్లల్లాః" వ్రాసి ఉన్న చిన్న ముక్క తొంబైతొమ్మిది రిజిస్టర్ల (Records) కంటే ఎక్కువ బరువుగలదైపోతుంది. అందులో ప్రతీ ఒక్క దాని పొడువు, మనిషి దృష్టి ఎంత దూరము చేరుకుంటుందో అంత దూరముంటుంది. మరో వైపు కొందరుంటారు; తౌహీద్, ఇఖ్లాసు మనసులో సంపూర్ణం లేనివారు. వారికి ఈ స్థానం, ఘనత ప్రాప్తి కాదు.

12) ఇహపరాల్లో తౌహీద్ వారలకు అల్లాః విజయం, సహాయం, గౌరవం నొసంగుతాడు. సన్మార్గం ప్రసాదిస్తాడు. మంచి పనులు చేయు టకు సౌకర్యం కలుగజేస్తాడు. మాటలను, చేష్టలను సంస్కరించుకునే భాగ్యం ప్రసాదిస్తాడు.

13) విశ్వాసులైన తౌహీద్ వారల నుండి ఇహపరాల బాధలను దూరము చేసి, శాంతి, సుఖ ప్రదమైన జీవితం అనుగ్రహిస్తాడు. దీని ఉదాహరణలు, సాక్ష్యాలు ఖుర్ఆన్, హదీసులో చాలా ఉన్నవి.

## 3వ అధ్యాయం

## తౌహీద్ యొక్క నిర్ధారణ చేసినవారు విచారణ లేకుండా స్వర్గంలో చేరుతారు

అల్లాః ఆదేశం: ﴾నిజానికి ఇబ్రాహీమ్ తనకు తానే ఒక సంఘం. అల్లాఃకు పరమ విధేయుడు. ఆయన యందే మనస్సు నిలిపినవాడు. అతను ఎన్నడూ ముష్రిక్కుగా ఉండలేదు﴿. (16: నహ్ల్: 120).

﴾ఎవరు తమ ప్రభువునకు ఇతరులను భాగస్వాములుగా చేయరో (వారే మేళ్ళ వైపునకు పరుగులు తీసేవారు﴿. (23: మూ'మినూన్: 59).

హుసైన్ బిన్ అబ్దుర్ రహ్మాన్ కథనం: నేను సఈద్ బిన్ జుబైర్ వద్ద ఉండగా "నిన్న రాత్రి తెగిపడిన నక్షత్ర చుక్కను ఎవరు చూశారు" అని

అడిగారాయన. "నేను చూశాను. అప్పుడు నేను నమాజులో లేను, కాని విష-పురుగు కాటేసినందున బాధతో ఉన్నాను'. అని చెప్పాను. "అయితే నీవు ఏమి చేశావు" అని ఆయన ప్రశ్నించారు. "మంత్రం చదివాను" అని జవా-బిచ్చాను. "ఎందుకు అలా చేశావు" అని ఆయనడిగారు. "షాబీ మాకు ఒక హదీసు వినిపించారు (దాని ఆధారంగా నేను చదివాను)" అని చెప్పాను. "ఆయన ఏ హదీసు మీకు వినిపించారు" అని ఆయన అడిగారు. నేను చెప్పాను: "బురైద బిన్ హుసయ్యిబ్ ఉల్లేఖించిన ఒక హదీసు మాకు వినిపించారు. ఆయన చెప్పారు: "దిష్టి తలుగుతే మరియు విషపురుగు కాటేస్తే తప్ప మంత్రించకూడదు" అని. "ఎవరు విన్న హదీసుపై ఆచరించారో వారు మంచి పని చేశారు" అని సఈద్ చెప్పి, మాకు ఇబ్ను అబ్బాసు ﷺ ఈ హదీసు వివిపించారు" అన్నారు. ప్రవక్త ﷺ ఇలా సెలవిచ్చారు: "నాకు వివిధ అనుచర సమాజాలను చూపించడం జరిగింది. (వారికి సారథ్యం వహిస్తూ) ప్రవక్తలు నా ముందు నుంచి వెళ్ళసాగారు. అప్పుడు కొందరు ప్రవక్తల వెనక ఓ చిన్న సమూహం ఉంది. కొందరు ప్రవక్తల వెనక ఒక్కొక్క వ్యక్తి మాత్రమే ఉంటే, మరికొందరి ప్రవక్తల వెనక ఇద్దరేసి వ్యక్తులు ఉండేవారు. అసలు ఒక్క మనిషి కూడా తమ వెనుక లేని ప్రవక్తలు కూడా వారిలో ఉన్నారు. ఆ తరువాత నాకు ఒక పెద్ద జన సమూహము కన్పించింది. అది నా అనుచర సమాజం కావచ్చని భావించాను. కాని ఆ సమూహం హజ్రత్ మూసా ﷺ, ఆయన అనుచర సమాజమని నాకు తెలియజేయబడింది. ఆ తరువాత జన సమూహం మరొకటి చూశాను. అప్పుడు ఈ జన సమూహం మీ అనుచర సమాజమే. వీరిలో డెబ్బై వేల మంది ఎలాంటి విచారణ, శిక్ష లేకుండానే స్వర్గంలో ప్రవేశిస్తారు" అని తెలుపబడింది.

ఆ తరువాత ప్రవక్త లేచి వెళ్ళిపోయారు. (డెబ్బై వేల మంది ఎవరయి ఉంటారో) అని కొందరు అనుచరులు పరస్పరం మాట్లాడుకుంటూ "బహుశ వారు ప్రవక్త మైత్రిత్వం (స్నేహం) పొందిన వారు కావచ్చు"

అన్నారు. మరి కొందరు "వారు ఇస్లాంలోనే పుట్టి ఏ మాత్రం షిర్క్ చేయని-వారు కావచ్చు" అని అన్నారు. ఇలా చర్చించుకుంటూ ఉండగా ప్రవక్త ﷺ వచ్చేశారు. వారందరూ చర్చించుకున్న విషయాల్ని ప్రవక్తకు తెలిపారు. అప్పుడు ఆయన ﷺ "వారు మంత్రాలు చేయించేవారు కారు, దుశ్శకునాలను పాటించరు, వాతలతో చికిత్స చేయించరు. వారు తమ ప్రభువును మాత్రమే నమ్ముకొని (ఏ కష్టమొచ్చినా) ఆయన మీదే ఆధారపడతారు" అని విశదీకరించారు.

ప్రవక్త అనుచరుల్లో 'ఉక్కాషా బిన్ మిహ్‌సన్' లేచి నిలబడి "ప్రవక్తా! నేను వారిలో ఒకరిని కావాలని మీరు దుఆ చేయండి" అని కోరాడు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పారు: "నీవు వారిలో ఒకడివి". ఇది చూసి మరో వ్యక్తి లేచి "ప్రవక్తా! నేను వారిలో ఒకరిని కావాలని మీరు దుఆ చేయండి" అని అడిగాడు. ప్రవక్త ﷺ చెప్పారు: "ఉక్కాషా నీకంటే ముందు ఈ సదవ-కాశాన్ని ఉపయోగించుకున్నాడు". (బుఖారి, ముస్లిం).

## ముఖ్యాంశాలు:

1. తౌహీద్ విషయంలో ప్రజల స్థానాల్లో వ్యత్యాసం గలదు.
2. తౌహీద్ యొక్క భావం స్పష్టమయింది.
3. ప్రవక్త ఇబ్రాహీం ముష్రికులలోనివారు కారు అని అల్లాః వారిని ప్రశం-సించాడు.
4. షిర్క్ నుండి దూరమున్న ఔలియాఅల్లాఃలను (అల్లాః భక్తులను) ప్రశంసించబడింది.
5. మంత్రం చేయించుట, వాతలు వేయించుటను మానుకొనుట "తౌహీద్ యొక్క తహ్ ఖీఖ్" చేసినట్టగును.
6. పై హదీసులో వచ్చిన గుణాలు అలవరచుకొనుట అల్లాఃపై "భరోసా" (నమ్మకం, ఆధారం) చాలా ఉన్నట్లు.

7. ఈ హదీసు ద్వారా ప్రవక్త సహచరుల అపారవిద్య తెలుస్తుంది. (ఆ డెబ్బై వేల మంది అల్లాః దయ తరువాత) వారి సత్కార్యాలతోనే (విచారణ, శిక్ష లేకుండా) స్వర్గ ప్రవేశానికి అర్హులవుతారు.
8. సహాబీలు మంచి విషయాల్లో మున్ముందుగా ఉండడానికి ఎంతగా కాంక్షించేవారో తెలుస్తుంది.
9. ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం "ఉమ్మతీలు" (అనుచర సమాజం) ఉన్నత స్థానంలో, సంఖ్యలో ఇతర ప్రవక్తల "ఉమ్మతీల" (అనుచరుల) కంటే ఎక్కువగా, శ్రేష్ఠులుగా ఉన్నట్లు తెలుస్తుంది.
10. ప్రవక్త మూసా అలైహిస్సలాం "ఉమ్మతీల" ఘనత కూడ తెలుస్తుంది.
11. ప్రవక్త ఎదుట గత "ఉమ్మతీలందరు" ప్రత్యక్షమయ్యారు.
12. ప్రతీ "ఉమ్మత్" తమ ప్రవక్త వెంట వచ్చును.
13. ప్రవక్తలను అనుసరించిన ప్రజలు అల్ప సంఖ్యాకులు అని తెలుస్తుంది.
14. ఏ ప్రవక్తను విశ్వసించిన వారు ఎవరూ ఉండరో, ఆ ప్రవక్త ఒంటరిగా వచ్చును.
15. దీని వల్ల తెలిసిందేమిటంటే: మెజారిటి ఉన్నప్పుడు విర్రవీగ వద్దు. మైనారిటిగా ఉన్నప్పుడు చింతించవద్దు.
16. విష పురుగు కాటు వేసినా, దిష్టి తగిలినా, మంత్రం చేయించుట ధర్మసమ్మతం.
17. సఈద్ బిన్ జుబైర్ "ఎవరు విన్న హదీసుపై ఆచరించారో వారు మంచి పని చేశారు" అని అన్న పదంతో పూర్వీకులు విద్యలో ఎంత ఆరితేరిన వారో తెలుస్తుంది. ఇంకా; వీరు చెప్పిన హదీసు మరియు హుసైన్ బిన్ అబ్దుర్ రహ్మాన్ చెప్పిన హదీసులో తేడా ఏ మాత్రం లేదు.
18. పూర్వ పండితులు అనవసర ప్రశంసల నుండి దూరంగా ఉండేవారు.
19. ఉక్కాషాకు "నీవు వారిలో ఒకడివి" అని ప్రవక్త చెప్పడం ప్రవక్త పదవి గుర్తుల్లో ఒకటి.

20. ఉక్కాషా ఘనత. (అతడు స్వర్గవాసి అని తెలుపబడుట).
21. ఉక్కాషా తరువాత వ్యక్తికి ప్రవక్త చెప్పిన మాటల ద్వారా సందర్భాన్ని-బట్టి స్పష్టంగా కాకుండా సైగల ద్వారా సంక్షిప్తంగా మాట్లడడం యోగ్యం అని తెలుస్తుంది.
22. ప్రవక్త నీతి, సద్ప్రవర్తన కూడా ఈ హదీసులో ఉట్టిపడుతుంది.

## తాత్పర్యం:

ఈ అధ్యాయం దీనికంటె ముందు అధ్యాయాన్ని సంపూర్ణ పరుస్తుంది. ఇది దానికి సంబంధించినదే.

తౌహీద్ యొక్క "నిర్ధారణ" అంటే: అత్యధికమైన షిర్క్, అత్యల్పమైన షిర్క్ నుండి, వాక్కులోనూ, విశ్వాసంలోనూ, కర్మలలోనూ అన్ని బిద్ అత్ (కల్పిత ఆచారా)ల నుండి, పాపాల నుండి తౌహీద్ ను కాపాడుట, శుద్ధి పరుచుట. ఇవన్నియు కేవలం అల్లాః ప్రీతి కొరకు మాత్రమే చేయుట. ఎందుకనగా అత్యధికమైన షిర్క్ తౌహీద్ కు విరుద్ధమైనది. అత్యల్పమైన షిర్క్ సంపూర్ణ తౌహీద్ కు విరుద్ధమైనది. బిద్ అత్, పాపాలు తౌహీద్ ను కలుషితం చేసి, దాని సంపూర్ణత్వానికి అడ్డు పడతాయి. దాని లాభాల నుండి దూరం చేస్తాయి.

తౌహీద్ యొక్క నిర్ధారణ చేసిన వాని హృదయం విశ్వాసం, తౌహీద్, ఇఖ్లాసు (సంకల్పశుద్ధి)తో నిండిపోతుంది. తన ఆచరణ దాన్ని సత్యా-పరుస్తుంది. అది ఏ విధంగనగా: అల్లాః యొక్క సమస్త ఆదేశాలకు అతడు శిరసా వహిస్తాడు. అవిధేయతకు పాల్పడి విశ్వాసాన్ని నష్టపరుచుకోడు. అలాంటివాడే స్వర్గంలో విచారణ లేకుండా వెళ్ళేవాడు. అందులో ప్రవేశించే మొదటి వ్యక్తి అయ్యేవాడు.

అల్లాఃకు సంపూర్ణ విధేయుడై, అల్లాఃపై దృఢమైన నమ్మకం ఉంచి, ఏ ఒక్క విషయంలో కూడా అల్లాఃను వదలి మానవుల వైపు మరలకుండా, వారిని

అడగకుండా ఉండి, అతని బాహ్యం, ఆంతర్యం, మాటలు, చేష్టలు, ప్రేమ, ద్వేషం అన్నియు కేవలం అల్లాః ప్రీతి కొరకే చేయుట, ప్రవక్త అడుగుజాడల్లో నడుచుట తౌహీద్ యొక్క నిర్ధారణకు ప్రత్యేక నిదర్శనం.

ఇక్కడ ప్రజల స్థానాల్లో వ్యత్యాసం గలదు. ﴾ప్రతి వ్యక్తి స్థానం అతడు చేసే పనులకు అనుగుణంగా ఉంటుంది﴿. (6: 132).

ఆశలతో, వాస్తవం లేని మాటలతో తౌహీద్ యొక్క నిర్ధారణ కాదు. మనస్సులో స్థిరమైన విశ్వాసం, ఇహ్సాన్ (ఆరాధనా సౌందర్యం) వాస్తవికతలతో, దానికి తోడుపడే సత్ప్రవర్తన, సత్కార్యాలతో అవుతుంది.

ఈ విధంగా తౌహీద్ యొక్క నిర్ధారణ చేసినవారు ఈ అధ్యాయంలో చెప్ప-బడిన ఘనతలకు అర్హులవుతారు.

## 4వ అధ్యాయం

## షిర్క్ నుండి భయపడుట

అల్లాః ఆదేశం: ﴾అల్లాః క్షమించనిది కేవలం షిర్క్ మాత్రమే. అది తప్ప ఏ పాపాన్ని అయినా ఆయన తాను ఇష్టపడిన వారికొరకు క్షమిస్తాడు﴿. (4: నిసా: 48).

﴾నన్ను, నా సంతానాన్ని విగ్రహారాధన నుండి కాపాడు﴿. అని ఇబ్రాహీం ﷺ దుఆ చేశారు. (14: ఇబ్రాహీం: 35).

"అతి ఎక్కువగా నేను మీ పట్ల భయం చెందేది "షిర్క్ అస్గర్"కు మీరు పాల్పడుతారని" ప్రవక్త చెప్పినప్పుడు, సహచరులు "అదేమిటి" అని అడిగినందుకు "ప్రదర్శనాబుద్ధి" అని బదులిచ్చారు ఆయన ﷺ.

"అల్లాఃతో మరొకరిని సాటి కల్పించి, అర్థించేవాడు అదే స్థితిలో చనిపోతే నరకంలో చేరుకుంటాడు" అని ప్రవక్త ﷺ చెప్పారని ఇబ్ను మసూద్ ؓ తెలిపారు. (బుఖారి).

"అల్లాహ్‌తో మరెవ్వరిని సాటి కల్పించని స్థితిలో చనిపోయిన వ్యక్తి స్వర్గంలో చేరుకుంటాడు. అల్లాహ్‌తో సాటి కల్పించి చనిపోయిన వ్యక్తి నరకంలో చేరుకుంటాడు" అని ప్రవక్త ﷺ ప్రవచించారు.

## ముఖ్యాంశాలు:

1. షిర్క్ నుండి భయపడుట.
2. ప్రదర్శనాబుద్ధి షిర్క్‌లో వస్తుంది.
3. అది షిర్కె అస్గర్ లో వస్తుంది.
4. సత్కార్యాలు చేసేవారిలో అది చోటు చేసుకుంటుందన్న భయం ఎక్కువ ఉంటుంది.
5. స్వర్గనరకాలు సమీపములోనే ఉన్నాయని తెలిసింది.
6. ఒకే హదీసులో రెండిటిని కలిపి చెప్పడం జరిగింది.
7. షిర్క్ చేయకుండా చనిపోయి అల్లాహ్‌తో కలసినవాడు స్వర్గంలో చేరుతాడు. షిర్క్ చేసి చనిపోయి అల్లాహ్‌తో కలసినవాడు నరకంలో పోతాడు. అతడు అందరికన్నా ఎక్కువ ప్రార్థనలు చేసినవాడైనప్పటికినీ.
8. ముఖ్య విషయం: ఇబ్రాహీం అలైహిస్సలాం తమను, తమ సంతానాన్ని విగ్రహారాధన నుండి కాపాడమని అల్లాహ్‌ను ప్రార్థించారు.
9. ﴾ప్రభూ! ఈ విగ్రహాలు చాలా మందిని మార్గం తప్పించాయి﴿ **(14: 36).** అంటూ (దుర్మార్గంలో పడుతున్న) అధికసంఖ్యాకులతో గుణపాఠం నేర్చుకొని (ఓ ప్రభూ! నా సంతానాన్ని విగ్రహారాధన నుండి కాపాడుము అని అర్థించారు).
10. ఇమాం బుఖారి (రహిమహుల్లాహ్) తెలిపిన ప్రకారం ఇందులో "లాఇలాహ ఇల్లల్లాహ్" యొక్క భావం ఉంది.
11. షిర్క్ నుండి దూరమున్నవారి ఘనత తెలిసింది.

## తాత్పర్యం:

షిర్క్ తౌహీద్‌కు విరుద్ధం. దాని రెండు రకాలు: ఒకటి షిర్క్ అక్బర్ (జలి). రెండవది: షిర్క్ అస్గర్ (ఖఫి).

షిర్క్ అక్బర్ అంటే: అల్లాఃతో మొరపెట్టుకున్నట్లు, భయం చెందినట్లు, ప్రేమించినట్లు ఇతరులతో మొరపెట్టుకొనుట, భయం చెందుట, ప్రేమించుట. సారాంశమేమనగా: అల్లాఃకు చేయవలసిన ప్రార్థనలు, ఆరాధనలు ఇతరులకు చేయుట షిర్క్ అక్బర్. దీనికి పాల్పడినవానిలో ఏ మాత్రం తౌహీద్ లేనట్లే. అల్లాః స్వర్గాన్ని నిషేధించింది ఇలాంటి ముష్రిక్‌పైనే. అతని నివాసం నరకం. ఇక ఎవరైనా ఇలాంటి పనులు చేస్తూ దానిని "వసీల", "పుణ్యపురుషుల ప్రేమ", అన్న పేర్లతో నిజాన్ని వక్రీకరిస్తే అది కూడ షిర్క్ అవుతుంది.

షిర్క్ అస్గర్ అంటే: షిర్క్ అక్బర్ వరకు చేర్పించే సాధనాలు, కార్యాలు. ఉదాహరణకు: "గులువ్వ్ " (అతిశయోక్తి. అంటే: పుణ్యపురుషుల విషయంలో హద్దులు మీరుట), అల్లాఃయేతరుల ప్రమాణం, చూపుగోలుతనం, ప్రదర్శనాబుద్ధి మొదలగునవి).

# 5వ అధ్యాయం:

## "అల్లాః తప్ప మరొక ఆరాధ్యుడు లేడు" అనే ప్రమాణానికి ఆహ్వానించుట

అల్లాః ఆదేశం: ﴿ఇలా చెప్పండి! నా మార్గం ఇది. స్పష్టమగు సూచనను అనుసరించి నేను అల్లాః వైపునకు పిలుస్తాను﴾. **(12: యూసుఫ్: 108).**

ఇబ్ను అబ్బాసు ﷺ కథనం: ప్రవక్త ﷺ మఆజ్ ﷺ ను యమన్ దేశానికి పంపుతూ ఇలా ఉపదేశించారు: "నీవు గ్రంథమివ్వబడిన (క్రైస్తవుల) వైపునకు

వెళ్తున్నావు. మొట్టమొదట నీవు వారిని "లాఇలాహ ఇల్లల్లాః" సాక్ష్యం ఇవ్వాలని ఆహ్వానించు". మరో రివాయత్ లో ఉంది. "అల్లాః ఏకత్వాన్ని నమ్మాలని చెప్పు. వారు నీ ఈ మాటకు విధేయులయితే, అల్లాః వారికి రోజుకు (24గంటల్లో) ఐదు సార్లు నమాజు చేయుట విధించాడని తెలుపు. నీ ఈ మాటకు కూడా విధేయత చూపితే, అల్లాః వారిపై జకాత్ విధించాడని తెలియజేయి. అది వారి ధనికుల నుండి వసూలు చేసి, పేదలకు పంచబడుతుంది అని తెలుపు. నీ ఈ మాటను వారు అమలు పరుస్తే, (వారి నుండి జకాత్ వసూలు చేసినప్పుడు) వారి శ్రేష్ఠమైన వస్తువుల జోలికి పోకు. పీడితుని ఆర్తనాదాలకు భయపడు. పీడితుని ఆర్తనాదానికి, అల్లాఃకి మధ్య ఏలాంటి అడ్డుతెర ఉండదు".

సహల్ బిన్ సఅద్ కథనం: ఖైబర్ యుద్ధం నాడు ప్రవక్త ﷺ ఇలా అన్నారు: "నేను రేపు యుద్ధపతాకం ఎలాంటి వ్యక్తికి ఇస్తానంటే, అతను అల్లాః, ఆయన ప్రవక్తని ప్రేమిస్తాడు. అతన్ని అల్లాః, ఆయన ప్రవక్త ప్రేమిస్తారు. అల్లాః అతని ద్వారా (ఖైబర్) విజయం చేకూరుస్తాడు". ఆ పతాకం ఎవరికి దొరుకుతుందో అన్న ఆలోచనలోనే వారు రాత్రి గడిపి, తెల్లవారుకాగానే ప్రవక్త సమక్షంలో హాజరయి, తనకే ఆ పతాకం లభిస్తుందని ఆశించారు. అప్పుడు "అలీ బిన్ అబీ తాలిబ్ ఎక్కడున్నాడ"ని ప్రవక్త ﷺ అడిగారు. ఆయన కళ్ళలో ఏదో బాధగా ఉంది అని సమాధానమిచ్చారు ప్రజలు. ఎవరినో పంపి అతన్ని పిలిపించడం జరిగింది. ప్రవక్త ﷺ అతని కళ్ళల్లో తమ లాలాజలాన్ని ఉమ్మినారు. తక్షణమే అలీ رضي الله عنه తనకసలు ఎలాంటి బాధే లేనట్లు పూర్తిగా ఆరోగ్య వంతులైపోయారు. యుద్ధ పతాకం ప్రవక్త ﷺ అలీ رضي الله عنه చేతికి ఇచ్చి, ఇలా బోధించారు: "నీవు నెమ్మదిగా, హుందాగా వెళ్ళి వారి మైదానంలో దిగు. ఆ తరువాత వారికి ముందుగా ఇస్లాం సందేశాన్ని అందజెయ్యి. వారు నిర్వహించవలసిన అల్లాః హక్కులు వారిపై ఏమున్నాయో వారికి బోధించు. అల్లాః సాక్షిగా! నీ ద్వారా ఏ ఒక్కనికి అల్లాః రుజు మార్గం (ఇస్లాం) ప్రసా-

దించినా అది నీకోసం ఎరుపు రంగు ఒంటెల కంటే ఎంతో విలువైనది, శ్రేష్టమైనది". (బుఖారి, ముస్లిం).

## ముఖ్యాంశాలు:

1. అల్లాః వైపునకు ఆహ్వానించుట (ప్రవక్త మరియు) ఆయన్ని అనుసరించిన-వారి జీవితాశయం.
2. 'ఇఖ్లాసు' ఉండుట చాలా ముఖ్యం. ఎందుకనగా ధర్మం వైపు ఆహ్వానిస్తు-న్నామంటున్న అనేక మంది స్వయంగా తమ వైపునకు ప్రజల్ని ఆహ్వానిస్తున్నారు.
3. విద్య ఆధారంగా (ధర్మప్రచారం చేయుట) కూడా ఒక విధి.
4. అల్లాఃను లోపాలు లేని పవిత్రుడని నమ్మటంయే ఉత్తమమైన తౌహీద్.
5. అల్లాః లోపాలు గలవాడని భావించుట చాలా చెడ్డ షిర్క్.
6. ముస్లిం, ముష్రికులకు అతి దూరంగా ఉండాలి. ఎందుకనగా అతను షిర్క్ చేయనప్పటికి వారిలో కలసిపోయే ప్రమాదముంటుంది.
7. విధుల్లో మొట్టమొదటిది తౌహీద్.
8. అన్నిటికి ముందు, చివరికి నమాజుకన్నా ముందు తౌహీద్ ప్రచారం మొదలుపెట్టాలి.
9. మఆజ్ హదీసులో "అన్ యువహ్హిదుల్లాః" (అల్లాః ఏకత్వాన్ని స్వీకరించుట) మరియు "లాఇలాహ ఇల్లల్లాహ" రెండిటి భావం ఒక్కటే.
10. మనిషి దైవ గ్రంథం పొందిన (యూదుడు, క్రైస్తవుడు లాంటి) వాడు అయి కూడా "లాఇలాహ ఇల్లల్లాః" అర్థం తెలుసుకోలేకపోవచ్చు, లేక తెలుసుకొని కూడా దాని ప్రకారం ఆచరించకపోవచ్చు.
11. విద్యను క్రమ క్రమంగా నేర్పాలని బోధపడింది.
12. ముఖ్యమైన విషయంతో ఆరంభించాలని తెలిసింది.
13. జకాత్ సొమ్మును ఎందులో ఖర్చుపెట్టాలో తెలిసింది.

14. (జకాత్ సొమ్ము ఎందులో ఖర్చు చెయ్యాలి తెలియక, మఆజ్ సందేహ పడుకుండా ప్రవక్త ముందే వివరించినట్లు) శిష్యులను సందిగ్ధంలో పడవేసే విషయాలను పండితుడు ముందే విశదీకరించాలి.

15. (జకాత్ వసూలి చేసే అతను) కేవలం మంచి సొమ్ము మాత్రమే తీసుకొనుట నివారించబడింది.

16. పీడుతుని ఆర్తనాదానికి భయపడాలి.

17. అతని ఆర్తనాదం స్వీకరించబడటానికి ఏదీ అడ్డు పడదు అని తెలుపబడింది.

18. ప్రవక్త, సహాబీలు, ఇతర మహాభక్తులు (తౌహీద్ ప్రచారంలో) భరించిన కష్టాలు, ఆకలి, అంటు వ్యాధి బాధలు, తౌహీద్ యొక్క నిదర్శనాలు.

19. "నేను యుద్ధపతాకం ఇస్తాను" అన్న ప్రవక్త మాట, ఆయనకు ప్రసాదించబడిన అద్భుత సంకేతం (ముఅ్ జిజ).

20. అలీ ﷺ కళ్ళల్లో ఆయన లాలాజలం పెట్టడం కూడా ఒక అద్భుత సంకేతమే.

21. అలీ రజియల్లాహు అన్హు యొక్క ఘనత తెలిసింది.

22. ఇందులో సహాబాల ఘనత కూడా తెలుస్తుంది. ఎలా అనగా? యుద్ధ-పతాకం ఏ అదృష్టవంతునికి లభిస్తుందో అని ఆలోచించడంలోనే నిమగ్న-లయ్యారు, అతని ద్వారానే అల్లాః విజయం ప్రసాదిస్తాడన్న విషయం వారు మరచిపోయారు.

23. అదృష్టంపై విశ్వాసం ఇందులో రుజువవుతుంది. అది ఎలా? యుద్ధ పతాకం కోరినవారికి లభించలేదు. కోరని, ఏ మాత్రం ప్రయత్నం చేయని వారికి లభించింది.

24. "నిదానంగా బయలుదేరు" అన్న ప్రవక్త మాటలో (యుద్ధ) శిక్షణ, పద్ధతి బోధపడుతుంది.

25. ఎవరితో యుద్ధం చేయబోతున్నారో ముందు వారికి ఇస్లాం పిలుపు-నివ్వాలి.

26. ఇంతకు ముందే పిలుపు ఇవ్వడం, లేక యుద్ధం జరిగి యుంటే పరవా లేదు.

27. "వారిపై విధియున్న వాటిని వారికి తెలుపు" అనడంలో ధర్మప్రచార రంగంలో అవసరమైన వివేకం కానవస్తుంది.
28. ఇస్లాంలో అల్లాః హక్కులు ఏమున్నవో వాటిని తెలుసుకొనుట ఎంతైనా అవసరం.
29. ఒక్క వ్యక్తి అయినా తమ ద్వారా రుజుమార్గం పొందుతే ఇది ఎంత పుణ్యకార్యమో తెలుస్తుంది.
30. ఫత్వా ఇస్తున్నప్పుడు అవసర సందర్భంగా అల్లాః నామముతో ప్రమాణం చేయవచ్చును.

## తాత్పర్యం:

ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహ్హాబ్ రహిమహుల్లాః ఈ గ్రంధంలోని అధ్యాయాల్లో ఏ క్రమాన్ని పాటించారో అది చాలా ఉత్తమమైనది. మొదట తౌహీద్ "విధి" అని తెలిపారు, తరువాత దాని ఘనత, సంపూర్ణత ప్రస్తావన తెచ్చి, పిదప బాహ్యాంతర్యాల్లో దాని "నిర్ధారణ", ఆ తరువాత దానికి విరుద్ధమైన షిర్క్ తో భయంను ప్రస్తావించారు. ఇలా మనిషి ఒక విధంగా తనకు తాను పరిపూర్ణుడవుతాడు. ఆ తరువాత "లాఇలాహ ఇల్లల్లాహ"యొక్క పిలుపునివ్వాలన్న అధ్యాయాన్ని చేర్చారు.

ఇది ప్రవక్తల విధానం. ఒకే అల్లాః ఆరాధన చేయాలని వారు తమ జాతి వారికి పిలుపు ఇచ్చారు. ఇదే విధానం ప్రవక్తల నాయకులైన ముహమ్మద్ ﷺది. ఆయన వివేకంతో, చక్కని హితబోధతో, ఉత్తమమైన రీతిలో వాదనతో ఈ బాధ్యతను సంపూర్ణంగా నెరవేర్చారు. అందులో అలసిపోలేదు. బలహీనత చూపలేదు. అల్లాః ఆయన ద్వారా ఇస్లాం ధర్మాన్ని స్థాపించాడు. అది తూర్పు, పశ్చిమాల్లో వ్యాపించింది. అనేక మంది ఋజుమార్గం పొందారు. ఆయన స్వయంగా ఈ బాధ్యతను నెరవేర్చుతూ, తమ అనుచరులను ప్రచారకులుగా తీర్చిదిద్ది ఇతర ప్రాంతాలకు పంపేవారు. మొట్ట మొదట తౌహీద్

గురించే బోధించాలని చెప్పేవారు. ఎందుకనగా సర్వ కర్మల అంగీకారం దానిపైనే ఆధారపడియుంది. ఇలాంటి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. అందుకే మొదట తౌహీద్ గురించి తెలుసుకోవాలి. పిదప దాని ప్రచారం చేయాలి. ప్రతి ఒక్కరిపై తన శక్తి మేరకు ఈ బాధ్యత ఉంటుంది. పండితుడు తన విద్య-తో ఈ బాధ్యతను నెరవేర్చాలి. ధన, ప్రాణ శక్తి గలవాడు, హోదా గలవాడు దాన్ని ఉపయోగించి ఈ బాధ్యతను నెరవేర్చాలి. కనీసం ఒక మాటతోనైనా ఈ బాధ్యతను నెరవేర్చినవానిని అల్లాః కరుణించుగాకా! శక్తి, సామర్థ్యాలు కలిగియుండి కూడా ఈ బాధ్యతను నెరవేర్చని వానికి వినాశము ఉంటుంది.

## 6వ అధ్యాయం

## తౌహీద్ మరియు "లాఇలాహ ఇల్లల్లాః"ల యొక్క భాష్యము

అల్లాః ఆదేశం: ﴿ఈ ప్రజలు మొర పెట్టుకుంటున్నవారే స్వయంగా తమ ప్రభువుసాన్నిధ్యాన్ని పొందటానికి మార్గాన్ని వెతుకుతున్నారు﴾. (17: బనీ ఇస్రాయీల్: 57).

﴿ఇబ్రాహీం తన తండ్రి మరియు తన జాతి వారికీ ఇలా చెప్పిన ఆ సమయాన్ని జ్ఞాపకం తెచ్చుకోండి. "మీరు పూజిస్తున్న వాటితో నాకు ఏ సంబంధమూ లేదు. నా సంబంధం కేవలం నన్ను సృష్టించినవానితోనే ఉన్నది﴾. (43: జుఖ్రుఫ్: 26).

﴿వారు అల్లాఃను కాదని తమ పండితులను తమ సన్యాసులను తమ ప్రభువులుగా చేసుకున్నారు﴾. (9: తౌబా: 31). (2: బఖర: 165)లో ఉంది:

﴿కొందరు అల్లాఃను కాదని ఇతరులను ఆయనకు సమానులుగా, ప్రత్యర్థులుగా భావిస్తారు. వారు అల్లాః పట్ల కలిగి వుండవలసిన ప్రేమతో వారిని ప్రేమిస్తారు﴾.

ప్రవక్త ﷺ సెలవిచ్చారు: "ఎవడు "లాఇలాహ ఇల్లల్లాః" (అల్లాః తప్ప సత్య ఆరాధ్య దైవం మరొక్కడు లేడు) అని, అల్లాః తప్ప ఆరాధింపబడే ఇతరుల్ని తిరస్కరిస్తాడో అతని ధనప్రాణం సురక్షితంగా ఉండును. అతని లెక్క (ఉద్దేశం) అల్లాః చూసుకుంటాడు". (ముస్లిం).

తరువాత వచ్చే పాఠాల్లో ఇదే వివరణ ఉంది.

## ముఖ్యాంశాలు:

1. ఇందులో ముఖ్య విశేషం: తౌహీద్ (ఏకదైవ విశ్వాసం) మరియు షహాదత్ (లాఇలాహ ఇల్లల్లాః సాక్ష్యం) యొక్క వ్యాఖ్యానం ఉంది. దాన్ని అనేక ఆయతుల ద్వారా స్పష్టం చేయడం జరిగింది

2. బనీ ఇస్రాయీల్ లోని వాక్యం. మహాపురుషులతో మొరపెట్టుకునే ముష్రికుల ఆ కార్యాన్ని రద్దు చేస్తూ, ఇదే షిర్క్ అక్బర్ (పెద్ద షిర్క్) అని చెప్పబడింది.

3. సూరె తౌబాలోని వాక్యం. "యూదులు, క్రైస్తవులు అల్లాఃను గాక తమ పండితులను, సన్యాసులను తమ ప్రభువులుగా చేసుకున్నారని అల్లాః తెలిపాడు". ఇంకా "కేవలం అల్లాఃను మాత్రమే ఆరాధించవలసిన ఆజ్ఞ వారికి ఇవ్వడం జరిగింద"నీ తెలిపాడు. అయితే వారు తమ పండితుల, సన్యాసులతో మొరపెట్టుకోలేదు. వారి పూజా చేయలేదు. కాని పాప కార్యాల్లో వారి విధేయత పాటించారు.

4. "మీరు ఆరాధిస్తున్న వాటితో నాకు ఏ సంబంధమూ లేదు. నా సంబంధం కేవలం నన్ను సృష్టించినవానితోనే ఉన్నది" అన్న అవిశ్వాసులకు ఇబ్రాహీం మాట. తమ సత్య ప్రభువును ఇతర మిథ్య ఆరాధ్యులతో స్పష్టమైన పద్ధతిలో వేరు జేశారు.

ఇలా అవిశ్వాసులతో అసహ్యత, విసుగు మరియు అల్లాహ్‌తో ప్రేమయే "లాఇలాహ ఇల్లల్లాహ్" యొక్క పరమార్థము అని అల్లాహ్ తెలిపాడు. అందుకే ఆ వాక్యం తరువాతనే ఈ వాక్యం ఉంది.

﴾ఇబ్రాహీం ఈ వచనాన్నే తన తరువాత తన సంతానం కోసం విడిచి వెళ్ళాడు, బహుశా వారు దాని వైపునకు మరలుతారని﴿. (43: జుఖ్‌రుఫ్: 28).

5. మరొకటి బఖరలోని వాక్యం. అందులో ప్రస్తావించబడిన అవిశ్వాసుల గురించి, ﴾వారు నరకము నుండి బయటికి వెళ్ళేవారు కారు﴿ అని అల్లాహ్ తెలిపాడు. వారు నియమించుకున్న వారిని అల్లాహ్‌ను ప్రేమించవలసినట్లు ప్రేమిస్తారు. వారు అల్లాహ్‌ను కూడా ప్రేమించువారు అని దీనితో తెలుస్తుంది. కాని వారి ఈ ప్రేమ వారిని ఇస్లాంలో ప్రవేశింపజేయలేకపోయింది. ఇది వీరి విషయం అయితే, ఎవరయితే తమ నియమించుకున్న వారిని అల్లాహ్ కంటే ఎక్కువ, లేక కేవలం వారినే ప్రేమించి, అల్లాహ్‌ను ఏ మాత్రం ప్రేమించరో, వారి సంగతి ఎలా ఉంటుంది....? ఆలోచించండి!

6. "ఎవరు "లాఇలాహ ఇల్లల్లాహ్" (అల్లాహ్ తప్ప సత్య ఆరాధ్యదైవం మరొక్కడు లేడు) చదివి, అల్లాహ్ తప్ప పూజింపబడే ఇతరుల్ని తిరస్కరిస్తాడో అతని ధనప్రాణాలు సురక్షితంగా ఉండును. అతని వ్యవహారం అల్లాహ్ చూసుకుంటాడు" అన్న ప్రవక్త ప్రవచనం "లాఇలాహ ఇల్లల్లాహ్" యొక్క భావాన్ని తెలిపే దానిలో ముఖ్యమైనది. కేవలం నోటి పలుకుల ద్వారానే అతని ధన-ప్రాణాలు సురక్షితంగా ఉంటాయని చెప్పలేదు. ఆ పదాలు, దాని భావం తెలుసుకున్నవాని గురించే ఆ ఘనత లేదు. లేక దాన్ని కేవలం ఒప్పుకున్న వానికే రక్షణ లేదు. లేక అతడు కేవలం అల్లాహ్‌తోనే మొరపెట్టుకుంటున్నందుకని కాదు. అతడు దాన్ని పలుకడంతో పాటు మిథ్యా దైవాలను తిరస్క-రించనంత వరకు అతని ధనప్రాణాలకు రక్షణ లేదు. ఇంకా అతడు అందులో సందేహపడితే, ఆలస్యం చేస్తే కూడా రక్షణ లేదు. ఈ విషయం ఎంతో ముఖ్య-మైనది, గొప్పదైనది!. ఎంతో స్పష్టంగా తెలుపబడింది! వ్యతిరేకులకు విరుద్ధంగా ఎంతో ప్రమాణికమైన నిదర్శన ఉన్నది.

తాత్పర్యం:

వాస్తవానికి తౌహీద్ యొక్క భావం ఏమనగా: అల్లాః అద్వితీయుడని అతని గుణాలతో తెలుసుకొని, నమ్ముట. కేవలం అయన్ని మాత్రమే ఆరాధించుట.

ఇది రెండు రకాలు:

ఒకటి: అల్లాఃయేతరుల ఉలూహియత్ (ఆరాధన)ను తిరస్కరించుట. అది ఎలా అనగా; సృష్టిలోని ప్రవక్త, దైవదూత, ఇంకెవరయినా ఆరాధనకు అర్హులు కారని, వారికి ఏ కొంత భాగం కూడా అందులో లేదని తెలుసుకొని విశ్వసించుట.

రెండవది: ఉలూహియత్‌కు అర్హుడు అల్లాః మాత్రమేనని, ఆయనకి సాటి మరొకడు లేడని విశ్వసించుట. కేవలం ఇంతే సరిపోదు. ధర్మాన్ని కేవలం అల్లాఃకే అంకితం చేసి, ఇస్లాం, ఈమాన్, ఇహ్సాన్‌ను పూర్తి చేసి, అల్లాః హక్కులతో పాటు అల్లాః దాసుల హక్కులను అల్లాః సంతృప్తి, దాని ప్రతిఫలం పొందడానికే పూర్తి చేయుట.

దాని సంపూర్ణ భావంలో మరొకటి: అల్లాఃయేతరుల ఆరాధన నుండి అసహ్యత, విసుగు చెందుట. అల్లాఃను గాక ఇతరులను అల్లాఃకు సమానులుగా నిలబెట్టి, అల్లాఃను ప్రేమించినట్లు వారిని ప్రేమించుట, అల్లాఃకు విధేయత చూపినట్లు వారికి విధేయత చూపుట "లాఇలాహ ఇల్లల్లాః" యొక్క భావానికి విరుద్ధమైనది.

## 7వ అధ్యాయం

# కష్టం తొలగిపోవుటకు, లేక రాకుండా ఉండుటకు కడాలు, దారాలు, వాటి లాంటివి ధరించుట షిర్క్

ఒక వేళ అల్లాః నాకేదైనా నష్టాన్ని కలిగించగోరితే, మీరు అల్లాఃను కాదని

వేడుకునే దేవతలు, ఆయన కలిగించే నష్టం నుండి నన్ను కాపాడగలరా?﴾. (39: జుమర్ : 38).

ఇమ్రాన్ బిన్ హుసైన్ కథనం: ఒక వ్యక్తి చేతిలో ప్రవక్త ﷺ రాగి కడం చూసి, ఇది ఏమిటి అని అడిగారు. "వాహిన"[1] దూరము కావడానికి వేసుకున్నాను అని అతడు చెప్పాడు. అప్పుడు ప్రవక్త ﷺ "దాన్ని తీసివేయి. అది నీ "వాహి-న" పెరుగుటకే కారణమవుతుంది. ఒక వేళ అది నీవు ధరించి ఉన్నప్పుడు మరణించావంటే ఎన్నటికీ సాఫల్యం పొందవు" అని హెచ్చరించారు. (అహ్మద్).

ఉఖ్బా బిన్ ఆమిర్ కథనం: ప్రవక్త ఆదేశం: "తాయత్తు వేసుకున్నవారి ఉద్దేశాన్ని అల్లాః పూర్తి చేయకూడదు. గవ్వ (సీపి) వేసుకున్న వానికి కూడా అల్లాః స్వస్థత ప్రసాదించకూడదు". (అహ్మద్). మరో ఉల్లేఖనంలో ఉంది: "తాయత్తు వేసుకున్న వారు షిర్క్ చేయువారు".

ఇబ్ను అబి హాతింలో ఉంది: హుజైఫా ఒక వ్యక్తి చేతిలో జ్వరం దూరం కావడానికి వేసుకున్న దారాన్ని చూసి తెంచారు. తరువాత ఈ ఆయతు చదివారు. ﴿వారిలో అల్లాఃను విశ్వసించేవారు ఎంతమంది లేరు! కాని వారు ఆయనతో పాటు ఇతరులను భాగస్వాములుగా నిలబెడతూ ఉంటారు﴾. (12: యూసూఫ్: 106).

## ముఖ్యాంశాలు:

1. రోగాలు దూరమగుటకు కడాలు, దారాలు వేసుకొనుట కఠినంగా నివారించబడింది.

2. సహాబి అదే స్థితిలో చనిపోతే సఫలుడు కాడు, అన్న దానితో షిర్క్ అస్గర్, కబీర గునాఃలో (ఘోర పాపాల్లో) పెద్దది అని తెలుస్తుంది.

---

(1) భుజములోని ఒక నరం ఉబ్బి రోగము వస్తుంది. అది దూరము కావడాకి వారు అలాంటివి వేసుకునేవారు

3. తెలియక పోవడము ఒక సాకుగా పరిగణింపబడలేదు.

4. దాని వలన లాభం కలగదు. ప్రవక్త ఆదేశానుసారం: "దాని వలన "వహన్" ఇంకా పెరుగుతుంది.

5. ఇలాంటి పని చేసిన వానిని కఠినంగా హెచ్చరించబడింది.

6. ఇలాంటివి వేసుకున్నవారు దాని వైపే అప్పగించబడుతారు.

7. తాయాత్తు వేసుకున్న వారు షిర్క్ చేయువారు అని స్పష్టం అయింది.

8. జ్వరం దూరం కావడానికి దారం వేసుకొనుట కూడా ఇందులోనే పరిగణించబడుతుంది.

9. హుజైఫా పఠించిన ఆయతుతో తెలిసిందేమిటంటే; ప్రవక్త సహచరులు పెద్ద షిర్క్ ప్రస్తావించబడిన ఆయతులతో చిన్న షిర్క్ గురించి ప్రమాణంగా ప్రస్తావించేవారు. సూరె బఖర వాక్యంలో ఇబ్నె అబ్బాసు ﷺ ఇలాగే తెలిపారు.

10. దిష్టి తగలకుండా గవ్వ (సీపి) వేసుకొనుట కూడా షిర్క్ అవుతుంది.

11. తాయత్తు వేసుకున్న వారిపై, గవ్వ వేసుకున్న వారిని శపించబడింది. అంటే అల్లాః వారిని తన సంరక్షణలో ఉంచడు.

## తాత్పర్యం:

నష్టం, కష్టం దూరం కావడానికి లేక రాకుండా ఉండడానికి ఉపయోగించే సాధనాల (జరియ, అస్బాబ్)లో ఏవి యోగ్యం, ఏవి నిషేధం తెలుసుకొనటానికి, సాధనాల (జరీయ, అస్బాబ్)కు సంబంధించిన ఆదేశాల్ని తెలుసుకొనుట ఎంతయినా అవసరం. ఇందులో మూడు విషయాల్ని తెలుసుకొనుట చా లా ముఖ్యం.

1- ధార్మికంగా లేక శాస్త్రీయంగా లాభకరమయిన సాధనం అని రుజువైన వాటినే సాధనంగా ఉపయోగించాలి.

2- వాటిని ఉపయోగించే వ్యక్తి ఆధారం, భరోసా వాటిపై ఉండ కూడదు. వాటిని సాధనంగా చేసిన అల్లాఃపై నమ్మకం ఉండాలి.

3- సాధనాలు ఎంత గొప్పవి, శక్తి గలవైనా అల్లాః వ్రాసి ఉంచిన విధి, (తఖ్ దీర్)కి అవి లోబడి ఉంటాయి. దానిని తప్పించుకోలేవు. అల్లాః తాను కోరినట్లు వాటిలో మార్పు చేస్తాడు. అల్లాః కోరితే అందులోని గుణాన్ని అలాగే ఉంచుతాడు. ఆయన దాసులు వాటిని తెలుసుకోని, ఉపయోగించి వాటిలో ఉన్నటువంటి అల్లాః తత్వాన్ని గమనించగలరనీ. అతను కోరితే అందులోని గుణాన్ని మార్చనూ వచ్చు. ఇలా దాసులు వాటిపైనే నమ్మకం ఉంచకూడదనీ, అల్లాః శక్తిని అర్థం చేసుకోగలరనీ. మార్పు చేయు సర్వ శక్తి, సర్వ ఇష్టం ఒకే ఒక్క అల్లాఃకు మాత్రమే ఉంది.

పై ముఖ్య విషయం తెలుసుకున్న తరువాత, ఇక వచ్చిన కష్టం తొలగడానికి, లేక కష్టం రాకుండా జాగ్రత్త పడడానికి దారం లేక కడం లాంటివి వేసుకున్న వాడు షిర్క్ చేసినట్లే కదా? ఎలా అనగా; అది కష్టం రాకుండా. లేక వచ్చిన తరువాత కాపాడునది అని విశ్వసిస్తే ఇదొపెద్ద షిర్క్ అవుతుంది. అతడు అల్లాఃను గాకా ఇతరులను స్వస్థత ఇచ్చేవాడుగా నమ్మినందుకు ఇది రుబూబియత్ కు సంబంధించిన షిర్క్. ఇంకా అతడు అందులో స్వస్థత ఉంది అని దానిపై భరోసా, నమ్మకం, ఆశ ఉంచినందుకు, ఇది ఉలూహియత్ కు సంబంధించిన షిర్క్ అవుతుంది.

ఒక వేళ అతడు అల్లాఃయే కష్టనష్టాలు రాకుండా, లేక వచ్చిన తరువాత కాపాడువాడు అని విశ్వసించి, అవి కేవలం సాధనం అని నమ్మినవాడు, ధార్మికంగా, శాస్త్రీయంగా సాధనం లేని దానిని సాధనంగా నమ్మినవాడవుతాడు. ఇది నిషిద్ధం (హరాం). మరియు ఇస్లాంపై, వైద్యశాస్త్రంపై ఒక అబద్ధం మోపినవాడవుతాడు. ఎలా అనగా; ఇస్లామీయ ధర్మం దీనిని చాలా కఠినంగా నివారించింది. అది నివారించినవి లాభాన్నిచ్చేవి కావు.

శాస్త్రియంగా కూడా ఇవి ఆమోదం పొందినవి కావు. లాభం చేకూర్చే ఔషదాల్లో లెక్కించబడవు.

అందుకే ఇవి షిర్క్ వైపునకు లాక్కు వెళ్ళే సాధనాలు. వాటిని వేసుకున్న-వాని మనస్సు వాటిపై లగ్నం అయి ఉంటుంది. అందుకే అది షిర్క్ భాగాల్లో ఒక భాగం. లేక సాధనాల్లో ఒక సాధనం.

ఇది ధార్మికంగా, శాస్త్రియంగా సాధనం కాదని తెలిసినప్పుడు, విశ్వాసుడు తన విశ్వాసం సంపూర్ణముగుటకు దానిని వదిలి వేయాలి. అతని తౌహీద్ సంపూర్ణం అయిందంటే నివారించబడిన వాటిపై అతని మనస్సు లగ్నం కాదు. లాభం లేనివాటిపై మనుస్సు లగ్నం కావడం బుద్ధిహీనతకు నిదర్శనం. ఎలా అనగా మనిషి తనకు లాభం లేనివాటిని ఉపయోగించడు. అందులో నష్టమే ఉంది.

ఈ సత్య ధర్మం యొక్క పునాది: "ప్రజల నుండి విగ్రహారాధనను, సృష్టి రాసుల పై నుండి నమ్మకాన్ని దూరము చేసి, వారి ధర్మాన్ని దురాచారాల, దుష్చేష్టల నుండి దూరం చేసి వారి బుద్ధిజ్ఞానాలను సంపూర్ణం చేయుట. బుద్ధిని అభివృద్ధి పరిచే, ఆత్మలను పరిశుద్ధపరిచే, ధార్మిక, ప్రాపంచిక స్థితిగతులను సంస్కరించే లాభదాయకమయిన విషయాల గురించి కృషి చేయుట.

## 8వ అధ్యాయం:

# మంత్రాలు మరియు తాయత్తుల విషయంలో వచ్చిన ఆదేశాలు

అబూ బషీర్ అన్సారి రజియల్లాహు అన్హు కథనం; ఆయన ఓ ప్రయాణంలో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వెంట ఉండగా, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఒక చాటింపు చేసే వ్యక్తిని ఈ వార్త ఇచ్చి పంపారు: "తమ ఒంటె మెడలో ఎవరు కూడా తీగతో తయారైన పట్టా ఉంచకూడదు. ఒక వేళ ఉంటే తెంపాలి". (బుఖారి, ముస్లిం).

ఇబ్ను మస్ఊద్ రజియల్లాహు అన్హు కథనం: నేను ప్రవక్త ﷺ చెప్పగా విన్నాను: "మంత్రము, తాయత్తులు, తివల (భార్యభర్తల మధ్య ప్రేమ పెరుగుటకు చేతబడి చేయుట) షిర్క్". (అహ్మద్ అబూ దావూద్).

అబ్దుల్లాః బిన్ ఉకైం ఉల్లేఖనలో ఉంది: "ఎవరు ఏదైనా వస్తువు వేసుకుంటే అతన్ని దాని వైపునకే అప్పగించబడుతుంది". (అహ్మద్, తిర్మిజి).

తాయత్తు అంటే: దిష్టి తగలకుండా తమ సంతానానికి ధరింపజేయబడే వస్తువులు. ఇది ఖుర్ ఆన్ నుండి ఉంటే కొందరు పూర్వ ధర్మవేత్తలు యోగ్యమని చెప్పారు. మరి కొందరు యోగ్యం కాదని, నివారించబడింది అని చెప్పారు. నివారించినవారిలో ఇబ్నె మస్ఊద్ రజియల్లాహు అన్హు ఉన్నారు.

మంత్రాలను "అజాయిం" అనీ అంటారు. దిష్టి తగిలినప్పుడు, విష పురుగులు కాటేసినప్పుడు మంత్రిచవచ్చును కాని షిర్క్ అర్థమునిచ్చే పదాలు ఉండ కూడదు.

తివల అంటే: భార్యభర్తల మధ్య ప్రేమానురాగాలు పెరుగుటకు చేయబడే ఇంద్రజాలం.

రువైఫిల్ యొక్క హదీసు అహ్మద్ ఉల్లేఖించారు. ప్రవక్త ﷺ ఆయనకి ఇలా తెలిపారు: "ఓ రువైఫిల్! నీవు దీర్ఘకాలం బ్రతుకవచ్చు. ఈ విషయం ప్రజలకు తెలియజేయి: గడ్డమును ముడి వేసేవారితో, లేక తీగలు మెడలో వేసుకునేవారితో, పశువుల పేడ, ఎముకలతో మలమూత్ర పరిశుద్ధి చేసేవారితో ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కు ఏలాంటి సంబంధం లేదు".

సఈద్ బిన్ జుబైర్ ఇలా చెప్పారు: 'ఒక వ్యక్తి ధరించిన తాయత్తును తీసేవారికి ఒక బానిసను విడుదల చేసినంత పుణ్యం లభించును'.

వకీల్, ఇబ్రాహీం నఖఈతో ఉల్లేఖించారు: వారు అన్ని రకాల తాయుత్తులను నిషిద్ధంగా భావించేవారు. అవి ఖుర్ ఆన్ కు సంబంధించినవైనా, లేదా ఖుర్ ఆన్ కు సంబంధం లేనివైనా.

## ముఖ్యాంశాలు:

1. మంత్రము, తాయత్తు యొక్క వివరణ తెలిసింది.
2. తివల యొక్క భావం తెలిసింది.
3. ఏలాంటి వ్యత్యాసం లేకుండా పైన పేర్కొన్న మూడూ విషయాలు కూడా షిర్క్ గా పరిగణించబడుతాయి.
4. దిష్టి తగలకుండా, విషపురుగు కాటేసినప్పుడు షిర్క్ పదాలు లేకుండా మంత్రించుట షిర్క్ కాదు.
5. ఖుర్ఆన్ ఆయతులతో వ్రాయబడిన తాయత్తు విషయములో పండితుల బేధాభిప్రాయం ఏర్పడినది. (వాస్తవమేమిటంటే అది కూడా యోగ్యం కాదు. ఎలా అనగా మంత్రం షిర్క్ అని తెలిపిన తరువాత యోగ్యమైనదేదో ప్రవక్త స్వయంగా తెలిపారు. కాని తాయత్తు విషయంలో అలా తెలుపలేదు).
6. పశువులకు దిష్టి తగలకుండా తీగలు, ఇంకేపైనా వేయుట కూడా షిర్క్ కు సంబంధించినవే.
7. అలాంటివి వేసినవారిని కఠినంగా హెచ్చరించబడింది.
8. ఒక వ్యక్తి మెడ నుండి తాయత్తు తీయుట ఎంత పుణ్యమో తెలిసింది.
9. ఇబ్రాహీం నఖఈ మాట, పైన తెలిపిన మాటకు విరుద్ధం ఏమి కాదు. ఎలా అనగా; ఈయన ఉద్దేశం అబ్దుల్లాః బిన్ మస్ఊద్ శిష్యులు అని.

## తాత్పర్యం:

తాయత్తులు వేసుకొనుట షిర్క్ అని తెలిసింది. అయితే ఇందులో కొన్ని షిర్క్ అక్బర్. ఉదా: షైతాన్ తో లేక సృష్టిరాసులతో మొరపెట్టుకొనుటు, అల్లాః ఆధీనంలో ఉన్నదాని గురించి ఇతరులతో మొరపెట్టుకొనుట పెద్ద షిర్క్ లో పరిగణించబడుతుంది. ఈ విషయం మరీ వివరంగా తరువాత అధ్యాయాల్లో వస్తుంది. మరి కొన్ని నిషిద్ధమున్నవి. ఉదా: అర్థం లేని పేర్లతో, పదాలతో. ఇవి షిర్క్ వైపునకు తీసుకెళ్తాయి.

ఇస్లాం ధర్మంలో అనుమతి లేదు గనుక, ఖుర్ఆన్ మరియు హదీసులో వచ్చిన దుఆలు వ్రాయబడిన తాయత్తులు విడనాడడమే ఉత్తమం. ఈ పద్ధతి నిషిద్ధమున్న వాటి ఉపయోగమునకు దారి తీస్తుంది. అపరిశుద్ధ స్థలాల్లో పోక తప్పదు గనక, వాటిని వేసుకున్నవాడు దాని గౌరవ మర్యాదను పాటించలేడు. (ఇవి పాటించినవానికి సయితం అనుమతి లభించదు. ఎందుకనగా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అనుమతి ఇవ్వలేదు).

మంత్రం విషయంలో ఉన్న వివరాన్ని కూడా తెలుసుకోవాలి. అది ఖుర్ఆన్, హదీసు నుండి ఉంటే మంత్రించేవాని గురించి అభిలషనీయమే. ఎందుకనగా ఇది కూడా ఒక ఉపకారం, పుణ్యం క్రింద లెక్కించబడుతుంది గనుక యోగ్యం కూడా. కాని మంత్రం చేయించే వ్యక్తి స్వయంగా అడగక ఉండడమే మంచిది. మంత్రించడమైనా లేక ఇంకేదైనా అడగక ఉండడం మానవుని సంపూర్ణ నమ్మకం, బలమైన విశ్వాసం యొక్క నిదర్శన. అడగడంలో అతనికి లాభం మరియు అది యోగ్యం అయినప్పటికీ అడగక పోవడం మంచిది అనబడుతుంది. ఇందులోనే వాస్తవ తౌహీద్ యొక్క రహస్యం ఉంది. ఈ విషయాన్ని గమనించి ఆచరించేవారు చాలా అరుదు.

మంత్రంలో అల్లాహ్ యేతరులతో స్వస్థత కోరి, వారితో దుఆ చేయబడుతే అది పెద్ద షిర్క్. ఎందుకంటే: దుఆ, మొర అల్లాహ్ యేతరులతో చేయరాదు గనక.

ఈ వివరాలన్నీ జాగ్రత్తగా తెలుసుకో! అందులో ఉన్న సూక్ష్మ వ్యత్యాసాలను గమనించకుండా అన్నిటి గురించి ఒకే రకమైన తీర్పు చేయకు. జాగ్రత్తగా ఉండు!

## 9వ అధ్యాయం:

## చెట్లు, రాళ్ళతో శుభం (తబర్రుక్) కోరుట

అల్లాహ్ ఆదేశం: ﴾ఈ లాత్, ఈ ఉజ్జా, మూడోది ఒక దేవత అయిన మనాత్ ల వాస్తవికతను గురించి కాస్తయినా ఆలోచించారా?﴿ (53: నజ్మ్: 25).

అబూ వాఖిద్ లైసీ కథనం: మేము ప్రవక్త ﷺతో కలసి హునైన్ యుద్ధానికి వెళ్ళాము. అప్పుడే మేము కొత్తగా ఇస్లాం స్వీకరించి యుంటిమి. (దారి మధ్యలో ఒక చోట) ముష్రికుల ఒక రేగు చెట్టు ఉండింది. అక్కడ వారు శుభం (తబర్రుక్) కలగాలని కూర్చుండేవారు, తమ ఆయుధాలను దానికి తగిలించేవారు. దానిని "జాతు అన్వాత్" అనేవారు. ఆ రేగు చెట్టు దగ్గరి నుండి మేము వెళ్తూ, 'మాకు కూడా అలాంటి ఒక "జాతు అన్వాత్" నిర్ణయించండి ప్రవక్తా' అని అన్నాము. అప్పుడు ప్రవక్త అన్నారు: "అల్లాహు అక్బర్! ఇవే (గత జాతులు పాటించిన) పద్ధతులు, మార్గాలు. నా ప్రాణం ఎవరి చేతిలో ఉందో ఆయన సాక్ష్యం! బనీ ఇస్రాయీల్ తమ ప్రవక్త మూసా ﷺతో అన్న తీరే మీరన్నారు. ﴾వాళ్ళ దేవుళ్ళ వంటి ఒక దేవుణ్ణి మాకు కూడా చేసి పెట్టు﴿ (అని వారన్నప్పుడు), మూసా ﷺ ఇలా అన్నారు: ﴾మీరు చాలా అజ్ఞానపు మాటలు మాట్లాడుతున్నారు﴿. (7: ఆరాఫ్: 138). తప్పకుండా మీకంటే ముందు గడిచిపోయినవారి మార్గాలను మీరు కూడా అనుసరిస్తారు" అని ప్రవక్త ﷺ హెచ్చరించారు. (తిర్మిజి). సహీ అని నిరూపించబడిన హదీసు.

## ముఖ్యాంశాలు:

1. సూరె నజ్మ్ లోని ఆయత్ యొక్క వ్యాఖ్యానం తెలిసింది. (అదేమనగా: ఆ దేవతలు వారికి లాభనష్టాలు చేకూర్చేవి అని ముష్రికులు భావించేవారు. అందుకే వారితో మొరపెట్టుకునేవారు, అక్కడ జంతువులను బలిచ్చేవారు. వారి సాన్నిధ్యం కోరేవారు).

2. సహచరులు "జాతు అన్వాత్" నిర్ణయించండని ప్రవక్తను కోరింది, అచ్చట "తబర్రుక్' పొందాలనే ఉద్దేశంతోనే. వాటిని దేవతలుగా చేసుకుందామనికాదు.

3. సహచరులు కేవలం తమ కోరికను వెల్లడి చేశారు తప్ప, దాన్ని ఆచరణ రూపంలోకి తీసుకురాలేదు.

4. కోరిక ఉద్దేశం కూడా అల్లాః సాన్నిధ్యం పొందడానికే ఉండేది. ఎందుకనగా: అల్లాః దానిని ప్రేమిస్తాడని వారనుకున్నారు.

5. ఇది షిర్క్ కు సంబంధించినదని సహాబాలకు తెలియనప్పుడు ఇతరులకు తెలియకపోవడం సంభవం. (కాని తెలిసిన వెంటనే విడనాడడం కూడా తప్పనిసరి).

6. ప్రవక్త సహచరులు, తమ సత్కార్యాలకు బదులుగా పొందిన వాగ్దానం, క్షమాపణ శుభవార్త లాంటివి అంత సులభంగా ఇతరులు పొందలేరు.

7. వారికి తెలియదు కదా అని ప్రవక్త ఊరుకోలేదు. "అల్లాహు అక్బర్! ఇవే మార్గాలు. మీకంటే ముందు గతించిన వారి మార్గాలను మీరు అనుసరిస్తారు" అని మూడు సార్లు హెచ్చరించి, అలాంటి కోరికలు చెడు అని స్పష్టం చేశారు.

8. మరో ముఖ్య విషయం ప్రవక్త తమ సహచరులతో ఇలా అనడం: మీ ప్రశ్న, కోరిక బనీ ఇస్రాయీల్, మూసాతో ప్రశ్నించి, కోరినటువంటిదే. వారు: ﴾వాళ్ళ దేవుళ్ళవంటి ఒక దేవుణ్ణి మాకు కూడా చేసిపెట్టు﴿ అని కోరారు.

9. ప్రవక్త వారిని నివారించడం "లాఇలాహ ఇల్లల్లాః" యొక్క భావంలోనే వస్తుంది. ఇది చాలా సూక్ష్మమైనది. అందుకే సహచరులు కూడా అది "లాఇలాహ ఇల్లల్లాః" భావానికి విరుద్ధమైనదని ముందు గమనించ లేకపోయారు.

10. ఇచ్చట కూడా ప్రవక్త ﷺ, అల్లాః ప్రమాణం చేసి చెప్పారు. (మాటి-మాటికి ప్రమాణం చేయటం ఆయన అలవాటు కాదు. కాని విషయం చాలా గంభీరమైనది గనుక ప్రమాణం చేసి చెప్పారు).

11. తమ కోరికను వెల్లడించినందుకు వారు మతభ్రష్టులు కాలేదు. దీనితో తెలిసిందేమిటంటే షిర్క్ చిన్నదీ (కనబడనిది) ఉంటుంది, పెద్దదీ (కనబడునది) ఉంటుంది.

12. "మేము కొత్తగా ఇస్లాం స్వీకరించియుంటిమి" అన్న వారి మాటతో ఇతర సహచరులు దీనిని షిర్క్ భావించేవారు అని తెలుస్తుంది.

13. ఆశ్చర్యం కలిగినప్పుడు "అల్లాహు అక్బర్" అనవచ్చు అని తెలిసింది. ఇలా అనకూడదు అని అనేవారి మాట ప్రవక్త మాటకు విరుద్ధం అని స్పష్టమయింది.

14. (షిర్క్ మరియు బిద్ అత్)కు చేర్పించే సాధనాలన్నిటిని రద్దు చేయాలని తెలిసింది.

15. జాహిలియ్యత్ (అజ్ఞానకాలం) నాటి పోలికను అవలంభించుట నుండి నివారించబడింది.

16. విద్య నేర్పుతున్నప్పుడు అవసర సందర్భంగా ఆగ్రహించవచ్చును.

17. "ఇవే సాంప్రదాయాలు" అని ప్రవక్త ﷺ ఒక నియమం తెలిపారు.

18. ప్రవక్త మహత్యాల్లో ఒకటి. ఆయన భవిష్యసూచన ఇచ్చినట్లు సంభవించింది.

19. ఖుర్ ఆన్ లో యుదూల, క్రైస్తవుల ఏ ఏ విషయాల్ని చెడుగా ప్రస్తావించి వారిని హెచ్చరించబడిందో, అలాంటి పనుల నుండి మనము దూరముండాలని మనకు కూడా హెచ్చరిక ఉంది.

20. పండితుల వద్ద ఉన్న ఒక నియమం వాస్తవమైనది. అది: ఆరాధనల (ఇబాదత్ ల) పునాది ఆజ్ఞ, (హుకుం) పై ఉంది. (మన ఇష్టానుసారం ఇబాదత్ చేయరాదు).

21. గ్రంథమివ్వబడిన వారి సాంప్రదాయాలు, అలవాట్లు ఎలా చెడ్డవో ముష్రికులవి కూడా అలాగే చెడ్డవి.

22. ఎవరైతే అధర్మం నుండి ధర్మంలో అడుగుపెడుతారో వారిలో కొన్ని పాత అలవాట్లు ఉంటాయి అని తెలిసింది. అబూ వాఖిద్ లైసీ అదే చెప్పింది. "మేము కొత్తగా ఇస్లాం స్వీకరించియుంటిమి".

### తాత్పర్యం:

చెట్లతో, రాళ్ళతో శుభం కోరుట ముష్రికుల పని. చెట్లతో, రాళ్ళతో, సమాధులతో ఇంకేదానితోనైనా శుభం కోరుట ధర్మసమ్మతం కాదని పండితులు ఏకీభవించారు. ఇది గులువ్వ (అతిశయోక్తి). ఎవరితో, ఏ దానితో తబర్రుక్ కోరబడుతుందో, వారి ఆరాధన, వారితో దుఆ (ప్రార్థన) చేయడం లాంటి పనులకు ఇది గురి చేస్తుంది. అల్లాఃయేతరుల ఆరాధన, వారితో దుఆ షిర్కె అక్బర్ అన్న విషయం తెలిసిందే. చివరికి ముఖామె ఇబ్రాహీం, ప్రవక్త యొక్క గృహం, బైతుల్ మఖ్దిసు, అక్కడ ఉన్న "సఖ్రా" మొదలగు వాటితో తబర్రుక్ కోరుట కూడా తప్పు. కాబట్టి అల్లాః లోని హజ్రె అస్వద్ ను ముట్టుకొనుట, చుంబించుట మరియు రుక్నె యమానిని ముట్టుకొనుట అల్లాఃకు విధేయత చూపుట. ఆయన ఔన్నత్యాల ముందు వినయవినమ్రతతో మెలుగుటయే ఇబాదత్ యొక్క సారాంశము. దీనికున్న ఆదేశం ఇతర వాటికి లేదు.

## 10వ అధ్యాయం:

## అల్లాఃయేతరుల కొరకు జిబహ్ (జంతు బలిదానం)

అల్లాః ఆదేశం: ﴾ఇలా అను: నా నమాజ్, నా ఖుర్ బాని (జంతుబలి), నా జీవనం, నా మరణం సమస్తమూ సకల లోకాలకూ ప్రభువైన అల్లాః కొరకే. ఆయనకు ఏ భాగస్వామీ లేడు﴿. (6: అన్ ఆమ్: 162,163).

﴾నీ ప్రభువు కొరకే నమాజ్ చెయ్యి, ఖుర్బానీ కూడా ఇవ్వు﴿. (108: కౌసర్: 2).

అలీ రజియల్లాహు అన్హు కథనం: ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నాకు నాలుగు మాటలు నేర్పారు: (1). అల్లాః తప్ప ఇతరులకు జిబహ్ చేసిన వానిని అల్లాః శపించాడు. (2). తన తల్లిదండ్రుల్ని శపించిన, దూషించి

నవానిని అల్లాః శపించాడు. (3). "ముహ్ దిన్" (బిద్ అతి, దురాచారం చేయు వాని)ని అల్లాః శపించాడు. (4). భూమిలో తమ స్థలాల (ఆస్తుల) గుర్తుల్ని మార్చిన వానిని అల్లాః శపించాడు. (ముస్లిం).

తారిఖ్ బిన్ షిహాబ్ ఉల్లేఖించారు, ప్రవక్త ఇలా సెలవిచ్చారు: "ఈగ కారణంగా ఒక వ్యక్తి స్వర్గంలో ప్రవేశించాడు. మరొక వ్యక్తి నరకంలో చేరాడు". అది ఎలా అని సహచరులు అడుగగా, ప్రవక్త చెప్పారు: "ఇద్దరు మనుషులు ఒక గ్రామం నుండి వెళ్తుండగా, అక్కడ ఆ గ్రామవాసుల ఒక విగ్రహం ఉండింది. అక్కడి నుండి దాటిన ప్రతి ఒకడు ఆ విగ్రహానికి ఏ కొంచమైనా బలి ఇవ్వనిదే దాటలేడు. (ఆ విగ్రహారాధకులు) ఒకనితో అన్నారు: ఏదైనా బలి ఇవ్వు. "నా వద్ద ఏమి లేదు" అని అతడన్నాడు. దాటలేవు. కనీసం ఒక ఈగనైనా బలి ఇవ్వు. అతడు ఒక ఈగను ఆ విగ్రహం పేరు మీద బలిచ్చాడు. వారు అతన్ని దాటనిచ్చారు. కాని అతడు నరకంలో చేరాడు. నీవు కూడా ఏదైనా బలి ఇవ్వు అని మరో వ్యక్తితో అన్నారు. నేను అల్లాః తప్ప ఇతరులకు ఏ కొంచెమూ బలి ఇవ్వను అని అతడన్నాడు. వారు అతన్ని నరికేశారు. అతడు స్వర్గంలో ప్రవేశించాడు. (అహ్మద్).

## ముఖ్యాంశాలు:

1. మొదటి ఆయతు యొక్క వ్యాఖ్యానం.
2. రెండవ ఆయతు యొక్క వ్యాఖ్యానం.
3. శాపం ఆరంభం అల్లాఃయేతరులకు జిబహ్ చేసినవారితో అయింది.
4. తల్లిదండ్రుల్ని దూషించిన, శపించినవానినీ శపించడమైనది. నీవు, ఒక వ్యక్తి తల్లిదండ్రుల్ని దూషించావంటే అది నీవు స్వయంగా నీ తల్లిదండ్రుల్ని దూషించినట్లే.
5. "ముహ్ దిన్"ని శపించడమైనది. ఏ పాపంపై శిక్ష ఇహంలోనే అల్లాః విధించాడో, ఒక వ్యక్తి ఆ పాపం చేసి ఆ శిక్ష నుండి తప్పించుకోడానికి ఇతరుల

శరణు కోరుతాడు. అతన్ని కూడా "ముహ్ దిస్" అనబడుతుంది.

6. భూమి గుర్తులను మార్చిన వానిని కూడా శపించబడినది. నీ భూమి, నీ పక్కవాని భూమి మధ్యలో ఉండే గుర్తుల్ని వెనుక, ముందు చేసి మార్చేయడం అని భావం.

7. ఒక వ్యక్తిని ప్రత్యేకించి శపించడంలో, పాపాన్ని ప్రస్తావించి అది చేసిన వారిని శపించడంలో ఉన్న వ్యత్యాసాన్ని గమనించాలి.

8. ఈగ (కారణంగా ఒకతను నరకంలో మరొకతను స్వర్గంలో చేరిన) హదీసు చాలా ముఖ్యమైనది.

9. అతడు తన ప్రాణం కాపాడుకునే ఉద్దేశంతో ఒక ఈగను బలి ఇచ్చాడు. కాని నరకంలో చేరాడు.

10. విశ్వాసుల వద్ద షిర్క్ ఎంత ఘోర పాపమో గమనించవచ్చు. తన ప్రాణాన్ని కోల్పోవడం సహించాడు. కాని షిర్క్ చేయడానికి ఒప్పుకోలేదు.

11. నరకంలో చేరినవాడు విశ్వాసుడే. అతను మొదటి నుండే అవిశ్వాసి అయితే ఈగ కారణంగా నరకంలో చేరాడు అని అనబడదు.

12. ఈ హదీసు మరో హదీసును బలపరుస్తుంది. అది ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ ప్రవచనం: "స్వర్గం మీ చెప్పు యొక్క వారు (గూడ) కంటే చేరువుగా ఉంది, నరకం కూడా అలాగే". (బుఖారి).

13. ముస్లింలు, ముస్లిమేతరులు అందరి వద్ద మనఃపూర్వకంగా ఉన్న ఆచరణ చాలా ప్రాముఖ్యత గలది.

## తాత్పర్యం:

జిబహ్ కేవలం అల్లాః కొరకే చేయాలి. పూర్తి చిత్తశుద్ధితో చేయాలి. నమాజు గురించి చెప్పబడినట్లే దీని గురించి ఖుర్ ఆన్ లో స్పష్టంగా చెప్పబడింది. ఎన్నో చోట్ల దాని ప్రస్తావన నమాజుతో కలసి వచ్చింది. ఇక ఇది అల్లాఃయేతరుల కొరకు చేయుట షిర్క్ అక్బర్.

షిర్క్ అక్బర్ దేనినంటారో గుర్తుంచుకోండి: "ఆరాధనలోని ఏ ఒక భాగాన్ని అయినా అల్లాఃమేతరుల కొరకు చేయుట". అయితే ఏ విశ్వాసం, మాట, కార్యాలు చేయాలని ఇస్లాం ధర్మం చెప్పిందో అది అల్లాఃకు చేస్తే అది తౌహీద్, ఇబాదత్, ఇఖ్లాసు. ఇతరల కొరకు చేస్తే షిర్క్, కుఫ్ర్. ఈ షిర్క్ అక్బర్ యొక్క నియమాన్ని మీ మదిలో నాటుకొండి. అదే విధంగా షిర్క్ అస్గర్ అంటేమిటో తెలుసుకోండి. "షిర్క్ అక్బర్ వరకు చేర్పించే ప్రతీ సంకల్పం, మాట, పని. అది స్వయం ఇబాదత్ కాకూడదు". షిర్క్ అక్బర్, షిర్క్ అస్గర్ యొక్క ఈ రెండు నియమాలను క్షుణ్ణంగా తెలుసుకుంటే, దీనికి ముందు, తరువాత అధ్యాయాలన్నింటినీ మీరు అర్థం చేసుకో గలుగుతారు. ఇంకా సందేహమనిపించే విషయాల్లో ఇది మీకు స్పష్టమైన గీటురాయిగా ఉంటుంది.

## 11వ అధ్యాయం:

## అల్లాః తప్ప ఇతరుల కొరకు జిబహ్ చేసే చోట, అల్లాః కొరకు జిబహ్ చేయరాదు

అల్లాః ఆదేశం: ﴾నీవు ఎన్నడూ అందులో నిలబడకు﴿. (9: తౌబా: 108).

సాబిత్ బిన్ జహ్హాక్ రజియల్లాహు అన్హు కథనం: బువాన అనే స్థలంలో ఒక వ్యక్తి ఒంటె జిబహ్ చేయాలని మొక్కుకున్నాడు. దాన్ని గురించి ప్రవక్త ﷺతో ప్రశ్నించగా, "అక్కడ జాహిలియ్యత్ కాలంలోని విగ్రహాల్లో ఏదైనా విగ్రహం ఉందా? దాని పూజా జరుగుతూ ఉందా?" అని ఆయన ﷺ అడిగారు. "లేదు" అని అతడు సమాధానం పలికాడు. "వారి పండుగలో (ఉర్సు, జాత్రల్లో) ఏదైనా పండుగ (ఉర్సు, జాత్ర) అక్కడ జరుగుతుందా?" అని అడిగారు. "లేదు" అని అతడు సమాధానం పలికాడు. అప్పుడు ప్రవక్త ﷺ

చెప్పారు: "నీ మ్రొక్కుబడిని పూర్తి చేయి. అల్లాః అవిధేయతకు గురి చేసే మ్రొక్కుబడిని పూర్తి చేయరాదు. మానవుడు తన శక్తికి మించిన దాన్ని మ్రొక్కుకుంటే అది కూడా పూర్తి చేయరాదు". (అబూ దావూద్).

## ముఖ్యాంశాలు:

1. ఇందులోని ఆయతు యొక్క వ్యాఖ్యానం.
2. అల్లాః విధేయత, అవిధేయత కొన్ని సందర్భాల్లో భూమిపై కూడా తన ప్రభావాన్ని చూపుతుంది. (అందుకే షిర్క్ జరిగే చోట జిబహ్ చేయవద్దు అని చెప్పబడింది).
3. కఠిన సమస్యను నచ్చజెప్పేటప్పుడు సులభరీతిలో ఏలాంటి చిక్కు లేకుండా స్పష్టపడునట్లు చెప్పాలి.
4. అవసర సందర్భంలో "ఫత్వా" ఇచ్చువారు వివరాన్ని కోరవచ్చు.
5. ఏలాంటి ధార్మిక అడ్డు, ఆటంకం లేనప్పుడు ప్రత్యేక చోటును మ్రొక్కుబడి కొరకు నిర్ణయించవచ్చును.
6. జాహిలియ్యత్ (మూఢవిశ్వాస) కాలంలో విగ్రహం ఉన్న చోట, దాన్ని తర్వాత తొలగించినప్పటికీ అచ్చట జిబహ్ చేయరాదు.
7. వారి పండుగ (ఉర్సు, జాత్ర) జరుగుతున్న స్థలం, అది ఇప్పుడు జరగనప్పటికీ అక్కడ కూడా జిబహ్ చేయరాదు.
8. ఇలాంటి స్థలాల్లో జిబహ్ చేయుటకు మ్రొక్కుకుంటే దానిని పూర్తి చేయకూడదు. అది పాపపు మ్రొక్కు అగును.
9. ఉద్దేశపూర్వకంగా కానప్పటికీ ముస్లింలు ముష్రికుల పండుగ (ఉర్సు, జాత్ర)ల పోలికల నుండి జాగ్రత్తగా వహించాలి.
10. అవిధేయతకు గురి చేసే మ్రొక్కుబడి చేయరాదు.
11. మనిషి తన శక్తికి మించిన దాని మ్రొక్కు చేయకూడదు.

తాత్పర్యం:

దీనికి ముందు అధ్యాయం తరువాత, వెంటనే ఈ అధ్యాయాన్ని ప్రస్తావించడంలో ఉత్తమమైన ఔచిత్యం ఉంది. మొదటిది షిర్క్ అక్బర్ అయితే, ఇది దానికి వసీల (మార్గం, సాధనం). ఏ చోటనైతే అవిశ్వాసులు, ముష్రికులు తమ దేవతల, (వలీల) సాన్నిధ్యం పొందుటకు అల్లాహ్‌తో షిర్క్ చేస్తూ వారి కొరకు జిబహ్ చేస్తారో అవి షిర్క్ యొక్క చిహ్నాలు, గుర్తులు అయ్యాయి. అక్కడ ఎవరైనా ముస్లిం జిబహ్ చేస్తే, అతని ఉద్దేశం అల్లాః కొరకే ఉన్నప్పటికీ అది బాహ్యంగా వారి విధంగనే ఏర్పడుతుంది. (అంటే చూసేవాళ్ళకు అల్లాఃయేతరలకు చేస్తున్నట్లే ఏర్పడుతుంది). ఇలా బాహ్య రూపంలో వారికి పోలిన పనులు చేస్తే, చివరికి ఆంతర్యం కూడా ఒకటి అయి పోయే భయం ఉంటుంది. (ఈ రోజుల్లో అయిపోయినట్లే కనబడుతుంది).

అందుకే ఇస్లాం వారి పోలికల నుండి దూరముండాలని హెచ్చరించింది. అది వారి పండుగలు, వారి లాంటి కార్యాలు, వారి లాంటి దుస్తులు ఇంకా వారికి ప్రత్యేకించిన ప్రతీ దానితో ముస్లిం దూరముండాలి. వాస్తవానికి ఇది వారిలో కలసిపోవుటకు ఒక సాధనంగా మారుతుంది. ముష్రికులు అల్లాః-యేతరులకు సజ్దా చేసే సమయంలో, ముస్లింలు నఫిల్ నమాజు చేయుట నివారించబడింది. ఈ నివారణ వచ్చింది వారి పోలిక నుండి దూరముంచుటకే.

## 12వ అధ్యాయం:

### అల్లాః తప్ప ఇతరులకు మొక్కు కొనుట షిర్క్

అల్లాః ఆదేశం: ﴾వారు మొక్కుబడి చెల్లించేవారు﴿ (76: దహ్ర్: 7). మరోచోట: ﴾మీరేమి ఖర్చుపెట్టినదీ, మీరు మొక్కుబడి చేసుకున్నదీ, అంతా అల్లాఃకు తెలుసు﴿. (2: బఖర: 270).

ఆయిషా రజియల్లాహు అన్హా ఉల్లేఖనంలో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఆదేశించారు: "అల్లాహ్ కు విధేయత చూపాలని మొక్కుబడి చేసిన వ్యక్తి విధేయత చూపాలి. కాని ఎవరు అల్లాహ్ కు అవిధేయత చూపాలని మొక్కుబడి చేస్తాడో అతడు అవిధేయత చూపకూడదు". (బుఖారి).

## ముఖ్యాంశాలు:

1. మొక్కుబడి చేస్తే దాన్ని పూర్తి చేయాలి.
2. మొక్కుబడి ఇబాదత్ అని తెలిసింది, దాన్ని ఇతరుల కొరకు చేయుట షిర్క్.
3. పాపకార్యానికి, అవిధేయతకు మొక్కుబడి చేస్తే దాన్ని పూర్తి చేయకూడదు.

# 13వ అధ్యాయం:

## అల్లాః తప్ప ఇతరులతో శరణు కోరుట షిర్క్

అల్లాః ఆదేశం: ﴿మానవులలో కొందరు జిన్నాతులలో కొందరిని శరణు-వేడుతుండేవారు. ఈ విధంగా వారు జిన్నాతుల గర్వాన్ని మరింత అధికం చేశారు﴾. (72: జిన్న్: 6).

ఖౌలా బిన్తె హకీం ﷺ కథనం: ప్రవక్త ﷺ ఇలా ఆదేశించగా నేను విన్నాను: "ఎవరైనా ఒక స్థలంలో చేరిన తరువాత "అఊజు బికలిమా తిల్లాహి-త్తామ్మాతి మిన్ షర్రి మా ఖలఖ" చదివినచో వారికి ఆ స్థలం నుండి వెళ్ళే వరకు ఏ హాని కలగదు". (ముస్లిం).

## ముఖ్యాంశాలు:

1. కొందరు మనుషులు జిన్నాతుల శరణు కోరేవారు అని సూరె జిన్న్ వాక్యంలో తెలిసింది.

2. అది షిర్క్ అనీ తెలిసింది.
3. పైన పేర్కొనబడిన హదీసుతో కూడా అల్లాహ్‌తో మాత్రమే శరణు వేడాలని తెలిసింది. అల్లాహ్ వాక్కు (కలిమ), ఆయన గుణమని, సృష్టిరాశి కాదు అని తెలిసింది. ఒక వేళ సృష్టి అయి ఉంటే ప్రవక్త వాటిద్వారా శరణు కోరేవారు కాదు. ఎందుకనగా సృష్టితో శరణు కోరుట షిర్క్.
4. పైన తెలుపబడిన దుఆ చిన్నది అయినప్పటికి దాని ఘనత, లాభం చాలా వుంది.

ఓ సందర్భంలో ఒక క్రియ, పని ద్వారా ఏదైనా ప్రాపంచిక లాభం కలిగితే, లేక కష్టం, నష్టం దూరమైతే అది షిర్క్ కాదు అనటానికి అది ప్రమాణం కాదు. (దేనితో లాభం కలిగిందో అదే స్వయం షిర్క్ కావచ్చు. అందుకు ఏది షిర్కో, ఏది షిర్క్ కాదో అనేది ఖుర్ఆన్, హదీసుల ద్వారా తెలుసుకోవాలి).

## 14వ అధ్యాయం:

## అల్లాహ్‌మేతరులతో "దుఆ" చేయుట, లేక సహాయం కొరకు "మొర"పెట్టుకొనుట షిర్క్

అల్లాహ్ ఆదేశం: ﴾అల్లాహ్‌ను వదలి నీకు నష్టాన్నిగాని లాభాన్నిగాని కలిగించలేని ఏ శక్తినీ వేడుకోకు. ఒక వేళ అలా చేస్తే నీవూ దుర్మార్గుడవై పోతావు. అల్లాహ్ గనక నిన్ను ఏదైనా ఆపదకు గురి చేస్తే స్వయంగా ఆయన తప్ప ఆ ఆపదను తొలగించేవారు ఎవ్వరూ లేరు﴿. (10: యూనుస్: 106,107).

﴾అల్లాహ్‌ను కాదని మీరు ఆరాధిస్తున్నవి మీకు ఏ ఉపాధినీ ఇచ్చే అధికారం కలిగి లేవు, ఉపాధి కొరకు అల్లాహ్‌ను అడగండి﴿. (29: అన్‌కబూత్: 17).

﴾అల్లాను కాదని, ప్రళయం వచ్చే వరకు అతనికి సమాధానమైనా ఇవ్వలేని వారిని, మొరపెట్టుకునే వారు తమకు మొరపెట్టుకుంటున్నారనే విషయం కూడా ఎరుగని వారిని వేడుకునే వాడికంటే పరమ మార్గభ్రష్టుడైన వాడు ఎవడు? మానవులందరిని సమావేశపరచినప్పుడు, వారు తమను వేడుకున్న వారికి విరోధులైపోతారు. వారి ఆరాధనను తిరస్కరిస్తారు﴿. (46: అహ్ ఖాఫ్: 6, 7).

﴾బాధితుడు మొరపెట్టుకున్నప్పుడు, అతని మొరను ఆలకించి అతని బాధను తొలగించేవాడు ఎవడు?﴿. (27: నమ్ల్: 62).

తబ్రానీలో ఉంది. ప్రవక్త ﷺ కాలంలో ఒక కపటవిశ్వాసి విశ్వాసులకు చాలా బాధకలిగించేవాడు. ఒకసారి సహచరులు "పదండి! మనం ప్రవక్తతో ఈ కపటవిశ్వాసి గురించి మొరపెట్టుకుందాము" అని అన్నారు. అప్పుడు ప్రవక్త ﷺ చెప్పారు: "నాతో కాదు మొర పెట్టుకోవలసింది. అల్లాహ్‌తో మొరపెట్టుకోవాలి".

## ముఖ్యాంశములు:

1. "దుఆ" (ప్రార్థన) సర్వ సామాన్యమైనది. కాని "ఇస్తిగాస" (మొర) ప్రత్యేకించబడినది.
2. సూరె యూనుస్‌లోని ఆయత్ (అల్లాహ్‌ను వదలి నీకు నష్టాన్నిగాని లాభాన్నిగాని కలిగించలేని ..........) యొక్క భావం తెలిసింది.
3. అదే షిర్కె అక్బర్.
4. పుణ్యపురుషుడు, మహాభక్తుడు అల్లాహ్‌యేతరులతో వారి సంతృప్తి కొరకు మొరపెట్టుకుంటే అతడు కూడా దుర్మార్గులలో కలసిపోతాడు.
5. సూరె యూనుస్‌లోని రెండవ ఆయతు (అల్లాహ్ గనక నిన్ను ఏదైనా ఆపదకు గురి చేస్తే .....) యొక్క భావం తెలిసింది.
6. అల్లాహ్‌యేతరులతో మొరపెట్టుకుంటే వారు ఏ లాభమూ చేకూర్చలేరు. అది అవిశ్వాసం కూడాను.

7. అన్ కబూత్ లోని ఆయతు (అల్లాహ్‌ను కాదని మీరు పూజిస్తున్నవి.......) యొక్క భావం కూడా తెలిసింది.

8. స్వర్గం అల్లాహ్‌తో కోరినట్లు, ఉపాధి కూడా అల్లాహ్‌తో మాత్రమే కోరాలి.

9. అహ్ ఖాఫ్ లోని ఆయతు (అల్లాను కాదని, ప్రళయం వచ్చే వరకు అతనికి.......) యొక్క భావం తెలిసింది.

10. అల్లాహ్‌ను వదలి ఇతరులతో దుఆ చేసిన వానికంటే ఎక్కువ దుర్మార్గుడు, భ్రష్టుడు మరొకడు లేడు.

11. ఎవరితోనైతే మొరపెట్టుకొనడం జరుగుతుందో వారు మొరపెట్టుకునే వారిని ఎరుగరు.

12. ఇహలోకంలో మొరపెట్టుకోవటం, పరలోకంలో వారి పరస్పర ద్వేషానికి, శతృత్వానికి కారణమగును.

13. అల్లాహ్‌ను వదలి ఇతరులను మొరపెట్టుకొనుట వారి ఆరాధన చేసినట్లు అగును.

14. మొరపెట్టుకోబడినవాడు ఈ మొరను తిరస్కరిస్తాడు.

15. ఇదే పరమ మార్గభ్రష్టత్వానికి కారణం.

16. ఆహ్ ఖాఫ్ వాక్యం (బాధితుడు మొరపెట్టుకున్నప్పుడు..........) యొక్క భావం తెలిసింది.

17. చాలా ఆశ్చర్యకరమైన విషయం: కష్ట కాలాలో అల్లాహ్ తప్ప ఎవరూ వినరని విగ్రహారాధకులు సయితం ఒప్పుకుంటారు. అందుకే ఆ సమయాల్లో అల్లాహ్‌తోనే చిత్త శుద్ధితో మొరపెట్టుకుంటారు. (కాని ఈ నాటి సమాధి పూజారులైన ముస్లింల విషయం బాధకరమైనది. అల్లాహ్ వారికి తౌహీద్ మార్గం చూపుగాకా!).

18. పై హదీసు ద్వారా తెలిసిందేమిటంటే; ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తౌహీద్‌ను అన్ని రకాల షిర్క్ నుండి దూరముంచడానికి చాలా ప్రయత్నం చేశారు. అల్లాహ్ తో ఏలాంటి మర్యాద పాటించాలో నేర్పారు.

## తాత్పర్యం:

పదవ అధ్యాయంలోని తాత్పరియంలో తెలుపబడిన షిర్క్ అక్బర్ యొక్క పరిచయాన్ని నీవు అర్థం చేసుకొనియుంటే 12, 13, 14వ అధ్యాయాలు కూడా అర్థం చేసుకోగలవు. మొక్కుబడి ఒక ఆరాధన. దాన్ని పూర్తి చేసిన వారిని అల్లాః ప్రశంసించాడు. అల్లాః విధేయత కొరకు మొక్కుకున్న మొక్కు-బడి పూర్తి చేయాలని ప్రవక్త ఆదేశించారు. ఏ పని గురించి ధర్మం ఆదేశించిందో, లేక అది చేసినవారిని ప్రశంసించిందో అది ఇబాదత్. మరొకసారి ఇబాదత్ (ఆరాధన) పరిచయాన్ని (భావాన్ని) గుర్తుంచుకొండి: "అల్లాః ఇష్టపడే, తృప్తి చెందే ప్రతీ బాహ్య, ఆంతర్య మాటలు, చేష్టలు".

అన్ని రకాల కీడు నుండి అల్లాః శరణు మాత్రం కోరాలని అల్లాః ఆదేశించాడు. ఇది ఇబాదత్. అల్లాఃతో శరణు కోరితే దాన్ని తౌహీద్, విశ్వాసం అంటారు. ఇతరులతో కోరితే షిర్క్ అంటారు.

దుఆ మరియు మొరపెట్టుకొనుటలో వ్యత్యాసం ఏమనగా: దుఆ అన్ని పరిస్థితులకు ఉపయోగపడుతుంది. కష్టకాలాల్లో మొరపెట్టుకోవడం జరుగుతుంది. ఇవన్నియు పూర్తి చిత్తశుద్ధితో అల్లాఃతోనే చేయాలి. ఆయనే దుఆలు వినేవాడు. అంగీకరించేవాడు. కష్టాలను తొలగించువాడు. శక్తి లేని దాని గురించి దైవదూత, వలీలతో మొరపెట్టుకునేవాడు ముష్రిక్, కాఫిర్ అవుతాడు. ధర్మభ్రష్టుడవుతాడు. సృష్టిలో ఎవరి వద్ద కూడా స్వయంగా తనకు, లేక ఇతరులకు లాభనష్టాలు చేకూర్చే ఏ శక్తి లేదు. అందరూ అన్ని విషయాల్లో అల్లాః ఎదుట బీదవాళ్ళే.

## 15వ అధ్యాయం:

అల్లాః ఆదేశం: ﴿ఏ వస్తువునూ సృష్టించలేనివారిని, స్వయంగా తామే సృష్టింపబడ్డవారిని, ఎవరికీ సహాయం చేయలేనివారిని, స్వయంగా

తమకు తామే సహాయం చేసుకోలేనివారిని వీరు అల్లాహ్‌కు భాగస్వాములుగా చేస్తున్నారా?﴿ (7: ఆరాఫ్: 191, 192).

అల్లాహ్ ఆదేశం: ﴾అల్లాహ్‌ను కాదని మీరు పిలిచే ఇతరులకు కనీసం ఖర్జూరం విత్తనంపై ఉండు పొర అంత అధికారం కూడా లేదు﴿. (35: ఫాతిర్: 13).

అనస్ రజియల్లాహు అన్హు కథనం: ఉహద్ యుద్ధం నాడు ప్రవక్త ﷺ గాయపడ్డారు. అందులో ఆయన నాలుగు పళ్ళు విరిగాయి. అప్పుడు ఆయన అన్నారు: "తమ ప్రవక్తను గాయపరచిన జాతి సాఫల్యం ఎలా పొందగలదు?" అప్పుడే ఈ వాక్యం అవతరించింది. ﴾(ప్రవక్తా!) నిర్ణయాధికారాలలో నీకు పాత్ర ఏదీ లేదు﴿. (3: ఆలె ఇమ్రాన్: 128).

అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ ﷺ కథనం: ప్రవక్త ﷺ ఫజ్ర్ నమాజులో, రెండవ రకాతులోని రుకూ నుండి తలెత్తి, సమిఅల్లాహు లిమన్ హమిదహ్ రబ్బనా వలకల్ హందు అన్న తరువాత "ఓ అల్లాహ్ ఫలాన, ఫలానను శపించు" అని అన్నది విన్నారు. అప్పుడే ఈ ఆయతు అవతరించింది: ﴾(ప్రవక్తా!) నిర్ణయాధికారాలలో నీకు పాత్ర ఏదీ లేదు﴿. (3: ఆలె ఇమ్రాన్: 128).

మరో ఉల్లేఖనంలో ఉంది. సుఫ్యాన్ బిన్ ఉమయ్యా, సుహైల్ బిన్ అమర్, హారిస్ బిన్ హిషాంపై "బద్ దుఆ" చేస్తున్నప్పుడు (శపిస్తున్నప్పుడు) అవతరించింది: ﴾(ప్రవక్తా!) నిర్ణయాధికారాలలో నీకు పాత్ర ఏదీలేదు﴿. (3: ఆలె ఇమ్రాన్: 128).

అబూ హురైరా ﷺ ఉల్లేఖనం ప్రకారం: ﴾నీ దగ్గరి బంధువులను భయపెట్టు﴿. (26: షుఅరా: 214). అన్న ఆయతు అవతరించిన తరువాత "ఓ ఖురైషులారా!" అని లేక ఇలాంటిదే ఒక పదముతో ప్రవక్త ﷺ అందరిని సమావేశపరచి ఇలా చెప్పారు: "మీ ప్రాణాలను మీరు నరకాగ్ని నుండి కాపాడుకోండి. అల్లాహ్ వద్ద నేను మీకు ఏ మాత్రం సహాయం చేయలేను. ఓ అబ్బాసు బిన్ అబ్దుల్ ముత్తలిబ్! అల్లాహ్ వద్ద నేను మీకు ఏ మాత్రం సహాయం చేయలేను. ప్రవక్త

మేనత్త సఫియ్యా! నేను నీకు అల్లాః వద్ద ఏ మాత్రం సహాయం చేయలేను. ముహమ్మద్ కుమార్తె ఫాతిమా! నీవు కోరినంత నా సొమ్ము అడుగు ఇచ్చేస్తా, కాని అల్లాః వద్ద నేను నీకు ఏ మాత్రం సహాయం చేయలేను ". (బుఖారి).

## ముఖ్యాంశాలు:

1. పై రెండు ఆయతుల భావం.
2. ఉహద్ యుద్ధం యొక్క సంఘటన.
3. సకల ప్రవక్తల నాయకులైన ముహమ్మద్ ﷺ "ఖునూత్"లో దుఆ చేస్తు అంటున్నారు. (అలాంటి మహాపురుషులు తమ కష్ట కాలాల్లో అల్లాఃతో మొరపెట్టుకుంటే, సామాన్యులు తమ కష్ట కాలాల్లో అల్లాఃతో మొర పెట్టుకొనుట ఎక్కువ అవసరం).
4. ఎవరిని శపించబడినదో వారు అప్పుడు అవిశ్వాసులుండిరి.
5. ఇతర అవిశ్వాసులు చేయని ఘోరకార్యాలు వారు చేశారు. ఉదా: ప్రవక్త ﷺ ను గాయపరిచారు. ఆయన్ను హతమార్చడానికి ప్రయత్నించారు. అమర-వీరులైన (హత్యచేయబడిన విశ్వాసుల) అవయవాలను సయితం కోశారు. వీరు (విశ్వాసులు) వారి (అవిశ్వాసుల) తండ్రి సంబంధిత దగ్గరి బంధువులే.
6. ఇంత జరిగినందుకు ప్రవక్త ﷺ వారిని శపించినప్పుడు అల్లాః, పై వాక్యం అవతరింపజేసాడు.
7. ﴾వారిని క్షమించే, శిక్షించే అధికారం అల్లాఃకు మాత్రమే ఉంది﴿ (3: ఆలె ఇమ్రాన్: 128). అన్న అల్లాః ఆదేశం ప్రకారం, అల్లాః వారిని క్షమించాడు. వారు ఇస్లాం స్వీకరించారు.
8. ముస్లింపై కష్టకాలం దాపురించినప్పుడు "ఖునూత్ నాజిల" చేయవలెను.
9. ఎవరిని శపించబడుతుందో వారిని, వారి తండ్రుల పేరుతో కలిపి శపించ వచ్చును.

10. ఖునూత్ లో ప్రత్యేకించబడిన ఒక్కొక్క వ్యక్తినిపై ప్రవక్త శపించారు.
11. (షుఅరా: 214) అల్లాః అవతరించినప్పుడు ప్రవక్త ﷺ అందరిని సమూహపరచి తౌహీద్ పిలుపు ఇచ్చిన విషయం తెలిసింది.
12. ప్రవక్త ﷺ తౌహీద్ ప్రచారం చేయునప్పుడు, "పిచ్చివాడు" అని అవిశ్వా-సుల ద్వారా పిలువబడ్డారు. ఈ రోజుల్లో ఎవరైనా అదే పని చేస్తుంటే వారి-తో కూడా అలాగే ప్రవర్తించబడుతుంది.
13. దగ్గరి, దూరపు బంధువులందరికి "నేను మీకు సహాయము చేయలేను " అని స్పష్టం చేశారు. స్వయం తమ కుమార్తె అయిన ఫాతిమాకు కూడా "ఓ ఫాతిమా "నేను నీకు సహాయము చేయలేను " అని చెప్పారు. ఆయన ప్రవక్తల నాయకులై, స్త్రీల నాయకురాలైన ఫాతిమ రజియల్లాహు అన్హాకు ఏ మాత్రం పనికి రాను అని తెలిపారు. ఆయన ﷺ సత్యం తప్ప మరేది పలకరు అని అందరి విశ్వాసం. అయినా ఈ రోజుల్లో ఈ రోగం సామాన్య ప్రజలకే కాక విద్యావంతులు కూడా అర్థం చేసుకోలేకున్నారు. తౌహీద్, ధర్మం వారి వద్ద ఎంత విచిత్రమైందో అగపడుతుంది.

## తాత్పర్యము:

ఇక్కడి నుండి తౌహీద్ యొక్క నిదర్శనాలు ప్రారంభం అవుతున్నాయి. తౌహీద్‌ను నిరూపించడానికి ఉన్నటువంటి గ్రాంధిక, జ్ఞాన సంబంధమైన నిదర్శనాలు మరేదానికి లేవు.

తౌహీద్ రబూబియత్, ఉలూహియత్ స్వయంగా ఇవి రెండు పెద్ద నిదర్శనాలు. సృష్టి, నిర్వాహణలో అద్వితీయుడైన, అన్ని విధాలుగా సర్వశక్తుడైన వాడే ఆరాధనలకు అర్హుడు. అతడు తప్ప మరెవ్వడూ ఆరాధనలకు అర్హుడు కాడు.

అదే విధంగా సృష్టిరాసుల గుణాలను పరిశీలిస్తే కూడా దాని నిదర్శనాలు కనబడుతున్నాయి. అల్లాఃయేతరులలో దైవదూత, మానవుడు, చెట్లు,

గుట్టలు మొదలగు ఎవరెవరి పూజా చేయబడుతుందో వారందరూ/ అవన్నియు అల్లాః ఎదుట దీనులు, బలహీనులు, భిక్షకులు. లాభనష్టాలు చేకూర్చే రవ్వంత శక్తి కూడా లేనివారు. ఏ కొంచెమూ సృష్టించలేరు. వారే సృష్టింపబడ్డారు. లాభనష్టాలు, జీవన్మరణాలకు మరియు రెండవసారి పునరుత్థానానికి వారు అధికారులు కారు. అల్లాః మాత్రమే సర్వ సృష్టికి సృష్టికర్త. పోషకుడు. నిర్వహకుడు. లాభనష్టాలు చేకూర్చే, కోరిన వారికి ప్రసాదించే, కోరనివారికి ప్రసాదించకుండా ఉండే అధికారం కలవాడు. సర్వశక్తి ఆయన చేతిలో ఉంది. ఇంతకు మించిన, మంచి నిదర్శనాలు ఇంకేం కావాలి. వీటి ప్రస్తావన అల్లాహు తఆలా, ఖుర్ఆన్ లో అనేక చోట్ల చేశాడు. ప్రవక్త ﷺ అనేక సార్లు తెలిపారు. ఇది అల్లాః ఒక్కడు. సత్యుడు. బహుదైవత్వం (షిర్క్) తుచ్ఛం అనడానికి స్వాభావికమైన, జ్ఞాన సంబంధమైన నిదర్శనాలతో పాటు, గ్రాంధిక, ఎల్లవేళల్లో కనవినబడుతున్న నిదర్శనాలు కూడానూ.

సృష్టిలో కెల్ల అతి ఉన్నతుడైన ఒక మానవుడు (ప్రవక్త) స్వయం తన దగ్గరి బంధువునికి ఏ లాభం అందించలేకపోయినప్పుడు ఇతరులకు ఏమివ్వగలడు? ఇంతా తెలిసికూడా అల్లాఃతో షిర్క్ చేసినా, సృష్టిలో ఏ ఒకరిని అల్లాఃకు సమానంగా నిలబెట్టినవాడు నాశనమవుగాకా, అతడు ధర్మం కోలిపోయిన తరువాత, బుద్ధిజ్ఞానం కూడా కోలిపోయాడు.

అల్లాఃను ఆ తరువాత సృష్టిని తెలుసుకున్నవాడు, అతని ఈ తెలివితో కేవలం అల్లాఃనే ఆరాధించాలి, ధర్మమును ఆయనకే ప్రత్యేకించాలి, ఆయనన్న మాత్రమే ప్రశంసించాలి, తన నాలుక, హృదయం, శరీరాంగాలతో ఆయనకే కృతజ్ఞత తెలుపాలి. సృష్టిరాసులతో భయం, ఆశ లాంటివేమి ఉండకూడదు.

## 16వ అధ్యాయం:

అల్లాః ఆదేశం: ﴿చివరకు దైవదూతల హృదయాల నుండి భయం తొలగిపోయినపుడు, వారు "మీ ప్రభువు ఏమని పలికాడు?" అని అడుగుతారు. వారు, "సత్యం పలికాడు", ఆయన మహిమాన్వి తుడు, మహోన్నతుడు అని అంటారు﴾. (34: సబా: 23).

అబూ హురైరా ఉల్లేఖించారు, ప్రవక్త ఇలా చెప్పారు: "అల్లాః ఆకాశంలో ఒక ఆదేశం జారి చేసినప్పుడు, ఆయన ఆజ్ఞకు (విధేయులై) దైవదూతలు తమ రెక్కలు కొడుతారు. దాని శబ్దం కొండరాతిపై గొలుసుతో కొట్టినట్లు ఉంటుంది. ఆయన ఆదేశం వారి వరకు చేరుతుంది. ﴿చివరకు వారి హృదయాల నుండి భయం తొలగిపోయినప్పుడు, వారు "మీ ప్రభువు ఎమని పలికాడు?" అని అడుగుతారు. వారు, "సత్యం పలికాడు", ఆయన మహోన్నతుడు, మహిమాన్వితుడు అని చెబుతారు﴾. ఈ మాటను దొంగలించడానికి షైతాన్ వింటూ ఉంటాడు. షైతానులు ఒకరిపై ఒకరు ఇలా ఉంటారు అని (ఈ హదీసు ఉల్లేఖించేవారిలో ఒకరు) సుఫ్యాన్ బిన్ ఉయయ్ నా తమ అరచేతిని వంచి వ్రేళ్ళ మధ్య వ్యత్యాసముంచి వివరించారు. ఆ షైతాన్ ఒక్క మాట విని, అతని క్రింద ఉన్న షైతాన్ కు ఇస్తాడు. ఇలా ప్రతి ఒకడు తన క్రిందివానికి ఇస్తూ చివరివాడు మాంత్రికునికి, లేక జ్యోతిష్యునికి ఇస్తాడు. ఒకప్పుడు ఆ మాట క్రిందికి చేరక ముందే (అల్లాః ఆకాశంలో నియమించిన) అగ్ని జ్వాల అతడ్ని పట్టుకొని (కాల్చేస్తుంది). ఒకప్పుడు ఆ అగ్నిజ్వాల పట్టుకోక ముందే ఆ మాటను అతడు పంపేస్తాడు. ఆ ఒక్క మాటలో మాంత్రికుడు, లేక జ్యోతిష్యుడు వంద అబద్ధాలు కలిపి (ప్రజలకు చెబుతాడు). అతడు చెప్పింది నిజమయ్యేదుంటే, ప్రజలు అతను (మాంత్రికుడు, జ్యోతిష్యుడు) అలా, అలా చెప్పలేదా అని అనుకుంటారు. కాని అందులో నిజమయ్యేది ఆ ఆకాశం నుండి విన్న ఒక్క మాటే". (బుఖారి).

నవాసుబ్ను సమ్ఆన్ ؓ ఉల్లేఖించారు, ప్రవక్త ﷺ చెప్పారు: "అల్లాః ఒక విషయం వహీ (దివ్య సందేశం) పంపాలని కోరినప్పుడు వహీ ద్వారా మాట్లాడుతాడు. అప్పుడు అల్లాః భయంతో ఆకాశాలు కంపించిపోతాయి. ఆకాశవాసులు ఇది విన్నప్పుడు సొమ్మసిల్లి, సజ్దాలో పడిపోతారు. మొట్ట-మొదట వారిలో జిబ్రీల్ తలెత్తుతారు. అల్లాః తాను కోరింది వహీ ద్వారా అతనితో మాట్లాడుతాడు. తరువాత జిబ్రీల్ దైవదూతల ముందు వెళ్తారు. ప్రతీ ఆకాశం నుండి వెళ్తున్నప్పుడు ఆ ఆకాశ దైవదూతలు మీ ప్రభువు ఏమన్నాడు? అని అడుగుతారు. "సత్యం పలికాడు. ఆయన మహోన్న-తుడు, మహిమాన్వితుడు" అని అతడంటాడు. వారందరు జిబ్రీల్ అన్నట్లు అంటారు. తరువాత జిబ్రీల్ ఆ విషయాన్ని ఎక్కడ చేరవేయాలని అల్లాః చెప్పాడో అక్కడికి చేరవేస్తారు". (ضعيف كما في القول المفيد لابن عثيمين ١ ٣٢٠)

## ముఖ్యాంశాలు:

1. ఖుర్ఆన్ ఆయతు యొక్క భావం. (అల్లాః వహీ చేసినప్పుడు దైవ దూతల భయ కంపనాల వివరణ ఉంది).
2. ఇందులో షిర్క్ కు విరుద్ధంగా బలమైన ఋజువు ఉంది. ప్రత్యేకంగా పుణ్యపురుషుల పేరు మీద జరిగే షిర్క్. ఈ ఆయత్ ఆంతర్యాల నుండి షిర్క్ పునాదులను బ్రద్దలు చేస్తుంది అని అనబడింది.
3. "సత్యం పలికాడు", ఆయన మహిమాన్వితుడు, మహోన్నతుడూ" అన్న ఆయతు భావం.
4. వారు ప్రశ్నించింది ఎందుకు అన్నది కూడా తెలుస్తుంది. (అల్లాః భయంతో).
5. ఆ తరువాత జిబ్రీల్ "అల్లాః ఇలా ఇలా చెప్పాడు" అని వారికి బదులిస్తారు.
6. "మొదటిసారిగా తల ఎత్తేవారు జిబ్రీల్" అన్న ప్రస్తావన వచ్చింది.
7. ఆకాశవాసులందరు అడిగినందుకు జిబ్రీల్ వారందరికి సమాధానమిస్తారు.
8. ఆకాశవాసులందరూ సొమ్మసిల్లిపోతారు.

9. ఆకాశాలు కంపించేది అల్లాః యొక్క వచనములతో.
10. అల్లాః ఆదేశమిచ్చిన చోటకి వహీ తీసుకెళ్ళేవారు జిబ్రీలె.
11. షైతానులు మాటలను దొంగతనం చేసే ప్రయత్నాలు చేసేవారు.
12. షైతానులు ఒకరిపై ఒకరు ఎక్కుతారు, ఆకాశంలోని మాట అందుకోవటాని.
13. వారిని తరిమి కొట్టడానికి అగ్నిజ్వాల పంపబడుతుంది.
14. ఒక్కప్పుడు అగ్నిజ్వాల అతన్ని అందుకొని కాల్చేస్తుంది. ఒకప్పుడు అతడు తప్పించుకొని ఆ మాట మాంత్రికుని, లేక జ్యోతిష్యునికి అందిస్తాడు.
15. ఒక్కోసారి మాంత్రికుని, జ్యోతిష్యుని మాట నిజమవుతుంది.
16. మాంత్రికుడు, జ్యోతిష్యుడు ఆ ఒక్క మాటకు వంద అబద్దాలు కలుపుతాడు.
17. అతని అసత్య మాటల్ని ప్రజలు నిజమనుకునేది ఆ ఒక్క ఆకాశ మాట నిజమయినందుకే.
18. అసత్యాన్ని, మిథ్యాన్ని మనుస్సు ఎంత తొందరగా ఒప్పుకుంటుందో చూడండి. ఒక్క మాటను చూస్తారు, కాని వంద అబద్దాలున్నాయని గమనించరు.
19. షైతానులు పరస్పరం ఆ మాటను అందుకొని జ్ఞాపకముంచుకుంటారు. ఇతర మాటల్ని నిజమని భావింపజేసే ప్రయత్నం చేస్తారు.
20. ఇందులో అల్లాః గుణవిశేషణాలు రుజువవుతున్నాయి. "అషఅరియ్యా, ముఅత్తిల" వర్గంవారు వాటిని తిరస్కరిస్తారు. (వాస్తవానికి తిరస్కరించకూడదు).
21. కంపించుట, సొమ్మసిల్లుట అనేది అల్లాః భయం వలన జరుగుతుంది.
22. దైవదూతలు అల్లాః కు సజ్దా చేస్తారు.

## తాత్పర్యం:

ఇందులో కూడా తౌహీద్ విధితం, షిర్క్ తుచ్ఛం అని చెప్పడానికి గొప్ప నిదర్శనం ఉంది. పై మూల వాక్యాల్లో అల్లాః గొప్పతనం, ఔన్నత్యం ప్రస్తావించబడినది. ఆ గొప్పతనం, ఔన్నత్యం ముందు సర్వ సృష్టి యొక్క

పెద్దరికాలు మట్టిలో కలిసిపోతాయి. అతని మాట వింటెనే భూమ్యాకాశాల్లో ఉన్న సర్వ దైవదూతల గుండెలు అదిరిపోతాయి. వారందరు ఆయన ఎదుట తల మోకరిల్లి, ఆయన గొప్పతనం, ఔన్నత్యాలను స్తుతిస్తారు. ఆయనతో భయపడుతారు. ఇలాంటి గొప్ప గుణం గల ప్రభువే, ఆరాధనకు అర్హుడు కాగలడు. ఆయన తప్ప మరెవ్వరూ ఆరాధనకు, పొగడ్తలకు, ప్రశంసనలకు, కృతజ్ఞతకు అర్హులు కారు.

## 17వ అధ్యాయం:

## సిఫారసు (షఫాఅత్)

అల్లాః ఆదేశం: ﴾ప్రవక్తా! తమ ప్రభువు ముందు ఆయన తప్ప తమకు అండగా నిలిచి, సహాయం చేసే (అధికారంగల) వాడుగానీ లేదా తమ కొరకు సిఫారసు చేసే వాడుగానీ ఎవడూ ఉండని స్థితిలో ఎప్పుడైనా హాజరు కావలసివస్తుందని భయపడుతూ ఉండేవారికి నీవు దీని (ఖుర్ఆన్) ద్వారా ఉపదేశించు﴿. (6: అన్ఆమ్: 51).

﴾సిఫారసు అనేది పూర్తిగా అల్లాః చేతిలోనే ఉంది﴿. (39: జుమర్: 44).

﴾ఆయన సమ్ముఖంలో ఆయన అనుమతి లేకుండా సిఫారసు చెయ్యగల-వాడెవ్వడు?﴿. (2: బఖర: 255).

﴾ఆకాశాలలో ఎంతో మంది దైవదూతలు ఉన్నారు. కాని వారి సిఫారసు ఏ మాత్రం ఉపయోగపడదు. అల్లాః తాను ఎవరిని గురించైతే ఏదైనా విన్నపం వినదలుస్తాడో, ఎవడైతే ఆయనకు ఇష్టమైనవాడో, అటువంటి వ్యక్తి విషయంలో దానికి (సిఫారసుకు) అనుమతి ఇస్తేనే తప్ప﴿. (53: నజ్మ్: 26).

﴾(ప్రవక్తా! ఈ ముష్రికులతో) ఇలా అను, "అల్లాఃను కాదని మీరు ఆరాధ్యులుగా భావించిన వారిని పిలిచి చూడండి. వారు ఆకాశాలలో గాని, భూమిలోగాని, రవ్వంత వస్తువుకు కూడా యజమానులుకారు﴿. (34: సబా: 22,23).

షేఖుల్ ఇస్లాం ఇబ్ను తైమియ రహిమహుల్లాః ఇలా చెప్పారు: "తనలో తప్ప ముష్రికులు భావించే వారిలో ఏ శక్తి లేదని అల్లాః స్పష్టం చేశాడు. ఆయన తప్ప మరెవ్వరికి (భూమ్యాకాశాల్లో దేనికీ) ఏలాంటి అధికారం లేదు. ఎవరూ అల్లాః మద్దతుదారులూ కారు. కేవలం సిఫారసు మిగిలి ఉన్నది. దాన్ని స్పష్టం చేశాడు; ఆయన అనుమతి ఇచ్చిన వారి తప్ప మరెవ్వరి సిఫారసు పనికిరాదు. అదే విషయం ఈ వాక్యంలో ఉంది: ﴾వారు ఎవరిని గురించీ సిఫారసు చేయరు. సిఫారసు వినటానికి అల్లాః ఇష్టపడిన వాని విషయంలో తప్ప﴿. (21: అంబియా: 28).

ఏ సిఫారసు గురించి ముష్రికులు (పనికి వస్తుందన్నట్లు) ఇక్కడ భావిస్తున్నారో ప్రళయ దినమున అది కనబడదు, పనికిరాదు. ఖుర్ఆన్ దానిని రద్దు చేసింది.

ప్రవక్త ﷺ ఇలా తెలిపారు: "(ప్రళయదినాన అందరూ సమూహమైన చోట <మైదానె మహ్షర్‌లో>) ప్రవక్త ﷺ తన ప్రభువు కొరకు దీర్ఘ సమయం వరకు సజ్దాలో ఉండి, ఆయన స్తోత్రములు పఠిస్తారు. -వెంటనే సిఫారసు చేయరు- తరువాత ఇలా చెప్పబడుతుంది. "ఓ ముహమ్మద్! తల ఎత్తు, పలుకు, నీ మాట వినబడుతుంది. అడుగు, ఇవ్వబడుతుంది. సిఫారసు చేయి, అంగీకరించబడుతుంది".

ఒక సారి అబూ హురైరా ﷺ ప్రవక్త ﷺ తో ఇలా ప్రశ్నించారు: ప్రళయ దినాన మీ సిఫారసుకు అర్హులు ఎవరు కాగలరు?. దానికి ఆయన "ఎవరు "లాఇలాహ ఇల్లల్లాః" హృదయాంతర సత్యత మరియు స్వఛ్ఛతతో అంటారో వారు" అని సమాధానమిచ్చారు. ఈ సిఫారసు, అల్లాః అనుమతి తరువాత లభించేది సత్య విశ్వాసులకు. కాని అల్లాఃతో షిర్క్ చేసినవారు దీనికి నోచుకోలేరు.

అల్లాః అనుమతి ఇచ్చిన వారి సిఫారసు, దుఆతో సత్యవిశ్వాసులను క్షమించడం వాస్తవానికి ఇది వారికి అల్లాః వైపు నుండి లభించే గౌరవం, ఘనత. మరియు ప్రవక్త ﷺ కు గౌరవం, ప్రసాదం, ఇలా ఆయన "ముఖామె

మహ్మూద్" (అత్యంత స్తుతింపబడిన మహోన్నత స్థానం) పొందుతారు.

ఖుర్ఆన్ రద్దు చేసిన సిఫారసు షిర్క్ తో కలుషితమైన సిఫారసు. అందుకే స్వయంగా ఆయన అనుమతితో చెల్లే సిఫారసును గురించి అనేక చోట్ల ప్రస్తావించాడు. దానికి అర్హులు తౌహీద్ ను విశ్వసించిన సత్య విశ్వాసులు అని ప్రవక్త స్పష్టం చేశారు. (షేఖుల్ ఇస్లాం వివరణ సమాప్తమయింది).

## ముఖ్యాంశాలు:

1. ఖుర్ఆన్ ఆయతుల భావం తెలిసింది.
2. రద్దుచేయబడిన సిఫారసు వివరణ వచ్చింది.
3. చెల్లునటువంటి సిఫారసు వివరణ వచ్చింది.
4. ముఖామె మహ్మూద్ ను షఫాఅతె కుబ్రా (పెద్ద సిఫారసు) అని అంటారు, దాని ప్రస్తావన వచ్చింది.
5. ప్రవక్త ﷺ సిఫారసు సాధారణంగా చేయరు. ముందు దీర్ఘ సమయం వరకు సజ్దాలో ఉంటారు తరువాత అనుమతి లభిస్తుంది.
6. దాని అర్హులైన అదృష్టవంతులెవరో కూడా తెలిసింది.
7. అల్లాః తో షిర్క్ చేసినవారికి అది ప్రాప్తం కాదు.
8. దాని వాస్తవికత కూడా తెలిసింది.

## తాత్పర్యం:

రచయిత (ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహ్హాబ్) రహిమహుల్లాః సిఫారసుకు సంబంధించిన అధ్యాయాన్ని ఇచ్చట ప్రస్తావించడానికి కారణం ముష్రికుల భ్రమ, తప్పుడు ఆలోచనను దూరం చేయడానికి. అది ఏమనగా: దైవదూతల, ప్రవక్తల, వలీల (ఔలియాఅల్లాః)తో ముష్రికులు దుఆ చేస్తూ, మొరపెట్టు-కుంటూ, తాము షిర్క్ కు అతీతులమని చెప్పుకుంటారు. అది ఎలా అనేది వారే స్వయంగా ఇలా తెలుపుతారు: "వారు మా లాంటి మనుషులని మాకు

తెలిసినప్పటికీ మేము వారితో దుఆ చేస్తాము. ఎందుకనగా వారు అల్లాః వద్ద ఉన్నత స్థానం గలవారు. మేము వారితో దుఆ చేస్తే, వారు మమ్మల్ని అల్లాః వరకు చేర్పిస్తారు. అల్లాః వద్ద మా సిఫారసు చేస్తారు. ఎలాగైతే రాజుల, అధికారుల వరకు చేరుకోవటానికి, వారి దగ్గర ఉండే కొందరు ప్రత్యేక సిఫారసు చేయువారు, సామాన్య ప్రజల అవసరాలు తీర్చుటకు గాను రాజుల, అధికారుల వద్ద సిఫారసు చేస్తారో". కాని ఇది అసత్యం, తుచ్ఛం. సర్వ అధికారులకన్నా గొప్ప అధికారి అయిన, శక్తి సామర్థ్య-వంతుడైన అల్లాః యొక్క ఉదాహరణ భిక్షకుడైన, అసమర్థుడైన రాజుతో ఇవ్వబడుతుంది. కొందరు మంత్రులతో కలసియే అతను రాజు అయినం-దుకు (అతని అసమర్థత అట్లే ఏర్పడుతుంది). ఈ అధ్యాయంలో ప్రస్తా-వించబడిన ఆయతులతో ఇలాంటి భ్రమ తొలిగిపోతుంది. సర్వ లోకాలకు అధికారి అయిన అల్లాఃయే సిఫారసు యొక్క అధికారి అని అందులో స్పష్టంగా ఉంది. ఆయన అనుమతి లేనిదే ఎవ్వరూ ఎవ్వరికీ సిఫారసు చేయ లేరు. ఎవని మాట, కర్మలతో అల్లాః సంతృప్తి పడతాడో అతని కొరకే అను-మతి లభించేది. తౌహీద్, ఇఖ్లాసు ఉన్న వ్యక్తి తోనే అల్లాః ఇష్టపడతాడు. అయితే ముష్రిక్ (షిర్క్ చేసినవానికి) సిఫారసు ప్రాప్తం కాదు.

## 18వ అధ్యాయం:

### అల్లాః ఆదేశం: ﴾ప్రవక్తా! నీకు ఇష్టమైన వారికి నీవు మార్గదర్శకత్వాన్ని ప్రసాదించలేవు﴿. **(28: ఖసస్: 56).**

ముసయ్యిబ్ ﷺ కథనం: అబూ తాలిబ్ మరణ సమయంలో ప్రవక్త ﷺ వచ్చారు. అక్కడ అబ్దుల్లాః బిన్ అబీ ఉమయ్య, అబూ జహల్ ఇద్దరు అవిశ్వాసు-లున్నారు. ప్రవక్త అన్నారు: "చిన్నాన్నా! "లాఇలాహ ఇల్లల్లాః" వచనం పలకండి, అల్లాః వద్ద మీ పట్ల దాన్ని ఒక ఋజువుగా ఉంచి మాట్లాడతాను".

అప్పుడు వారిద్దరు: "అబ్దుల్ ముత్తలిబ్ ధర్మంను విడనాడుతావా?" అని హెచ్చరించారు. ప్రవక్త మళ్ళీ చెప్పారు. వారిద్దరు అదే మాట అన్నారు. అబూ తాలిబ్ పలికిన చివరి మాట: "నేను అబ్దుల్ ముత్తలిబ్ ధర్మాన్నే విశ్వసిస్తున్నాను", "లాఇలాహ ఇల్లల్లాహ్"ను అతడు తిరస్కరించాడు. అప్పుడు ప్రవక్త ﷺ అన్నారు: "అల్లాహ్ నన్ను నివారించని వరకు మీ కొరకు క్షమాపణ కోరుతూ ఉంటాను". అప్పుడు అల్లాహ్ ఈ వాక్యం అవతరింపజేశాడు. ﴿ముష్రికులను క్షమించవలసినదిగా ప్రార్థన చెయ్యటం ప్రవక్తకూ, విశ్వాసులకూ తగనిపని﴾. (9: తౌబా: 113). అబూ తాలిబ్ విషయంలో ఈ ఆయతు అవతరించింది. ﴿ప్రవక్తా! నీకు ఇష్టమైన వారికి నీవు మార్గదర్శకత్వాన్ని ప్రసాదించలేవు". కాని అల్లాహ్ తనకు ఇష్టమైన వారికి మార్గదర్శకత్వాన్ని ప్రసాదించగలడు﴾. (28: ఖసస్: 56). (ఈ మొత్తం విషయం బుఖారి మరియు ముస్లిం హదీసులలో ఉల్లేఖించబడింది).

## ముఖ్యాంశాలు:

1. మొదటి ఆయతు యొక్క భావం. (ప్రవక్త ﷺ తమ జీవితకాలంలోనే స్వయంగా తన పినతండ్రికి ఏ లాభం చేయలేక పోతే, మరణించిన తర్వాత ఎవరికి ఏ సహాయం చేయగలరు?).

2. ﴿ముష్రికులను క్షమించవలసినదిగా ప్రార్థన చెయ్యటం......﴾ అన్న ఆయతు యొక్క భావం తెలిసింది.

3. ముఖ్యమైన విషయం ఇందులో "లాఇలాహ ఇల్లల్లాహ్" యొక్క భావం. అంటే కేవలం నోటితో పలికితే సరిపోదు. నిర్మలమైన మనస్సుతో సాక్ష్యం ఇచ్చుట తప్పనిసరి. నోటి మాటలు సరిపోవును అని చెప్పే కొందరి పండితులకు ఈ హదీసు విరుద్ధంగా ఉన్నది.

4. ప్రవక్త వచ్చి "లాఇలాహ ఇల్లల్లాహ్" చదవమని అబూ తాలిబ్ తో అన్నప్పుడు, ప్రవక్త ఉద్దేశం ఏమిటో అబూ జహల్, అతనితో ఉన్నవాడు ఇద్దరికి

బాగా తెలుసు. (అందుకే వారు తాతముత్తాతల ధర్మాన్ని విడనాడకూడదని అతనికి చెప్పగలిగారు). అందరికంటే అబూ జహల్ ఎక్కువ ఇస్లాం మౌలిక విషయాన్ని తెలుసుకున్నప్పటికీ (ఇస్లాంలో చేరలేదు). వారిని అల్లాః శపించుగాకా!

5. ప్రవక్త, తన పినతండ్రి ఇస్లాం స్వీకరించాలని చాలా ప్రయత్నం చేశారు.

6. అబ్దుల్ ముత్తలిబ్ మరియు అతని పూర్వీకులు ఇస్లాం స్వీకరించారు, అన్నవారి భ్రమ దీనిద్వారా దూరం కావాలి.

7. ప్రవక్త ﷺ అతని కొరకు ఇస్తిగ్ ఫార్ (క్షమించమని అల్లాఃతో ప్రార్థించుట) చేశారు. ఆయన పినతండ్రి క్షమించబడలేదు. ప్రవక్త అలా ఇస్తిగ్ ఫార్ చేయుటను అల్లాః నివారించాడు.

8. దుష్ట స్నేహితుల దుష్ప్రభావం మనిషి పై పడుతుంది.

9. దుర్మార్గంపై ఉన్న పూర్వీకుల బాటను అనుసరించడం, గౌరవించడం కూడా హానికరం.

10. "మా పెద్దల ఆచారాన్ని ఎలా వదులుకోవాలి" అన్న సందేహంలో పడి ఉన్నవారు, వాస్తవానికి అబూ జహల్ అన్నటువంటి మాటే అంటున్నారు.

11. మనిషి సఫలుడు అవుతాడు అన్నదానికి ఒక సాక్ష్యం అతని అంతిమ ఘడియల్లో ఉన్న ఆచరణ. అతడు (అబూ తాలిబ్) ఒకవేళ కలిమహ్ పలికియుంటే అది అతనికి ఉపయోగపడేది.

12. దుర్మార్గుల మనుస్సులో ఉన్న (పెద్దల ఆచరణ విడనాడకూడదు) భ్రమ ఎంత భయంకరమో గమనించాలి. ఎందుకనగా కొన్ని సంఘటనలలో వారికి ప్రవక్త అనేకసార్లు చెప్పినను తిరస్కరించి వివాదానికి కూడా తయారయింది వారు దాన్ని గౌరవిస్తూ, దాన్ని విడనాడడానికి సిద్ధంగా లేకపోవడమే.

## తాత్పర్యం:

ఈ అధ్యాయం కూడా దీనికంటే మునుపటి లాంటిదే. సృష్టిలో శ్రేష్ఠులైన ముహమ్మద్ ﷺ అల్లాః వద్ద ఉన్నత స్థానంగల వారు, సిఫారసు చేసేవారిలో ఎక్కువ అర్హత గలవారు, అయినా స్వయంగా తమ పినతండ్రికి ఋజుమార్గం ప్రసాదించలేక పోయారు. ఋజుమార్గం ప్రసాదించేవాడు అల్లాఃయే అయినప్పుడు ఇతరులు ఏమి చేయగలుగుతారు? అల్లాయే సత్యమైన ఆరాధ్యుడు అని తెలుస్తుంది. ఆయన సృష్టించటంలో అద్వితీయుడైతే, ఋజుమార్గం ప్రసాదించడంలో కూడా అద్వితీయుడు. మరెవ్వరి చేతిలో ఈ శక్తి లేదు.

"ప్రవక్త నీవు ఋజుమార్గం చూపుతావు" అని ఖుర్ఆన్ లో వచ్చిన దానికి భావం: ప్రవక్త అల్లాః యొక్క వహీ (సందేశం) ప్రజలకు అందజేస్తారు. వారు దాని ద్వారా ఋజుమార్గం పొందుతారు అని అర్థం.

## 19వ అధ్యాయం:

### ఆదం సంతానంలో కొందరు ధర్మాన్ని విడనాడి అవిశ్వాసంలో పడిపోవుటకు కారణం పూర్వ పుణ్యపురుషుల ప్రేమలో "గులువ్వు" చేయడం, అంటే హద్దు మీరటం.

అల్లాః ఆదేశం: ﴾గ్రంథ ప్రజలారా! మీ ధర్మ విషయాల్లో మీరు హద్దులు మీరకండి.﴿. (4: నిసా: 171).

ఇబ్ను అబ్బాసు ﷺ, అల్లాః ఆదేశం: ﴾మీరు మీ ఆరాధ్య దైవాలను ఎంత మాత్రం విడిచిపెట్టకండి. వద్దా, సువాఅ్ లను విడిచిపెట్టకండి. యగూస్ ను, యఊఖ్ ను, నసర్ ను కూడ విడనాడకండి అని వారన్నారు﴿. (71: నూహ్: 23) ను వాఖ్యానిస్తూ ఇలా చెప్పారు: ఇవి నూహ్ ప్రవక్తకు ముందు ఉన్న పుణ్య-పురుషుల పేర్లు. వారు చనిపోయిన తరువాత వారి వారసుల వద్దకు షైతాన్

వచ్చి, "వారి ఫోటోలను, ప్రతిమలను వారు కూర్చొండే స్థలాల్లో పెట్టండి. వాటికి పేర్లు కూడా నిర్ణయించండి" అని చెప్పాడు. వారు అలా చేశారు. ఈ దశలో ఇంకా వారి పూజా జరగలేదు. వారు కూడా చనిపోయిన తరువాత జ్ఞానం కొరత ఏర్పడింది. అప్పుడు వారి సంతానం ద్వారా పూజ మొదలయింది. (బుఖారి).

"అనేక పూర్వ పండితులు ఇలా చెప్పారు: (పైన పేర్కొనబడిన) పుణ్యపురుషులు చనిపోయిన తరువాత, వారు తబర్రుక్ పొందే ఉద్దేశంతో వారి సమాధుల దగ్గర కూర్చునేవారు. తరువాత వారి విగ్రహాలు తయారు చేశారు. కొంత కాలం గడిచాక వాటి పూజ ప్రారంభం అయింది" అని ఇబ్ను ఖయ్యిం రహిమహుల్లాః వివరించారు.

అబ్దుల్లాః బిన్ ఉమర్ ﷺ ఉల్లేఖించారు: ప్రవక్త ﷺ ఆదేశించారు: "క్రైస్తవులు ఈసా బిన్ మర్ యమ్ ﷺ విషయంలో మీతిమీరి ప్రవర్తించినట్లు, మీరు నా విషయంలో మీతిమీరి ప్రవర్తించకండి. నేను అల్లాః దాసున్ని. అల్లాః దాసుడు, ఆయన ప్రవక్త అని అనండి". (బుఖారి, ముస్లిం). మరో సారి ఇలా చెప్పారు: "గులువ్వు (హద్దులు మీరుట) నుండి జాగ్రత్తగా ఉండండి. మీకంటే ముందువారిని నశింపచేసింది గలువ్వే". (తిర్మిజి, ఇబ్ను మాజ, అహ్మద్).

అబ్దుల్లాః బిన్ మస్ ఊద్ ఉల్లేఖించారు, ప్రవక్త ﷺ ఇలా సెలవిచ్చారు: "మితిమీరే వాళ్ళు సర్వ నాశనమయ్యారు". మూడు సార్లు ఇలా అన్నారు. (ముస్లిం).

## ముఖ్యాంశాలు:

1. ఈ అధ్యాయం, దీని తరువాత రెండు అధ్యాయాలను గ్రహిస్తే, ఇస్లాం మరియు ఇతర మతాల్లో ఉన్న వ్యత్యాసం స్పష్టం అవుతుంది. (ఇస్లాం పునాది తౌహీద్ పై ఉంటే, ఇతరుల పునాది షిర్క్ పై ఉంది). మరియు అల్లాః తన దాసుల హృదయాలను మార్చే అనేక విచిత్రాలు కనబడుతాయి.

2. మొదటి సారిగా భూభాగం పై షిర్క్ మొదలయింది పుణ్యపురుషుల విషయంలో (అతిశయోక్తిలో పడిపోయి) మోసబోయినందు వలన అని తెలిసింది.

3. ప్రవక్తల్ని అల్లాః తౌహీద్ ప్రచారానికి పంపినప్పటికీ, వారు బోధించిన ధర్మంలో మార్పు వచ్చింది పుణ్యపురుషుల విషయంలో మితిమీరడం వల్లనే.

4. ధర్మం, స్వభావం వాటిని తిరస్కరించినప్పటికీ ప్రజలు బిద్ అతులను (దురాచారాలను) తొందరగా స్వీకరిస్తారు.

5. దానికి కారణం ధర్మాన్ని, అధర్మంతో, సత్యాన్ని అసత్యంతో కలుషితం చేసినందు వలన. అందులో మొదటిది: పుణ్యపురుషుల ప్రేమలో మితిమీరుట. రెండవది: జ్ఞానులు, విద్యావంతులు చేసిన కొన్ని పనులు, అవి సదుద్దేశంతో కూడి యుండగా వారి తరువాత వచ్చేవారు, వారి ఉద్దేశాన్ని వేరుగా అని భావించుట.

6. సూరె నూహ్ లోని ఆయతు యొక్క భావం.

7. ధర్మం మనుసులో తరుగుతూ ఉండుట, అధర్మం పెరుగుట మనిషి స్వభావంలోనే ఉంది.

8. కొందరు పూర్వ పండితులు చెప్పినదానికి ఇది సాక్ష్యంగా ఉంది. వారు చెప్పారు: బిద్ అత్, కుఫ్ర్ కు కారణం అవుతుంది. అది ఇబ్లీసుకు, పాపం కంటే ఎక్కువ ఇష్టం. ఎందుకనగా పాపం చేయువాడు తౌబా చేస్తాడు, కాని బిద్ అత్ చేయువాడు తౌబా చేయడు.

9. చేసేవాడు ఎంత సదుద్దేశంతో చేసినా బిద్ అత్ అతడిని ఎలా నశింపజేస్తుందో షైతాన్ కు బాగా తెలుసు.

10. దీనితో ఒక మౌలిక విషయం తెలుస్తుంది. అదేమనగా : బిద్ అత్ నుండి దూరముండాలి. అది ఎటు వైపు తీసుకెళ్తుందో గమనించాలి.

11. ఒక మంచి పని చేయుటకయినా సమాధి దగ్గర కూర్చుండటం (ముజావరి చేయుట) చాలా నష్టం.

12. ప్రతిమలు, ఫోటోలను ఉంచుటను నివారించడం, వాటిని తీసివేయడం లో ఉన్న లాభం, ఔచిత్యం తెలుస్తుంది.
13. పై సంఘటనను బాగుగా తెలుసుకొనుట చాలా అవసరం. కాని చాలా ముస్లిములు అశ్రద్ధలో ఉన్నారు.
14. <u>చాలా విచిత్ర విషయం: బిద్ అతీలు ఈ సంఘటనను తఫ్సీర్, హదీసు గ్రంథాలల్లో చదువుతారు. ........... అయినా వారు పుణ్యాపురుషుల విషయంలో మితిమీరుట, వారు అక్కడ చేసే పనులు మంచివి, శ్రేష్టమైనవి అని అంటారు. ఇక అల్లాః, ఆయన ప్రవక్త నివారించినదానిని వ్యతిరేకించుట ఏలాంటి కుఫ్ర్ అంటే దాని వలన వారి ధనప్రాణాలు కూడా స్వాధీనం చేసు కొనుట ధర్మమని విశ్వసిస్తారు.</u>
15. వారు ఆ పుణ్యాపురుషుల సమాధుల దగ్గర చేసే ప్రార్థనల ఉద్దేశం కేవలం వారి సిఫారసు పొందడమే.
16. మా పూర్వీకులు ప్రార్థన చేయుటకే వారి ప్రతిమలను తయారు చేశారు అని వెనుకటి వారు భావించారు.
17. (క్రైస్తవులు ఈసా బిన్ మర్యమ్ ﷺ విషయంలో మితిమీరి ప్రవర్తించి నట్లు, .......) అన్న హదీసు ద్వారా ఆ విషయాన్ని చాలా స్పష్టం చేశారు.
18. మితిమీరినవారు వినాశము పొందుగాక అని మనకు హితవు చేస్తున్నారు.
19. జ్ఞానం నశించిన తరువాతనే షిర్క్ మొదలయింది. దీని ద్వారా జ్ఞానం యొక్క విలువ, అది లేనిచో ఎంత నష్టం కలుగుతుందో అర్థం అవుతుంది.
20. విద్వాంసుల మరణంతో విద్య నశించిపోతుంది.

## తాత్పర్యము:

గులువ్వు అంటే హద్దు మీరటం. అది ఎలా అనగా: ఎవరూ సాటి లేని అల్లాః యొక్క ప్రత్యేక హక్కుల్లో కొన్నింటిని పుణ్యాపురుషుల్లో ఉన్నవి అని నమ్ముట. అల్లాః <u>అన్ని విధాలుగా సంపూర్ణుడు. అన్ని విధాలుగా</u>

అతీతుడు (ఎవరి అక్కర ఏ మాత్రం లేనివాడు). ఆయనే అన్ని విధాల నిర్వాహకుడు. ఆరాధనలకు అర్హతగలవాడు ఆయన తప్ప మరెవ్వడూ లేడు. ఇలా ఎవరైనా పై (అండర్ లైన్ లో ఉన్న) గుణాలు ఇతరుల్లో ఉన్నాయని నమ్మితే, అతడు అతని విషయంలో హద్దు మీరిన వాడవుతాడు. అతణ్ణి అల్లాఃకు సమానంగా నిలబెట్టిన వాడవుతాడు. ఇది పెద్ద షిర్క్.

హక్కులు మూడు రకాలు అన్న విషయం కూడా తెలుసుకోవాలి.

1) అల్లాః యొక్క ప్రత్యేక హక్కు. అందులో ఆయనతో భాగస్వామి ఎవ్వడూ లేడు. అది ఆయన ఇబాదత్ (ఆరాధన). ఇందులో ఇతరులను అల్లాఃకు సాటి కల్పించకు. ప్రేమ, భయం, ఆశ అన్ని విధాలుగా ఆయన్నే వేడుకో. ఆయన వైపునకే మరలు.

2) ప్రవక్తల ప్రత్యేక హక్కు. అది వారిని గౌరవించడం, మర్యాద చేయడం.

3) "హఖ్ఖె ముష్తరక్". అంటే అల్లాః, ఆయన ప్రవక్తలపై విశ్వాసం. అల్లాః మరియు ప్రవక్తల విధేయత. అల్లాః, ఆయన ప్రవక్తల ప్రేమ. ఇది వాస్తవానికి అల్లాః హక్కు. తరువాత దానికనుగుణంగా ప్రవక్తల హక్కు. సత్యవంతులు ఈ హక్కులను ఉత్తమరీతిలో తెలుసుకొని ఎవరి హక్కులు వారికి చెల్లిస్తారు. వాటి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని మరచిపోరు.

## 20వ అధ్యాయం:

## పుణ్యపురుషుని సమాధి వద్ద అల్లాః యొక్క ఆరాధన చేయుట చాలా కఠినంగా నివారించబడితే ఇక పుణ్యపురుషుణ్ణి ఆరాధించేవాని గతి ఏమిటి?

ఆయిషా రజియల్లాహు అన్హా కథనం: ఒక సారి ఉమ్మె సల్మా రజియల్లాహు అన్హా ఆమె హబ్‌షా (నేటి ఇథోపియ దేశం)లో చూసిన చర్చి, అందులోని

ఫోటోల విషయం ప్రస్తావించింది. అప్పుడు ప్రవక్త ﷺ అన్నారు: "వారిలోని పుణ్యపురుషుడు చనిపోతే అతని సమాధిపై ఆలయం నిర్మించి, అందులో వారి ఫోటోలు పెట్టేవారు. అలాంటి వారు అల్లాః వద్ద ఆయన సర్వ సృష్టిలో కెల్ల నీచులు". (బుఖారి, ముస్లిం). వారు రెండు ఉపద్రవాలను (ఫిత్న) ఒక చోట చేర్చారు. (1). సమాధులు. (2). ప్రతిమలు, ఫోటోలు.

ఆయిషా రజియల్లాహు అన్హా కథనం: ప్రవక్త ﷺకు మరణ సమయం ఆసన్న-మయినప్పుడు ఆయన పరిస్థితి చాలా బాధాకరంగా మారిపోయింది. ఒక్కో-సారి ఆయన తన దుప్పటిని ముఖం మీదికి లాక్కునేవారు. కాస్సేపటికి ఊపిరి ఆడకపోవడంతో ముఖం మీది దుప్పటిని తొలగించి వేసేవారు. అలాంటి స్థితిలో సయితం ఆయన (సమాధి పూజలను శపిస్తూ) "యూదులు, క్రైస్తవులు తమ ప్రవక్తల సమాధుల్ని ప్రార్థనా స్థలాలుగా చేసుకున్నారు. అల్లాః వారిని శపించుగాక!" అని అన్నారు. ఈ విధంగా ప్రవచించి ఆయన ముస్లింలను ఇలాంటి చర్యలకు పాల్పడకూడదని పరోక్షంగా హెచ్చరించారు. ఈ హదీసు తెల్పిన తరువాత హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా దానిపై ఇలా వ్యాఖ్యానించారు. "దైవప్రవక్త ﷺ ఇలా ప్రవచించి ఉండకపోతే ఆయన సమాధి (ప్రజల దర్శనార్థం) తెరచి ఉంచబడేది. అంతేకాదు అది కొంత కాలానికి ప్రార్థనా స్థలంగా కూడ మారిపోయేదని భయంగా ఉండేది. (అందుకే తెరచి ఉంచలేదు). (బుఖారి, ముస్లిం).

ప్రవక్త ﷺ తమ మరణానికి ఐదు రోజులు ముందు ఉపదేశించిన మాటల్ని నేను విన్నాను, అని జున్దబ్ ﷺ ఉల్లేఖించారు. "మీలో ఎవరినైనా నా స్నేహితుడిగా (ఖలీల్) చేసుకొనుటకు నేను, అల్లాః ముందు, ఇష్ట-పడను. ఎందుకనగా అల్లాః ఇబ్రాహీంను "ఖలీల్" చేసుకున్నట్లు, నన్ను కూడా స్నేహితుడిని "ఖలీల్" చేసుకున్నాడు. నా అనుచర సంఘంలో ఎవరినైనా "ఖలీల్" చేసుకుంటే అబూ బకర్ ను చేసేవాణ్ణి. వినండి! మీకంటే ముందువారు, తమ ప్రవక్తల సమాధులను ప్రార్థనా స్థలంగా మార్చుకున్నారు.

వినండి! మీరు సమాధులను ప్రార్థనా స్థలంగా చేసుకోకండి. నేను దాని నుండి మిమ్మల్ని నివారిస్తున్నాను". (ముస్లిం).

ఇలాంటి సమాధి పూజల నుండి ప్రవక్త తమ జీవితంలోని చివరి ఘడియలలో నివారించారు. అలా చేసేవారిని శపించారు.

మస్జిద్ లేకున్ననూ సమాధి దగ్గర నమాజు చేయకూడదు. ఆయిషా రజియల్లాహు అన్హా చెప్పిన "అది కొంతకాలానికి ప్రార్థనా స్థలంగా కూడా మారిపోవచ్చని భయంగా ఉండేంది" అన్న మాటకు ఇదే భావం. లేకుంటే సహచరులు ప్రవక్త సమాధిని ప్రార్థన స్థలంగా మారుస్తారని భావించనూ-లేము. ఎందుకనగా ఎక్కడ నమాజు చేయనుద్దేశించబడిందో అదే మస్జిద్. అంతే కాదు నమాజు చేయబడే ప్రతి చోటను మస్జిద్ అనబడును. ప్రవక్త హదీసు భావం అదే: "నా కోసం, (నా అనుచరులకు) యావత్తు భూమండలం ప్రార్థనా స్థలంగా, పరిశుద్ధమైనదిగా చేయబడింది".

ప్రవక్త చెప్పినట్లు ఇబ్ను మస్ఊద్ ఉల్లేఖించారు: "ప్రజల్లో అత్యంత నీచమైన వాళ్ళుగా పరిగణించబడేవారు రెండు రకాలవారు: ఎవరు జీవించి యుండగా ప్రళయం సంభవిస్తుందో వారు. సమాధులపై ప్రార్థనా స్థలాలు నిర్మించేవారు". (అహ్మద్, అబూ హాతిం).

## ముఖ్యాంశాలు:

1. పుణ్యపురుషుని సమాధిపై ప్రార్థనాలయం నిర్మించి, అక్కడ అల్లాః ఆరాధన చేయువానిని ప్రవక్త హెచ్చరించారు. అతని సంకల్పం (నియ్యత్) మంచిదైనప్పటికి.

2. ఫోటోలు, ప్రతిమల నుండి కఠినంగా నివారించారు.

3. ప్రవక్త ﷺ దాని గురించి అనేకసార్లు బోధించారు. దాని నుండి గుణపాఠం నేర్చుకోవాలి. తొలుత మాములుగా దానిని నివారించారు. తరువాత

మరణానికి ఐదు రోజుల ముందు. మళ్ళీ పరలోక ప్రయాణానికి సిద్ధంగా ఉన్న చివరి ఘడియల్లో కూడా కఠినంగా నివారించారు.

4. తన సమాధి వద్ద అలా చేయకూడదని ప్రవక్త తన సమాధి తయారు కాక ముందే హెచ్చరించారు.

5. ఈ ఆచారం యూదులది, క్రైస్తవులది. వారు తమ ప్రవక్తల సమాధుల వద్ద అట్లే చేస్తారు.

6. వారి ఈ చర్యపై ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారిని శపించారు.

7. అందులో ఆయన ఉద్దేశం ఆయన సమాధి పట్ల మనల్ని హెచ్చరించడం.

8. ఆయన ﷺ సమాధిని తెరచి ఉంచకపోవడానికి కారణము తెలిసింది.

9. సమాధులను ప్రార్థన స్థలం చేయడం అన్నదాని భావం తెలిసింది.

10. సమాధులపై ప్రార్థనాలయం నిర్మించేవారిని, ప్రళయం ఎవరిపై సంభవిస్తుందో వారిని కలిపి ప్రవక్త ﷺ ఒకే హదీసులో చెప్పారు. ఇలా షిర్క్ కు ముందు సంభవించే దాని కారణాలు, సాధనాలు, మరియు దాని పర్యవసానం (Result) ను కూడా తెలిపారు.

11. మరణానినికి ఐదు రోజుల ముందు ఇచ్చిన ప్రసంగంలో రెండు సంఘాల ఖండన చేశారు. బిద్ అతి సంఘాల్లో ఇవి రెండు చాలా పెద్దవి. కొందరు పండితులు వారిని 72 సంఘాల నుండి బహిష్కరించారు. ఒకటి: రాఫిజ. రెండవది: జహ్మియ్యా. రాఫిజీల కారణంగనే షిర్క్, సమాధుల పూజ మొదలయింది. మొదటి సారిగా సమాధులపై వీరే మస్జిద్ నిర్మించారు.

12. ప్రవక్తకు చివరి ఘడియల్లో (సక్రాత్ లో) చాలా బాధ గలిగింది

13. ఖలీల్ యొక్క గౌరవపదం ప్రవక్తకు లభించింది.

14. "ఖుల్లత్" (స్నేహం) ముహబ్బత్ కన్నా ఉన్నతమైనది.

15. అబూ బకర్ సిద్దీఖ్ ؓ ప్రవక్త ﷺ వారి సహచరుల్లో శ్రేష్ఠులు అని తెలిసింది.

16. ప్రవక్త తరువాత ఖలీఫా ఆయనే అన్నట్లు సంకేతం ఉంది.

## తాత్పర్యము:

పుణ్యపురుషుల సమాధి వద్ద చేయబడే కార్యాలను గురించి కొంత వివరంగా తెలుసుకుందాము. రెండు రకాల కార్యాలు అక్కడ జరుగుతాయి. ఒకటి: యుక్తమైనది. రెండవది: యుక్తంకానిది.

యుక్తమైనది: దేనినైతే ధర్మం సమ్మతించిందో అది. ఉదా: సమాధుల దర్శనం. కాని దూర ప్రయాణం చేసి దర్శించకూడదు. (దగ్గరి శ్మశానంలో). ముస్లిం భక్తుడు ప్రవక్త సాంప్రదాయాన్ని అనుసరిస్తూ దర్శనానికి వెళ్తాడు. అక్కడికి వెళ్ళి సామాన్యంగా అందరి కొరకు, ప్రత్యేకంగా తనవారి కొరకు అల్లాహ్‌తో దుఆ చేస్తాడు. ఇలా వారి క్షమాపణ, మన్నింపులకు దుఆ చేసిన-వాడు, స్వయంగా పుణ్యం చేసినవాడవుతాడు. ప్రళయాన్ని జ్ఞప్తి చేసిన-వాడు, గుణపాఠం నేర్చుకున్నవాడవుతాడు.

యుక్తం కానిది: ఒక విధంగా ఇది నిషిద్ధం. ఇది షిర్క్‌కు ఒక మార్గం, సాధనం అవుతుంది. ఉదా: తబర్రుక్ (శుభం) కొరకు వాటిని ముట్టుకొనుట. వారిని వసీల (అల్లాహ్ వరకు చేర్పించేవారు)గా భావించుట. అక్కడ నమాజు చేయుట. దీపాలు వెలిగించుట. దానిపై గుమ్మటం, భవనం నిర్మించుట. దాని గురించి, అందులో ఉన్నవారి గురించి గులువ్వు చేయుట. ఇవి స్వయంగా ఇబాదత్ కావు. కాని షిర్క్‌కు సాధనాలు.

రెండవ విధంగా ఇది షిర్క్ అక్బర్. ఉదా: వారితో దుఆ, మొరపెట్టుకొనుట. ఇహపర అవసరాలు వారితో కోరుట. విగ్రహపూజారులు విగ్రహాలతో ఇలాగే చేస్తారు. ఇవన్నియు వారు స్వయంగా పూర్తి చేస్తారు అని విశ్వసించినా, లేక వారు వసీల (అల్లాహ్ వరకు చేర్పించేవారు) అని విశ్వసించినా (రెండూ తప్పులే). ముష్రికులు కూడా ఇదే విధంగా అనేవారు. చదవండి ఖుర్ ఆన్ ఆయతు: ﴾వారు మా కొరకు అల్లాహ్ వద్ద సిఫారసు చేస్తారు﴿. (10: యూనుసు: 18). మరోచోట ఉంది: వారంటారు: ﴾వారు మమ్మల్ని అల్లాహ్ వద్దకు చేరుస్తారని మాత్రమే మేము వారిని ఆరాధిస్తున్నాము﴿. (39: జుమర్ : 3).

సమాధిలో ఉన్నవారితో దుఆ చేయువారు, వారు లాభం చేకూర్చి, నష్టం, కష్టం దూరం చేయువారు అని విశ్వసించినవారు, అల్లాః మాత్రమే అధికారం గలవాడు, కాని వారు మనకు మరియు అల్లాఃకు మధ్య రాయబారి (వసీల, వాస్త) లాంటివారు అని విశ్వసిస్తూ వారితో దుఆ, మొరపెట్టుకునేవారు ముష్రికులు, కాఫిర్లు. వీరు ముష్రికులు, కాఫిర్లు కారు అని నమ్మినవారు కూడ కాఫిర్లవుతారు. ఇంకా అతడు ఖుర్ఆన్, హదీసులను తిరస్కరించిన-వాడవుతాడు. అల్లాఃను గాక ఇతరులతో దుఆ చేసేవాడు, స్వయంగా వారిస్తారని విశ్వసించినా, లేక వారు వసీల అని విశ్వసించినా ముష్రికులు అని ప్రవక్త అనుచర సంఘం ఏకీభవించింది.

## 21వ అధ్యాయం:

### పుణ్యపురుషుల సమాధుల విషయంలో హద్దు మీరుట (గులువ్వు) వలన ఆ సమాధులు విగ్రహాలుగా మారుతాయి

ప్రవక్త ﷺ ఇలా సెలవిచ్చారు: "ఓ అల్లాః నా సమాధిని పూజింపబడే విగ్రహంగా మార్చకు. ప్రవక్త సమాధులను ప్రార్థనా స్థలంగా మార్చుకున్న వారిపై అల్లాః ఆగ్రహం అవతరించుగాక. (ముఅత్తా ఇమాం మాలిక్).

ఇబ్ను జరీర్ ﴿ఈ లాత్, ఈ ఉజ్జా వాస్తవికతను గురించి కాస్తయినా ఆలోచి-ంచారా?﴾ (53: నజ్మ్: 25) అన్న వాక్యంలో ఇలా వ్యాఖ్యానించారు: లాత్ సత్తు కలిపేవాడు. (ఎండిన పిండి ముద్దలను నీటిలో కలిపి బాటసారులకు త్రాగించేవాడు). అతడు చనిపోయిన తరువాత అతని సమాధిపై కూర్చోవటం ప్రారంభించారు.

అబుల్ జౌజా కూడా ఇబ్ను అబ్బాసుతో ఉల్లేఖించిన దానిలో "అతను హజ్ కొరకు వచ్చేవారికి సత్తు తయారు చేసేవాడు అని అన్నారు".

ఇబ్నె అబ్బాసు కథనం: సమాధుల దర్శనం చేసే స్త్రీలను, వాటిపై ప్రార్థనా-లయం కట్టి, దీపాలు వెలిగించేవారిని ప్రవక్త ﷺ శపించారు. (అబూ దావూద్).

## ముఖ్యాంశాలు:

1. అల్లాహ్ తప్ప పూజింపబడే ప్రతీ వస్తువు ను "వసన్" అంటారు.
2. ఇబాదత్ (ఆరాధన) యొక్క భావం తెలిసింది.
3. ఏది సంభవిస్తుందని ప్రవక్త భయంచెందారో దాని గురించి అల్లాః శరణు కోరారు.
4. "శరణు కోరారు" అన్న దానిలోనే సమాధుల పై ప్రార్థనాలయం కట్టిన వారి విషయం చెప్పారు.
5. అల్లాః ఆగ్రహం వారిపై కురుస్తుంది.
6. అరేబియలో కెల్ల పెద్ద విగ్రహంగా పేరుపొందిన "లాత్" పూజ ఎలా ప్రారంభమయిందో తెలిసింది.
7. అతడు పుణ్యపురుషుడు అని తెలిసింది.
8. అతని పేరు, దాని అర్థం తెలిసింది.
9. సమాధులను దర్శించే స్త్రీలను శపించడమైనది.
10. దీపాలు వెలిగించే వారూ శపించబడ్డారు.

# 22వ అధ్యాయం:

## తౌహీద్ ను రక్షించుటకు, షిర్క్ వరకు చేర్పించే ప్రతి దారిని మూసి వేయుటకు ప్రవక్త చేసిన కృషి

అల్లాః ఆదేశం: ﴾చూడండి! మీ వద్దకు ఒక ప్రవక్త వచ్చాడు. ఆయన స్వయంగా మీలోనివాడే. మీరు నష్టానికి గురికావటం అనేది ఆయనకు బాధ కలిగిస్తుంది﴿. **(9: తౌబా: 128).**

అబూ హురైరా ﷺ కథనం: ప్రవక్త ﷺ ఇలా చెప్పారు: "మీరు మీ ఇళ్ళను సమాధులుగా మార్చకండి. నా సమాధిని పండుగ కేంద్రం (ఉర్సు, జాతరగా) చేయకండి. నా కోసం దరూద్ చదవండి. మీరు ఎక్కడా ఉన్నా మీ దరూద్ నావరకు చేరు తుంది". (అబూ దావూద్).

అలీ బిన్ హుసైన్ కథనం: ఒక వ్యక్తి గోడలో ఉన్న ఒక రంధ్రం నుండి ప్రవక్త ﷺ సమాధి వద్దకు వచ్చి అక్కడ దుఆ చేస్తుండగా, చూసి అతనిని నివారించారు. ఇంకా ఇలా చెప్పారు. నేను నీకు ఒక హదీసు వినిపిస్తాను, అది నేను నా తండ్రి (హుసైన్ ﷺ)తో, అతను తన తండ్రి (అలీ ﷺ)తో, అతను ప్రవక్త ﷺతో విన్నాడు. ప్రవక్త చెప్పారు: "నా సమాధిని పండుగ కేంద్రంగా (ఉర్సు, జాత్ర) చేయకండి. మీరు మీ ఇళ్ళను సమాధులుగా మార్చకండి (నఫిల్ నమాజులు చదవకుండా). మీరు ఎక్కడ ఉండి నాపై సలాం పంపినా అది నా వరకు చేరు-తుంది". (రవాహు ఫిల్ ముఖ్తార్).

## ముఖ్యాంశాలు:

1. సూరె తౌబా ఆయతు యొక్క భావం.
2. షిర్క్ దరిదాపులకు కూడా చేరకుండా దూరముండాలని ప్రవక్త యొక్క [illegible]కీదు.
3. ప్రవక్త ﷺ మనపై చాలా కనికరం, కారుణ్యం గలవారు. మన రుజుమార్గాన్ని అధికంగా కోరుకునేవారు.
4. ఆయన సమాధి దర్శనకు వెళ్ళుట ప్రత్యేకంగా నివారించారు. ఆయన సమాధి దర్శనం (అక్కడ ఉన్నవారికి ధర్మం పరిధిలో ఉండి చేయుట) చాలా పుణ్యకార్యం).
5. (అక్కడ నివసించే వారైనప్పటికీ) మాటికి మాటికి దర్శించుటను నివారించారు.

6. నఫిల్ నమాజులు ఇంట్లో చదవాలని ప్రోత్సహించారు.

7. స్మశానంలో నమాజ్ చదవకూడదన్నది సహచరుల వద్ద స్పష్టమయిన విషయం.

8. దరూద్, సలాం దూరంగా ఉండి పంపినా, ఆయన ﷺ వరకు చేరుతుంది. అలాంటపుడు ప్రత్యేకంగా ఈ ఉద్దేశంతో అక్కడికి వెళ్ళే అవసరం లేదు.

9. ప్రవక్త ﷺ సమాధి జీవితం (బర్.జఖ్)లో ఉన్నారు. ఆయన వరకు తన అనుచర సంఘం కర్మల నుండి కేవలం దరూద్, సలాం మాత్రమే చేర్పించ-బడుతాయి.

## తాత్పర్యం:

ఈ అధ్యాయంలో ప్రస్తావించబడిన వాక్యాలపై శ్రద్ధ చూపినవారు ఇందులో తౌహీద్‌ను బలపరిచే విషయాలపై ఆచరించాలని ప్రోత్సహించబడింది. అల్లాః వైపునకే మరలాలని, భయమూ మరియు ఆశతో అల్లాఃపై మాత్రమే నమ్మకం ఉంచాలని, ఆయన దయను కాంక్షించి, దాన్ని పొందే ప్రయత్నం చేయాలని, సృష్టి బానిసత్వ శృంఖలాలను తెంచేసి, ముక్తి పొందాలని, సృష్టిలో ఎవరి గురించి కూడా గులువ్వు చేయకూడదని, సర్వ బాహ్యాంతర కార్యాలు సంపూర్ణంగా నిర్వహించి, ప్రత్యేకంగా ఇబాదత్‌కు ప్రాణమయి-నటువంటి చిత్తశుద్ధి (ఇఖ్లాసు) ప్రతి కార్యంలో ఉంచే ప్రయత్నం చేయాలని ప్రోత్సహించబడింది.

సృష్టిరాసుల విషయంలో గులువ్వు అయ్యే, ముష్రికులను పోలిన మాటలు, చేష్టలు చేయుట నివారించబడింది. ఇది వారిలో కలిసిపోవుటకు కూడా కారణం కావచ్చు. తౌహీద్ భద్రతకై షిర్క్ లోయలో పడవేసే మాటలు, చేష్టల నుండి కూడా నివారించబడింది. విశ్వాసులు ఏ ఉద్దేశంతో పుట్టించబడ్డారో దానిపై వారు స్థిరంగా ఉండుటకు ఇది వారిపై ఓ కరుణ, దయ. వారి సాఫల్యం కూడా అందులోనే ఉంది.

## 23వ అధ్యాయం:

### ప్రవక్త వారి సంఘంలో కొందరు "ఔసాన్" (విగ్రహా)లను పూజిస్తారు

అల్లాః ఆదేశం: ﴾గ్రంథజ్ఞానంలో కొంత భాగం ఇవ్వబడిన వారిని నీవు చూడలేదా? వారి పరిస్థితి ఎలా వుందంటే, వారు "జిబ్త్"ను "తాగూత్" ను నమ్ముతారు﴿.(4: నిసా: 51). మరో ఆదేశం:

﴾అల్లాః వద్ద ఎవరి ముగింపు అవిధేయుల ముగింపు కంటే కూడా హీనతరంగా ఉంటుందో వారిని గురించి తెలియజేయనా? వారు అల్లాః శాపగ్రస్తులు. వారిపై ఆయన ఆగ్రహం విరుచుకు పడింది. వారు కోతులుగా, పందులుగా చెయ్యబడ్డారు. వారు తాగూత్ దాస్యం చేశారు﴿. (5: మాఇద: 60). మరో చోట:

﴾కాని ఈ వ్యవహారంలో పై చేయిగా ఉన్నవారు, "మేము వారిమీద ఒక ఆరాధనా మందిరాన్ని నిర్మిస్తాము" అని అన్నారు﴿. (18: కహాఫ్: 21).

అబూ సఈద్ ఖుద్రీ ؓ ఉల్లేఖించారు, ప్రవక్త ﷺ చెప్పారు: "మీరు తప్పకుండా పూర్వీకుల (అంటే గత మతస్థుల) జీవన విధానాలను బాణం, బాణంకు సమానం ఉన్నట్లు అనుసరిస్తారు. చివరికి వారు ఉడుము కన్నంలోకి దూరితే, వారి వెంట మీరు కూడా అందులోకి దూరుతారు". సహచరులు ఈ మాట విని దైవప్రవక్తా! "ఏమిటీ మేము యూదుల్ని, క్రైస్తవుల్ని అనుసరిస్తామా?" అని అడిగారు (ఆశ్చర్యంతో). దానికి దైవప్రవక్త ﷺ "మరి ఎవరు అనుకుంటుకున్నారు?" అని అన్నారు. (బుఖారి, ముస్లిం).

సౌబాన్ ؓ కథనం: ప్రవక్త ﷺ ఇలా తెలిపారు: "అల్లాః నా కొరకు భూమిని చుట్టి దగ్గరికి చేశాడు. నేను దాని తూర్పు పడమర అంతా చూశాను. నా ఎదుట చుట్టబడిన భూమి అంతటిలో నా అనుచర సంఘం చేరుకుంటుంది. నాకు ఎర్రని, తెల్లని రెండు ధనభండారాలు ఇవ్వబడినవి. నేను నా ప్రభువుతో ఇలా వేడుకున్నాను: "నా అనుచర సంఘాన్ని అనావృష్టి (ఖహత్) ద్వారా

నశింపజేయకు. వారిపై గెలిచి, వారిని అణచివేసే ముస్లిమేతరులైన శత్రువులకు వారిపై విజయం ప్రసాదించకు". అప్పుడు నా ప్రభువు అన్నాడు: "వారిని అనావృష్టితో నశింపజేయను. ముస్లిమేతరులైన శత్రువులకు వారిపై ఆధిపత్యం ఇవ్వను. వారంతా ఏకమై వచ్చినప్పటికీ. ఇది వారిలో ఒకడు మరొకడ్ని నాశనం జేసి, ఖైదీలుగా చేయకుండా అందరు ఏకమై ఉన్నంత వరకు". (ముస్లిం).

ఇదే హదీసును బర్ ఖాని ఉల్లేఖించారు, అందులో ఇంకా ఇలా వుంది. ప్రవక్త ﷺ చెప్పారు: "నేను నా అనుచర సంఘం పట్ల వారిలోని దుర్మార్గులైన నాయకులు, పండితులతో భయపడుతున్నాను. వారిపై ఒకసారి కత్తి పడిందంటే ప్రళయం వరకు లేపబడదు. నా అనుచర సంఘంలోని ఒక చిన్న సమూహం ముష్రికులతో కలువని వరకు, మరొక సమూహం విగ్రహాలను పూజించని వరకు ప్రళయం సంభవించదు. నా అనుచర సంఘంలో 30 అసత్య-వాదులు వస్తారు. వారిలో ప్రతి ఒక్కడు తనే ప్రవక్త అని అరోపణ చేస్తాడు. నేను చిట్టచివరి ప్రవక్తని. నా తరువాత ఏ ప్రవక్త రాడు. ఎల్లకాలం, ఎల్లవేళల్లో సత్యం, ధర్మంపై ఒక సంఘము ఉండే ఉంటుంది. వారికి దైవ సహాయం లభిస్తూనే ఉంటుంది. ఆ సంఘాన్ని వదలి వెళ్ళినవాడు దానిని ఏ మాత్రం హాని కలిగించలేడు. చివరికి ప్రళయం సంభవిస్తుంది".

## ముఖ్యాంశాలు:

1. సూరె నిసా ఆయతు భావం.
2. సూరె మాఇద ఆయతు భావం.
3. సూరె కహఫ్ ఆయతు భావం.
4. ఇది చాలా ముఖ్య విషయం: ఇందులో జిబ్త్, తాగూత్ పై విశ్వాసం అంటే ఏమిటి? అది హృదయాంతర విశ్వాసమా? లేక అది మిథ్యం, అసత్యం అని తెలిసి, దానితో ప్రేమ, ఇష్టం లేనప్పటికి కేవలం దాన్ని అనుసరించిన వారితో సంబంధమా?

5. అవిశ్వాసుల అవిశ్వాసం తెలిసి కూడా వారు విశ్వాసులకన్నా ఉత్తమమైన మార్గంపై ఉన్నారన్న యూదుల మాట కూడా తెలిసింది.
6. ఒక ముఖ్య విషయం అది ఈ అధ్యాయంలో ఉద్దేశించినది. అది అబూ సఈద్ హదీసులో వచ్చినది; ప్రవక్త అనుచర సంఘంలో కొంత మంది గత మతస్తులను అనుసరిస్తారు.
7. వీరిలో కొంత మంది విగ్రహ పూజారులు అవుతారు.
8. విచిత్రమైన విషయం: ప్రవక్తలు అని ప్రకటన చేసేవారు వస్తారు. ఉదా: ముఖ్తార్ అబూ ఉబైద్ సఖఫీ. అతడు "లాఇలాహ ఇల్లల్లాహ్"ను చదివి, ప్రవక్త అనుచర సంఘంలోనివాడయి, ముహమ్మద్ ప్రవక్తను సత్యప్రవక్త, చివరి ప్రవక్త అని, ఖుర్ఆన్ సత్యం అని నమ్మి కూడా వాటికి వ్యతిరేకించి తానే ప్రవక్త అని ప్రకటించుకున్నాడు. అతడు ప్రవక్త సహచరుల చివరి జీవితకాలంలో పుట్టినవాడు. అతన్ని చాలా మంది అనుసరించారు.
9. ఇంతకు ముందు కాలంలో జరిగినట్లు ఇస్లాం ధర్మం నశించిపోదు. ఎల్లప్పుడు దానిని అనుసరించేవారు కొందరు ఉంటారు అన్న శుభవార్త ఉంది.
10. వారు సంఖ్యలో అల్పులయినప్పటికీ వారిని విడనాడినవాడు, వ్యతిరేకించినవాడు వారికి ఏ హానీ కలిగించలేడు అన్న గొప్ప సూచన ఉంది.
11. ఇది ప్రళయము వరకు ఉండును.
12. ఇందులో ఉన్న గొప్ప సూచనలు:

* అల్లాహ్, ప్రవక్త ﷺకు తూర్పు, పడమర వరకు ఉన్న భూమిని దగ్గరికి చేశాడు. ప్రవక్త ﷺ దాని గురించి తెలిపిన విషయం నిజమయింది. (అంటే తూర్పు, పడమరలో ఇస్లాం వ్యాపించింది). ఉత్తరం, దక్షిణం గురించి ఇలా ఏమి తెలుపలేదు.

* రెండు ధనభండారాలు లభించాయి అని తెలిపారు.

* ప్రవక్త చేసిన రెండు దుఆలు అల్లాహ్ స్వీకరించాడు.

* పరస్పర యుద్ధాలకు, వినాశనాలకు గురికాకూడదు అన్న మూడవ దుఆ అల్లాహ్ స్వీకరించలేదు.

* వారిపై కత్తి నడిచిందంటే అగదు అన్నది కూడా సత్యమైంది.
* పరస్పరం హత్యయత్నాలు, ఖైదీలు చేయడం జరుగతుంది అన్న విషయం తెలిసింది.
* అనుచర సంఘంపై భ్రష్టనాయకుల, పండితుల (మౌల్వీల) భయం ఉంది అని తెలిపారు.
* వీరిలో తానే ప్రవక్త అని ఆరోపించేవారు వస్తారు అన్న సూచన ఉంది.
* అల్లాః సహాయంపొందే ఒక సమూహం ధర్మం వైపు ఎల్లప్పుడూ ఉంటుందన్న శుభవార్త ఇచ్చారు.

ప్రవక్త తెలిపిన పై సూచనలు మన బుద్ధిజ్ఞానంతో ఆలోచిస్తే అసంభవం అని అంటామేమో, కాని అవి పూర్తిగా నిజమైనాయి.

13. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన అనుచర సంఘం పట్ల భయం మార్గభ్రష్టులైన పండితులతో మాత్రమే ఉంది అని తెలిపారు.

14. విగ్రహ పూజ యొక్క భావాన్ని వివరించారు. (అది అల్లాఃయేతరులకు రుకూ, సజ్దా చేయడమే కాదు. వారు హలాల్ చేసినదాన్ని హలాల్, హరాం చేసినదాన్ని హరాంగా నమ్మకట కూడా).

## తాత్పర్యం:

ఈ అధ్యాయం యొక్క ఉద్దేశం ముస్లిం సంఘంలో సంభవించిన షిర్క్ నుండి హెచ్చరించడం. ఇది ముస్లిం సమాజంలో వ్యాపించింది. అదే విధంగా "లాఇలాహ ఇల్లల్లాః" నోటితో పలికి, తనకు తాను ముస్లిం అని చాటుకున్న వ్యక్తి, దానికి వ్యతిరేకమున్న: సమాధిలో ఉన్నవారితో దుఆ, మొరపెట్టుకొనుట లాంటి పనులు చేసి, దానికి వసీల అన్నపేరుపెడితే అతని తౌహీద్‌లో ఏలాంటి తేడా ఉండదు అని అన్నవారి ఖండన కూడా ఇందులో ఉంది.

"వసన్" అంటే: అల్లాః తప్ప పూజింపబడే వారు. అందులో పూజింపబడే చెట్లు, రాళ్ళు (సమాధులపై ఉన్న) నిర్మాణాలు. ఇంకా ప్రవక్తలు, పుణ్యాత్ములు.

దుష్టులు అన్నీ వస్తాయి. ఇబాదత్ కేవలం అల్లాః హక్కు. అల్లాః తప్ప ఇతరులతో దుఆ చేయువాడు, లేక వారిని ఆరాధించేవాడు, వారిని "వసన్" (విగ్రహంగా, ఆరాధ్యదైవంగా) చేసుకున్నవాడయ్యాడు. అందువల్ల అతను ఇస్లాం నుండి దూరమవుతాడు. తనకు తాను ముస్లిం అని చెప్పుకున్నా లాభం లేదు. తమనుతాము ఇస్లాం వైపుకు అంకితం చేసుకున్న అవిశ్వాసులు, నాస్తికవాదులు, తిరస్కారులు, కపట విశ్వాసులు (మునాఫిఖులు) ఎంత మంది లేరు. వాస్తవ ధర్మంతోనే స్వచ్ఛమైన విశ్వాసుడు అనబడును. కేవలం పేరుతో, పదాలతో కాదు.

## 24వ అధ్యాయం:

### ఇంద్రజాలం

అల్లాః ఆదేశం: ﴾ఈ విద్య కొనేవారికి పరలోక సౌఖ్యాలలో ఏమాత్రం భాగం లేదనే విషయం వారికి బాగా తెలుసు﴿. (2: బఖర: 102). మరో చోట:

﴾వారు "జిబ్త్"ను "తాగూత్" ను నమ్ముతారు﴿.(4: నిసా: 51).

జిబ్త్ అంటే: ఇంద్రజాలం, తాగూత్ అంటే షైతాన్ అని ఉమర్ ﷺ చెప్పారు.

తాగూత్ అంటే; జ్యోతిష్యులు. వారి వద్దకు షైతానులు వస్తారు. వారు ప్రతి వాడలో ఒకరుండేవారు అని జాబిర్ చెప్పారు.

అబూ హురైరా ﷺ ఉల్లేఖించారు, ప్రవక్త ﷺ ఆదేశించారు: "నాశనం చేసే ఏడు విషయాల నుండి దూరముండండి". ఏ విషయాలు ప్రవక్తా! అని సహచరులు అడిగినప్పుడు, "అల్లాఃతో షిర్క్ చేయుట. ఇంద్రజాలం. అల్లాః నిషేధించిన ప్రాణాన్ని అన్యాయంగా హతమార్చుట. వడ్డీ తినుట. అనాథుల సొమ్ము తినుట. రణరంగం నుండి వెనుదిరుగుట. అమాయకులు మరియు పవిత్రులైన ముస్లింస్త్రీపై అపనింద మోపుట" అని వివరించారు ప్రవక్త ﷺ

జున్దుబ్ ﷺ ప్రవక్త చెప్పినట్లు ఉల్లేఖించారు: "ఇంద్రజాలం చేయువాని శిక్ష ఖడ్గంతో నరకడం". (తిర్మిజి).

అబూ దావూద్ లో బజాల బిన్ అబ్ద ఉల్లేఖించారు: ఉమర్ బిన్ ఖత్తాబ్ ﷺ గవర్నర్లకు ఇలా ఆదేశాలు వ్రాసారు: "ఇంద్రజాలం చేసే ప్రతి స్త్రీ పురుషున్ని నరికి వెయ్యండి". మేము ముగ్గురు స్త్రీలను హతమార్చాము.

హఫ్సా రజియల్లాహు అన్హా ఆమె పై ఇంద్రజాలం చేసిన ఆమె బానిసరాలును హతమార్చండి అని ఆదేశించారు. ఆ బానిసరాలు నరికివేయబడింది. అదే విధంగా జున్దుబ్ రజియల్లాహు అన్హు ఉల్లేఖనంలో ఉంది. మాంత్రికున్ని హతమార్చే విషయం ముగ్గురి సహాబీలతో రుజువైనది అని ఇమాం అహ్మద్ రహిమహుల్లాః చెప్పారు.

ముఖ్యాంశాలు:

1. సూరె బఖర ఆయతు యొక్క భావం.

2. సూరె నిసా ఆయతు యొక్క భావం.

3. జిబ్త్, తాగూత్ యొక్క భావం. అందులోని వ్యత్యాసం తెలిసింది.

4. తాగూత్, జిన్నాతులోని వాడు కావచ్చు, లేదా మనుష్యులలోనివాడు కావచ్చు.

5. ప్రత్యేకంగా నివారించబడిన, నాశనం చేసే ఏడు విషయాలను గుర్తుంచుకోవాలి.

6. ఇంద్రజాలం చేసేవాడు అవిశ్వాసుడవుతాడు.

7. అతని తౌబా స్వీకరించబడదు. అతన్ని హతమార్చాలి.

8. ఉమర్ రజియల్లాహు అన్హు వారి కాలంలోనే అలాంటి వాళ్ళున్నారంటే, ఆ తరువాతి కాలపు సంగతి ఏమి చెప్పనవసరం లేదు.

## 25వ అధ్యాయం:

### ఇంద్రజాలం యొక్క కొన్ని రకాలు

ఇమాం అహ్మద్ హదీసు ఉల్లేఖించారు ముహమ్మద్ బిన్ జఅఫర్ తో, ఆయన హదీసు ఉల్లేఖించారు ఔఫ్ తో, ఆయన హయ్యాన్ బిన్ అలాతో, ఆయన హదీసు ఉల్లేఖించారు ఖుతన్ బిన్ ఖబీసతో, ఆయన తన తండ్రితో, ఆయన ప్రవక్తతో విన్నారు, ప్రవక్త ﷺ ఇలా సెలవిచ్చారు: "పక్షుల్ని ఎగరేసి (ఇయాఫ), నేలపై గీతలు గీసి (తర్ఖ్), ఇంకే విధంగానైనా శకునం పాటించుట (తియర), ఇవన్నియు ఇంద్రజాలం రకాలు".

ఇయాఫ అంటే: పక్షుల్ని ఎగరేసి శకునం పాటించటం. తర్ఖ్ అంటే: నేలపై గీతలు గీసి శకునం పాటించటం అని ఔఫ్ రహిమహుల్లాః చెప్పారు. జిబ్త్ అంటే: షైతాన్ యొక్క ఈలలు, అరుపులు అని హసన్ బసరీ రహిమహుల్లాః అన్నారు. (దీని సనద్ సరియైనది).

ఇబ్ను అబ్బాసు రజియల్లాహు అన్హుమా కథనం: ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించారు: "ఏ వ్యక్తి ఎంత జ్యోతిష్య విద్య నేర్చుకుంటాడో, అతడు అంతే ఇంద్రజాలం నేర్చుకున్నట్లు. ఎంత నేర్చుకుంటే అంతే పాపం కూడా పెరుగుతూ ఉంటుంది. (అబూ దావూద్. దీని సనద్ ఉత్తమమైనది).

అబూ హురైరా ﷺ ఉల్లేఖించారు, ప్రవక్త ﷺ ఇలా ఆదేశించారు: "ఎవరు ముడి వేసి అందులో మంత్రిస్తారో అతడు ఇంద్రజాలం చేసినట్లే. ఇంద్రజాలం చేసినవాడు షిర్క్ చేసినట్లు. ఎవరు ఒక వస్తువును ధరిస్తారో అతను దాని వైపే అప్పగించబడుతాడు". (నసాయి).

ఇబ్ను మస్ఊద్ ఉల్లేఖించారు. ఒకసారి ప్రవక్త ﷺ "అ.జ్.హ్" అంటేమిటో మీకు తెలుపనా?" అని అడిగారు. మళ్ళీ ఆయనే "చాడీలు చెప్పడం, ప్రజల మధ్య జగడము వేయుట" అని విశదీకరించారు. (ముస్లిం).

ఇబ్నె ఉమర్ ؓ ఉల్లేఖించారు: ప్రవక్త ﷺ చెప్పారు: "కొన్ని ప్రసంగాలలో కూడా మంత్రం లాంటి ప్రభావం ఉంటుంది". (బుఖారి, ముస్లిం).

## ముఖ్యాంశాలు:

1. ఇయాఫ, తర్ఖ్, అపశకునం ఇవన్నియు ఇంద్రజాలం రకాలు.
2. ఇయాఫ, తర్ఖ్, తియర యొక్క అర్థం తెలిసింది.
3. జ్యోతిష్య విద్య ఇంద్రజాలం రకంలోనిదే.
4. ముడి వేసి మంత్రించుట కూడా ఆ రకానికి సంబంధించిందే.
5. చాడీలు చెప్పడం దాని రకాల్లోనే లెక్కించబడుతుంది.
6. ప్రసంగం కూడా ఒక్కోసారి దాని రకాల్లో వస్తుంది.

## తాత్పర్యం:

ఇంద్రజాలంకి సంబంధించిన పాఠాన్ని తౌహీద్ అధ్యాయాల్లో ప్రస్తావించడానికి కారణం ఏమనగా మాంత్రికుని ఉద్దేశం పూర్తి కావటానికి అందులోని అనేక రకాలు షిర్క్ మరియు షైతాన్ యొక్క ఆత్మతో వసీల కోరుతూ చేయబడుతాయి. మానవుడు చిన్నదైనా, పెద్దదైనా అన్ని రకాల ఇంద్రజాలాన్ని వదులుకోనంత వరకు అతని తౌహీద్ సంపూర్ణం కాదు. అందుకే దాన్ని షిర్క్‌తో కలిపి చెప్పబడింది. అది రెండు విధాలుగా షిర్క్‌లో చేరుతుంది.

ఒకటి: ఇందులో షైతానుల సహాయం కోరడం, వారితో సంబంధం ఉంచడం జరుగుతుంది. మాంత్రికులు తమ కోరికను వారితో పొందుటకు, వారి సేవలను అందుకొనుటకు వారు కోరునది వారి సన్నిధానంలో ఉంచుతారు.

రెండవది: అగోచర జ్ఞానం ఉన్నదన్న ఆరోపణ, అల్లాహ్ కు ఉన్న విద్య, జ్ఞానంలో భాగస్తుడు ఉన్నాడన్న ఆరోపణ ఉంది. ఈ ఆరోపణ నేరుగా చేయకున్నా దాని వరకు చేర్పించే బాటను వారు అనుసరిస్తారు. ఇది షిర్క్, కుఫ్ర్ యొక్క భాగాల్లో ఒక భాగం.

ఇంతేగాకా అందులో నిషిద్ధమైన, చెడ్డ కార్యాలు జరుగుతాయి. ఉదా: హత మార్చడం, ప్రేమగా కలిసియున్నవారిని విడదీయడం, బుద్ధీ, జ్ఞానాన్ని మార్చి వేసే ప్రయత్నాలు. ఇది కఠినంగా నిషేధించబడినదానిలో ఒకటి. ఇంకా షిర్క్, దానికి సంబంధించిన మార్గాల్లో ఒకటి. అందుకే ఇంతటి ఘోరమైన నష్టాలను అడ్డుకొనటానికే మాంత్రికుణ్ణి హతమార్చాలని చెప్పబడింది.

దాని రకాల్లో ఒకటి ఈ రోజుల్లో ప్రజల్లో చెలామణిలో ఉన్న చాడీలు. దాని వలన కూడా ప్రజల మధ్య బేధాన్ని, ప్రేమగా ఉన్నవారిని విడదీయడం జరుగుతుంది.

ఇంద్రజాలంలో అనేక రకాలు గలవు. ప్రతీ ఒక్కటి మరో దానికంటే చెడ్డది.

## 26వ అధ్యాయం:

## జ్యోతిష్యం మరియు అలాంటి పనులు

ప్రవక్త సతీమణుల్లో ఒకరు ఉల్లేఖించారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించారు: "ఎవరైనా "అర్రాఫ్" వద్దకు వెళ్ళి అతన్ని ఒక విషయం అడిగి అతను చెప్పిన సమాధానాన్ని సత్యం అని నమ్మితే, అతని నలుబై రోజుల నమాజు అంగీకరింపబడదు". (ముస్లిం).

అబూ హురైరా ﷺ కథనం: ప్రవక్త ﷺ ఇలాసెలవిచ్చారు: "ఎవరు "కాహిన్' వద్దకు వచ్చి అతను చెప్పింది సత్యం అని నమ్మితాడో అతను ముహమ్మద్

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పై అవతరించిన దాన్ని (ఖుర్ ఆన్ ను) తిరస్కరించినవాడవుతాడు". (అబూ దావూద్).

అబూ హురైరా రజియల్లాహు అన్హు ఉల్లేఖించారు: ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పారు: "ఎవరు "కాహిన్ లేక అర్రాఫ్" వద్దకు వచ్చి అతని మాటను సత్యపరుస్తాడో అతడు ముహమ్మద్ ప్రవక్త ﷺ పై అవతరించినదానిని తిరస్కరించినవాడవుతాడు". (అబూ దావూద్.....).

ఇమ్రాన్ బిన్ హుసైన్ ؓ మహాప్రవక్త ﷺ నుండి ఉల్లేఖించారు: "అపశకునం పాటించినవాడు లేక తన కొరకు అపశకునం పాటించువాణ్ణి (వెతికి, అతనితో తన అదృష్టం తెలుసుకున్నవాడు). "కహానత్" చేసినతడు లేక చేయించు-కున్నతడు. ఇంద్రజాలం చేసినతడు లేక చేయించినవాడు. కాహిన్ మాటల్ని సత్యం అని భావించినతడు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై అవతరించిన దానిని తిరస్కరించినవాడవుతాడు". (బ.జ్జార్ సరియైన సనద్ తో సేకరించారు).

గొప్ప వ్యాఖ్యానకర్త ఇమాం బగవి చెప్పారు: అర్రాఫ్ అంటే; కొన్ని మూల విషయాల అధారంతో దొంగలించబడిన వస్తువులను, కనబడని, తప్పిపోయిన వస్తువులను తెలుపుతానని అరోపించేవాడు. కాహిన్ అంటే కూడా అతడే అని కొందరున్నారు. మరి కొందరున్నారు: కాహిన్ అంటే; భవిష్యత్తులో సంభవించేవాటిని తెలిపేవాడు. మనుస్సులో ఉండేవాటిని తెలిపేవాడు అని కూడా అన్నారు.

షే. ఇ. ఇబ్ను తైమియ్యా రహిమహుల్లాః చెప్పారు: కాహిన్ ను, మునజ్జిం. రమ్మాల్ లాంటి వారిని అర్రాఫ్ అంటారు. ఈ మార్గాల ద్వారా వారు కొన్ని విషయాలను తెలుపుతామని ఆరోపణ చేస్తారు.

"అబ్ జద్" అక్షరాలు వ్రాసి, నక్షత్రాల్లో చూసి (భవిష్యత్తు గురించి తెలుసుకునే) వారి గురించి ఇబ్ను అబ్బాసు ؓ చెప్పారు: వారికి ప్రళయదినాన ఎలాంటి పుణ్య ఫలము లభించదు.

## ముఖ్యాంశాలు:

1. ఖుర్ ఆన్ పై విశ్వాసం, కాహిన్ మాటను సత్యమని నమ్మట ఈ రెండు విషయాలు ఒక మనిషిలో కలిసి ఉండలేవు.

2. అది అవిశ్వాసం అని స్పష్టం అయింది.

3. కహానత్ చేయించేవారి ప్రస్తావన వచ్చింది.

4. అపశకునం పాటించువాని వద్దకు వెళ్ళినవాని ప్రస్తావన వచ్చింది.

5. ఇంద్రజాలం చేయించేవాని ప్రస్తావన వచ్చింది.

6. అబ్ జద్ (అక్షరాల జ్ఞానం) నేర్చుకునే వాని ప్రస్తావన వచ్చింది.

7. కాహిన్, అర్రాఫ్ మధ్య ఉన్న వ్యత్యాసం తెలిసింది.

## తాత్పర్యం:

అగోచర జ్ఞానంలో అద్వితీయుడు అల్లాః మాత్రమే. ఇందులో తాను అల్లాః తో భాగస్తుడు అని కహానత్, అర్రాఫ ఆధారంతో ఎవరు ఆరోపణ చేస్తాడో, లేక ఇలా ఆరోపణ చేసినవానిని నమ్ముతాడో అతడు అల్లాః ప్రత్యేకతల్లో ఇతరులను సాటి కల్పించినవాడవుతాడు. అందుచేత అల్లాః, ఆయన ప్రవక్తను తిరస్కరించినవాడవుతాడు.

అనేక కహానత్ లుషైతాన్ కు సంబంధించినవి. అవి షిర్క్ లేకుండా ఉండవు. ఇంకా అగోచర జ్ఞాన ఆరోపణకు సహాయపడే మార్గాల సన్నిధానం కోరడం కూడా జరగుతుంది. ఇలా ఇది రెండు విధాలుగా షిర్క్. ఒకటి: అల్లాఃకు ప్రత్యేకించిన అగోచరజ్ఞానంలో భాగస్తుడని అరోపణ చేసినందుకు. రెండవది: అల్లాఃయేతరుల సన్నిధానం కోరినందుకు.

ఇలా ధర్మాన్ని, బుద్ధి, జ్ఞానాన్ని నష్టము కలిగించే దురాచారాలు, దుష్కార్యాల నుండి ఇస్లాం ధర్మం ప్రజల్ని దూరంగా ఉంచింది.

## 27వ అధ్యాయం:

# ఇంద్రజాలం ద్వారా ఇంద్రజాలం చేయబడిన వ్యక్తి చికిత్స

జాబిర్ కథనం: ఇంద్రజాలం ద్వారా ఇంద్రజాలం చికిత్స చేయవచ్చునా? అని ప్రవక్త ముందు ప్రశ్న వచ్చినప్పుడు "అది షైతాన్ పని" అని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పారు. (అహ్మద్, అబూ దావూద్). ఇందులో ఇంకా ఇలా ఉంది: అదే ప్రశ్న ఇమాం అహ్మద్ రహిమహుల్లాహ్తో చేసినప్పుడు ఆయన "అబ్దుల్లాః బిన్ మస్ఊద్ రజియల్లాహు అన్హు వీటన్నిటితో ఇష్టపడేవారు కాదు" అని చెప్పారు. (అంటే నిషిద్ధం అని భావించేవారు). బుఖారిలో ఖతాద కథనం: నేను ఇబ్ను ముసయ్యిబ్ తో అడిగాను: ఒక వ్యక్తిపై మంత్రం చేయ బడింది. లేక అతను తన భార్య వద్దకు వెళ్ళకుండా మంత్రించారు. అయితే అది దూరం చేయవచ్చునా? లేక దాన్ని దూరము చేయుటకు మంత్రం చేయవచ్చునా? దానికి ఆయన "పరవాలేదు. వారు దాని ద్వారా మంచి చేయగోరుతున్నారు. లాభం కలిగే దాన్ని నివారించకూడదు" అని అన్నారు.

హసన్ బస్రీ రహిమహుల్లాః చెప్పారు: "ఇంద్రజాలాన్ని, ఇంద్రజాలం చేసే-వాడే దూరము చేయగలుగుతాడు".

ఇబ్నుల్ ఖయ్యిం చెప్పారు: ఇంద్రజాలం చేయబడిన వ్యక్తి నుండి దాని ప్రభావం దూరం చేసే విధానాలు రెండు: ఒకటి: అలాంటి ఇంద్రజాలం ద్వారానే దూరం చేయుట. ఇది షైతాన్ పని. హసన్ బస్రీ చెప్పిన దానికి భావం అదే. ఇందులో అది చేసేవాడు, చేయబడేవారిద్దరూ షైతాన్ కు ఇష్ట-మైన పనులు చేస్తారు, అతడు వారితో సంతోషపడి తన ప్రభావాన్ని దూరం చేసుకుంటాడు. రెండవది: దానిని దూరము చేయుటకు ధర్మసమ్మతమైన మంత్రాలు, ప్రవక్త నేర్పిన దుఆలు, వైద్యశాస్త్రం ద్వారా చికిత్స చేయుట. ఇది ధర్మసమ్మతమైనది.

## ముఖ్యాంశాలు:

1. ఇంద్రజాలం ద్వారా ఇంద్రజాలాన్ని దూరం చేయుట నివారించబడింది.

2. నివారించబడిన దానిలో, యోగ్యమైన దానిలో మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గమనించాలి.

## 28వ అధ్యాయం:

### అపశకునం

అల్లాః ఆదేశం: ﴾అసలు వాస్తవానికి వారి అపశకునం అల్లాః చేతులలో ఉంది. కాని వారిలో చాలా మంది జ్ఞానహీనులు﴿. (7: ఆరాఫ్: 131).

అల్లాః పంపిన ప్రవక్తలు ఇలా అన్నారు: ﴾మీ దుశ్శకునం స్వయంగా మీ వెంటనే ఉంది﴿. (36: యాసీన్: 19).

అబూ హురైరా ﷺ కథనం: ప్రవక్త ﷺ చెప్పారు: "అస్పృశ్యత (అంటు వ్యాధి) సరైనది కాదు. అపశకునం పాటించకూడదు. గుడ్లగూబ (అరుపు, లేక ఒకరి ఇంటిపై వాలితే ఆ ఇంటివారికీ నష్టం కలుగుతుందని భావించుట) సరి కాదు. ఉదర వ్యాధితో[1] అపశకునం పాటించుట కూడా సరైనది కాదు". (బుఖారి, ముస్లిం). ముస్లిం హదీసు గ్రంథంలో "తారాబలం, దయ్యాల నమ్మకం కూడా సరైనది కాదు". అని ఉంది.

అనసు ﷺ ఉల్లేఖించారు, ప్రవక్త ﷺ ఉపదేశించారు: "అస్పృశ్యతా పాటింపు లేదు. దుశ్శకునం పాటించడం ధర్మ సమ్మతం కాదు. అయితే శుభ శకునం

---

(1) కొందరి నమ్మకం ప్రకారం రోగి కడుపులోకి ఒక జంతువు దూరి ఆకలిగా ఉన్నప్పుడు తీవ్రమైన దుఃఖం కలిగిస్తుంది. దీనివల్ల ఒక్కోసారి రోగి మృత్యువాతన కూడా పడతాడు. ఈ నమ్మకాన్ని అరబిలో "సఫర్" అంటారు.

(ఫాల్) పాటించడమంటే నాకిష్టమే[1]". అప్పుడు అనుచరులు "మంచి శకునం అంటే ఏమిటి?" అని అడిగారు. దానికి ప్రవక్త ﷺ "(మంచి శకునం అంటే) మంచి మాట (సద్వచనం)" అని సమాధానమిచ్చారు.

ఉఖ్బా బిన్ ఆమిర్ రజియల్లాహు అన్హు కథనం: ప్రవక్త దగ్గర దుశ్శకునం పాటించే ప్రస్తావన వచ్చింది. అప్పుడు ఆయన "ఫాల్" మంచిది. అది ముస్లింను తన పనుల నుండి ఆపదు. మీలో ఎవరైనా తనకు ఇష్టం లేనిది చూస్తే ఇలా అనాలి: "అల్లాహుమ్మ లా యాతి బిల్ హసనాతి ఇల్లా అంత. వలా యద్ ఫఉస్సయ్యిఆతి ఇల్లా అంత. వలాహౌల వలాఖువ్వత ఇల్లా బిక" (అర్థం: ఓ అల్లాః! మంచిని ప్రసాదించేవాడివి నీవే. చెడును దూరము చేయువాడివి నీవే. మంచి చేయుటకు, చెడు నుండి దూరముంచుటకు నీకు తప్ప మరెవ్వరికి సాధ్యం కాదు). అని చెప్పారు. (అబూ దావూద్).

ఇబ్ను మస్ఊద్, ప్రవక్త చెప్పినట్లు ఉల్లేఖించారు: "దుశ్శకునం పాటించుట షిర్క్. దుశ్శకునం పాటించుట షిర్క్. మనలో ప్రతీ ఒకడు దానికి గురవుతాడు. కాని అల్లాః పై ఉన్న నమ్మకం ద్వారా అల్లాః దాన్ని దూరము చేస్తాడు". (అబూ దావూద్, తిర్మిజి. తిర్మిజి చెప్పారు: చివరి పదాలు ఇబ్ను మస్ఊద్ రజియల్లాహు అన్హు చెపితనవి).

ఇబ్ను ఉమర్ రజియల్లాహు అన్హుమా కథనం: "దుశ్శకునం తన పనికి అడ్డు పడిందని ఎవడు నమ్ముతాడో అతడు షిర్క్ చేసినట్లు". దాని పరిహారం ఏమిటని అడిగినప్పుడు: "అల్లాహుమ్మ లా ఖైర ఇల్లా ఖైరుక. వలా తైర ఇల్లా తైరుక. వలాఇలాహ గైరుక" అనండి అని తెలిపారు.

---

(1) అకస్మాత్తుగా ఏదైనా మంచి మాట విని లేదా సందర్భోచితమైన మాట విని దాన్నుండి సకారాత్మక ఫలితం తీయడమే మంచి శకునం (ఫాల్). ఇది ధర్మసమ్మతమే.

(అర్థం: నీ మంచి తప్ప మంచి ఎక్కడా లేదు. నీ శకునం తప్ప శకునం ఎక్కడా లేదు. నీ తప్ప సత్యమైన ఆరాధ్యుడు ఎవడూ లేడు). (అహ్మద్).

"నిన్ను పని చేయనిచ్చేది లేక పనికి అడ్డుపడేది దుశ్శకునం" అని ఫజ్ల్ బిన్ అబ్బాసు రజియల్లాహు అన్హు అన్నారు.

## ముఖ్యాంశాలు:

1. ఖుర్ఆన్‌లోని పై రెండు ఆయతుల భావం తెలిసింది. "అసలు వాస్తవానికి వారి అపశకునం అల్లాః చేతులలో ఉంది". "మీ దుశ్శకునం స్వయంగా మీ వెంటనే ఉంది".
2. అస్పృశ్యత పాటించడము సరికాదు.
3. దుశ్శకునం పాటించడం సరికాదు.
4. గుడ్లగూబ నష్టం కలిగిస్తుందని భావించుట సరికాదు.
5. సఫర్ కూడా సరైనది కాదు.
6. ఫాల్ అలాంటిది కాదు. అది మంచిది.
7. ఫాల్ అంటేమిటో కూడా తెలిసింది.
8. అది ఇష్టం లేనప్పటికి, ఒక్కోసారి మనుస్సులో అలాంటి భావం కలిగితే నష్టం లేదు. ఎందుకనగా అల్లాః తనపై నమ్మకం ఉన్నవారి నుండి దాన్ని దూరము చేస్తాడు.
9. అలా మనుస్సులో కలిగినప్పుడు ఏమనాలో తెలిసింది.
10. దుశ్శకునం షిర్క్.
11. దుశ్శకునం అంటేమిటో కూడా తెలిసింది.

## తాత్పర్యం:

పక్షులతో, పేర్లతో, పదాలాతో, స్థలము వగైరాలతో అపశకునం పాటించుటను అరబిలో "తియర" అంటారు. అల్లాః అపశకునమును నివారించి, దాన్ని

పాటించేవారిని కఠినంగా హెచ్చరించాడు. ప్రవక్త ﷺ ఫాల్ అంటే ఇష్టపడేవారు. అపశకునమంటే అసహ్యించుకునేవారు.

అపశకునం మరియు ఫాల్‌లో వ్యత్యాసం ఏమనగా: ఫాల్ మానవుని విశ్వాసము, బుద్ధి, జ్ఞానములో లోపం కలుగచేయదు. అల్లాఃయేతరులపై మనస్సు లగ్నంవ్వ విశ్వాసం, అల్లాః పై నమ్మకముపై దెబ్బకొట్టింది. ఇలా (గీత గీయబడిన) రెండిట్లో లోపం కలుగ జేసింది అనడంలో ఏలాంటి సందేహం లేదు. ఆ తరువాత ఈ కారణంగా అతని మనస్సు బలహీనత, పిరికితనం, సృష్టిరాసులతో భయం ఎలా చోటు చేసుకుంటుందో అడుగకు. నిరాధారమైన వాటిని ఆధారంగా నమ్మి, అల్లాః వైపు లగ్నం కాకుండా దూరమవుతాడు. ఇదంతయు ఏకత్వ విశ్వాస బలహీనత, అవనమ్మకము, షిర్క్ వాటి మార్గాల అనుసరణ, బుద్ధిని చెడగొట్టే దురాచారాల వలన కలుగుతుంది.

రెండవది: అతడు ఆ ప్రభావాన్ని స్వీకరించడు. కాని అది తన ప్రభావాన్ని చూపి బాధ, చింతకు గురిచేస్తుంది. ఇది చూడడానికి మొదటిదానికంటే చిన్నది అయినా, అది చెడు, మానవునికి నష్టం. అతని మనస్సు బలహీనతకు కారణం మరియు అల్లాః పై ఉండే నమ్మకంలో కూడా బలహీనత వస్తుంది. ఒకప్పుడు ఏదైనా ఇష్టములేని సంఘటన జరిగితే అది ఈ కారణంగానే అని భావిస్తాడు. అపశకునంపై అతని నమ్మకం మరీ రెట్టింపవుతుంది. ఒకప్పుడు పైన వివరించిన భాగంలో చేరే భయం కూడా ఉంటుంది.

అపశకునమును ఇస్లాం అసహ్యించుకునే దీ, దాన్ని పాటించేవారిని హెచ్చరించేదీ, అది ఏకత్వ విశ్వాసం మరియు అల్లాఃపై నమ్మకమును ఎలా వ్యతిరేకమోపైవివరణ ద్వారా మీకు తెలియవచ్చు.

ఇలాంటిది ఎవరికైనా సంభవించి, స్వభావికమైన ప్రభావాలు అతనిపై తమ ప్రభావాన్ని చూపుతే తను వాటిని దూరము చేయుటకు అన్ని రకాల ప్రయ-

త్నాలు చేయాలి. అల్లాహ్‌తో సహాయము కోరాలి. ఆ చెడు అతని నుండి దూరము కావాలంటే, ఏ విధంగా కూడా దాని వైపునకు మ్రొగ్గు చూప కూడదు.

## 29వ అధ్యాయం:

## జ్యోతిష్య శాస్త్రం

బుఖారిలో ఖతాద కథనం: అల్లాహ్ నక్షత్రాలను మూడు ఉద్దేశాలతో పుట్టించాడు. (1). ఆకాశ అలంంకారానికి. (2). షైతానులను తరిమి కొట్టడానికి. (3). మార్గం పొందడానికి సంకేతాలుగా. ఇవి గాక వేరే భావించేవాడు తప్పులో పడి, తన భాగ్యాన్ని కోలిపోతాడు. తనకు తెలియనిదానిలో అడుగుపెట్టిన-వాడవుతాడు.

చంద్రుని దశల విద్యను నేర్చుకొనుట 'ఖతాద' ఇష్టపడలేదు. 'ఇబ్ను ఉయయ్ న' దీని అనుమతి ఇవ్వలేదు. ఈ రెండు రివాయతులను 'హర్బ్' ఉల్లేఖించారు.

ఇమాం అహ్మద్ మరియు ఇస్హాఖ్ అది నేర్చుకొనుట యోగ్యమే అన్నారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పారని అబూ మూసా రజియల్లాహు అన్హు ఉల్లేఖించారు: "ముగ్గురు మనుషులు స్వర్గంలో ప్రవేశించరు. (1). మత్తు సేవించుటకు బానిస అయినవాడు. (2). రక్త సంబంధాలను తెంచువాడు. (3). ఇంద్రజాలాన్ని సత్యం అని నమ్మేవాడు. (అహ్మద్).

### ముఖ్యాంశాలు:

1. నక్షత్రాల సృష్టిలో ఉన్న ఔచిత్యం.
2. అవి తప్ప వేరే భావంతో ఉన్నవాడు తప్పులో ఉన్నాడు.
3. చంద్రుని దశల విద్య నేర్చుకునే విషయంలో ఉన్న భిన్నాభిప్రాయం. (విషయం క్షుణ్ణంగా అర్థం చేసుకుంటే బిన్నాభిప్రాయం దూరమవుతుంది.

అదేమనగ: ఎవరి భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలుసుకొనుటకు ఆ విద్య నేర్చుకొనుట హరాం. ఎందుకనగా అది అల్లాః తప్ప మరెవ్వరికి తెలియదు. కాని తేది, సంవత్సరాలు లాంటి విషయాలు తెలుసుకొనుటకు విద్య నేర్చుకోవచ్చు)).

4. ఇంద్రజాలం మిథ్యం, తప్పు అని తెలిసి కూడా ఆ విషయాల్ని సత్యం అని నమ్మిన వారికి హెచ్చరించడమైనది.

## తాత్పర్యం:

### జ్యోతిష్య శాస్త్రం రెండు రకాలు:

ఒకటి: "ఇల్మె తాసీర్" అంటారు. ఇందులో భూలోకములో సంభవించునవి ఖగోళ పరిస్థితులను బట్టి యున్నాయి అనుట. ఇది నిషిద్ధం. ఇంకా అగోచర జ్ఞానంలో అద్వితీయుడైన అల్లాఃతో పొత్తు కలసిన ఆరోపణ చేసినట్లు. లేక ఆరోపణ చేసినవాణ్ణి సత్యపరచినట్లగును. ఇందులో తుచ్ఛమైన ఆరోపణలు, అల్లాఃయేతరులపై మనస్సు లగ్నం కావడం, బుద్ధిజ్ఞానాన్ని చెడగొట్టే విషయాలు ఉన్నవి గనుక తౌహీద్ కు విరుద్ధం. ఎందుకనగా తుచ్ఛమైన మార్గాలను అనుసరించుట, వాటిని నమ్ముట వలన ధర్మము, జ్ఞానము రెండూ పాడవుతాయి.

రెండవది: "ఇల్మె తైసీర్": సూర్యచంద్రలు, నక్షత్రాలతో ఖిబ్లా, సమయాలు, దిశలు తెలుసుకొనుట. ఇందులో ఏలాంటి అభ్యంతరము లేదు. ఇందులో అనేకము లాభదాయకమైనవి. ప్రార్థనాసమయాలు, దిశలు తెలుసుకొనుటకు వాటిని ఉపయోగించాలని ఇస్లాం ప్రోత్సహించింది.

ధర్మం నిషేధించినది, నివారించినది ఏమిటో, యోగ్యపరచినది, లేక విధి అని తెలిపినది ఏమిటో, రెంటిలోని వ్యత్యాసమును బాగుగా తెలుసుకొనుట చాలా అవసరం. మొదటిది తౌహీద్ కు విరుద్ధం. రెండవది విరుద్ధం కాదు.

## 30వ అధ్యాయం:

## నక్షత్రబలంతో వర్షం కురిసింది అని నమ్మకుట

అల్లాః ఆదేశం: ﴿అల్లాః మీకొసంగిన ఉపాధిని (వర్షాన్ని), ఆయన్ని తిరస్కరించుటకు ఉపయోగిస్తున్నారా?﴾. (56: వాఖిఅః: 82).

అబూ మాలిక్ అష్అరి ؓ కథనం: ప్రవక్త ﷺ సెలవిచ్చారు: "నా అనుచర సంఘంలోనివారు జాహిలియ్యత్ (అజ్ఞాన కాలాని)కి సంబంధించిన నాలుగు విషయాలను విడనాడరు. (1). వంశంపై గర్వపడుట. (2). ఇతర వంశాలను దూషించుట. (3). నక్షత్రాల ప్రభావంతో వర్షం కురుస్తుందని తారాబలాన్ని నమ్ముట. (4). శోకము చేయుట". ఇంకా ఇలా చెప్పారు: "శోకము చేయు స్త్రీ తౌబాచేయకుండా చనిపోతే ప్రళయదినాన లేపబడినప్పుడు ఆమెపై తార్ కోల్ (Tar coal) పైజామా, చిడుము (ఖారిష్) వ్యాధికి గురి చేసే కవచము ఉండును".

జైద్ బిన్ ఖాలిద్ అల్ జుహ్నీ ؓ ఉల్లేఖించారు: హుదైబియ ప్రాంతములో ప్రవక్త ﷺ మాకు ఫజర్ నమాజ్ చదివించారు. ఆ గడిచిన రాత్రి వర్షం కురిసింది. నమాజ్ అయిన తరువాత ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరుల వైపు తిరిగి "మీ ప్రభువు ఏం సెలవిచ్చాడో మీకు తెలుసా?" అని అడిగారు. 'అల్లాఃకు, ఆయన ప్రవక్తకే బాగా తెలుసు, మాకు తెలియదు' అని అన్నాము. అప్పుడు దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం, అల్లాః ఇలా చెప్పాడని తెలిపారు: "ఈ రోజు ఉదయం నా దాసుల్లో కొందరు విశ్వాసులయిపోయారు, మరికొందరు అవిశ్వాసులయ్యారు. "అల్లాః దయ వల్ల మనకు వర్షం కురిసింది" అన్నవారు తారాబలాన్ని నిరాకరించి, నన్ను విశ్వసించిన వారయ్యారు. దీనికి భిన్నంగా ఫలానా నక్షత్ర ప్రభావంతో వర్షం కురిసిందని అన్నవారు నక్షత్ర విశ్వాసులయి, నన్ను తిరస్కరించిన వారయ్యారు". *(బుఖారి, ముస్లిం).*

ఇలాంటి హదీసు ఇబ్ను అబ్బాసు ؓ కూడా ఉల్లేఖించారు. అందులో ఇంకా ఈ విషయం ఉంది. అందులో కొందరున్నారు: ఫలాన, ఫలాన నక్షత్ర (ప్రభావం) నిజమయింది. (అందుకే వర్షం కురిసింది). అప్పుడు అల్లాః ఈ ఆయతులు అవతరింపజేసాడు. ﴿నక్షత్రాల స్థానాలు సాక్షిగా చెబుతున్నాను: మీరు తెలుసుకుంటే, ఇది చాలా పెద్ద ప్రమాణం: ఇది ఒక మహాన్నతమైన ఖురాన్; ఒక సురక్షితమైన గ్రంథంలో వ్రాయబడి ఉంది. దానిని పరిశుద్ధులు తప్ప మరెవరూ తాకలేరు. ఇది సకల లోకాల ప్రభువు అవతరింపజేసినటు-వంటిది. అయినా మీరు ఈ వాణిని తేలిక విషయంగా తీసుకుంటారా? అల్లాః మీకొసంగిన ఉపాధిని, ఆయన్ని తిరస్కరించుటకు ఉపయోగిస్తు-న్నారా?﴾ **(56: వాఖిఅః: 75-82).**

## ముఖ్యాంశాలు:

1. సూరె వాఖిఅ ఆయతు యొక్క భావం.
2. జాహిలియ్యత్ కు సంబంధించిన నాలుగు విషయాల ప్రస్తావన.
3. అందులో కొన్ని అవిశ్వాసం, తిరస్కారమునకు సంబంధించినవి.
4. తిరస్కారంలో కొన్ని రకాలు ధర్మభ్రష్టతకు కారణము కావు.
5. "నా దాసుల్లో కొందరు నన్ను విశ్వసించువారు, మరికొందరు నన్ను తిరస్కరించువారయ్యారు" అన్నది అల్లాః కారుణ్యమైన వర్షం కురిసినప్పటి సంగతి.
6. ఇక్కడ విశ్వాసం యొక్క వాస్తవికతను గమనించాలి. (అల్లాః కరుణ, దయ వలన అని చెబితే విశ్వాసం).
7. అవిశ్వాసం యొక్క వాస్తవికతనూ గమనించాలి. (ఫలాన, ఫలాన నక్షత్ర ప్రభావం అని చెప్పితే అది అవిశ్వాసం).
8. నక్షత్రం నిజమయింది అనుట కూడా అవిశ్వాసం గనుక దానిని గమనించాలి.

9. శిష్యులకు విషయం బాగుగా అర్థం కావడానికి ప్రశ్నించి మరీ జవాబు చెప్పాలి అని "మీ ప్రభువు ఏమన్నాడో మీకు తెలుసా?" అన్న వాక్యంలో తెలుస్తుంది.

10. శోకము చేసేవారికి ప్రళయము నుండే శిక్ష మొదలవుతుంది.

## తాత్పర్యం:

అనుగ్రహించువాడు, కష్టాలు తొలగించువాడు అల్లాః మాత్రమేనని మనసా-వాచావిశ్వసించి, వాటిని ఆయన విధేయత కొరకే ఉపయోగించుట తౌహీద్ అయినప్పుడు, "ఫలాన నక్షత్రం వలన వర్షం కురిసింది" అనుట ఆ తౌహీద్ విశ్వాసానికి చాలా విరుద్ధం. వర్షమూ, ఇతర వరాలు అల్లాఃయే ఇచ్చువాడనుట తప్పనిసరి. ఆయనే వాటిని తన దాసులకు ప్రసాదించాడు కనుక.

వర్షం కురువటానికి నక్షత్రాలు ఏ విధంగానూ కారణం కాజాలవు. అల్లాః యొక్క దయ, కరుణా కటాక్షముల వలన, మానవుల అవసరము, వారు తమ వాజ్మాలిక, స్థితి భాషలో తమ ప్రభువుతో వేడుకొనుట ద్వారా అల్లాః వారి అవసరాలనుబట్టి తన వివేకము, కరుణతో వర్షం కురిపిస్తాడు.

మానవుడు తనపై, సర్వ సృష్టిపై ఉన్న అల్లాః యొక్క బాహ్యాంతర సర్వ వరాలను విశ్వసించనంత వరకు అతని తౌహీద్ సంపూర్ణం కాదు. అనుగ్రహాలన్నిటిని అల్లాఃకు అంకితం చేయాలి. ఆయన్ను ఆరాధిస్తున్నప్పుడు, స్మరిస్తున్నప్పుడు, కృతజ్ఞత తెలుపుతున్నప్పుడు వాటి సహాయము, ఆధారము తీసుకోవాలి.

ఇలాంటి సందర్భములలోనే తౌహీద్ వాస్తవికత తెలుస్తుంది. దీనితోనే విశ్వాసం యొక్క పరిపూర్ణత మరియు కొరతా తెలుస్తుంది.

# 31వ అధ్యాయం:

అల్లాః ఆదేశం: ﴾ప్రజలలో కొందరు అల్లాఃను కాదని ఇతరులను ఆయనకు సమానులుగా, ప్రత్యర్థులుగా భావిస్తారు. వారు అల్లాః పట్ల కలిగి వుండవలసిన ప్రేమతో వారిని ప్రేమిస్తారు﴿. (2: బఖర: 165). మరో ఆదేశం:

﴾ప్రవక్త ఇలా చెప్పండి: ఒక వేళ మీ తండ్రులు, మీ కుమారులు, మీ సోదరులు, మీ భార్యలు, మీ బంధువులు, మీ ఆప్తులు, మీరు సంపాదించిన ఆస్తిపాస్తులు, మందగిస్తాయేమో అని మీరు భయపడే మీ వ్యాపారాలు, మీరు ఇష్టపడే మీ గృహాలు అల్లాః కంటే ఆయన ప్రవక్త కంటే ఆయన మార్గంలో శ్రమించటం (జిహాద్) కంటే మీకు ఎక్కువ ప్రియతరమైతే, అల్లాః తన తీర్పును మీ ముందుకు తీసుకువచ్చే వరకు నిరీక్షించండి. అల్లాః దోషులకు మార్గం చూపడు﴿. (9: తౌబా: 24).

అనసు  ఉల్లేఖించారు, పవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పారు: "మీలో నెవరి దృష్టిలోనైనా, నేను అతని కుమారుని కన్నా, అతని తండ్రి కన్నా మరియు ప్రజలందరికన్నా, అధికంగా ప్రేమ పాత్రుణ్ణి కానంతవరకు మీలో ఎవడూ నిజమయిన విశ్వాసి కాలేడు". (బుఖారి: 15, ముస్లిం: 70).

అనసు  ఉల్లేఖనలో ప్రవక్త  చెప్పారు: "ఈ క్రింది మూడు లక్షణాలు కలిగి ఉన్నవాడు విశ్వాస మాధుర్యాన్ని ఆస్వాదిస్తాడు.

1) అందరికంటే ఎక్కువ అల్లాఃను, అల్లాః ప్రవక్తను అభిమానించడం.

2) ఎవరిని ప్రేమించినా కేవలం అల్లాః ప్రసన్నత కోసం ప్రేమించడం.

3) (నరక) అగ్నిలో పడటానికి ఎంతగా అసహ్యించుకుంటాడో, అవిశ్వాస స్థితి వైపునకు మరలిపోవడానికి కూడా అంతగా అసహ్యించుకోవడం". (బుఖారి, ముస్లిం).

మరో ఉల్లేఖనలో ఉంది: "అందరికంటే ఎక్కువ అల్లాహ్‌ను, అల్లాహ్ ప్రవక్తను ................అభిమానించనంత వరకు విశ్వాస మాధుర్యాన్ని ఆస్వాదించడు".

అబ్దుల్లాహ్ బిన్ అబ్బాసు రజియల్లాహు అన్హు ఉల్లేఖించారు: "ఎవరైనా ఒకరితో ప్రేమ, ద్వేషము, స్నేహము, శతృత్వమూ అల్లాహ్ కొరకే కలిగి యుంటాడో, అల్లాహ్ యొక్క స్నేహం, సహాయం విటి ద్వారానే లభిస్తుందని అతను తెలుసుకోవాలి. ఎవరు కూడా ఎంత గొప్ప నమాజు, రోజాలు పాటించేవాడైనా ఇవి లేకుండా విశ్వాస మాధుర్యాన్ని పొందలేడు. సామాన్య ప్రజల ప్రేమ, సోదర సంబంధాలు ఐహికంగా పరిమితమైనవి. ఇలాంటి ఉద్దేశం వారికి ఏ మాత్రం లాభం చేకూర్చదు". (ఇబ్ను జరీర్).

ఇబ్ను అబ్బాసు రజియల్లాహు అన్హు సూరె బఖర యొక్క ఈ 166వవాక్యం ﴾ఇంకా వారి సకల సంపత్తుల పరంపర తెగిపోతుంది﴿ను వ్యాఖ్యానిస్తూ "అస్బాబ్" అంటే "ప్రేమ, (స్నేహం), సంబంధాలు" అని చెప్పారు.

## ముఖ్యాంశాలు:

1. సూరె బఖరలోని వాక్యం యొక్క వ్యాఖ్యానం తెలిసింది. (బహుదైవా-రాధకులకు అల్లాహేతరులతో ఉన్న ప్రేమ యొక్క ప్రస్తావన అందులో ఉంది).

2. సూరె తౌబాలో ఉన్న వాక్యం యొక్క వ్యాఖ్యానం తెలిసింది. (అందులో అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తకు బదులు ఇతరుల పట్ల ప్రేమ ఫలితం తెలుపబడింది).

3. ప్రవక్త ప్రేమ తమ ఆత్మ, సంతానం, ఆస్తిపాస్తుల కంటే ఎక్కువగా ఉండాలి.

4. కొన్ని సందర్భాల్లో విశ్వాసి కాడు అని అంటే మతభ్రష్టుడయ్యాడు అన్న భావం కాదు.

5. విశ్వాసంలో మాధుర్యం అనేది ఉంది. కాని మానవుడు ఒక్కొక్కప్పుడు దాన్ని ఆస్వాదిస్తాడు, ఒకప్పుడు ఆస్వాదించడు.

6. ఆత్మసంబంధమైన నాలుగు విషయాలున్నవి, అవి లేకుండా మానవుడు అల్లాః స్నేహం, ఆయన వద్ద స్థానమూ పొందలేడు. అవి లేకుండా విశ్వాస మాధుర్యాన్ని ఆస్వాదించలేడు.

7. సామాన్య ప్రజల ప్రేమ, సోదరత్వం ఐహికంగా ఉందని ప్రవక్త అనుచరులు (సహాబా) కొన్ని పరిస్థితులను బట్టి తెలుసుకున్నారు.

8. సూరె బఖర 166వ ఆయతు యొక్క వ్యాఖ్యానం కూడా తెలిసింది.

9. కొందరు బహుదైవారాధకులు కూడా అల్లాఃతో చాలా ప్రేమ చూపే వారుంటారు.

10. సూరె తౌబాలో వచ్చిన ఎనిమిది వస్తువుల ప్రేమ, ఎవరికైతే తన ధర్మం కంటే ఎక్కువ ప్రియమైనవో వారికి శిక్షవార్త ఇవ్వబడింది.

11. ఎవరు అల్లాఃతో పాటు ఒక్క బాగస్వామిని నిర్ణయించుకొని, అల్లాఃతో ఉండవలసిన ప్రేమ వారితో కలిగియుంటే అతను పెద్ద షిర్క్ చేసినవాడవుతాడు.

## తాత్పర్యం:

తౌహీద్ యొక్క మూలం, ప్రాణం "ప్రేమ కేవలం ఒకే ఒక అల్లాఃకు అంకితం చేయుట". అదే ఆరాధన, ప్రార్థన యొక్క మూలం. ఇంకా చెప్పాలంటే అదే వాస్తవమైన ఆరాధన. మానవుని ప్రేమ తన ప్రభువుతో సంపూర్ణం కానంత వరకు, ఆ ప్రేమను అన్ని రకాల ప్రేమల పై ఆధిక్యత పొందనంత వరకు అతని తౌహీద్ సంపూర్ణం కాదు. అల్లాః ప్రేమకే ఆధిక్యత ఇచ్చి, ఇతర ప్రేమలన్నిటిని దానికనుగుణంగా ఉంచాలి. ఇందులోనే సత్ఫలితము, మేలు ఉన్నాయి.

ఇందులోని ఒక భాగం, భాగమే కాదు దాని పరిపూర్ణత "అల్ హుబ్బు ఫిల్లాః" (అల్లాః కొరకు ప్రేమించుట)లో ఉంది. అల్లాః ఏ కార్యాలను, ఎవరెవరిని ప్రేమిస్తాడో మానవుడు వాటన్నిటిని ప్రేమించాలి. అల్లాః ఏ కార్యాలను, ఎవరెవరిని ప్రేమించడో వారిని ప్రేమించకుండా ఉండాలి. అల్లాః స్నేహితులతో స్నేహంగా, శత్రువులతో శతృత్వంగా మెలగాలి. ఈ విధంగా మానవుని ఏకత్వ విశ్వాసం సంపూర్ణమవుతుంది.

ఇతరులను అల్లాఃకు సమానులుగా చేసుకొని, అల్లాఃను ప్రేమించునట్లు వారిని ప్రేమించుట, వారి విధేయతను అల్లాః విధేయత పై ఆధిక్యం ఇచ్చుట, మరవకుండా ఎల్లప్పుడూ వారిని స్మరించుట, ప్రస్తావించుట, వారితో దుఆ చేయుట ఇదే షిర్క్ అక్బర్ (పెద్ద షిర్క్). అల్లాః వారిని క్షమించడు. అతను తన మనస్సును మహాశక్తిమంతుడు, సకల స్తోత్రాలకు తగినవానితో దూరము చేసి, ఏ శక్తిసామర్థ్యం లేని వాని వైపు లగ్నం చేశాడు. బహుదైవారాధకులు పట్టుకున్న దుర్బలమైన సాధనం, సంబంధం ప్రళయమున పనికి రాదు. తెగిపోతుంది. ఈ (బూటకపు) ప్రేమ అక్కడ ద్వేషం, శతృత్వంలో మారిపోతుంది.

ప్రేమ మూడు రకాలుగా ఉంటుందన్నది కూడ తెలుసుకోండి!

1. అల్లాః యొక్క ప్రేమ. ఇదే ఏకత్వం, విశ్వాసం యొక్క మూలం.

2. అల్లాః కొరకు ప్రేమ. ప్రవక్తల, వారి అనుచరుల పట్ల ప్రేమ. ఇంకా అల్లాః ప్రేమించు కార్యాలు, కాలాలు, స్థలాలు వగైరాల ప్రేమ. ఇది అల్లాః ప్రేమకు అనుగుణంగా ఉంటుంది. దాన్ని సంపూర్ణం చేస్తుంది.

3. అల్లాఃతో ప్రేమ. ఇది బహుదైవారాధకుల్లో ఉంటుంది. వారు అల్లాఃతో పాటు, అల్లాఃకు సమానంగా నిలబెట్టుకున్న వారిని, చెట్లు, రాళ్ళు,, మానవులు, దైవదూతల్లో నియమించుకున్న వారి బూటకపు దేవతలను ప్రేమిస్తారు. ఇది అసలైన షిర్క్ (బుహుదైవారాధన).

నాలుగో రకం కూడా ఉంది. అది స్వాభావికమైన ప్రేమ. అది తినుత్రాగు వస్తువుల్లో, సంభోగంలో, దుస్తుల్లో, తమ భార్య/భర్తతో సత్సంబంధము కలిగి ఉండడంలో, మానవునికి నచ్చిన, ఇష్టమున్న దాన్ని ప్రేమిస్తాడు. వీటిని ఇస్లామియ పరిభాషలో "ముబాహ్" అనవచ్చు. అవి అల్లాః యొక్క ప్రేమ, ఆయన విధేయతకు సహాయపడితే ఇబాదత్ (ప్రార్థన)లో లెక్కించబడుతాయి. ఒక వేళ దానికి అడ్డుపడితే, అల్లాః ప్రేమించని వాటి వైపుకు తీసుకెళ్తే నివారించబడిన వాటిలో లెక్కించబడుతాయి. లేకుంటే అవి "ముబాహ్"గానే ఉంటాయి. (నిజం అల్లాహ్ కే తెలుసు).

## 32వ అధ్యాయం:

﴾వాస్తవానికి తన మిత్రులను గురించి ఊరకే మిమ్మల్ని భయపెట్టింది షైతానేనని ఇప్పుడు మీరు గ్రహించే ఉంటారు. కనుక మీరు నిజమైన విశ్వాసులే అయితే, ఇకముందు మానవులకు భయపడకండి, నాకు భయపడండి﴿. (3: ఆలె ఇమ్రాన్: 175).

﴾అల్లాఃను, అంతిమ దినాన్ని విశ్వసించి, నమాజును స్థాపించేవారు, జకాత్ ఇచ్చేవారు, అల్లాఃకు తప్ప మరెవరికి భయబడనివారు మాత్రమే అల్లాః మసీదులకు సంరక్షకులూ, సేవకులూ కాగలుగుతారు. వారు సరియైన మార్గంలో నడుస్తారని ఆశించవచ్చు﴿. (9: తౌబా: 18).

﴾ప్రజలలో, "మేము అల్లాఃను విశ్వసించాము" అని అనే వ్యక్తి ఒకడు ఉన్నాడు. కాని అతడు అల్లాః మార్గంలో హింసించబడినప్పుడు, లోకులు పెట్టిన పరీక్షను అల్లాః విధించిన శిక్షగా భావిస్తాడు﴿. (29: అన్ కబూత్: 10).
అబూ సఈద్ ఖుద్రీ ఉల్లేఖించారు. ప్రవక్త సల్లలాహు అలైహి వసల్లం ఉపదేశించారు:

"విశ్వాస బలహీనత, అవనమ్మకానికి చిహ్నాలు ఇవి: ప్రజల్ని సంతోష పరచడానికి నీవు అల్లాఃకు కోపం వచ్చినట్లు చేయుట, అల్లాః ప్రసాదించిన ఆహారానికి బదులుగా ప్రజలకు కృతజ్ఞత తెలుపుట, వారిని పొగడుట. అల్లాః నొసంగని దానిపై ప్రజల్ని దూషించుట. అల్లాః యొక్క ఆహారమును ఏ లోభి యొక్క లోభము తీసుకోలేదు. ఎవరి అయిష్టము దాన్ని ఆపలేదు". (బైహఖి). ఆయిషా రజియల్లాహు అన్హా ఉల్లేఖించారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచించారు:

"ఎవరు అల్లాఃను సంతోష పరచడానికి ప్రజల కోపాన్ని సహిస్తారో. అల్లాః అతనితో సంతోషించి, ప్రజలు కూడ అతనితో సంతోషపడునట్లు చేస్తాడు. ఎవరు అల్లాఃను అసంతృప్తి పరచి ప్రజల్ని సంతోష పరుస్తాడో, అల్లాః అతనితో అసంతృప్తి చెంది. ప్రజలు కూడ అతనితో అసంతృప్తి చెందినట్లు చేస్తాడు". (ఇబ్నుహిబ్బాన్).

## ముఖ్యాంశాలు:

1. సూరె ఆలె ఇమ్రాన్ లోని ఆయతు యొక్క వ్యాఖ్యానం. (అందులో కేవలం అల్లాఃతో భయపడాలని బోధించబడింది).
2. సూరె తౌబా లోని ఆయతు యొక్క వ్యాఖ్యానం.
3. సూరె అన్ కబూత్ లోని ఆయతు యొక్క వ్యాఖ్యానం.
4. విశ్వాసం, నమ్మకం ఒకప్పుడు బలముగా ఉంటే, మరొకప్పుడు బలహినమవుతుంది.
5. అది బలహీనమయినదనుటకు మూడు గుర్తులు. (అబూ సఈద్ ఖుద్రి హదీసులో తెలుపబడినవి).
6. కేవలం అల్లాఃతో భయపడుట కూడా ఇస్లామీయ విధుల్లో ఒక విధి.
7. దానిని వదలినవానికి శిక్ష ప్రస్తావన ఉంది.
8. దానిని అనుసరించినవాని ప్రతిఫల ప్రస్తావన ఉంది.

## 33వ అధ్యాయం:

﴾మీరు విశ్వాసులైతే కేవలం అల్లాః పై నమ్మకం ఉంచండి﴿.
(5: మాఇద: 23).

﴾నిజమైన విశ్వాసుల హృదయాలు అల్లాః ప్రస్తావన విన్నంతనే భయంతో కంపిస్తాయి. వారి సమక్షంలో అల్లాః ఆయతులు పారాయణం చేయబడినప్పుడు వారి విశ్వాసం పెరుగుతుంది. వారు తమ ప్రభువుపట్ల నమ్మకం కలిగివుంటారు﴿. (8: అన్ ఫాల్: 2).

﴾అల్లాఃను నమ్ముకున్నవానికి అల్లాఃయే చాలు﴿. (65: తలాఖ్: 3).

ఇబ్ను అబ్బాసు ఉల్లేఖించారు: ﴾"మాకు అల్లాః చాలు. ఆయనే శ్రేష్టుడైన కార్యసాధకుడు".﴿ అని ఇబ్రాహీం ﷺ అగ్నిలో వేయబడినప్పుడు అన్నారు. అలాగే (ఉహద్ యుద్ధం తరువాత) ప్రజలు ప్రవక్త ముహమ్మద్ ﷺ వద్దకు వచ్చి ﴾"మీకు వ్యతిరేకంగా పెద్ద సైన్యాలు మోహరించి ఉన్నాయి, వాటికి భయపడండి" అని అన్నప్పుడు﴿ దానిని విని ప్రవక్త ﷺ కూడా "మాకు అల్లాహ్ చాలు, ఆయనే శ్రేష్టుడైన కార్యసాధకుడు" అన్నారు. అందుచేత ప్రవక్త అనుచరులలో విశ్వాసము పెరిగినది.

### ముఖ్యాంశాలు:

1. విధుల్లో తవక్కుల్ కూడా ఒకటి.
2. అది విశ్వాస నిబంధనలలో ఒకటి.
3. సూరె అన్ ఫాల్ లోని ఆయత్ యొక్క వాఖ్యానం.
4. అదే ఆయతు చివరిలో ఇవ్వబడిన బోధ.
5. సూరె తలాఖ్ ఆయతు యొక్క వ్యాఖ్యానం.
6. ﴾"మాకు అల్లాః చాలు....."﴿ వచనముల యొక్క ప్రాముఖ్యత వివరించబడింది. కష్టకాలాల్లో ఇబ్రాహీం మరియు ముహమ్మద్ ప్రవక్తలు దీనిని చదివారు.

## తాత్పర్యం:

అల్లాః పై నమ్మకం తౌహీద్, విశ్వాసం యొక్క విధుల్లో చాలా ముఖ్య-మైనది. నమ్మకం ఎంత ఎక్కువగా ఉండునో అంతే విశ్వాసబలం పెరుగును. తౌహీద్ సంపూర్ణం అగును. మానవుడు తన ఐహిక, ధార్మిక సంబంధమైన ఏ కార్యం చేయాలనుకున్నా, వదులుకోవాలనుకున్నా అల్లాః పై నమ్మకం, ఆయన సహాయం కోరుట తప్పనిసరి. అది తప్ప వేరే మార్గం లేదు.

అల్లాః పై నమ్మకం యొక్క వాస్తవికత: ఏ పని అయినా అది అల్లాః తరుపునే అవుతుంది అని మానవుడు తెలుసుకోవాలి. అల్లాః కోరునది అగును. కోరనిది కాదు. ఆయనే లాభనష్టాలు చేకూర్చేవాడు. ప్రసాదించువాడు, ప్రసాదమును ఆపుకునేవాడు. పుణ్యం చేయు శక్తి, పాపం నుండి దూరముండే భాగ్యం అల్లాః తప్ప మరెవ్వరూ ప్రసాదించలేరు అని తెలుసుకోవాలి.ఈ విషయం తెలుసుకున్న తరువాత ఐహిక, ధార్మిక లాభాలు పొందుటకు, కష్టాలు తొలిగిపోవుటకు తన మనస్సులో ఆయనపై మాత్రమే ఆధారపడాలి. తను కోరునది పొందుటకు సంపూర్ణంగా అల్లాఃపై ఆధారపడాలి. దానితో పాటు తన శక్తి కొలది కృషి చేయాలి, వాటి సాధనాలను ఉపయోగించాలి.

ఏ మానవుడు, పైన తెలిపిన విషయాన్ని తెలుసుకొని, ఆ ప్రకారంగా అల్లాః పై ఆధారం, నమ్మకం ఉంచుతాడో అతడు ఈ శుభవార్త తెలుసుకోవాలి: అలాంటివారికి అల్లాఃయే చాలు. వారి కొరకు అల్లాః చేసిన వాగ్దానాన్ని నెరవేరుస్తాడు. అల్లాఃయేతరులతో సంబంధం, నమ్మకం ఉంచినవాడు, వారిపై ఆధారపడేవాడు ముష్రిక్ అవుతాడు. అతని ఆశలన్నియు వృధా అవుతాయి.

## 34వ అధ్యాయం:

﴾ఏమిటీ, ఈ ప్రజలు అల్లాః యుక్తి అంటే నిర్భయంగా ఉన్నారా? వాస్తవానికి నాశనం కాబోయే జాతి మాత్రమే అల్లాః ఎత్తుగడ అంటే నిర్భయంగా ఉంటుంది﴿. (7: ఆరాఫ్: 99).

﴾తమ ప్రభువు కారుణ్యం పట్ల, మార్గం తప్పినవారు మాత్రమే నిరాశ పడతారు﴿. (15: హిజ్ర్: 56).

ఇబ్ను అబ్బాసు ﷺ ఉల్లేఖన ప్రకారం, ప్రవక్త ﷺను ఘోరమైన పాపాల గురించి ప్రశ్నించబడినప్పుడు ఇలా చెప్పారు: "అల్లాఃతో షిర్క్ చేయుట. (ఇతరులను సాటి కల్పించుట). అల్లాః కారుణ్యం పట్ల నిరాశ చెందుట. అల్లాః యుక్తితో నిర్భయంగా ఉండుట". (తబ్రాని, మజ్ మఉజ్జవాఇద్: 1/104).

ఇబ్ను మస్ ఊద్ ﷺ చెప్పారు: అతిఘోరమైన పాపాలు ఇవి: అల్లాఃతో షిర్క్ చేయుట. అల్లాః యుక్తితో నిర్భయంగా ఉండుట. అల్లాః కారుణ్యం పట్ల నిరాశ చెందుట. అల్లాః దయ పట్ల ఆశను వదులుకొనుట". (ముసన్నఫు అబ్దిర్ రజ్జాఖ్: 10/459. తబ్రాని ఫిల్ కబీర్: 8783, 8784).

### ముఖ్యాంశాలు:

1. సూరె ఆరాఫ్ ఆయతు యొక్క వ్యాఖ్యానం. (అందులో అల్లాః ఎత్తుగడ నుండి నిర్భయంగా ఉండేవారి ప్రస్తావన ఉంది).
2. సూరె హిజ్ర్ ఆయతు యొక్క వ్యాఖ్యానం.
3. అల్లాః ఎత్తుగడ పట్ల నిర్భయంగా ఉండేవారికి కఠిన హెచ్చరిక ఇవ్వబడింది.
4. నిరాశ చెందేవారికి కూడా కఠిన హెచ్చరిక ఇవ్వబడింది.

## తాత్పర్యం:

ఈ అధ్యాయం యొక్క ఉద్దేశం: మానవుడు అల్లాహ్ కి భయపడుట, ఆయనపై ఆశ ఉంచుట చాలా ముఖ్యం. తన పాపాలను మరియు అల్లాహ్ న్యాయాన్ని, ఆయన కఠిన శిక్షను చూసి భయపడాలి. అల్లాహ్ యొక్క సామాన్య, ప్రత్యేక దయను, విశాలమైన క్షమాపణ చూసి ఆశించాలి. కొన్ని ఉదాహరణలు:

పుణ్య కార్యం చేయుటకు భాగ్యం కలిగితే దాన్ని అల్లాహ్ స్వీకరించాలని ఆశిస్తూ, అందులో ఏదైనా లోపం వలన ఆ పుణ్యకార్యం రద్దు చేయబడుతుందేమోనని భయపడాలి.

ఏదైనా పాపం జరిగిన తరువాత తౌబా చేస్తూ, అది స్వీకరించబడాలని, ఆ పాపం మన్నించబడాలని ఆశిస్తూ, తౌబాలో ఏదైనా కొరత వలన, పాపం వైపున మ్రొగ్గినందుకు శిక్షకు గురి కావలసి వస్తుందేమోనని భయపడాలి.

అనుగ్రహం, సౌలభ్యం వరించినప్పుడు అవి రెట్టింపు కావాలని, దీర్ఘకాలం ఉండాలని, దాని కృతజ్ఞత తెలుపుకునే భాగ్యం కలగాలని ఆశించాలి. కృతజ్ఞతలో లోపం వలన అవి నశిస్తాయని భయం చెందాలి.

బాధకరమైన సందర్భాల్లో అవి తొలిగిపోవాలని, సుఖం లభించాలని, వాటిపై సహనం వహిస్తూ అల్లాహ్ దానికి బదులుగా సత్ఫలితం ప్రసాదించాలని ఆశించాలి. సహనం వహించకున్నట్లయితే పుణ్యం వ్యర్థమయి, బాధకరమైన సంఘటనలు సంభవించి ఈ రెండూ ఒకేసారి ఏకమవుతాయేమోనని భయపడాలి.

భయం, ఆశ సంపూర్ణ విశ్వాసికి సర్వ పరిస్థితులలో తోడుగా ఉంటాయి. ఇవి తప్పనిసరి మరియు లాభదాయకమైనవి కూడాను. దీనితోనే సాఫల్యం ప్రాప్తమవుతుంది.

మానవుని పట్ల రెండు దుష్ప్రవర్తనల భయం చాలా ఉంటుంది.

1) భయానికి గురై అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందుతాడు.

2) ఆశలు అధికమై అల్లాః శిక్షను మరచిపోతాడు, ఎత్తుగడ పట్ల నిర్భ-యంగా ఉంటాడు. ఇలా ఈ రెండింటిలో మితిమీరడం వలన, భయం, ఆశ యొక్క విధిని, తౌహీద్ యొక్క ముఖ్య అంశాన్ని కోల్పోవలసి వస్తుంది.

అల్లాః కారుణ్యం పట్ల రెండు కారణాల వల్ల నిరాశచెందుతారు.

1) మానవుడు తన ఆత్మపై అన్యాయం చేస్తూ, నిషిద్ధ కార్యాలకు పాల్పడి, కావాలని అవి చేస్తూ, వాటిని వదులుకోకుండా ఉంటాడు. అప్పుడు అల్లాః కరుణపై అతనికి ఆశ ఉండదు. ఎందుకనగా తను ఏ పాపాలకు పాల్పడ్డాడో అవి అతన్ని ఈ స్థితికి గురి చేస్తాయి. ఇక ఇదే అతని గుణంగా, ప్రవర్తనగా మారిపోతుంది. షైతాన్ మానవునితో కోరేది ఇదే. ఈ స్థితికి మానవుడు చేరు-కున్నప్పుడు స్వచ్ఛమైన తౌబా చేసి (పశ్చాత్తాప పడి), ఆ స్థితి నుండి బయటికి రావాలి.

2) తాను చేసిన దుష్కార్యాలకు చాలా భయ పడుతూ, ఆ భయంతో అల్లాః కారుణ్యం విశాలమైనదనే విషయాన్ని మరచిపోతాడు, తాను తౌబా చేసినా, అల్లాః వైపునకు మరలినా అల్లాః క్షమించడని తన మూర్ఖత్వం వలన భావిస్తాడు. ఇలా ఆయన కరుణ పట్ల నిరాశ చెందుతాడు. ఈ నిషిద్ధమైన మరియు నష్టానికి గురి చేసే స్థితి, తన ప్రభువు విషయంలో ఉండ వలసిన జ్ఞానం లేక పోవడం. ఏ హక్కులు పాటించాలో తెలుసుకోక పోవడం. మరియు స్వయంగా తన ఆత్మ బలహీనత వలన.

అతను అల్లాఃను సరియైన రీతిలో తెలుసుకొని, సోమరితనాన్ని వదలుకుంటె అతని చిన్న ప్రయత్నం వలన అల్లాః యొక్క అనంత కరుణను నోచుకున్నట్లు తప్పక గమనిస్తాడు.

అల్లాః ఎత్తుగడపట్ల నిర్భయంగా ఉండుటకు కూడా వినాశానికి గురి చేసే రెండు కారణాలు గలవు:-

1) మానవుడు ధర్మం పట్ల విముఖత చూపి, అల్లాః గురించి ఏమి తెలుసుకోకుండా, అతనిపై ఆయన ఏ హక్కులు ఉన్నాయో తెలుసుకొనక

యుండుట. ఇందు వల్ల అతను ఎల్లప్పుడూ విధివైన విషయాల్లో అశ్రద్ధ చూపుతూ, నిషిద్ధ కార్యాలకు పాల్పడుతాడు. చివరికి అతని హృదయంలో భయం, విశ్వాసమూ లేనట్లవుతుంది. ఎలా అనగా విశ్వాసమున్న వ్యక్తిలో అల్లాః భయం, ఇహపరలోకాల శిక్ష భయం ఉంటుంది.

2) అజ్ఞానుడు ఇబాదత్ (ఆరాధన) చేస్తూ మురిసిపోయి, తను చేసిన కర్మలపై గర్వపడుతాడు. చివరికి భయం లేని వాడవుతాడు. అల్లాః వద్ద అతనికి చాలా గొప్ప స్థానం ఉందని భ్రమ పడతాడు. ఇలా అల్లాః ఎత్తుగడతో నిర్భయుడవుతాడు. తన నీచమైన, బలహీనమైన మనసుపై నమ్మకం ఉంచుతాడు. అందుకే ఇది తౌహీద్ కు వ్యతిరేకమైనది.

## 35వ అధ్యాయం:

### విధివ్రాతపై సహనం వహించుట కూడా అల్లాఃపై విశ్వాసంలో ఒక భాగం

అల్లాః ఆదేశం: ﴾ఎవడు అల్లాఃను విశ్వసిస్తాడో, అల్లాః అతని హృదయానికి మార్గదర్శకత్వం ప్రసాదిస్తాడు﴿. (64: తగాబున్ : 11).

పై ఆయతులో ప్రస్తావించబడిన వ్యక్తి ఎవరు అనేది "అల్ ఖమ" ఇలా ప్రస్తావించారు: "అతనిపై ఏదైనా ఆపద వస్తే, అది అల్లాః తరఫు నుండి అని అతను తెలుసుకొని, సంతోషిస్తాడు, మనఃపూర్వకంగా ఒప్పుకుంటాడు'.

అబు హురైరా ﷺ కథనం, ప్రవక్త ﷺ ప్రవచించారు: "కుఫ్ర్ కు (సత్యతిరస్కా-రానికి) సంబంధించిన రెండు గుణాలు ప్రజల్లో ఉన్నాయి. ఒకటి: ఒకరి వంశ పరంపరను నిందించుట. రెండవది: చనిపోయినవారిపై శోకము చేయుట".

అబ్దుల్లాః బిన్ మస్ ఊద్ ﷺ ఉల్లేఖించారు: ప్రవక్త ﷺ ఉపదేశించారు: "చెంప-లను బాదుకుంటూ, దుస్తులు చించుకుంటూ అజ్ఞానకాలపు అరుపులు/

పలుకులు పలికేవాడు మన (సంప్రదాయము అనుసరించే)వాడు కాదు". (బుఖారి, ముస్లిం).

అనసు ﷺ ఉల్లేఖించారు: ప్రవక్త ﷺ ప్రవచించారు: "అల్లాః ఏ మానవునికి మేలు చేయగోరుతాడో, అతని పాపాలకు బదులు శిక్ష ఇహలోకంలోనే తొందరగా ఇచ్చేస్తాడు. ఏ మానవునికి మేలు చేయగోరడో, అతని పాపాలకు బదులు శిక్షను ప్రళయం వరకు వేచి ఉంచి అక్కడ ఇస్తాడు". (తిర్మిజి).

మరో సారి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పారు: "పరీక్ష ఎంత కఠినంగా ఉంటుందో ప్రతిఫలం కూడా అంతే గొప్పగా ఉంటుంది. అల్లాః ఏ సమాజం, సంఘాన్ని ప్రేమిస్తాడో, దానిని పరీక్షకు గురి చేస్తాడు. ఎవరు దానిని సహనంతో (సహిస్తారో), వారితో అల్లాః ఇష్ట పడుతాడు.ఎవరు అసహనము చూపుతారో, అల్లాః వారిపై ఆగ్రహిస్తాడు". (తిర్మిజి).

## ముఖ్యాంశాలు:

1. తగాబున్ ఆయతు యొక్క భావం.
2. సహనం అల్లాఃపై విశ్వాసంలో ఒక భాగం.
3. వంశ పరంపరలోని లోపాలను ఎంచుట మంచిది కాదు.
4. "చెంపలు బాదుకుంటూ, దుస్తులు చించుకుంటూ, అజ్ఞానకాలపు పలుకులు పలికేవాని గురించి కఠినంగా హెచ్చరించబడింది.
5. అల్లాః మేలు కోరిన వ్యక్తి లక్షణం తెలిసింది.
6. అల్లాః మేలు కోరని వ్యక్తి లక్షణం తెలిసింది.
7. అల్లాః ప్రేమించిన వ్యక్తి చిహ్నం.
8. పరీక్ష, ఆపదపై అసంతృప్తి వ్యక్తం చేయుట నిషిద్ధం.
9. వాటిపై సహనం వహించుట వలన పుణ్యం లభిస్తుంది.

తాత్పర్యం:

ఓపికతో అల్లాహ్ కు విధేయులగుట, పాపం నుండి దూరంగా ఉండి సహనం వహించుట. ఇవి రెండూ విశ్వాసంలో లెక్కించబడుతాయి. అంతే కాదు అవి దాని పునాది. దాని భాగాలే. అల్లాహ్ ప్రేమించేవాటిని, ఆయనకు ఇష్టమున్న, ఆయన సన్నిధిలో చేర్పించేవాటిని ఓపికతో (ఆచరించుట), ఆయన నిషేధించిన వాటి నుండి దూరంగా ఉండి సహనం వహించుటయే విశ్వాసం.

ఇస్లాం పునాది మూడు సూత్రాలపై ఉంది.

1) అల్లాహ్, ఆయన ప్రవక్త తెలిపిన వాటిని సత్యం అని నమ్ముట.

2) అల్లాహ్, ఆయన ప్రవక్త ఆదేశాలను తు.చ తప్పకుండా పాటించుట.

3) అల్లాహ్, ఆయన ప్రవక్త నిషేధించినవాటి నుండి దూరంగా ఉండుట.

అల్లాహ్ వ్రాసిన విధి వ్రాత బాధకరమైనప్పటికి దానిపై ఓపిక వహించుట ఇందులోనే వస్తుంది. కాని దాన్ని తెలుసుకొనుట, ఆచరించుట చాలా అవసరం కాబట్టి దానిని ప్రత్యేకంగా ప్రస్తావించడం జరిగింది.

ఆపద, కష్టం అల్లాహ్ తరఫు నుండియే వస్తుంది అని, అల్లాహ్ దాన్ని నిర్ణయించడంలో సంపూర్ణ వివేచణాపరుడని, దానిని మానవునిపై నిర్ణయించడం కూడా ఆయన సంపూర్ణ వరమేనని తెలుసుకున్న వ్యక్తి అల్లాహ్ వ్రాసిన విధివ్రాతతో సంతోషించి, దాన్ని మనఃపూర్వకంగా ఒప్పుకొని, అసంతృప్తికరమైనవాటిపై అల్లాహ్ సన్నిధానం కోరుతూ, పుణ్యాన్ని ఆశిస్తూ, ఆయన శిక్షతో భయపడుతూ మరియు సద్ప్రవర్తన అవలంభించే సమయం వచ్చిందని భావిస్తూ సహనం వహించాలి. అప్పుడు అతని హృదయానికి తృప్తి శాంతి కలుగుతుంది. అతని విశ్వాసం, ఏకత్వంలో బలం వస్తుంది.

## 36వ అధ్యాయం:

# ప్రదర్శనాబుద్ధి

﴾ప్రవక్తా! ఇలా చెప్పండి: "నేను కేవలం ఒక మానవుణ్ణి, మీలాంటివాణ్ణి, నాకు వహీ ద్వారా ఇలా తెలుపబడింది. మీ ఆరాధనలకు అర్హుడు కేవలం ఒకే ఒక్కడు. కనుక తన ప్రభువును కలుసుకోవాలని ఆశించేవాడు సత్కార్యాలు చేయాలి, ఆరాధనలో తన ప్రభువుతో పాటు మరెవ్వరినీ చేర్చ-కూడదు"﴿. **(18: కహఫ్: 110).**

అబూ హురైరా ؓ ఉల్లేఖించారు, అల్లాః ఇలా తెలిపాడని ప్రవక్త ﷺ ఉపదేశించారు: "నేను ఇతర సహవర్తులకంటే అధికంగా "షిర్క్"కు అతీతుణ్ణి. ఎవరు ఒక పని చేసి, అందులో నాతో ఇతరుల్ని సాటి కల్పిస్తారో నేను అతణ్ణీ, అతని ఆ పనిని స్వీకరించను". (ముస్లిం).

అబూ సఈద్ ఖుద్రీ ؓ ఉల్లేఖించారు: ఒక సారి ప్రవక్త ﷺ "నేను మీకు మసీహుద్దజ్జాల్ కన్నా భయంకరమైన విషయము తెలుపునా?" అని ప్రశ్నిస్తే 'తప్పక తెలుపండని' మేము విన్నవించుకోగా "గుప్తమైన షిర్క్, అదేమనగా: ఒక వ్యక్తి చూసినవారు నన్ను మెచ్చుకోవాలని అలంకరిస్తూ, ఎన్నలతో నమాజ్ చేస్తాడు". (అలా స్తుతించబడటానికి, చూచిన వారు మెచ్చుకోవాలనే ఉద్దేశముతో చేయడం గుప్తమైన షిర్క్) అని చెప్పారు. (అహ్మద్, ఇబ్ను మాజ: **4204**).

## ముఖ్యాంశాలు:

1. సూరె కహఫ్ ఆయతు యొక్క వ్యాఖ్యానం. (ప్రతి పని సంకల్ప శుద్ధి (ఇఖ్లాస్)తో కూడుకొని యుండాలని చెప్పడం జరిగింది).
2. ఒక గొప్ప విషయం: సత్కార్యంలో అల్లాఃయేతరుల ఏ కొంచెం ప్రవేశమున్న (ఆ క్రియలో, లేక సంకల్పంలో) అది రద్దు చేయబడుతుంది.

3. అల్లాః సంపూర్ణంగా అతీతుడు కనుక (ప్రదర్శనాబుద్ధితో కలుషితమైన) కార్యాన్ని స్వీకరించడు, (దానికి ఫలితం ప్రసాదించడు).

4. దానికి మరో కారణం ఏమనగ: అల్లాః అందరికన్నా ఘనతగలవాడు. (ఆయన్ని వదలి లేక ఆయనతో మరొకరిని సాటి కల్పించడం ఘోరమైన పాపం).

5. ప్రవక్త ﷺ తమ అనుచరుల పట్ల ప్రదర్శనాబుద్ధి నుండి భయం చెంది (దాని నుండి దూరముండాలని తాకీదు చేశారు).

6. దాన్ని విశదీకరించి చెప్పారు: నమాజు చేసే వ్యక్తి, చూసేవారు మెచ్చుకోవాలని ఎంతో అందముగా చేసే ప్రయత్నం చేస్తాడు.

## తాత్పర్యం:

అల్లాః కొరకు నిర్దుష్టమైన భక్తి / ఏకాగ్రచిత్తం కలికియుండుట ధర్మం యొక్క పునాది. మరియు అదే తౌహీద్ కు ప్రాణం. నిర్దుష్టమైన భక్తి / ఏకాగ్రచిత్తం (ఇఖ్లాసు) అంటే మానవుడు తను చేసే ప్రతి పని ఉద్దేశం అల్లాః సంతృప్తి, ఆయన నుండి పుణ్యం, ప్రళయమున సాఫల్యం పొందుట కొరకే ఉండాలి. ఇదే అసలైన తౌహీద్.

దీనికి బద్ధవిరుద్ధం ప్రదర్శనాబుద్ధి, చూసినవారు మెచ్చుకోవాలని, పొగడాలని, హోదా, ప్రాపంచిక లాభం పొందుట దాని ఉద్దేశం ఉండకూడదు.

ప్రదర్శనాబుద్ధి గురించి కొంచెం వివరంగా తెలుసుకోవాలి:-

ఒక వ్యక్తి ఏదైనా సత్కార్యం చేయునప్పుడు, దాని ఉద్దేశం ప్రజలు చూడాలి అని మనుసులో వచ్చినప్పుడు, ఆ ఆలోచనను దూరం చేయకుండా అలాగే ఉండిపోతే దాని వలన ఆ సత్కార్యం వృథా అవుతుంది (ఫలితం లభించదు). అది చిన్న షిర్క్ అవుతుంది. అలాగే పెద్ద షిర్క్ కు కారణం అవుతుందన్న భయం కూడా ఉంటుంది.

సత్కార్యం చేసే ఉద్దేశం అల్లాః సంతృప్తితో పాటు ప్రజలు చూడాలి అని

కూడా మనుస్సులో వచ్చినప్పుడు, అతని ఆ సత్కార్యంలో ప్రదర్శనాబుద్ధి ప్రవేశించింది కనుక అది కూడా వృథా అవుతుందని నిదర్శనాలున్నాయి.

సత్కార్యం చేసే ఉద్దేశం కేవలం అల్లాః సంతృప్తి అయినప్పటికీ, మధ్యలో ప్రదర్శనాబుద్ధి ఉద్దేశం ప్రవేశింది, అతను దాన్ని తొలగించి ఏకాగ్రచిత్తం (ఇఖ్లాసు) పాటిస్తే అతనికి ఏలాంటి నష్టం ఉండదు. ఆ దురుద్దేశాన్ని అతను తొలగించకుంటే, ఎంత శాతం ప్రదర్శనాబుద్ధి ఉందో, అంతే ఆ సత్కార్యంలో కొరత ఏర్పడుతుంది. విశ్వాసం, ఇఖ్లాసులలో బలహీనత వస్తుంది.

ప్రదర్శనాబుద్ధి మహాగండం. దానికి చికిత్స చాలా అవసరం. మనుసుకు ఇఖ్లాసు యొక్క మంచి శిక్షణ ఇవ్వాలి. ప్రదర్శనాబుద్ధిని, నష్టం కలిగించే మనోవాంఛల్ని తొలగించుటకు తగిన ప్రయత్నం చేయాలి. అందుకు అల్లాః సహాయం కోరాలి. అల్లాః తన దయ మరియు కరుణతో ఇఖ్లాసు భాగ్యం ప్రసాదించి, తౌహీద్ వాస్తవికత యొక్క జ్ఞానం కలిగిస్తాడు.

ప్రాపంచిక లాభం, మనోవాంఛల కొరకు సత్కార్యం చేయుట:

అల్లాః సంతృప్తి ఉద్దేశం ఏ మాత్రం లేకుండా, కేవలం పై ఉద్దేశమే ఉంటే, అతనికి దానికి బదులు ఏ లాభమూ ఉండదు. ఇలా ఒక విశ్వాసి ప్రవర్తించుట సమంజసం కాదు. విశ్వాసి అతని విశ్వాసం ఎంత బలహీనంగా ఉన్నప్పటికి అతను అల్లాః సంతృప్తి, పరలోక లాభం కోరుటయే చాలా అవసరం.

ఎవరు అల్లాః సంతృప్తి, ప్రాపంచిక లాభం రెండు ఉద్దేశాలతో చేసినప్పుడు, రెండు ఉద్దేశాలు ఒకే పరిమాణంలో ఉంటే, అతను విశ్వాసి అయి ఉంటే, వాస్తవానికి అతని విశ్వాసంలో, ఇఖ్లాసులో కొరత ఉన్నట్లే. ఇఖ్లాసులో కొరత ఉన్నప్పుడు అతని కార్యం కూడా సంపూర్ణం కాదు. (ఫలితం సంపూర్ణంగా ఉండదు).

ఎవరు కేవలం అల్లాః సంతృప్తి కొరకు, సంపూర్ణ ఇఖ్లాసుతో చేస్తారో, కాని అతను దానిపై వేతనము లేక బహుమానము పొందుతాడు. దానితో అతను తన పని, ధర్మంలో సహాయం తీసుకుంటాడు. ఉదా: ఎవరైనా ఒక మంచి పని, పుణ్యకార్యం చేసినందుకు ఏదైనా బత్తెం దొరికినట్లు. ముజాహిద్ జిహాద్ చేయుటకు వెళ్ళినప్పుడు యుద్ధఫలం (గనీమత్) పొందినట్లు. మస్జిద్, మద్ రసా మరియు ధర్మకార్యాలు నిర్వహించే వారికి వఖ్ఫ్ బోర్డ్ ఇచ్చే వేతనాలు. ఇలాంటివి తీసుకొనుట వలన విశ్వాసం, తౌహీద్ లో ఏలాంటి కొరత, నష్టం వాటిల్లదు. ఎందుకనగా అతని ఆ సత్కార్యం చేయు ఉద్దేశం ఉంటుంది. అతను పొందునది అతని ధర్మంపై నిలకడ కొరకు సహాయము చేయును. అందుకే జకాత్ మరియు మాలెఫై (యుద్ధ ఫలం లాంటిది) లాంటి ధనంలో, ధార్మిక మరియు లాభదాయకమైన ప్రాపంచిక కార్యాలు నిర్వహించువారికి హక్కు ఉంది.

## 37వ అధ్యాయం:

## మానవుడు తాను చేసే సత్కార్యంతో ప్రాపంచిక లాభం పొందాలని ఉద్దేశించుట కూడ ఒక రకమైన షిర్క్

అల్లాః ఆదేశం: ﴾ఎవరైతే కేవలం ఈ ప్రాపంచిక జీవితాన్ని, దాని ఆకర్ష-ణాలనూ కోరుకునే వారు చేసిన పనులకు పూర్తి ప్రతి ఫలాన్ని మేము వారికి ఇక్కడనే ఇచ్చేస్తాము. ఇందులో వారికి లోటు చెయ్యటం అంటూ జరగదు. అయితే పరలోకంలో అటువంటి వారికి అగ్ని తప్ప మరేమి ఉండదు. (అక్కడ తెలిసిపోతుంది) వారు ప్రపంచంలో చేసినదంతా మట్టిలో కలసి-పోయింది అనీ, వారు చేసినదంతా కేవలం మిథ్యఅనీ﴿. (11: హూద్: 15, 16).

ప్రవక్త ﷺ ఉపదేశించారని, అబూ హురైరా ؓ ఉల్లేఖించారు: "దీనార్, దిర్హం, మంచి దుప్పట్ల దాసుడు నాశనమయ్యాడు. అవి దొరికితే అతడు సంతోషిస్తాడు, లేనిచో అసంతృప్తికి లోనవుతాడు. అతను నాశనమవుగాకా, నష్టంలో పడుగాకా!. అతనికి ముళ్ళు గుచ్చుకున్నా తీయరాకుండా అవుగాకా. గుఱ్ఱం కళ్ళెం పట్టుకొని అల్లాః మార్గంలో (జిహాద్ లో) నిలబడిన వ్యక్తికి శుభవార్త! అతని తలవెంట్రుకలు చిందరవందరై ఉన్నాయి. అతని పాదాలకు దుమ్ము ధూళి పట్టి ఉంది. అతడిని ప్రహరితిరుగుటకు నియమిస్తే దానిపైనే ఉంటాడు. సైన్యం వెనక ఉంచుతే అక్కడే ఉంటాడు. అనుమతి కోరితే అతనికి అనుమతి లభించదు. సిఫారసు చేస్తే అది స్వీకరించబడదు". (బుఖారి: 6435).

## ముఖ్యాంశాలు:

1. ప్రళయమున లాభాన్నిచ్చే కార్యం చేస్తూ ప్రపంచాన్ని కూడా పొందాలని ఉద్దేశించుట (షిర్క్ లో వస్తుంది).

2. సూరె హూద్ ఆయతు యొక్క వ్యాఖ్యానం

3. (ప్రాపంచిక లాభంకోరు) ముస్లింను "దీనార్, దిర్హం, మంచి చాదర్లు, దుప్పట్ల దాసుడు" అని పిలవడం జరిగింది.

4. దాని వివరణ ఏమనగ అతనికి అది దొరికితే సంతోషిస్తాడు, దొరుకనిచో అసంతృప్తికి లోనవుతాడు.

5. అలాంటి వ్యక్తికి వినాశం ఉంది అని చెప్పబడింది.

6. అలాగే అతని ముళ్ళు గుచ్చుకున్నా తీయరాకుండా అవుగాకా అని శపించబడింది.

7. పై హదీసులో తెలుపబడిన గుణాలు ఉన్న ముజాహిద్ (ధర్మ యుద్ధవీరున్ని) ప్రశంసించడమైనది.

## 38వ అధ్యాయం:

## హలాల్ ను హరాం మరియు హరాంను హలాల్ చేయు పండితులకు, పాలకులకు విధేయత చూపుట (అల్లాను త్యజించి) వారిని ప్రభువులుగా చేసుకొనుటయే

ఇబ్నె అబ్బాసు రజియల్లాహు అన్హు చెప్పారు: సమీప కాలంలో మీపై ఆకాశం నుండి రాళ్ళ వర్షం కురుస్తుంది. ఎందుకనగా ప్రవక్త ఇలా చెప్పారు అని నేనంటుంటే, కాదు అబూ బకర్ మరియు ఉమర్ ఇలా చెప్పారు అని మీరు అంటున్నారు. (అహ్మద్).

ఇమాం అహ్మద్ చెప్పారు: సనద్ మరియు దాని సత్యతను తెలుసుకొని కూడా హదీసును వదలివేసి సుఫ్యాన్ (ఇస్లామీయ పండితులు) అభిప్రాయాన్ని తీసుకునేవారిని చూసి ఆశ్చర్యం ఏర్పడుతుంది. ఎందుకంటే అల్లాః చెప్పాడు: ﴾దైవప్రవక్త ఆజ్ఞను ఉల్లంఘించేవారు, తాము ఏదైనా ఉపద్రవంలో చిక్కుకుపోతామేమో అనీ, తమపై బాధాకరమైన శిక్ష ఏదైనా అవతరిస్తుందేమో అనీ భయపడాలి﴿. (24: నూర్: 63). ఉపద్రవం అంటేమిటో తెలియునా? ఉపద్రవం అంటే షిర్క్. ఎవరైనా ప్రవక్త ﷺ మాటను తిరస్కరిస్తే అతని హృదయములో వక్రత్వం చోటు చేసుకుంటుంది. అతను నాశనమవుతాడు.

అదీ బిన్ హాతిం ؓ ఉల్లేఖించారు, ప్రవక్త ﷺ ﴾వారు అల్లాఃను కాదని తమ విద్వాంసులను, తమ సన్యాసులను, తమ ప్రభువులుగా చేసుకున్నారు﴿. (9: తౌబా: 31) అన్న ఖుర్ఆన్ వాక్యం చదవగా, ఆయన విని, 'ప్రవక్తా! ﷺ మేము వారిని పూజించలేదు కదా?' అని ప్రశ్నించారు. "అల్లాః హరాం చేసిన దానిని వారు హలాల్ చేస్తే మీరు కూడా దాన్ని హలాల్ అని నమ్మలేదా?, అల్లాః హలాల్ చేసిన దానిని వారు హరాం చేస్తే మీరు కూడా దాన్ని హరాం

అని నమ్మలేదా?" అని అడిగారు ప్రవక్త ﷺ. 'అవును' అని అతనన్నాడు. అప్పుడు ప్రవక్త ﷺ చెప్పారు: "అదే వారి ఆరాధన". (అహ్మద్, తిర్మిజి. ఈ హదీసు "హసన్" స్థానములో ఉందని ఇమాం తిర్మిజి చెప్పారు).

## ముఖ్యాంశాలు:

1. సూరె నూర్ ఆయత్ యొక్క వ్యాఖ్యానం.
2. సూరె తౌబా ఆయత్ యొక్క వ్యాఖ్యానం.
3. ఆరాధన యొక్క ఏ భావాన్ని అదీ ؓ (సంభాషణ ఆరంభంలో) తిరస్కరించారో దానిని గమనించాలి. (అది చాలా ముఖ్యం).
4. ఇబ్ను అబ్బాసు ؓ, అబూ బకర్ ؓ మరియు ఉమర్ ؓ ల పేరు తీసుకొని, అలాగే ఇమాం అహ్మద్, సుఫ్యాన్ పేరు తీసుకొని చెప్పేదేమిటంటే ప్రవక్త ఆదేశం వచ్చిన తరువాత ఇతరుల మాట వినకూడదు.
5. ఈ రోజుల్లో పరిస్థితులు చాలా మారాయి. అనేక మంది సన్యాసులను ఆరాధించుటయే ఉత్తమమైన కర్మగా భావించి, దానికి "విలాయత్" అని నామకరణము చేస్తున్నారు. విద్యజ్ఞానాల పేరుతో విద్వాంసులు ఆరాధించబడుతున్నారు. పరిస్థితి మరింత భయంకరంగా మారి: ఎవరు పుణ్యపురుషుల్లో లెక్కించబడరో, అల్లాహ్‌ను వదలి వారి ఆరాధన కూడా జరుగుతుంది. మరో విధంగా చెప్పాలంటే మూర్ఖుల పూజ జరుగుతుంది.

## తాత్పర్యం:

రచయిత రహిమహుల్లాహ్ ఈ అధ్యాయాన్ని ఇందులో చేర్చడానికి కారణం స్పష్టంగా ఉంది. పోషకుడు, ఆరాధ్యుడు అయిన అల్లాహ్‌కే ఖద్ రీ (స్వాభావిక), షర్ ఈ (ధార్మిక) మరియు జజాఈ ఆదేశం (Criminal law) ఇచ్చే హక్కు ఉంది. కేవలం ఆయన ఆరాధనే జరగాలి. ఆయనతో మరొకరిని సాటి

కల్పించరాదు. ఎల్లవేళల్లో ఆయన విధేయతనే పాటించాలి. ఆయన అవిధేయతకు గురి కాకూడదు. ఆయన తప్ప (ఆయన ఆదేశించిన) ఇతరుల విధేయత ఆయన విధేయతకు అనుగుణంగా ఉండాలి. (ఒక వేళ ఈ విధంగా) విద్వాంసుల / పండితుల, అధికారుల విధేయత పాటిస్తే, ఇంకా అల్లాః ఆయన ప్రవక్త విధేయతను వారి విధేయతకు అనుగుణంగా చేస్తే వాస్తవంగా అతను అల్లాఃను కాదని వారిని "రబ్" చేసుకున్నవాడు, వారి పూజ చేయువాడు, వారితో తీర్పులు కోరినవాడు, వారి తీర్పును, అల్లాః ఆయన ప్రవక్త తీర్పుపై ప్రాధాన్యత ఇచ్చినవాడవుతాడు. నిస్సందేహంగా ఇదే అవిశ్వాసం (కుఫ్ర్). ఎలాగైతే ఆరాధనకు అల్లాః అర్హుడో అలాగే ఆదేశం, తీర్పు కూడా ఆయనదే చెల్లును.

ప్రతి వ్యక్తిపై విధిగా ఉన్న విషయం ఏమనగా: ఏ ఒకరు కూడా అల్లాఃను తప్ప ఇతరులను తీర్పు ఇచ్చేవానిగా (అల్లాః, ప్రవక్త ఆజ్ఞకు వ్యతిరేకంగా తమ ఆజ్ఞను చెలాయించే వానిగా) నిర్ణయించుకోకూడదు. ప్రజల మధ్య ఏ సమస్యలోనైనా వివాదం తలెత్తితే (దాని తీర్పునకు) అల్లాః (అంటే: ఖుర్ ఆన్ గ్రంథం) ఆయన ప్రవక్త (అంటే: సహీ హదీసుల) వైపు దాన్ని నివేదించాలి. ఈ విధంగా మానవుడు అల్లాః ధర్మాన్ని అవలంబించినవాడు, ఆయన సంతృప్తి కొరకే ఏకాగ్రచిత్తంతో తౌహీద్ ను పాటించినవాడవుతాడు.

అల్లాః ఆయన ప్రవక్త (ఖుర్ ఆన్, హదీసు)ను వదలి ఇతరులతో తీర్పు కోరేవాడు వాస్తవంగా "తాగూత్"తో తీర్పు కోరినవాడవుతాడు. ఇలా చేస్తూ తనకు తాను విశ్వాసి అని భావించినా అది అతని భ్రమ. అతడు అసత్యవాది.

ఇస్లాం ధర్మంలోని ప్రధానాంశాలు, దాని శాఖలన్నిట్లో అల్లాః ఆయన ప్రవక్త తీర్పుకు ప్రధాన్యత ఇవ్వనంత వరకు, (దాన్ని స్వీకరించనంత వరకు) ఏ వ్యక్తీ సరియైన, సంపూర్ణ విశ్వాసి కాజాలడు.

## 39వ అధ్యాయం:

﴾ప్రవక్తా! "నీ వద్దకు పంపబడిన గ్రంథాన్ని, నీకు పూర్వం పంపబడిన గ్రంథాలను మేము విశ్వసించాము" అని ప్రకటన అయితే చేసి, (తమ వ్యవహారాల) పరిష్కారం కొరకు 'తాగూత్' వద్దకు పోవాలని కోరేవారిని నీవు చూడలేదా? వాస్తవానికి 'తాగూత్' ను తిరస్కరించండి అని వారిని ఆదేశించటం జరిగింది. షైతాన్ వారిని పెడత్రోవ పట్టించి సన్మార్గానికి బహుదూరంగా తీసుకుపోవాలని చూస్తాడు﴿. (4: నిసా: 60).

﴾"భూమిపై కల్లోలాన్ని రేకెత్తించకండి" అని వారితో అన్నప్పుడల్లా వారు "మేము సంస్కర్తలము మాత్రమే" అని అంటారు. జాగ్రత్త! వాస్తవంగా వారే అసలు కల్లోలాన్ని సృష్టించేవారు.కాని వారు గ్రహిచటం లేదు﴿. (2: బఖర: 11).

﴾ధరణి సంస్కరణ జరిగిన తరువాత, దానిపై సంక్షోభాన్ని సృష్టించకండి﴿. (7: ఆరాఫ్: 56).

﴾(వారు అల్లాః శాసనానికి విముఖులై) అజ్ఞానపు (జాహిలియ్యత్) తీర్పు కావాలని కోరుకుంటున్నారా?﴿. (5: మాఇద: 50).

అబ్దుల్లాః బిన్ ఉమర్ ఉల్లేఖించారు, ప్రవక్త ﷺ ఉపదేశించారు: " నేను తీసుకొని వచ్చిన ధర్మ సూత్రములకు మీ మనోవాంఛలు కట్టుబడి ఉండనంత వరకు మీలో ఎవరూ విశ్వాసులు కాజాలరు". (ఇది సహీ హదీసు, మేము దీనిని సహీ సనద్ తో 'కితాబుల్ హుజ్జ'లో ఉల్లేఖించాము అని ఇమాం నవవి రహిమహుల్లాః చెప్పారు).

షఅబి ఇలా పేర్కొన్నారు: కపట విశ్వాసి మరియు యూదుని మధ్య వివాదం జరిగింది. ముహమ్మద్ ప్రవక్త ﷺ లంచము తీసుకోరని యూదునికి

తెలిసి, ఆయన వద్దకు (తీర్పు కొరకు) వెళ్దామని అతనన్నాడు. యూదులు లంచము తీసుకుంటారు అని కపట విశ్వాసికి తెలుసు గనుక, యూదుల వద్దకు వెళ్దామని అతనన్నాడు. చివరికి జుహైనా వంశానికి చెందిన ఒక జ్యోతిష్యుని వద్దకు వెళ్దామని ఇద్దరు ఒప్పుకున్నారు. అప్పుడే పై వాక్యం (4: నిసా: 60) అవతరించింది.

(పై వాక్యం అవతరణకు మరో కథనం కూడా ఉంది): ఇద్దరు జగడము చేసుకొని ఒకడన్నాడు ప్రవక్త ముహమ్మద్ ﷺ వద్దకు వెళ్దాము, మరొకడన్నాడు కఅబ్ బిన్ అష్రఫ్ (యూదుని) వద్దకు వెళ్దామని. (చివరికి ప్రవక్త వద్దకు వచ్చి అక్కడ తీర్పు అయిన తరువాత, వారిద్దరిలో ఒకడు ఆ తీర్పును అంగీకరించక) ఉమర్ వద్దకు వచ్చారు. (ఎవరి వైపు తీర్పు అయినదో) అతను పూర్తి వివరాన్ని ఉమర్ ﷺ ముందు పెట్టాడు. ప్రవక్త ﷺ తీర్పును వ్యతిరేకించిన వాడిని ఇది నిజమేనా? అని అడిగారు ఉమర్ ﷺ. 'ఔను' అన్నాడతను. అప్పుడు ఉమర్ ﷺ ఖడ్గముతో అతన్ని (ప్రవక్త ﷺ తీర్పును తిరస్కరించిన వాన్ని) హతమార్చారు.

## ముఖ్యాంశాలు:

1. సూరె నిసా ఆయతు యొక్క భావం తెలిసింది. 'తాగూత్' యొక్క భావం కూడా తెలిసింది.

2. సూరె బఖరలోని వాక్యం యొక్క భావం కూడా తెలిసింది. (అల్లాహ్ అవతరింపజేయని దానితో తీర్పు కోరడం మహా ఉపద్రవం అని తెలుస్తుంది).

3. సూరె ఆరాఫ్ వాక్యం యొక్క వ్యాఖ్యానం.

4. సూరె మాఇద వాక్యం యొక్క వ్యాఖ్యానం.

5. మొదటి వాక్యం యొక్క వ్యాఖ్యానంలో షఅబి చెప్పిన విషయం అర్థమయింది.

6. సత్యవిశ్వాసం, అసత్య విశ్వాసం యొక్క తేడా తెలిసింది.

7. ఉమర్ ﷺ (ప్రవక్త మాటను వినని) వంచకుని తో ఎలా వ్యవహరించారో తెలిసింది.

8. ప్రవక్త తీసుకువచ్చిన ధర్మాన్ని తమ మనోవాంఛలు అనుసరించనంత వరకు ఏ వ్యక్తీ విశ్వాసి కాలేడు.

## 40వ అధ్యాయం:

### అల్లాః నామాలను, గుణవిశేషణాలను తిరస్కరించువాడు

﴾వారు రహ్మాన్ ను తిరస్కరిస్తున్నారు﴿. (13: రఅద్: 30).

బుఖారిలో ఉంది. అలీ ﷺ ఇలా చెప్పారు: ప్రజలు అర్థం చేసుకోగల విషయాలే వారికి తెలుపండి. (ఊహజ్ఞానానికి అందని విషయం తెలిపి) అల్లాః ఆయన ప్రవక్త తిరస్కరించబడాలని మీరు కోరుతున్నారా?".

అబ్దుర్ రజ్జాఖ్, మఅ్ మర్ తో, ఆయన ఇబ్ను తావూసుతో ఆయన ఇబ్ను అబ్బాసుతో ఉల్లేఖించారు: అల్లాః గుణమునకు సంబంధించిన ఒక హదీసు విని అసహ్యంతో వణుకుతున్న ఒక వ్యక్తిని ఇబ్ను అబ్బాసు చూసి, ఇలా అన్నారు: అదేమిటి? వీరి భయం, వణుకుట చాలా విచిత్రంగా ఉంది. అల్లాః యొక్క "ముహ్కం" వాక్యాలు విని అంగీకరిస్తారు. "ముతషాబిః" వాక్యాలు విని (స్వీకరించక) నాశనమవుతారు".

ప్రవక్త ﷺ రహ్మాన్ విషయం ఖురైషు సంఘము ముందు ప్రస్తావించినప్పుడు వారు తిరస్కరించారు. అప్పుడే అల్లాః పై (13:30) వాక్యం అవతరింపజేసాడు.

### ముఖ్యాంశాలు:

1. అల్లాః నామములను, గుణవిశేషణాలను తిరస్కరించువానిలో ఏ మాత్రం విశ్వాసం ఉండదు.

2. సూరె రఅద్ ఆయతు యొక్క వ్యాఖ్యానం.
3. శ్రోతలకు అర్థం కాని విషయాలు చెప్పకపోవడం మంచిది.
4. ఎందుకనగా, అందువలన అల్లాః ఆయన ప్రవక్తను ఉద్దేశపూర్వకంగా కాకపోయినా అతను తిరస్కరిస్తాడేమో.
5. ఇబ్ను అబ్బాసు ﷺ అభిప్రాయము కూడా తెలిసింది: ఎవరు అల్లాః యొక్క గుణవిశేషణాలను తిరస్కరిస్తారో వారు అందువలన నాశనమవుతారు.

## తాత్పర్యం:

అల్లాఃను, ఆయన శుభనామములను మరియు గుణవిశేషణాలను విశ్వసించుట విశ్వాసానికి మూలం వంటిది.

వాటి పట్ల మానవుని జ్ఞానం మరియు విశ్వాసం ఎంత వృద్ధి చెందునో, అతను అల్లాః ఇబాదత్ లో ఎంత నిమగ్నుడగునో అంతే అతని తౌహీద్ కూడా వృద్ధి చెందును. సంపూర్ణ గుణాలు, మహోన్నతుడు, ఘనసీయుడు అల్లాః మాత్రమేనని తెలుసుకున్నవాడు, ఆయనే అసలైన ఆరాధ్యుడు, ఆయన తప్ప ఇతరులు తుచ్ఛము అని తెలుసుకొనుట తప్పనిసరి. అల్లాః నామములు, గుణాల్లో ఏ ఒక్క దాన్ని తిరస్కరించినా అతడు తౌహీద్ కు వ్యతిరేకమైన దాన్ని నమ్మినవాడవుతాడు. ఇది అవిశ్వాస భాగాల్లో ఒకటి.

## 41వ అధ్యాయం:

**అల్లాః ఆదేశం: ﴾వారు అల్లాః ఉపకారాన్ని గుర్తిస్తారు. అయినా దాన్ని తిరస్కరిస్తారు﴿. (16: నహ్ల్: 83).**

పై ఆయుతు యొక్క వ్యాఖ్యానం ఇమాం ముజాహిద్ రహిమహుల్లాః ఇలా

తెలిపారు: "నేను నా తాతల నుండి పొందిన ఆస్తి. ఇది నా సొమ్ము" అని మనిషి చెప్పుకొనుట.

ఔన్ బిన్ అబ్దుల్లాః చెప్పారు: "ఫలాన వ్యక్తి లేకుంటే ఇది నాకు లభించేదికాదు".

ఇబ్ను ఖుతైబ చెప్పారు: "ఇది మా దేవతల సిఫారసుతో దొరికినది" అని అనుట.

జైద్ బిన్ ఖాలిద్ ఉల్లేఖించిన హదీసు "నా దాసుల్లో కొందరు నన్ను విశ్వసించినవారు, మరి కొందరు నన్ను తిరస్కరించినవారున్నారు" (ఈ హదీసు 30వ అధ్యాయంలో గడిసింది). ఈ హదీసు వాఖ్యానంలో అబుల్ అబ్బాస్ (ఇబ్ను తైమియ) తెలిపారు: "ఇలా అల్లాః వరాలను అల్లాఃయేతరుల పేరున అంకితం చేసేవారిని, అల్లాఃకి సాటి కల్పించేవారిని అల్లాః ఖుర్ఆన్, హదీసులో అనేక చోట్ల అసహ్యించుకున్నట్లు తెలిపాడు.

ఈ మాటను వివరిస్తూ కొందరు పండితులు చెప్పారు: "గాలి మంచిగా ఉంది. నావికుడు తెలివైనవాడు ఉన్నాడు" లాంటి పదాలు అనేక మంది అంటుంటారు. (ఇలా వారు అల్లాః వరాల్ని తిరస్కరించి, వాటిని ప్రశంసిస్తారు).

## ముఖ్యాంశాలు:

1. ఉపకారాన్ని గుర్తిస్తారు, మళ్ళీ తిరస్కరిస్తారు అన్న దాని గురించి వివరించబడింది.

2. ఈ విధంగా ప్రజలు చాలా అంటుంటారు అని తెలిసింది.

3. ఈ విధంగా మాట్లాడటం వలన అల్లాః ఉపకారాన్ని తిరస్కరించి నట్లగును.

4. ఒకే హృదయంలో (అల్లాః వరాలను గుర్తించి, తిరస్కరించు వంటి) రెండు గుణాలు ఉంటాయి అని తెలిసింది.

## తాత్పర్యం:

అన్ని రకాల ఉపకారాలు అల్లాహ్‌యే చేయువాడు అని మనసావాచా నమ్మట సర్వ మానవులపై విధిగా ఉంది. దీనితోనే తౌహీద్ సంపూర్ణమవుతుంది. (ఈ విషయము ముందు వచ్చేసింది). అల్లాహ్ వరాలను మనసావాచా తిరస్కరించువాడు అవిశ్వాసి అవుతాడు.

అవి అల్లాహ్ వైపు నుండి అని హృదయపూర్వకంగా విశ్వసించి, నోటితో ఒకప్పుడు అల్లాహ్ తరఫున అని విశ్వసించి, మరొకప్పుడు తన తరఫున లేక తన వృత్తి వలన లేక తన కష్టం వలన అని అనుట. ఇలాంటి గుణం ఈ రోజుల్లో ప్రజల్లో చెలామణి ఉంది. ఇలాంటివారు వెంటనే (పశ్చాత్తాపపడి) తౌబా చేయాలి. అన్ని విషయాలను అల్లాహ్ వైపునకే అంకితం చేయాలి. ఈ విధంగానే విశ్వాసం సంపూర్ణం అవుతుంది.

విశ్వాసానికి మూలమైన కృతజ్ఞత యొక్క మూడు స్థంబాలున్నవి:-

1- అతని పై మరియు ఇతరులపై ఉన్న, అనుగ్రహాలు, సుఖసంతోషాలు అల్లాహ్ తరఫున అని హృదయపుర్వకంగా నమ్మాలి.

2- దాన్ని బహిర్గతం చేయాలి. అల్లాహ్‌కు ప్రశంసలు, కృతజ్ఞత తెలుపాలి.

3- ఉపకారుని (అల్లాహ్) విధేయతలో, అతనిని ప్రార్థనలో వాటిని సహాయంగా తీసుకోవాలి.

# 42వ అధ్యాయం:

## అల్లాహ్ ఆదేశం: ﴿మీరు తెలిసికూడా ఇతరులను అల్లాహ్‌కు సాటి కల్పించకండి﴾ (2: బఖర: 22).

పై ఆయతులో "అన్‌దాద్" అంటే షిర్క్ (అల్లాహ్‌కు ఇతరులను సాటి కల్పించడం).

అది (షిర్క్) కారు చీకటిలో నల్లటి రాతి బండపై నడిచే చీమ కన్నా మరీ గుప్తమైనది. ఇంకా ఇలాంటి పదాలు పలికినా అది షిర్క్‌లో వస్తుంది: "అల్లాః ప్రమాణంగా మరియు నీ జీవన ప్రమాణంగా". "ఓ వ్యక్తి! నా ప్రాణం సాక్షి". "ఈ కుక్క లేకుంటే దొంగలు పడేవారు". "ఇంట్లో ఈ బాతు లేకుంటే దొంగలు (ఇంటిని) దోచుకునేవారు". "అల్లాః కోరునది మరియు నీవు కోరునది (అగును)". "అల్లాః మరియు ఫలాన వ్యక్తి లేకుంటే..." లాంటి మాటలు పలుకరాదు. ఇవన్నియు అల్లాఃతో సాటి కల్పించినట్లగును". ఇది ఇబ్ను అబ్బాస్ رضي الله عنه వ్యాఖ్యానం. (దీనిని ఇబ్ను అబీ హాతిం ఉల్లేఖించారు).

ప్రవక్త ﷺ ప్రవచించారని, ఉమర్ رضي الله عنه ఉల్లేఖించారు: "అల్లాఃయేతరుల ప్రమాణం చేసేవాడు "కుఫ్ర్" చేసినవాడు లేక "షిర్క్" చేసినవాడవుతాడు". (తిర్మిజి).

ఇబ్ను మసూద్ رضي الله عنه ఇలా చెప్పారు: "సత్య విషయంలో అల్లాఃయేతరుల ప్రమాణం కంటే అసత్య విషయం పై అల్లాః ప్రమాణం చేయుట నాకు ఇష్టం". (తబ్రాని).

ప్రవక్త ﷺ ఉపదేశించారని, హుజైఫా رضي الله عنه ఉల్లేఖించారు: "అల్లాః మరియు ఫలానా కోరినట్లు అగును" అని చెప్పకండి. అల్లాః కోరినట్లు అగును. ఆ తరువాత ఫలానా కోరినట్లు అగును అని పలుకకండి". (అబూ దావూద్).

"అల్లాః మరియు నీ శరణు కోరుచున్నాను" అని అనుటను ఇబ్రాహీం నఖఇ (ఇస్లామీయ పండితులు) ఇష్టపడేవారు కాదు. "అల్లాః శరణు కోరుచున్నాను. మళ్ళీ ఫలాన వ్యక్తి శరణు" అనుట మంచిదే. "అల్లాః లేకుంటే, మళ్ళీ ఆయన లేకుంటే" అనవచ్చును. కాని "అల్లాః మరియు ఆయన లేకుంటే అనకూడదు".

## ముఖ్యాంశములు:

1- సూరె బఖరలోని "అన్ దాద్" యొక్క వ్యాఖ్యానం తెలిసింది.

2- షిర్క్ అక్బర్ గురించి అవతరించిన ఆయతు సంబధం షిర్క్ అస్గర్ తో ఉందని వ్యాఖ్యానించేవారు.
3- అల్లాహ్ యేతరుల ప్రమాణం చేయుట షిర్క్.
4- సత్యమైన విషయంలో అల్లాహ్ యేతరుల ప్రమాణం చేయుట "యమీనె గమూసు" (అల్లాహ్ నామంతో చేసే అబద్ధపు ప్రమాణం) కంటే మహా పాపమైనది.
5- "మరియు", "మళ్ళీ" పదాల్లో ఉన్న వ్యత్యాసం తెలిసింది.

## తాత్పర్యం:

31వ అధ్యాయంలో అల్లాహ్ ఆదేశం ﴿కొందరు అల్లాహ్ ను కాదని ఇతరులను ఆయనకు సమానులుగా, ప్రత్యర్థులుగా భావిస్తారు. వారు అల్లాహ్ పట్ల కలిగి వుండవలసిన ప్రేమతో వారిని ప్రేమిస్తారు﴾ ను ప్రస్తావించిన ఉద్దేశం ప్రార్థన, ప్రేమ, భయం మరియు ఆశ తదితర ప్రార్థనల్లో గల షిర్క్ అక్బర్ గురించి తెలుపడం జరిగింది.

అయితే ఈ అధ్యాయంలో అల్లాహ్ యేతరుల ప్రమాణం లాంటి వాజ్మాలిక షిర్క్, "అల్లాహ్ మరియు ఫలాన లేకుంటే...", "ఇది అల్లాహ్ తరఫున మరియు నీ తరఫున", "కాపాలాదారుడు లేకుంటే దొంగలు పడేవారు", ఫలానా ఔషదము లేకుంటే నేను చనిపోయేవాడిని", "ఫలాన సంపదలో ఫలాన అనుభవం, నైపుణ్యం లేకుంటే ఈ లాభం లభించేది కాదు" లాంటి మానవులను, అల్లాహ్ ను ఒకే స్థానంలో ఉంచే షిర్క్ అస్గర్ కు సంబంధించిన పదాలు తౌహీద్ కు వ్యతిరేకమైనవి. సర్వ కార్యాల సంబంధం, అవి సంభవించుట మరియు సర్వ సాధనాల, కారణాల లాభం అల్లాహ్ తరఫునుండే, ఆయన తలచినప్పుడే జరుగును అని విశ్వసించుట తప్పనిసరి. ఆ తరువాత అవి ఏ కారణాల వల్ల సంభవించినవో వాటిని, వాటి లాభాల్ని ప్రస్తావించవచ్చును. ఇలా అనాలి: "అల్లాహ్ లేకుంటే,

మళ్ళీ......." (కాని "మరియు" అనకూడదు). ఇలా ఎందుకనగా సర్వ కారణాలు సయితం అల్లాః వ్రాసిన విధి ప్రకారం సంభవించును.

## 43వ అధ్యాయం:

### అల్లాః నామ ప్రమాణంతో తృప్తి చెందని వ్యక్తి గురించి ఆదేశం

ప్రవక్త ﷺ ప్రవచించారని, ఇబ్ను ఉమర్ ﷺ ఉల్లేఖించారు: "మీరు మీ తాత ముత్తాతల నామములతో ప్రమాణాలు చేయకండి. అల్లాః నామం ప్రమాణం చేయువాడు సత్యంపలకాలి. ఎవరి కొరకు అల్లాః పేరున ప్రమాణం చేయబడిందో, అతను దాన్ని ఒప్పుకోవాలి. అతను దాన్ని ఒప్పుకొనక పోతే అల్లాఃతో అతనికి సంబంధం ఉండదు". (ఇబ్ను మాజ).

### ముఖ్యాంశాలు:

1- తాతముత్తాతల పేరున ప్రమాణం చేయుట నివారించబడింది.

2- ఎవరి ఎదుట (కోసం) అల్లాః పేరున ప్రమాణం చేయబడిందో అతను దాన్ని ఒప్పుకోవాలి.

3- ఒప్పుకొననివారికి హెచ్చరించడమైనది.

### తాత్పర్యం:

నీ ఎదుటివాడు సత్యవంతుడు, న్యాయశీలుడు మరియు మంచివాడు అని తెలిస్తే, అతను నీతో ఒక విషయంలో అల్లాఃపై ప్రమాణం చేస్తే నీవు తప్పక నమ్మాలి. ఎందుకనగా అతని సత్యతను తిరస్కరించడానికి నీ వద్ద ఏ ఆధారం లేదు.

ముస్లిములు అల్లాః గౌరవమర్యాదను ఏ విధంగా నమ్ముతారో దాని ఆధా-రంగా చూస్తే అల్లాః పేరున చేయబడిన ప్రమాణాన్ని వారు ఒప్పుకోవాలి.

అల్లాః పేరున ప్రమాణాన్ని స్వీకరించక తలాఖ్[1], లేక బద్ దుఆ (శాపము) యొక్క షర్తు పెట్టువారికి కూడ పైన పేర్కొన్న హెచ్చరిక వర్తిస్తుంది. ఎందుకనగా అది అల్లాః పట్ల ఉండవలసిన మర్యాదకు వ్యెతిరేకం. ఇంకా అల్లాః మరియు ఆయన ప్రవక్త ఆదేశాల్లో జోక్యం చేసినవాడవుతాడు.

ఎదుటివాడు అబద్ధములాడువాడు, పాపాత్ముడు అని స్పష్టం అయి-నప్పుడు అతని ప్రమాణాన్ని తిరస్కరించువానిపై ఆ హెచ్చరిక వర్తించదు. స్వయంగా అతని హృదయంలో అల్లాః పట్ల గౌరవమర్యాదలు లేవు.

## 44వ అధ్యాయం:

## అల్లాః కోరినట్లు మరియు నీవు కోరినట్లు అని పలుకవచ్చునా?

ఖుతైల ఉల్లేఖనం ప్రకారం: ప్రవక్త ﷺ వద్దకు ఒక యూదుడు వచ్చి "మీరు "అల్లాః కోరినట్లు మరియు నీవు కోరినట్లు" అని ఇంకా "కాబా ప్రమాణం" అని అల్లాఃతో షిర్క్ చేస్తారు అని అన్నాడు. అప్పుడు ప్రవక్త ﷺ తమ సహచరులకు ఇలా ఆదేశించారు: "ప్రమాణం చేయదలిచినప్పుడు "వరబ్బిల్ కాబా" (కాబా యొక్క ప్రభువు సాక్షి) అనండి. ఇంకా (అల్లాః కోరినట్లు మరియు నీవు కోరినట్లు అనకుండా) "అల్లాః కోరినట్లు తరువాత నీవు కోరినట్లు" అనండి".. (నసాయి).

---

(1) అంటే ఒక విషయం పై నీవు ప్రమాణం చేస్తే, ఎదుటివాడు దాన్ని నమ్మక, లేదు "అల్లాః ప్రమాణం! కాదు, ఈ మాట అబద్ధం అయితే నా భార్యకు విడాకులు, లేక నాపై శాపం కురుస్తుంది అని ప్రమాణం చేయు" అని అంటాడు. (ఇది తప్పుడు విధానం. ఇలాంటి వారి కొరకు పైన చెప్పబడిన హెచ్చరిక ఇవ్వబడింది).

ఇబ్నె అబ్బాస్ ﷺ కథనం: ఒక వ్యక్తి ప్రవక్తతో "అల్లాః కోరినట్లు మరియు మీరు కోరినట్లు" అని అన్నాడు. ప్రవక్త ఇది విని "ఏమిటి? నన్ను అల్లాఃతో సాటి కల్పిస్తున్నావా? అల్లాః మాత్రమే కోరినట్లు అని పలుకు" అని బోధించారు. (నసాయి).

ఆయిష రజియల్లాహు అన్హా యొక్క (తల్లి తరపున) సోదరుడు తుఫైల్ ఉల్లేఖించారు: "నేను యూదుల వద్దకు వచ్చినట్లు, ఈ విధంగా సంభాషించి నట్లు స్వప్నంలో చూసాను. "ఉజైర్ అల్లాః కుమారుడు అని మీరు చెప్పక పోతే మీరు మంచివారు" అని అన్నాను. అప్పుడు వారన్నారు: "అల్లాః కోరినట్లు, మరియు ముహమ్మద్ కోరినట్లు" అని మీరు చెప్పకపోతే మీరూ మంచివారు". మళ్ళీ నేను క్రైస్తవుల వద్దకు వెళ్ళాను. వారితో చెప్పాను: "యేసు అల్లాః కుమారుడు" అని చెప్పకపోతే, మీరు మంచివారు. అప్పుడు వారన్నారు: "అల్లాః కోరినట్లు, మరియు ముహమ్మద్ కోరినట్లు" అని మీరు చెప్పకపోతే మీరూ మంచివారు". తెల్లవారిన తరువాత ఈ విషయం కొందరికి తెలిపి, మళ్ళీ ప్రవక్త వద్దకు వచ్చి వారికీ తెలియజేసాను. "నీవు ఎవరికైనా ఈ విషయం చెప్పావా?" అని ఆయన అడిగారు. "అవును" అన్నాను. అప్పుడు ఆయన అల్లాః స్తోత్రములు పఠించి, ఇలా చెప్పారు: తుఫైల్ ఒక స్వప్నం చూశాడు. మీలో కొందరికి తెలిపాడు. మీరు ఒక మాట అంటుంటారు. దాన్ని నివారించకపోవడానికి ఫలాన, ఫలాన కారణం ఉండింది. ఇప్పుడు నివారిస్తున్నాను. ఇక మీరు "అల్లాః కోరినట్లు, మరియు ముహమ్మద్ కోరినట్లు" అని చెప్పకండి. "కేవలం అల్లాః కోరినట్లు" అని చెప్పండి.

## ముఖ్యాంశాలు:

1- యూదులకు చిన్న షిర్క్ గురించి తెలుసు.

2- మానవుడు తలచుకుంటే (సత్యం, అసత్యంలో) వ్యత్యాసం తెలుసుకోగలడు.

3- పై హదీసులో సహచరుడు అన్న మాటపై "ఏమిటి? నన్ను అల్లాఃతో సాటి

కల్పుతున్నావా?" అని ప్రవక్త అన్నారు. అయితే "యా అక్రమల్ ఖల్ ఖి మాలీ మన్ అలూజు బిహీ సివాక" (ఓ మానవుల్లో శ్రేష్ఠులైనవాడా!నేను మిమ్మల్ని కాదని ఇంకెవరి శరణు కోరాలి?) లాంటి పదాలు, కవిత్వాలు పాడువారిని వింటే ఇంకేమందురో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం!!.

4- "అల్లాః కోరినట్లు మరియు మీరు కోరినట్లు" అనుట షిర్కె అక్బర్ కాదు అని తెలుస్తుంది. ఎలా అనగా (ఒక వేళ అది షిర్కె అక్బర్ అయి ఉంటే) "ఇది వరకే దాన్ని నివారించేవాడిని కాని ఫలాన ఫలాన ఆటంకము ఉండేది అని ప్రవక్త అనేవారు కాదు.

5- మంచి స్వప్నం కూడా వహీ భాగాల్లో ఒకటి.

6- మంచి స్వప్నం కూడా ఒక్కప్పుడు కొన్ని ధార్మిక ఆధారాలకు కారణం అవుతుంది. (కాని ఇది ప్రవక్త జీవిత కాలం వరకే పరిమితం).

## 45వ అధ్యాయం:

## కాలాన్ని దూషించువారు, వాస్తవంగా అల్లాఃను బాధ పెట్టినవారే

﴾వారు ఇలా అంటారు: "జీవితం అంటే కేవలం మన ఈ ప్రాపంచిక జీవితం మాత్రమే. ఇక్కడే మన మరణం, ఇక్కడే మన జీవితం. కాల పరిభ్రమణం తప్ప, మనలను ఏదీ చంపలేదు﴿. **(45: జాసియ: 24)**.

అబూ హురైరా కథనం: అల్లాః ఇలా తెలిపాడని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచించారు: "ఆదము సంతానం (మానవులు) కాలాన్ని దూషిస్తూ నాకు బాధ కలిగిస్తున్నారు. నిజానికి కాలం కూడా నేనే. నేనే రాత్రిని, పగటిని ఒకదాని వెనుక మరొకటి వచ్చేలా త్రిప్పుతున్నాను". (బుఖారి: **4826.** ముస్లిం: **2985**). మరొక ఉల్లేఖనలో ఇలా ఉంది: "కాలాన్ని దూషించకండి. అల్లాఃయే కాలం (కాల చక్రం తిప్పువాడు)".

## ముఖ్యాంశాలు:

1- కాలాన్ని దూషించుట నివారించబడింది.

2- కాలాన్ని దూషించడాన్ని, ప్రవక్త ﷺ, అల్లాహ్ ను బాధపెట్టడమే అని అన్నారు.

3- "అల్లాహ్ యే కాలాన్ని (త్రిప్పువాడు)" అన్న విషయంపై శ్రద్ధ చూపాలి.

4- ఉద్దేశపూర్వకంగా కానప్పటికీ కొన్ని సమయాల్లో మానవుని నోట తిట్లు వెలువడుతాయి. (అలక్ష్యంగా ఉండవద్దు).

## తాత్పర్యం:

అజ్ఞాన కాలంలో ఇది చెలామణి ఉండినది. ఇప్పుడు అనేక పాపాత్ములు, బుద్ధిహీనులు, కాలం, వారి కోరికలకు వ్యతిరేకంగా ఉన్నట్లు చూసి కాలాన్ని తిడతారు. ఒక్కోసారి శాపనార్థాలు పెడుతారు. ఇది వారి ధర్మలోపం, బుద్ధి తక్కువ తనం వల్ల జరుగుతుంది. వాస్తవానికి "కాలం"చేతిలో ఏమీ లేదు. దానికి ఎలా ఆజ్ఞ అవుతుందో అలా నడుస్తుంది. దానిలో మార్పులు వివేకుడు, శక్తివంతుడైన అల్లాహ్ ఆజ్ఞ వల్ల సంభవిస్తాయి. అందుచేత ఇలా తిట్లు, దూషణలు దాన్ని త్రిప్పుతున్నవానికి బాధ కలిగించుతాయి.

ఇది ధర్మంలో లోటు, బుద్ధిలో కొరుతకు నిదర్శనం. దీని వల్ల విషయం మరింత గంభీరం అవుతుంది. సహనం ద్వారాలు మూయబడుతాయి. ఇది తౌహీద్ కు వ్యతిరేకం అవుతుంది.

అన్ని రకాల మార్పులు అల్లాహ్ నిర్ణయించిన, వ్రాసిన విధివ్రాత ప్రకారం సంభవిస్తాయని పూర్తి వివేకముతో విశ్వాసి గ్రహిస్తాడు. ఎందులో అల్లాహ్ ఆయన ప్రవక్త లోపము తెలుపలేదో అందులో అతను ఏ లోపము చూపడు. అల్లాహ్ యొక్క ప్రతి వ్యవహారంతో సంతృప్తి చెందుతాడు. ఆయన ఆజ్ఞను సంతోషంతో స్వీకరిస్తాడు. ఇలా అతడు మనశ్శాంతి, తృప్తి పొందుతాడు. అతని తౌహీద్ సంపూర్ణం అవుతుంది.

## 46వ అధ్యాయం:

### ఖాజియుల్ ఖుజాత్ లాంటి బిరుదులు ధర్మసమ్మతమేనా?

ప్రవక్త ﷺ ఉపదేశించారని, అబూ హురైరా రజి ఉల్లేఖించారు: "ఎవరైనా "మలికుల్ అమ్లాక్" అని పేరు పెట్టుకుంటే అది అల్లాః దృష్టిలో అతి నీచమైన పేరుగా పరిగణించబడుతుంది. అల్లాః తప్ప మరెవ్వడు రాజు కాడు". (బుఖారి. ముస్లిం).

"మలికుల్ అమ్లాక్" అంటే (రాజాధిరాజు) అని సుఫ్యాన్ అన్నారు.

మరొక ఉల్లేఖనలో ఉంది: "ప్రళయదినాన అందరికన్నా ఎక్కువ అల్లాః ఆగ్రహానికి గురయ్యేవాడు, నీచుడు..........." అని అర్థము.

### ముఖ్యాంశాలు:

1- 'రాజాధిరా'జు అనిపేరు పెట్టుకొనుట నివారించబడింది.

2- సుఫ్యాన్ చెప్పిన ప్రకారం 'రాజాధిరాజు' లాంటి పదాలు కూడా ఉపయోగించకూడదు.

3- ఎంత కఠినంగా దీన్ని నివారించబడిందో దాన్ని గ్రహించాలి. మనుస్సులో ఆ భావం లేకున్నా దాన్ని ఉపయోగించరాదు.

4- ఇది అల్లాః గౌరవ మర్యాదలకు వ్యెతిరేకముగా ఉన్నందున నివారించబడింది.

### తాత్పర్యం:

ఇది మరియు దీని తరువాత అధ్యాం, దీనికి ముందు అధ్యాయం యొక్క భాగమే. అదేమనగా మాటలు, చేష్టలు మరియు సంకల్పంలో ఎంత

మాత్రం అల్లాః తో ఇతరులను సాటి కల్పించవద్దు. ఏ ఒక్కరూ అల్లాః నామాల్లో, గుణాల్లో భాగస్వామ్యం చూపునటువంటి పేరు పెట్టకూడదు. ఉదాహరణకు: న్యాయాధిపతి. రాజాధిరాజు. సార్వభౌముడు. అబుల్ హకం లాంటివి. ఇవన్నియు తౌహీద్ మరియు అల్లాః నామాల, గుణాల రక్షణ కొరకు. మరియు ఏ పదాల ద్వారా అల్లాః హక్కుల్లో, ప్రత్యేకతల్లో ఇతరుల భాగస్వామ్యం ఉందని అనుమానం వస్తుందో అలాంటి షిర్క్ యొక్క సాధనాలను అంతమొందించుటకు చెప్పబడినవి.

## 47వ అధ్యాయం:

## అల్లాః నామాల పట్ల గౌరవం మరియు అందుకోసం పేరు మార్చుట

అబూ షురైహ్ కథనం: అతను 'అబుల్ హకం' అనే విశేష నామము (surname)తో పిలువబడేవారు. ప్రవక్త అతనికి ఇలా ఉపదేశించారు: "హకం అల్లాః మాత్రమే. హుకుం (ఆజ్ఞ, ఆదేశం) అతనిది మాత్రమే నడుస్తుంది". అప్పుడు అతనన్నాడు: "నా జాతివారు విబేధాల్లో పడినప్పుడు నా వద్దకు వచ్చేవారు. నేను వారి మధ్య తీర్పు చేసేవాణ్ణి. వారి రెండు వర్గములవారు నా తీర్పుతో సంతృప్తి పడేవారు. "ఇది చాలా మంచి విషయం. అయితే నీ సంతానం ఎవరెవరు?" అని అడిగారు ప్రవక్త. "షురైహ్", "ముస్లిం", "అబ్దుల్లా" అని నేను వివరించారు. "వారిలో పెద్ద ఎవరు?" అని అడిగారు ప్రవక్త. "షురైహ్" అని నేను చెప్పాను. "అయితే నీవు "అబూ షురైహ్" అని ప్రవక్త చెప్పారు. (అబూ దావూద్).

ముఖ్యాంశాలు:

1- అల్లాః నామములను, గుణాలను గౌరవించాలి. ఇతరుల కొరకు ఆ నామములను ఉపయోగించినప్పుడు ఆ భావం లేకున్నా సరే.

2- అల్లాః గౌరవంలో భాగముగా ఉన్న పేర్లను మార్చవచ్చును.

3- సర్ నేం (విశేష నామము) కొరకు పెద్ద కుమారుని పేరును ఎన్నుకోవాలి.

## 48వ అధ్యాయం:

### ఖుర్ఆన్, ప్రవక్త మరియు అల్లాః వచనములతో పరిహాసం

﴾మీరు చెప్పుకుంటూ ఉన్న విషయం ఏమిటి? అని ఒకవేళ వారిని అడిగితే, మేము సరదాగా వేళాకోళంగా మాట్లాడుకుంటున్నాము అని తక్షణం బదులు చెబుతారు. వారితో ఇలా అను: "మీ వేళాకోళం, అల్లాఃతోనా? ఆయన ఆయతులతోనా? ఆయన ప్రవక్తతోనా? ఇక సాకులు చెప్పకండి. మీరు విశ్వసించిన తరువాత అవిశ్వాసానికి పాల్పడ్డారు﴿. **(9: తౌబా: 65).**

అబ్దుల్లాః బిన్ ఉమర్, ముహమ్మద్ బిన్ కఅబ్, జైద్ బిన్ అస్లం మరియు ఖతాద రజియల్లాహు అన్హుంల కథనం: – వారి హదీసు పదాలు వేరు వేరు ఉన్నాయి కాని భావం ఒకటే – అది : తబూక్ యుద్ధంలో ఒక కపటవిశ్వాసి ఇలా అన్నాడు: "మా ఈ ఖుర్ఆన్ వేత్తల కంటే ఎక్కువ కడుపుగోరువారు, అసత్యులు మరియు యుద్ధమైదానము నుండి వెనకుండే వారెవరినీ మేము చూడలేదు". అంటే ప్రవక్త ఆయన సహచరులూ అని అతని ఉద్దేశం. ఇది విన్న వెంటనే ఔఫ్ బిన్ మాలిక్ "అలా కాదు! నీవు అబద్ధం పలుకుతున్నావు. నీవు మునాఫిఖ్ (కపటవిశ్వాసి). నీ ఈ విషయం తప్పక ప్రవక్తకు తెలుపుతాను" అని ప్రవక్త వద్దకు వెళ్ళారు. కాని ఆయనకు ముందే ప్రవక్త వద్దకు వహీ వచ్చింది. (ఆ విషయం ప్రవక్తకు తెలిసింది). ఆ

కపటవిశ్వాసి కూడ (సాకు చెప్పుటకు) వెనకే వచ్చాడు. అప్పుడే ప్రవక్త ప్రయాణ ఉద్దేశంతో ఒంటెపై ఎక్కారు. "ప్రవక్తా! మేము కేవలం ఉల్లాసానికి, ప్రయాణపు అవస్థ దూరుమగుటకు ఎగితాళి చేస్తుంటిమి" అని సాకులు చెప్ప సాగాడు. అబ్దుల్లాః బిన్ ఉమర్ రజియల్లాహు అన్హు ఇలా చెప్పారు: ఇప్పటికీ ఆ సంఘటన నా కళ్ళలో మెదులుతూ ఉంది: అతను ప్రవక్త ఒంటె పల్లము యొక్క త్రాడు పట్టుకొని 'మేము పరియాచకము చేస్తుంటిమి' అని అంటున్నాడు. ప్రవక్త అతనికి జవాబులో ﴾మీ వేళాకోళం, అల్లాఃతోనా, ఆయన ఆయతులతోనా, ఆయన ప్రవక్తతోనా?﴿ ఈ వాక్యం మట్టుకు వినిపిస్తున్నారు. అతని వైపు తిరిగి చూడనూ లేదు. దానికి మించి ఒక్క అక్షరం పలుకనూ లేదు. (ఇబ్నె జరీర్: **10/119.** ఇబ్నె అబీ హాతిం).

## ముఖ్యాంశాలు:

1- ఇందులో తెలిసిన ముఖ్య విషయమేమనగా ఎవరు ఇస్లాంకు సంబంధిత విషయాలతో ఎగితాళి చేస్తాడో అతడు అవిశ్వాసుడవుతాడు.

2- ఎగితాళి చేయువారెవరైనా సరే, పై వాక్యం వెలుగులో అతను (అవిశ్వాసానికి ఒడిగట్టినట్లే).

3- చాడీలు చెప్పడం, మరియు అల్లాః ఆయన ప్రవక్త పట్ల శ్రేయోభిలాష చూపడంలో చాలా వ్యత్యాసం ఉంది. (అంటే ఔఫ్ బిన్ మాలిక్, ఆ వంచకుని విషయం, ప్రవక్తకు తెలుపుట, చాడీల్లో లెక్కించబడదు).

4- స్వయం అల్లాః ప్రేమించునటువంటి మన్నింపు, క్షమాపణ మరియు అల్లాః శత్రువులపై కఠినత్వం చూపుటలో చాలా తేడా ఉంది.

5- కొన్ని సందర్భాల్లో సాకులు ఒప్పుకోబడవు.

### తాత్పర్యం:

ఖుర్ఆన్, ప్రవక్త మరియు అల్లాః నామ స్మరణ ఎందులో ఉందో వాటితో పరిహాసమాడటం విశ్వాసానికి వ్యతిరేకం. ధర్మభ్రష్టతకు కారణం. అల్లాఃను, ఆయన ప్రవక్తలను, గ్రంథాలను విశ్వసించడం, వాటిని గౌరవించడం మరియు మర్యాద చూపడం ధర్మం, మరియు విశ్వాస భాగమే. ఎగితాళి, పరిహాసం శుద్ధ అవిశ్వాసం కన్నా చాలా భయంకరమైనది. ఎందుకనగా ఇది అవిశ్వాసమే గాకుండా ధర్మంతో పరిహాసము చేయడం కూడా అవుతుంది.

అవిశ్వాసులు రెండు రకాలు: (1). తిరస్కారులు. (2). అభ్యంతరము, ఆక్షేపము చేసేవారు.

ఇందులో రెండో రకంవారే అల్లాః ఆయన ప్రవక్తతో యుద్ధానికి సిద్ధమైనవారు. వారే అల్లాః ధర్మంలో, ఆయన ప్రవక్త విషయంలో, అనవసర జోక్యం చేసుకుంటూ విమర్శలు, ఆక్షేపములు చేస్తూ ఉంటారు. ఇలాంటి వారే కఠిన అవిశ్వాసులు, మహాకల్లోలం, కలతలు సృష్టించేవారు.

## 49వ అధ్యాయం:

**అల్లాః ఆదేశం: ﴿కష్టకాలం తీరిపోయిన తరువాత, మేము అతనికి మా కారుణ్యాన్ని రుచి చూపినప్పుడు ఇలా అంటాడు, "నేను అసలు దీనికి అర్హుణ్ణే"﴾. (41: హామీమ్ అస్సజ్దా: 50).**

పై ఆయతులో "నేను అసలు దీనికే అర్హుణ్ణి" అనే పదాన్ని వ్యాఖ్యానిస్తూ ముజాహిద్ రహిమహుల్లాః చెప్పారు: "ఇది నా కష్టార్జితం. దీనికి నేను అర్హుణ్ణే".

ఇబ్నె అబ్బాస్ ఇలా వ్యాఖ్యానించారు: ఈ సంపద నా దగ్గరిదే.

సూరె ఖసస్‌లోని వాక్యం ﴾ఖారూన్ అన్నాడు: "నాకు లభ్యమైన జ్ఞానం మూలంగానే ఇదంతా నాకు ఇవ్వబడింది"﴿ (28: 78)ను వాఖ్యానిస్తూ ఖతాద రహిమహుల్లాః చెప్పారు: వ్యాపారంలో నాకున్న ప్రావీణ్యత, అనుభవం ద్వారా ఈ ధనం లభ్యమైంది.

మరి కొందరు వ్యాఖ్యానికులు ఇలా చెప్పారు: నేను దీనికి అర్హుణ్ణి అని అల్లాః కు తెలుసు కనుక ఇది నాకు లభించింది.

ముజాహిద్ రహిమహుల్లాః చెప్పింది ఇదే భావం: నా ఉన్నతి, గౌరవాన్నిబట్టి ఇది నాకు ఇవ్వబడింది.

అబూ హురైర రజియల్లాహు అన్హు కథనం: ఆయన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పగా విన్నారు: "పూర్వ ఇస్రాఈల్ సంతతిలో ఒక కుష్టు రోగి, ఒక అంధుడు మరియు ఒక బట్టతలవాడు ఉండేవారు. ఆ ముగ్గురిని పరీక్షించాలన్న ఉద్దేశంతో అల్లాః వారివద్దకు ఒక దూతను పంపాడు. అతను కుష్టురోగి వద్దకు వచ్చి, "నీకు అతి ప్రియమైనదేమిటి?" అని అడిగాడు. దానికా కుష్టురోగి "అందమైన రంగు, చర్మం. ముందు ఈ వ్యాధిపోవాలి. దీని మూలంగానే జనం నన్ను అసహ్యించుకుంటున్నారు" అని అన్నాడు. దైవదూత అతని శరీరాన్ని స్పృశించాడు. దాంతో అతని కుష్టురోగం తొలిగి పోయి అందమైన చర్మం, ఆకర్షవంతమైన రంగు లభించాయి. అప్పుడు దైవదూత అతనితో "నీకెలాంటి సంపద అంటే ఇష్టం"? అని అడిగాడు మళ్ళీ. దానికా వ్యక్తి "నాకు ఒంటెలంటే ఇష్టం" అని అన్నాడు. వెంటనే అతనికి పది నెలల సూడి ఒంటె ప్రసాదించబడినది. దైవదూత అతణ్ని ఆశీర్వదిస్తూ "అల్లాః నీ పశుసంపదలో శుభాభివృధ్ధులు ప్రసాదించుగాక" అని అన్నాడు.

ఆ తరువాత దైవదూత బట్టతలవాడి దగ్గరకు వెళ్ళి "నీకు అన్నిటికంటే ఎక్కువ ఏది ఇష్టం?" అని అడిగాడు. "నాకు అందమైన శిరోజాలంటే ఇష్టం.

నా బట్టతలను చూసి జనం నన్ను అసహ్యించుకుంటున్నారు. అందుచేత ముందు ఈ బట్టతల తొలిగి పోయి మంచి వెంట్రుకలు రావాలి" అన్నాడు. దైవదూత తన చేతితో అతని తల నిమిరాడు. దానితో అతని బట్టతలపై అందమైన వెంట్రుకలు వచ్చేశాయి. "మరి నీకెలాంటి సంపదంటే ఇష్టం?" అని అడిగాడు దైవదూత మళ్ళీ. దానికా వ్యక్తి "నాకు ఆవులంటే మహా యిష్టం" అన్నాడు. వెంటనే దైవదూత అతనికి సూడి ఆవు ఇచ్చేశాడు. పైగా "అల్లాః నీ ఈ పశుసందపలో శుభాభివృద్ధులు కలిగించుగాకా" అని దీవించాడు.

ఆ తరువాత దైవదూత అంధుడి దగ్గరకు వెళ్ళి "నీకు అన్నిటికంటే ఎక్కువ ఇష్టమైన వస్తువేది?" అని అడిగాడు. దానికా వ్యక్తి "అల్లాః నాకు దృష్టి ప్రసాదిస్తే లోకవాసులను చూడగలను" అని అన్నాడు. దైవదూత అతని కళ్ళపై చెయ్యి తిప్పాడు. అల్లాః అతనికి దృష్టి ప్రసాదించాడు. అప్పుడు దైవదూత "సరే, నీకు ఎలాంటి సంపద అంటే ఇష్టం?' అని అడిగాడు. దానికా వ్యక్తి "నాకు మేకలంటే ఇష్టం" అని అన్నాడు. దైవదూత అతనికి సూడి మేక ఇచ్చాడు.

కొంతకాలంలో దైవదూత ఇచ్చిన ఒంటె, ఆవు, మేక ప్రసవించి పశుసంపద వృద్ధి చెందింది. కుష్టురోగి దగ్గర ఒంటెల మంద, బట్టతల వాని దగ్గర ఆవుల మంద, అంధుని దగ్గర మేకల మందలు వృద్ధి చెందాయి.

కొంత కాలం గడిచిన తరువాత ఆ దైవదూత ఇది వరకటి లాగే మానవాకారంలో (ఒకప్పటి) కుష్టురోగి దగ్గరకు వచ్చి "నేనొక పేదవాడిని, ప్రయాణంలో నా ప్రయాణసామాగ్రి అంతా ఖర్చు అయినది. ఇప్పుడు నేను అల్లాః (దయ), తరువాత నీ సహాయం లేకుండా నా యింటికి కూడా చే రుకోలేని పరిస్థితి వచ్చింది. అందుచేత నీకు అందమైన దేహం, రూపం, సిరిసంపదలు ప్రసాదించిన అల్లాః పేరుతో అర్థిస్తున్నాను. నాకొక ఒంటెను దానం చెయ్యి. దాని మీద సవారీ చేసి నేను నా ఇంటికి చేరుకుంటాను" అని అన్నాడు. దానికా కుష్టురోగి (తన గత జీవితాన్ని విస్మరించి) ప్రస్తుతం నా

బాధ్యతలు, ఖర్చులు బాగా పెరిగిపోయాయి (నేను నీకు ఎలాంటి సహాయం చేయలేను)" అని అన్నాడు. దైవదూత ఈ మాటలు విని "బహుశా నేను నిన్ను గుర్తుపట్టాననుకుంటా. నీవు గతంలో కుష్టురోగిగా ఉండేవాడివి కదూ?. దాని వల్ల జనం నిన్ను అసహ్యించుకునేవారు. నీవు పేదవాడిగా ఉంటే, అల్లాః నీకు ఈ సంపద ప్రసాదించాడు. ఔను కదూ?" అని అన్నాడు. కుష్టురోగి (ఈ వాస్తవాలను అంగీకరించకుండా) ఈ సిరి సంపదలు తరతరాల నుంచి వస్తూ నాకు వారసత్వంలో లభించాయి" అని అన్నాడు. దానికి దైవదూత "నీవు చెప్పింది అబద్ధమయితే అల్లాః నిన్ను తిరిగి పూర్వస్థితికి చేర్చుగాక!" అని శపించాడు.

ఆ తరువాత దైవదూత తన మొదటి రూపంలోనే బట్టతల వాని దగ్గరకు వెళ్ళి, కుష్టురోగితో అన్న మాటలే అతనితో కూడా అన్నాడు. దానికి బట్టతల వాడు కూడా కుష్టురోగి ఇచ్చినటువంటి సమాధానమే ఇచ్చాడు. దైవదూత అతడ్ని కూడా శపిస్తూ "నీవు చెప్పింది అబద్ధమయితే అల్లాః నిన్ను పూర్వ స్థితికి తిరిగి చేర్చుగాక!" అని అన్నాడు.

అక్కడి నుండి దైవదూత తన మొదటి ఆకారంలోనే అంధుని దగ్గరకు వెళ్ళి "నేనొక నిరుపేదను, బాటసారిని, నా ప్రయాణ సామగ్రి అంతా అంతమయిపోయింది. ప్రస్తుతం నేను అల్లాః (దయ), తరువాత నీ సహాయం లేకుండా నా ఇంటికి చేరుకోలేని పరిస్థితి వచ్చింది. అందుచేత నీకు దృష్టి ప్రసాదించిన అల్లాః పేరుతో అర్థిస్తున్నాను. నాకొక మేకను ఇవ్వు. దాంతో నేను నా ప్రయాణాన్ని కొనసాగిస్తాను" అని అన్నాడు. దానికా అంధుడు సమాధానమిస్తూ "నిజమే, నేను అంధుడిగా ఉన్నప్పుడు అల్లాః నాకు దృష్టి ప్రసాదించాడు. నేను పేదవాడిగా ఉన్నప్పుడు ఆయన నన్ను ధనికుడిగా చేశాడు. నేనాయన పట్ల కృతజ్ఞతగా నా ఆస్తిలో నీవు కోరుకున్నది తీసుకునే అధికారం నీకిస్తున్నాను, అల్లాఃసాక్షి! ఈ రోజు నీవు అల్లాః పేరుతో (నా ఆస్తిలో) ఏది తీసుకున్నా దానికి నేనెలాంటి అభ్యంతరం

చెప్పను (నీవు నిస్సంకోచంగా తీసుకో)" అని అన్నాడు. దైవదూత ఈ మాటలు విని "నీ సంపద నీకే శుభప్రదం (నాకేమీ అవసరం లేదు). ఇది ఒక పరీక్ష మాత్రమే. (ఇందులో నీవు నెగ్గావు) తత్ఫలితంగా అల్లాః నీ పట్ల ప్రసన్నుడయ్యాడు. (ఈ పరీక్షలో) నీ సహచరులిద్దరు (విఫలమయి) అల్లాః ఆగ్రహానికి గురయిపోయారు" అని అన్నాడు. (బుఖారి. ముస్లిం. లూలు వల్ మర్జాన్: 1868).

## ముఖ్యాంశాలు:

1- ఈ అధ్యాయంలోని మొదటి వాక్యం యొక్క వ్యాఖ్యానం.
2- "నేను అసలు దీనికే అర్హుణ్ణి" యొక్క భావం.
3- "నాకు లభ్యమైన జ్ఞానం మూలంగానే ఇదంతా నాకు ఇవ్వబడింది" యొక్క భావం.
4- ఈ విచిత్రమైన వృత్తాంతములో చాలా గొప్ప గుణపాఠాలున్నవి.

## తాత్పర్యం:

ఈ అధ్యాయం ద్వారా తెలిసేదేమిటంటే: ఏ వ్యక్తి తనకు లభించిన అనుగ్రహం, ఉపాధి స్వయంగా తన కృషి, జ్ఞానం, నైపుణ్యంతో లభించి ందని భావిస్తాడో, లేక అతను దానికి అర్హుడని, తనకు ఇలా ప్రసాదించడం అల్లాః విధి అని అనుకుంటాడో, ఇలా అనుకొనుట, భావించుట తౌహీద్ కు వ్యెతిరేకం. ఎందుకనగా స్వచ్ఛమైన విశ్వాసి తనపై ఉన్న అల్లాః యొక్క అన్ని అనుగ్రహాలను అవి బాహ్యంగా ఉన్నా, గుప్తంగా ఉన్నా, అవి అల్లాః దయతో, ఆయన తరఫు నుండి అని విశ్వసించి, అందుకు అల్లాః స్తోత్రము పఠిస్తాడు. అల్లాః విధేయతలో వాటి సహకారం పొందుతాడు. ఇలా లభించడం అల్లాః పై ఉన్న తన హక్కు అని భావించడు. అన్ని హక్కులు అల్లాఃకే ఉన్నాయి. అతడు కేవలం అల్లాః దాసుడు. ఇలా తౌహీద్ విశ్వాసం

పరిపూర్ణమవుతుంది. దీనికి వ్యతిరేకమై కృతఘ్నత అవుతుంది. అహంకారం, మనోవాంఛల అనుసరణ తప్పుల్లో అతి పెద్దది.

## 50వ అధ్యాయం:

అల్లాః ఆదేశం: ﴿అప్పుడు అల్లాః వారికి ఒక చక్కని, ఏ లోపమూ లేనటువంటి పిల్లవాణ్ణి ప్రసాదించాడు. కాని వారు ఆయన ప్రసాదించిన ఈ కానుక విషయంలో ఇతరులను ఆయనకు భాగస్వాములుగా చేయసాగారు﴾.

**(7: ఆరాఫ్: 190).**

ఇబ్న హజం చెప్పారు: ఏ పేరులో 'అల్లాఃయేతరుల దాసుడు' అన్న భావం వస్తుందో అది నిషిద్ధం అని ఏకీభవించబడినది. ఉదాహరణకు: అబ్దు అమర్, అబ్దుల్ కాబ మొదలైనవి. కాని ప్రవక్త తాత 'అబ్దుల్ ముత్తలిబ్' పేరు ఇలాంటిది కాదు. (అయినా ఎవరు ఆ పేరు పెట్టవద్దు).

ముఖ్యాంశాలు:

1- అల్లాఃయేతరులకు దాసుడు అన్న భావం గల పేరు చేర్చుట నిషిద్ధం.
2- పై వాక్యం యొక్క వ్యాఖ్యానం తెలిసింది.
3- అసలు భావం ఉద్దేశించక పోయినా కేవలం పేరు మూలంగా షిర్క్ అవుతుంది.
4- ఏ అంగవైకల్యం లేకుండా సంతానం కలగడం కూడా అల్లాః యొక్క గొప్ప దయ.
5- విధేయతలో గల షిర్క్, ఆరాధనలో గల షిర్క్ మధ్య సలఫే సాలిహీన్ (సత్పురుషులైన పూర్వీకులు) వ్యత్యాసం పాటించేవారు.

## 51వ అధ్యాయం:

అల్లాః ఆదేశం: ﴾అల్లాః మంచి పేర్లకు అర్హుడు. ఆయనను మంచి పేర్లతోనే వేడుకోండి. ఆయనను మంచి పేర్లతో పిలిచే విషయంలో సత్యం నుండి వైదొలగేవారిని వదలి పెట్టండి﴿. (7: ఆరాఫ్: 180).

పై ఆయతులో "వైదొలగేవారిని" అంటే షిర్క్ చేసేవారిని అని అబ్దుల్లాః బిన్ అబ్బాస్ రజియల్లాహు అన్హు చెప్పారని ఇబ్ను అబీ హాతిం తెలిపారు.

ఇబ్ను అబ్బాస్ రజియల్లాహు అన్హు చెప్పారు: ముష్రికులు తమ దేవతల్లో 'లాత్' పేరు అల్లాఃతో, 'ఉజ్జా' పేరు 'అజీజ్'తో పెట్టారు. (ఇది కూడ ఒక షిర్క్ లాంటి విషయమే).

అఅ్ మష్ చెప్పారు: అల్లాః తన కొరకు తెలుపని పేర్లు, ఆయనకున్నవని తెలుపుట కూడా సత్యం నుండి వైదొలగినవారిలో పరిగణించబడుతారు.

### ముఖ్యాంశాలు:

1- అల్లాఃకు అనేక నామములు గలవు.

2- అల్లాఃకు గల నామములన్నియూ సుందరమైనవే.

3- ఆ నామములతో వేడుకోవాలని (ప్రార్థించాలని) ఆదేశించబడింది.

4- అందులో వక్ర మార్గాన్ని అవలంభించిన మూర్ఖుల నుండి దూరముండాలి.

5- అల్లాః నామాల్లో సత్యం నుండి వైదొలగుట అంటేమిటో తెలిసింది.

6- అందులో సత్యం నుండి వైదొలగినవారికి కఠిన హెచ్చరిక గలదు.

తాత్పర్యం:

అల్లాః స్వయంగా తన కొరకు మరియు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాః కొరకు తెలిపిన మంచి నామములను విశ్వసించుటయే తౌహీద్ యొక్క మూలం. అదే విధంగా వాటి గొప్ప భావాల, అందులో ఉన్న సూక్ష్మ విషయాల జ్ఞానం తెలుసుకొనుట. వాటితో అల్లాఃను వేడుకొనుట, ఆరాధించుట కూడా తప్పనిసరి.

మానవుడు ఎప్పుడు దుఆ చేసినా - అది తన ప్రాపంచిక, పరలోక (ఏ దాని గురించైనా) అల్లాః నామాల్లో తన అవసరానికి తగిన నామము యొక్క ఆధారంతో దుఆ చేయాలి. ఉదాహరణకు: ఉపాధి కొరకు దుఆ చేయునప్పుడు "రజ్జాఖ్" (ఉపాధినిచ్చేవాడు) నామముతో, కరుణ, క్షమాపణ కోరినప్పుడు "రహీం" (నిరంతరం కనికరం చూపేవాడు), "రహ్మాన్" (అనంత కరుణ జూపేవాడు), "బర్" (మహోపకారి), "కరీం" (అనుగ్రహించేవాడు), "అఫువ్వ్" (అత్యధికంగా మన్నించేవాడు), "గఫూర్" (అత్యధికంగా క్షమించేవాడు), "తవ్వాబ్" (పాపుల పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాడు) లాంటి నామములతో దుఆ చేయవలెను.

ఆరాధనా రీత్యా ఆయన నామములను, గుణవిశేషాలతో వేడుకొనుట మరీ ఉత్తమం. వేడుక సందర్భంలో నామముల భావాల్ని మనస్సులో తెచ్చుకోవాలి. హృదయాంతరంలో వాటి ప్రభావం దిగిపోవాలి.

ఉదాహరణకు: మహత్యం, గౌరవం, ఘనత, వైభవం గల పేర్లతో ఆయన గౌరవం, మహత్యం మనస్సులో నిండిపోవాలి.

ఉపకారం, కనికరం భావాలుగల ఆయన నామములతో ఆరాధించినప్పుడు మనస్సు ఆయన ప్రేమ, కృతజ్ఞతా భావంతో నిండిపోవాలి.

విద్య, వివేకం, అధికారం, శక్తి భావంగల పేర్లతో మనస్సు ఆయన భయభీతి, ఆయన ఎదుట వినమ్రతతో నిండిపోవాలి.

సూక్ష్మ జ్ఞానం, దృష్టి భావంగల నామములతో మనస్సులో ఆయన తన చేష్ట-లను చూస్తున్నాడన్న, తన దుస్సంకల్పం, దురుద్దేశాన్ని గమనిస్తున్నాడన్న భయం కలగాలి.

అక్కరలేనివాడు, ఇతర అవసరాలను తీర్చువాడు అన్న భావంగల నామములతో వేడుకుంటూ అన్ని సందర్భాల్లో ఆయన వైపునకు మరలే గుణం మనస్సులో కలగాలి.

అల్లాః నామగుణాలను తెలుసుకున్నప్పుడే హృదయానికి ఆ ప్రభావం కలుగుతుంది.

అల్లాః నామగుణాల విషయంలో, సత్యం నుండి వైదొలుగుట, పైన తెలిపినవాటికి బద్ధ విరుద్ధం. దాని రకాలు:-

వాటి అర్థాల్ని, భావాల్ని తిరస్కరించే ధైర్యం "జహ్మియా" అను ఒక వర్గం చేసింది.

లేక సృష్టి గుణాలతో పోల్చటం. ఇలా "రాఫిజ"లోని ఒక వర్గం చేసింది. అందుకు వారిని ముషబ్బిహ అంటారు.

లేక సృష్టిలోని కొందరికి అలాంటి పేర్లు పెట్టుట. ఇలా 'ముష్రికులు' చేశారు. అల్లాః యొక్క పేరు ఇలాహ్ తో లాత్, అజీజ్ తో ఉజ్జా, మన్నాన్ తో మనాత్ అని తమ దేవతల పేర్లు పెట్టుకున్నారు. ఆ తరువాత అల్లాఃకు గల ప్రత్యేక హక్కులు వారికి ఇచ్చేశారు.

ఈ రూపాల్లో ఏ ఒక్కటి సంభవించినా అల్లాః పేర్లలో సత్యం నుండి వైదొలిగినట్లే.

పదాల్లో, వాటి భావంలో మార్పు చేయుట. దానికున్న సరియైన భావాన్ని వదలి వక్ర భావం తెలుపుట. ఇవన్నియు తౌహీద్ కు వ్యతిరేకం.

## 52వ అధ్యాయం:

### 'అల్లాహ్‌కు సలాం' అని చెప్పరాదు

అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్ రజియల్లాహు అన్హు కథనం: మేము ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో నమాజు చేసినప్పుడు "తన దాసుల తరఫున అల్లాహ్‌కు సలాం. ఫలాన వ్యక్తిపై సలాం" అని అనేవాళ్ళము. అప్పుడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పారు: "అల్లాహ్‌కు సలాం అని చెప్పకండి. అల్లాహ్ స్వయముగా సలాం (శాంతినిచ్చువాడు". (బుఖారి, ముస్లిం).

### ముఖ్యాంశాలు:

1- సలాం యొక్క వివరం తెలిసింది.

2- 'సలాం' అనునది ఒక దుఆ, మరియు కానుక.

3- అల్లాహ్‌కు సలాం అని పలుకుట యోగ్యం కాదు.

4- దాని కారణం కూడా తెలిసింది.

5- అల్లాహ్ కొరకు ఎలాంటి సలాం తగినదో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన అనుచరులకు నేర్పారు. (అదియే అత్తహియ్యాతు లిల్లాహి వస్సలవాతు ......).

### తాత్పర్యం:

"అల్లాహ్‌యే సలాం ప్రసాదించువాడు" అని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం విశదీకరించారు. అల్లాహ్ సుబ్‌హానహు వతఆలా అన్ని రకాల లోపాలకు, దోషాలకు అతీతుడు. ఆయన సృష్టిలో ఒకరితో పోలినవాడు కాడు. తన దాసులను ఆపదల, కష్టాల నుండి రక్షించేవాడు కూడా ఆయనే. మానవులు అతనిని ఏ మాత్రం నష్ట పరచలేరు. ఏదైనా లాభం చేకూర్చాలన్నా, చేకూర్చలేరు. వారే అల్లాహ్ అవసరం కలవారు. వారి సర్వ

వ్యవహారాల్లో ఆయన అక్కర కలవారు. కాని ఆయన మాత్రం సర్వసంపన్నుడు. స్వయంగానే స్తుతిపాత్రుడు, నిస్సహాయుడు.

## 53వ అధ్యాయం:

### "అల్లాః నీకు ఇష్టమైతే నన్ను క్షమించు" అని చెప్పరాదు

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశించారని, అబూ హురైరా రజియల్లాహు అన్హు ఉల్లేఖించారు: "అల్లాః నీవు కోరితే క్షమించు. నీవు కోరితే కరుణించు. అలా కాకుండా దృఢ నమ్మకంతో, స్పష్టంగా అర్థించండి. అల్లాఃను ఎవరు బలవంతం పెట్టలేరు". (బుఖారి. ముస్లిం. లూలు: 1716). మరొక ఉల్లేఖనలో ఉంది: "తన పెద్ద పెద్ద కోరికలను కూడా ఆయనతోనే కోరుకోవాలి. ఎందుకనగా అల్లాః వద్ద ఏ వస్తువూ పెద్దదీ కాదు".

### ముఖ్యాంశాలు:

1- దుఆ చేస్తున్నప్పుడు "నీకు ఇష్టమైతే" అనకూడదు.

2- దాని నివారణకు కారణం కూడా తెలుపబడింది.

3- పూర్తి నమ్మకంతో దుఆ చేయాలని ఆదేశించబడింది.

4- పెద్ద పెద్ద కోరికలైనా ఆయన ముందే ఉంచాలని ఆదేశించబడింది.

5- దీని కారణం కూడా తెలియజేయబడింది.

### తాత్పర్యం:

అన్ని పనులు, వ్యవహారాలు అల్లాః కోరిన ప్రకారం, ఆయన ఇష్టంతోనే జరుగును. అయినా మానవుడు తన ధార్మిక సంబంధమైన కరుణ, క్షమాపణ లాంటివి, ధార్మిక విషయాల్లో సహాయపడే ఐహిక సంబంధమైన ఆరోగ్యం,

ఉపాధి మొదలైనవి అల్లాహ్‌తో పూర్తి నమ్మకం మరియు దృఢ నిశ్చయంతో అర్థించవలెను. ఇలాంటి వేడుకోలు, యాచన, అర్థింపుయే ఆరాధన, ఉపాసనకూ మూలం.

పెద్ద కోరికలను ఆయన ముందు ఉంచితే (నఊజుబిల్లాః) ఆయన తీర్చలేడు అని కాదు. అందుకే చిన్నదైనా, పెద్దదైనా ఏ దానికైనా అల్లాహ్‌నే వేడుకోవాలి.

ఇందులో, మరియు కొన్ని దుఆలలో మానవుడు అల్లాః ఇష్టం పై వదులుకునే విషయంలో చాలా వ్యత్యాసం ఉంది. ఉదాహరణకు: "ఓ అల్లాః నాకు జీవితం మేలుంటేఅది ప్రసాదించు. చావు మేలుంటే అది ప్రాప్తిచేయు. మరియు దుఆయే ఇస్తిఖారా లాంటివి.

ఇందులో ఉన్న వ్యత్యాసాన్ని జాగ్రత్తగా గమనించే ప్రయత్నం చేయాలి. భవిష్యత్తులో మేలుంటుందా లేదా, మానవునికి తెలియదు. అందుకు దానికి సంబంధించినదేదైనా అర్థించినప్పుడు అల్లాః ఇష్టంపై వదలాలి. కాని మానవుడు తనకు లాభంగలదని నిశ్చయింగా తెలిసినది అడిగినప్పుడు పూర్తి నమ్మకంతో అడగాలి.

## 54వ అధ్యాయం:

## నా దాసుడు, నా దాసి అని పిలువరాదు

అబూ హురైర ﷺ ఉల్లేఖనం ప్రకారం, ప్రవక్త ﷺ ఇలా ఉపదేశించారు: "మీలోనెవరు (తన సేవకునితో) నీ ప్రభువుకు అన్నం వడ్డించు. నీ ప్రభువుకు వుజూ చేయించు అని చెప్పకూడదు. దానికి బదులు మీ నాయకునికి లేక యజమానికి వడ్డించు, వుజూ చేయించు అని చెప్పాలి. అలాగే మీలోనెవరు (తమ సేవకునితో) "నా దాసుడా, నా దాసి" అని పిలువరాదు. దానికి బదులు నా బాలుడా, నా సేవకుడా లేక నా బాలికా అని పిలవాలి".(బుఖారి. ముస్లిం.).

## ముఖ్యాంశాలు:

1- నా దాసుడా, నా దాసి అని చెప్పవద్దు.

2- సేవకుడు తన యజమానితో నా ప్రభువు అని చెప్పవద్దు. నీ ప్రభువుకు అన్నం వడ్డించు అని చెప్పవద్దు.

3- మొదటి దానికి బదులు నా బాలుడా లేక నా బాలికా లేక నా సేవకుడా అని పిలవాలి.

4- రెండవ దానికి బదులు నా నాయకుడు, నా యజమని అని చెప్పాలి.

5- ఈ హెచ్చరిక ఉద్దేశం ఏమనగా మనము ఉపయోగించే పదాలలో కూడా 'తౌహీద్' పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

## తాత్పర్యం:

నా దాసుడా, నా దాసి అనే బదులు నా బాలుడా, నా బాలిక అనడం అభిలషణీయం. ఇది కేవలం సందేహం, అనుమానం నుండి దూరముండుటకు. అలా ఆనడం నిషిద్ధమేమి లేదు. కాని మర్యాద, పదాలు కూడా మంచివి ఉపయోగించడంలో ఉన్నది. మరియు పదాల్లో కూడా మర్యాద పాటించడం ఇఖ్లాసు (స్వచ్ఛత)కు నిదర్శనం. ఇలాంటి పదాల్లో ఈ జాగ్రత్త ఎంతైనా అవసరం.

## 55వ అధ్యాయం:

## అల్లాః పేరుతో యాచించేవారిని వట్టి చేతులతో పంపకూడదు

ప్రవక్త ﷺ ప్రవచించారని అబ్దుల్లాః బిన్ ఉమర్ ؓ ఉల్లేఖించారు: "అల్లాః పేరుతో అడిగినవాడికి ఇవ్వండి. అల్లాః పేరుతో శరణు కోరినవాడికి శరణు

ఇవ్వండి. మిమ్మల్ని ఆహ్వానించినవారి ఆహ్వానాన్ని స్వీకరించండి. మీకు ఒకరు మేలు చేస్తే, మీరు తిరిగి వారికి అలాగే మేలు చేయండి. బదులు ఇవ్వడానికి మీ వద్ద ఏమి లేనిచో మీరు వారికి బదులు తీరినాము అన్నంత తృప్తి కలిగే వరకు వారి కోసం అల్లాఃతో దుఆ చేయండి". (అబూ దావూద్ ..).

## ముఖ్యాంశాలు:

1- అల్లాః పేరుతో శరణు కోరువారికి శరణు ఇవ్వాలి.
2- అల్లాః పేరుతో అడిగినవారికి ఇవ్వాలి.
3- ఆహ్వానం స్వీకరించాలి.
4- ఎవరైనా ఉపకారం చేస్తే వారికి బదులు ఇవ్వాలి.
5- బదులు ఇచ్చే శక్తి లేకుంటే వారి కొరకు దుఆ చేయాలి.
6- బదులు ఇచ్చినాము అన్నంత తృప్తి కలిగే వరకు దుఆ చేయాలి.

## తాత్పర్యం:

అన్నిటిలో గొప్ప ఆధారం, అల్లాః పేరుతో ఒకరు ఏదైనా అడిగినప్పుడు, అల్లాః యొక్క గౌరవము, మర్యాద దృష్టిలో ఉంచుకొని, అడిగిన వాని హక్కు తనపై ఉన్నదన్న విషయం గమనించి, అతనికి ఇవ్వాలని ఈ అధ్యాయంలో హితువు చేయబడింది.

## 56వ అధ్యాయం:

### అల్లాః పేరుతో కేవలం స్వర్గమే అడగాలి

జాబిర్ రజియల్లాహు అన్హు కథనం: ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశించారు: "అల్లాః సమ్ముఖమై ప్రార్థించి కేవలం స్వర్గమే అడగాలి". (అబూ దావూద్).

## ముఖ్యాంశాలు:

1- ప్రత్యేకంగా అల్లాహ్‌ను ఉద్దేశించి అతి ముఖ్యమైన స్వర్గము తప్ప మరేదీ అడగరాదు.

2- అల్లాహ్‌కు ముఖము ఉంది అన్న విషయం ఈ హదీసు ద్వారా రుజువవుతుంది.

## తాత్పర్యం:

అర్థించే వ్యక్తి అల్లాహ్ శుభ నామములను, విశేషణాలను గౌరవించాలి. ప్రత్యే-కంగా అల్లాహ్‌నుద్దేశించి (సమ్ముఖమై) ప్రాపంచిక విషయాల్ని అడగరాదు. స్వర్గం, అందులోని వరాలు, ఆయన సంతృప్తి, ఆయన గౌరవనీయ ముఖ దర్శనం, ఆయనతో సంభాషన భాగ్యం తప్ప మరొకటి అర్థించ కూడదు.

## 57వ అధ్యాయం:

### 'ఒకవేళ', 'అయ్యేనచో', 'ఇలా చేసి ఉంటే' లాంటి పదాలు ఉపయోగించుట

అల్లాహ్ ఆదేశం: ﴾"ఒకవేళ" మాకు అధికారం ఉండివున్నట్లయితే ఇక్కడ మేము చంపబడి ఉండే వాళ్ళము కాము﴿. **(3: ఆలె ఇమ్రాన్: 154).** మరో చోట ఇలా చెప్పబడింది: ﴾వారు "గనక" మా మాటలు ఆలకించివున్నట్లయితే చంపబడి ఉండేవారు కారు" అని అన్నవారు వీరే﴿. **(3: ఆలె ఇమ్రాన్: 168).**

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశించారని, అబూ హురైరా రజియల్లాహు అన్హు ఉల్లేఖించారు: "నీకు లాభం చేకూర్చేవాటిపై శ్రద్ధ వహించు. అందులో సహాయం కొరకు అల్లాహ్‌ను అర్థించు. (విధివ్రాతపై

నమ్మకం ఉంచి) పని చేయకుండా ఉండకు. సోమరితనానికి గురికాకు. ఆ తరువాత ఏదైనా నష్టం, ఆపద కలిగితే "అయ్యో! ఒకవేళ నేను ఇలా చేస్తే, అలా జరిగి ఉండేది" అని చెప్పకు. కాని "ఖద్దరల్లాహు మా షాఅ ఫఅల" (అల్లాః విధి వ్రాసాడు. ఆయన కోరినట్లే జరిగింది) అని అనండి. "ఒకవేళ ఇట్లు చేస్తే" అన్న పదం షైతాన్ ద్వారాలు తెరుస్తుంది. (షైతానీయ కర్మలకు నాంది పలుకుతుంది). (ముస్లిం).

## ముఖ్యాంశాలు:

1- సూరె ఆలె ఇమ్రాన్ లోని రెండు వాక్యాల భావం తెలిసింది. (అందులో నిషేధించిన పదం ఉపయోగించువారి ప్రస్తావన ఉంది).
2- ఏదైనా ఆపద, కష్టం వచ్చినప్పుడు "ఒకవేళ ఇలా చేస్తే" లాంటి పదాల ఉపయోగాన్ని స్పష్టంగా నిషేధించడం జరిగింది.
3- అది షైతానీయ కర్మలకు ద్వారాము తెరుస్తుందని కూడా తెలియజేయబడింది.
4- దానికి బదులు మంచి పదాలు బోధించబడ్డాయి.

## తాత్పర్యం:

గమనిక: మానవుడు పైన నిషేధించిన పదం రెండు రకాలుగా ఉపయోగిస్తాడు. ఒకరకం మంచిదైతే. రెండవది మంచిది కాదు. మరో విధంగా చెప్పాలంటే ఒకటి ప్రశంసనీయమైనది. రెండవది దానికి విరుద్ధం.

ప్రశంసనీయానికి విరుద్ధమైనది ఎలా?

తనకిష్టము లేని ఒక సంఘటన తన పై లేక తన ద్వారా జరుగుతుంది. అప్పుడు అతను "ఒకవేళ నేను ఇలా చేస్తే అలా అయిఉండేది" అని అంటాడు. ఇదే షైతాన్ పని. ఎందుకనగా ఇందులో రెండు విధాల నివారణలున్నాయి.

ఒకటి: పశ్చాత్తాపము, కోపం, నిరాశ పెరుగుతుంది. ఇది లాభం లేదు. అందుకే ఈ పరిస్థితి రానివ్వద్దు.

రెండు: అల్లాః పట్ల, ఆయన వ్రాసి ఉంచిన విధివ్రాత పట్ల ఉండవలసిన మర్యాదకు వ్యెతిరేకమగును. అన్ని విషయాలు, సంఘటనలన్నియు అందులో వ్రాసి ఉన్నాయి. అందులోని ఏది సంభవించనుందో, అది తప్పక సంభవించవలసినదే. దాన్ని ఎవరూ ఆపలేరు. "ఒకవేళ నేను, ఇట్లు చేస్తే, అట్లు చేస్తే" అనడంలో ఒక వింధంగా అభ్యంతరం ఉంటుంది. విధివ్రాతపై విశ్వాసం బలహీన పడుతుంది.

కావున వీటిని మానవుడు వదలనంత వరకు అతని విశ్వాసం సంపూర్ణం కాదు.

ప్రశంసనీయమైనది:

ఏదైనా మేలును కోరుతూ అనుట. ఇది ప్రశంసనీయమైనది.

ఉదాహరణకు; " అతని వద్ద ఉన్నంత ధనం ఒకవేళ నా వద్ద ఉంటే, అతను (ధర్మమార్గంలో) ఖర్చు చేసినట్లు నేను కూడా చేసేవాడిని".

ఏదైనా చెడును కోరుతూ అన్నట్లైతే అది ప్రశంసనీయమైనది కాదు.

ఈ పదం పలికే వ్యక్తి కోపం, చింత, విధివ్రాతపై బలహీన విశ్వాసంతో పలికినట్లైతే అది తప్పు. అలా చెప్పకూడదు.

ఒకరికి బోధ, విద్య లాంటి మంచిని కోరుతూ చెప్పినట్లైతే అదే ప్రశంసనీయమైనది.

## 58వ అధ్యాయం:

## గాలిని దూషించుట నివారించబడింది

ఉబై బిన్ కలబ్ రజియల్లాహు అన్హు ఉల్లేఖించారు, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశించారు: "మీరు గాలిని దూషించకండి. ఏదైనా అసహ్యాకరమైనది చూసినచో ఈ దుఆ చదవండి: అల్లాహుమ్మ ఇన్నా నస్అలుక మిన్ ఖైరి హాజిహిర్రీహి, వ ఖైరి మా ఫీహా, వ ఖైరి మా ఉమిరత్ బిహీ. వ నఊజు బిక మిన్ షర్రి హాజిహిర్రిహి, వషర్రి మా ఫీహా, వ షర్రి మా ఉమిరత్ బిహీ. (తిర్మిజి). అర్థము: (ఓ అల్లాహ్! ఈ గాలి యొక్క మంచిని, అందులో ఉన్న మంచిని మరియు దానికి ఇవ్వబడిన ఆజ్ఞ యొక్క మంచిని కూడ నీతో కోరుచున్నాము. ఈ గాలి యొక్క చెడు నుండి, మరియు అందులో ఉన్న చెడు నుండి, మరియు దానికి ఇవ్వబడిన ఆజ్ఞ యొక్క చెడు నుండి నీ శరణు కోరుచున్నాము).

### ముఖ్యాంశాలు:

1- గాలిని దూషించుట నివారించబడింది.

2- అసహ్యాకరమైనదేదైనా చూసినచో మంచి దుఆ చదవాలని బోధించబడింది.

3- తనకు దొరికిన ఆజ్ఞ ప్రకారం అది నడుస్తుంది.

4- ఒకప్పుడు దానికి లాభకరమైన ఆదేశం లభిస్తుంది. ఇంకొక్కప్పుడు నష్టకరమైన ఆదేశం లభిస్తుంది.

## తాత్పర్యం:

వెనుకటి అధ్యాయంలో కాలాన్ని దూషించకండి అని చదివారు. ఇది కూడ అలాంటిది. కాని అది కాలం, అందులో సంభవించే సంఘటనలను దూషించుట నిషేధించబడింది. ఇందులో ప్రత్యేకంగా గాలిని దూషించుట నిషేధించబడింది.

నిషేధంతో పాటు ఇది పిచ్చితనము మరియు బుద్ధితక్కువతనం కూడాను. అల్లాః ఇచ్చిన ఆజ్ఞ ప్రకారం గాలి వీస్తుంది. దాన్ని దూషించువాడు వాస్తవంగా అల్లాఃను దూషిస్తున్నాడు. అల్లాఃను దూషించినట్లవుతుంది అని ఆ వ్యక్తి బహుశ గ్రహించడు. గ్రహించినట్లయితే ఇది మరీ ఘోరంగా ఉంటుంది. కాని విశ్వాసి తప్పక గ్రహించాలి.

## 59వ అధ్యాయం:

అల్లాః ఆదేశం: ﴾అల్లాఃను గురించి అజ్ఞాన భూయిష్టమైన, సత్య-దూరమైన, అనుమానాలు వ్యక్తం చెయ్యసాగారు. వారు ఇప్పుడు ఏమంటారంటే : "ఈ వ్యవహారాన్ని నడపటంలో మాకూ ఏదైనా భాగం ఉందా?" వారికి ఇలా చెప్పు : "(ఎవరికి ఏ భాగమూ లేదు) ఈ వ్యవహారానికి సంబంధించిన సమస్త అధికారాలూ అల్లాః చేతుల్లో ఉన్నాయి"﴿. **(3: ఆలె ఇమ్రాన్: 154).**

మరో ఆదేశం: ﴾అల్లాః విషయంలో కుశంకలు (చెడు అనుమానాలు) గలవారే చెడుల వలయంలోకి స్వయంగా వచ్చిపడ్డారు﴿. **(48: ఫత్ హ్: 6).**

మొదటి వాక్యం గురించి ఇబ్ను ఖయ్యిం ఇలా చెప్పారు: ఇందులో ఉన్న "అనుమానం" ఇలా వ్యాఖ్యానం చేయబడింది: "అల్లాః తమ ప్రవక్తకు

సహాయం చేయడు. ఈయన ధర్మ ప్రచారం ఇంతటితో సమాప్తం" అని కపటవిశ్వాసులు అనుమానించారు.

ఇలా కూడా ఉంది: "ఈ (ఉహద్ యుద్ధంలో) ముస్లింలకు ఏ నష్టం కలిగిందో, అది అల్లాః యొక్క విధివ్రాత మరియు వివేకానికి విరుద్ధంగా జరిగింది" అని వారు అన్నారు. అంతే కాదు "వారు విధివ్రాతను, అల్లాః వివేకాన్ని తిరస్కరించారు. ప్రవక్త ప్రచారం ముందుకు సాగుట, ఈ సత్యధర్మం ఇతర అసత్య మతాలపై ఆధిక్యం వహించుటను తిరస్కరించారు వంచుకులు" అని కూడా వ్యాఖ్యానించబడింది.

అవిశ్వాసుల, కపటవిశ్వాసుల ఈ కుశంకల, అనుమానాల ప్రస్తావన సూరె ఫత్ హ్ లో కూడా వచ్చింది.

ఈ కుశంకలు, అనుమానాలు అల్లాః మర్యాదకు, ఆయన వివేకానికి, స్తోత్రానికి, వాగ్దానాకి మరియు సహాయానికి విరుద్ధం కనుక దీనిని దురభిమానం, కుశంకలు అనబడింది.

(ఇబ్నె ఖయ్యిం తెలిపిన వ్యాఖ్యానంలో మూడు విషయాలు తెలిసినవి):

అల్లాః అసత్యానికి సత్యంపై శాశ్వత విజయం ఇస్తాడని, అందు వలన సత్యం మట్టిలో కలసిపోతుందని. లేక అది (ముస్లింలకు కలిగిన నష్టం) అల్లాః వ్రాసిన విధివ్రాత ప్రకారం జరగలేదని. లేక అల్లాః విధివ్రాత ప్రశంసనీయమైన సంపూర్ణ వివేకముతో లేదు, అది కేవలం అతని ఇష్టం అని ఎవరు అనుమానిస్తారో వారి ఈ అనుమానం అవిశ్వాసుల్లాంటి అనుమానమే. అందుకు వారికి నరక శిక్ష ఉంది.

అనేక మంది స్వయంగా తమ, లేక ఇతరుల వ్యవహారాల్లో అల్లాః పట్ల చెడు అనుమానము పాటిస్తారు. అల్లాఃను, ఆయన నామగుణాలను తెలుసు-కున్నవారు, ఆయన వివేకము, స్తోత్రము యొక్క కారుణాలను గమనించిన వారే ఈ దురఅనుమానము నుండి దూరంగా ఉండ గలుగుతారు.

తమ కొరకు మేలు గోరే బుద్ధిగలవారు అల్లాః వైపునకు మరలి, ఆయన పట్ల గల సందేహాలను గురించి ఆయనతో క్షమాపణ కోరాలి.

ప్రజల సంభాషణాల పై నీవు కొంత శ్రద్ధ వహిస్తే, చాలా మందిని విధివ్రాత, కర్మ పై ఆక్షేపము, అభ్యంతరము చేస్తూ "అది ఇలా ఉంటే బాగుండు, ఇది అలా ఉంటే బాగుండు" అని అంటూ చూస్తావు. హాఁ! ఈ గుణం కొందరిలో ఎక్కువ ఉంటే, మరికొందరిలో తక్కువ ఉంటుంది. అందులో నీవు ఎలా ప్రవర్తిస్తున్నావు అన్నది కూడా చూడు సుమా! అరబిలో ఒక పద్యం ఉంది. దాని భావం: "నీవు దాని నుండి దూరమున్నావంటే చాలా పెద్ద గండము నుండి రక్షణ పొందావు. లేకుంటే నీవు రక్షణ పొందిన వారిలో లేవన్న మాట".

## ముఖ్యాంశాలు:

1- ఆలె ఇమ్రాన్ ఆయతు యొక్క వ్యాఖ్యానం.

2- సూరె ఫత్ హ్ ఆయతు యొక్క వ్యాఖ్యానం.

3- దురఅనుమానము యొక్క రకాలు లెక్కలేనన్ని ఉన్నాయి.

4- ఎవరు అల్లాఃను, ఆయన నామగుణాలను మంచి విధంగా అర్థం చేసుకున్నారో వారే దాని నుండి రక్షణ పొందగలుగుతారు.

## తాత్పర్యం:

అల్లాః తెలిపిన తన నామములను, గుణములను విశ్వసించాలి, సత్యం అని నమ్మాలి. అదే విధంగా ధర్మమునకు మద్దతిస్తానని, సత్యమును స్థాపించి అసత్యమును ఖండిస్తానని చేసిన వాగ్దానాల్ని సత్యం అని నమ్మాలి. దాన్ని విశ్వసించుట, దానిపై తృప్తి పడుట కూడా విశ్వాసమే.

## 60వ అధ్యాయం:

# విధివ్రాతను తిరస్కరించువారు

అబ్దుల్లాః బిన్ ఉమర్ రజియల్లాహు అన్హుమా కథనం: ఇబ్నె ఉమర్ ప్రాణం ఎవరి చేతిలో ఉందో ఆయన సాక్షి! ఒకరి వద్ద ఉహద్ కొండంత బంగారం ఉండి, దాన్ని అల్లాః మార్గంలో ఖర్చు పెట్టినా, అతను విధివ్రాతపై విశ్వసించనంత వరకు దాన్ని అల్లాః స్వీకరించడు. మళ్ళీ దానికి ఆధారంగా ప్రవక్త ﷺ హదీసును వినిపించారు. "ఈమాన్ (విశ్వాసం) అంటే: అల్లాఃను, ఆయన దూతలను, ఆయన పంపిన గ్రంథాల్ని, ప్రవక్తల్ని, ప్రళయదినాన్ని మరియు విధివ్రాత యొక్క మంచి చెడులను విశ్వసించుట". (ముస్లిం).

ఉబాద బిన్ సామిత్ ؓ తన పుత్రునికి హితువు చేస్తూ చెప్పారు: "నా కుమారుడా! ఏ నష్టం నీకు కలుగనుందో, అది కలుగక తప్పదు అని, ఏ నష్టం నీకు కలుగను లేదో, అది ఎన్నటికీ నీకు కలుగదు అని విశ్వసించనంత వరకు నీవు విశ్వాస మాధుర్యాన్ని పొందలేవు. నేను ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పగా విన్నాను: "మొట్టమొదటిసారి అల్లాః కలమును సృష్టించాడు. ఆ పిదప "వ్రాయి" అని దాన్ని ఆదేశించాడు. "ఏమి వ్రాయాలి ప్రభువు?" అని అది విన్నవించుకోగా "ప్రళయము వరకు అన్నిటి విధి (కర్మ) వ్రాయు". నా పుత్రుడా! నేను ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో విన్నాను: "ఎవరు ఈ విశ్వాసంపై కాకుండా మరో విశ్వాసంపై చనిపోతాడో అతను నా అనుచర సంఘంలోనివాడు కాడు". (అబూ దావూద్, తిర్మిజి).

ముస్నద్ అహ్మద్‌లో ఒక ఉల్లేఖనం ఇలా ఉంది: "మొట్టమొదట అల్లాః సృష్టించినది కలము. తరువాత "వ్రాయి" అని దానికి ఆజ్ఞ ఇచ్చాడు. అది అప్పుడు ప్రళయం వరకు సంభవించేవాటన్నిటిని వ్రాసేసింది". **(5/317).**

ఇబ్నె వహబ్ ఉల్లేఖనలో ఉంది: "విధివ్రాత యొక్క మంచి, చెడు (అన్నిరకములను) విశ్వసించనివారిని అల్లాః అగ్నిలో కాలుస్తాడు".

ముస్నద్ అహ్మద్, సునన్ అబీ దావూద్‌లో ఉంది, ఇబ్ను దైలమి చెప్పారు: నేను ఉబై బిన్ కఅబ్ వద్దకు వచ్చి "విధి విషయంలో నాలో కొన్ని సందేహా-లున్నాయి. మీరు ఏదైనా హదీసు వినిపించండి. దానివలన అల్లాః వాటిని నా నుండి దూరము చేయుగాకా". అప్పుడు ఆయన చెప్పారు: "నీవు ఉహద్ కొండంత స్వర్ణం దానం చేసినా, నీ విధివ్రాతను విశ్వసించనట్లయితే అల్లాః దాన్ని స్వీకరించడు. అదే విధంగా నీకు ఏ ఆపద రానుందో అది రాక తప్పదు. ఏది రానులేదో, అది రానేరాదు. ఈ విశ్వాసానికి విరుద్ధంగా మరేదైనా విశ్వాసం పై నీవు మరణిస్తే నీవు నరకవాసి అవుతావు". ఇది విన్న తరువాత నేను అబ్దుల్లాః బిన్ మస్ఊద్, హుజైఫ బిన్ యమాన్ మరియు జైద్ బిన్ సాబిత్ రజియల్లాహు అన్హుం వద్దకు వెళ్ళి ప్రశ్నించగా వారందరు కూడా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి ఇదే హదీసు వినిపించారు. ఇది సహీ హదీసు. దీన్ని హాకిం తన సహీ గ్రంథంలో వ్రాసారు.

## ముఖ్యాంశాలు:

1- విధివ్రాత ను విశ్వసించడం తప్పనిసరి.

2- ఎలా విశ్వసించాలి అని తెలిసింది.

3- దాన్ని విశ్వసించని వాని కర్మలు వృధా అవుతాయి.

4- దాన్ని విశ్వసించనంత వరకు విశ్వాస మాధుర్యాన్ని పొందలేరని తెలిసింది.

5- మొట్టమొదటి సారి అల్లాః సృష్టించిందేమిటో (కలము) దాని ప్రస్తావన వచ్చింది.

6- ప్రళయం వరకు సంభవించే విధి (అన్ని విషయాలు), అదే సందర్భంలో వ్రాయబడింది.

7- విశ్వసించనివారితో ప్రవక్తకు ఏలాంటి సంబంధం లేదు.

8- పూర్వ పుణ్యా పురుషులు పండితులతో ప్రశ్నించి తమ సందేహాలను దూరము చేసుకునేవారు.

9- సందేహాలు దూరమగుటకు పండితులు ఇచ్చిన జవాబుల పద్ధతేమిటి? వారు ఆ విషయానికి సంబంధించిన, ప్రవక్త ﷺ హదీసు వినిపించేవారు.

## తాత్పర్యం:

విధివ్రాతపై విశ్వాసం విశ్వాస మూలసూత్రాల్లో ఒకటని, అల్లాః కోరునదే సంభవించునని, కోరనిది సంభవించదని మరియు ఇలా విశ్వసించనివాడు వాస్తవంగా అల్లాఃనే విశ్వసించలేదని ఖుర్ఆను, హదీసు మరియు ఇజ్మాఏ ఉమ్మత్ ద్వారా రుజువైనది.

విధికి సంబంధించిన అన్ని విషయాల్ని మనము విశ్వసించాలి. అల్లాః సర్వము తెలిసినవాడు. ప్రళయం వరకు సంభవించునటువంటివి అన్నిటిని సురక్షితమైన గ్రంథం (లౌహె మహ్ఫూజ్)లో వ్రాసిఉంచాడు. ప్రతీది ఆయన సృష్టి, శక్తి మరియు నిర్వహణకు లోబడి యున్నాయని విశ్వసించాలి.

విధి పై విశ్వాసం సంపూర్ణమయ్యేది ఈ విశ్వాసంతో: అల్లాః తన దాసులను బలవంతము చేయలేదని, వారికి విధేయత, అవిధేయత యొక్క స్వేఛ్ఛ అనేది ఉన్నదని నమ్మాలి.

## 61వ అధ్యాయం:

## ఫోటోగ్రాఫర్లు, చిత్రకారులు

అబూ హురైర రజియల్లాహు అన్హు ఉల్లేఖించారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశించారు: "అల్లాహు తఆలా ఇలాచెప్పాడు: "నేను సృష్టించిన తీరులో సృష్టించదలుచుకున్న వారికంటే పరమ దుర్మార్గులు మరెవ్వరు?.

(మహా శక్తి గలవారైతే) ఒక అణువు లేక ఒక విత్తనం లేక జొన్న తయారు చేసి చూపండి". (బుఖారి, ముస్లిం).

ప్రవక్త ﷺ బోధించారని, ఆయిష రజియల్లాహు అన్హా ఉల్లేఖించారు: "ప్రళయదినాన అందరి కంటే కఠినమైన శిక్ష అల్లాః సృష్టిని పోలిన వాటిని సృష్టించిన వారికి విధించబడుతుంది". (బుఖారి, ముస్లిం).

ఇబ్ను అబ్బాస్ ﷺ కథనం: నేను ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పగా విన్నాను: "ప్రతీ చిత్రకారుడు నరకములో యుండును. అతను చిత్రించిన ప్రతి చిత్రానికి బదులు ఒక ప్రాణం వేయబడుతుంది. దాని ద్వారా అతన్ని శిక్షించడం జరుగుతుంది". (బుఖారి, ముస్లిం).

ఆయన ఉల్లేఖనలో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రబోధించారు: "ఇహములో బొమ్మలు గీసేవాడ్ని అల్లాః (ప్రళయదినాన) నిలదీసి ఈ బొమ్మలకు ప్రాణం పొయ్యి అని ఆజ్ఞాపిస్తాడు. కాని అతను ఆ బొమ్మలకు ప్రాణం పొయ్యలేడు". (బుఖారి, ముస్లిం, లూలు).

అలీ రజియల్లాహు అన్హు నన్ను ఉద్దేశించి ఇలా చెప్పారని అబుల్ హయ్యాజ్ ఉల్లేఖించారు: ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నన్ను ఏ కార్యము పై పంపారో దానిపై నిన్ను పంపనా? "నీవు ఏ చిత్రాన్ని చూసినా దాన్ని తూడిచివేయుము. ఎత్తైన ఏ సమాధిని చూసినా దాన్ని నేలమట్టము చేయుము". (ముస్లిం).

## ముఖ్యాంశములు:

1- చిత్రకారులకు కఠిన శిక్ష యున్నదని తెలుపబడింది.

2- దాని కారణము తెలుపబడింది. దానిపై శ్రద్ధ వహించాలి: అది అల్లాః పట్ల మర్యాదకు వ్యతిరేకం. అందుకే అల్లాః తెలిపాడు: "నేను సృష్టించిన తీరులో సృష్టించదులుచుకున్న వారికంటే పరమ దుర్మార్గులు మరెవ్వరు?.

3- అల్లాః శక్తిగలవాడు. వారు అశక్తులు. "ఒక అణువు లేక ఒక విత్తనం లేక జొన్న తయారు చేసి చూపండి" అని చెప్పబడును కాని ఎవ్వరూ తయారు చేయలేరు.

4- అందరికన్నా కఠినమైన శిక్ష వారికే గలదు.

5- ప్రతి చిత్రానికి బదులు అల్లాః ఒక ప్రాణం తయారు చేసి వాటి ద్వారా వారికి శిక్ష ఇచ్చును.

6- అందులో ప్రాణం పోయుము అని కూడా అతనికి శిక్షించబడును.

7- చిత్రాలను చూసినచో వాటిని తొలిగించాలని ఆదేశం.

## తాత్పర్యం:

ఇది గత అధ్యాయం లాంటిది. సంకల్పం, మాటలు, చేష్టలు అన్నిట్లో అల్లాఃతో ఇతరులను భాగస్వాములు చేయుట ఎంత మాత్రం తగదు. ప్రాణులను చిత్రించుట అల్లాః సృష్టించిన సృష్టితాలను పోలినట్లగును. (ప్రపంచంలో మొట్టమొదట షిర్క్ ప్రారంభమైంది ఈ చిత్రాల ద్వారానే). అందుకే ఇస్లాం దీన్ని కఠినంగా నివారించింది.

## 62వ అధ్యాయం:

### అధికంగా ప్రమాణాలు చేయుట

అల్లాః ఆదేశం: ﴾మీరు మీ ప్రమాణాలను కాపాడుకోండి﴿. **(5: మాఇద: 89).**

అబూ హురైర కథనం: నేను ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పగా విన్నాను: "అసత్య ప్రమాణం చేయడం వల్ల సరుకు అమ్ముడు పోతుంది గాని, వ్యాపారంలోని శుభం తరిగిపోతుంది". **(లూలు: 1035).**

సల్మాన్ రజియల్లాహు అన్హు ఉల్లేఖించిన హదీసులో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించారు: "మూడు రకాల మనుషులతో అల్లాః సంభాషించడు. వారిని (పాపాల నుండి) పరిశుద్ధ పరచడు. వారికి కఠిన శిక్ష కలుగును: వృద్ధ వ్యభిచారుడు. అహంకారము గల యాచకుడు. అల్లాః పేరున (ప్రమాణాన్ని) ఒక సరుకుగా చేసుకున్న వ్యక్తి. ఏది కొన్నా ప్రమాణం చేస్తాడు. ఏది అమ్మినా ప్రమాణం చేస్తాడు". (తబ్రాని సహీ సనద్ తో ఉల్లేఖించారు).

ఇమ్రాన్ బిన్ హుసైన్ రజియల్లాహు అన్హు కథనం: ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలియజేశారు: "మీలో నా జీవిత కాలంలో ఉన్నవారు అందరికంటే ఎంతో శ్రేష్ఠులు. ఆ తరువాత నా జీవిత కాలానికి సమీప కాలంలో ఉండేవారు (అందరికంటే శ్రేష్ఠులు). ఆ తరువాత వారి సమీప కాలంలో ఉండేవారు". ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ జీవిత కాలం తరువాత రెండు కాలాలను ప్రస్తావించారా లేక మూడు కాలాలను ప్రస్తావించారా అనే సంగతి నాకు తెలియదు -ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇంకా ఇలా అన్నారు: "ఆ తరువాత వచ్చేవారు తమంతట తామే (ఇతరులు అడగక పోయినా) సాక్ష్యమిస్తారు. ఏదైనా మొక్కుబడి చేసుకుంటే దాన్ని నెరవేర్చరు. వారిలో అత్యధిక మంది స్థూలకాయలుగా ఉంటారు".(లూలు: 1647).

అబ్దుల్లాః బిన్ మస్ఊద్ కథనం ప్రకారం ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ప్రవచించారు: "నా జీవిత కాలంలో ఉండేవారు అందరికంటే ఎంతో శ్రేష్ఠులు. ఆ తరువాత నా జీవిత కాలానికి అతి సమీప కాలంలో ఉండేవారు ఎక్కువ శ్రేష్ఠులు. ఆ తరువాత వారి కాలానికి సమీప కాలంలో ఉండేవారు శ్రేష్ఠులు. ఆ తరువాత వచ్చేవారు (పనికి మాలినవారు) వారి సాక్ష్యం వారి ప్రమాణాన్ని, వారి ప్రమాణం వారి సాక్ష్యాన్ని మించిపోతాయి". (లూలు: 1646).

ఇబ్రాహీం నఖ్ ఈ చెప్పారు : "మా బాల్యంలో మా పెద్దలు సాక్ష్యం మరియు వాగ్దానం విషయంలో మమ్మల్ని అదుపులో ఉంచడానికి దండించేవారు". (అహ్మద్ : 1/378,417).

## ముఖ్యాంశాలు:

1- ప్రమాణాలను కాపాడాలని హితువు చేయబడింది.

2- ప్రమాణంతో సరుకు అమ్ముడుపోతుంది, గాని వ్యాపారంలో శుభం ఉండదని తెలిసింది.

3- ప్రమాణంతో సరుకు అమ్మే, కొనే వారి గురించి కఠిన శిక్ష ఉంది.

4- పాప కారణాలు చిన్నవిగా ఉన్నప్పటికి, దాని శిక్ష పెద్దదిగా ఉండవచ్చును.

5- అడగక ముందే తమంతట తాము ప్రమాణం చేయువారు ప్రశంసించబడలేదు.

6- మొదటి మూడు కాలాలు లేక నాలుగు కాలాలను ప్రశంసించడమైనది. ఆ తరువాత ఏమి జరుగనుందో తెలుపబడింది.

7- అడగక ముందే సాక్ష్యం పలికే వారు ప్రశంసలకు అర్హులు కారు.

8- పూర్వకాలంలోని పుణ్యపురుషులు తమ సంతానానికి సాక్ష్యం, వాగ్దానం విషయంలో (మంచి శిక్షణ ఇవ్వడానికై) దండించేవారు.

## తాత్పర్యం:

ఒక విషయాన్ని నొక్కి చెప్పటానికి ప్రమాణం చేయుట ధర్మసమ్మతం అని తెలుపబడింది. ఇంకా అల్లాః యొక్క గొప్పతనాన్ని పాటించుటకు. అందుకే అల్లాః ప్రమాణం చేయుట మాత్రమే విధిగా నిలిచింది. అల్లాఃయేతరుల నామముతో ప్రమాణం చేయుట షిర్క్ అనబడింది.

ఈ మర్యాద యొక్క హక్కు ఏమనగా: సత్య విషయంలోనే ప్రమాణం చేయాలి. అధికంగా ప్రమాణం చేయకుండా అల్లాః యొక్క గౌరవమును కాపాడాలి. అసత్య ప్రమాణం మరియు అధిక ప్రమాణం ఇవి రెండూ గౌరవ మర్యాదలు మరియు గొప్పతనానికి విరుద్ధం.

## 63వ అధ్యాయం:

## అల్లాః మరియు ఆయన ప్రవక్తతో చేయబడిన వాగ్దానం

అల్లాః ఆదేశం: ﴾మీరు అల్లాఃతో ఏదైనా వాగ్దానం చేసినప్పుడు, ఆ వాగ్దానాన్ని నెరవేర్చండి﴿. (16: నహ్ల్: 91).

బురైద రజియల్లాహు అన్హు కథనం: ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎవరినైనా సైన్యాధిపతిగా నిర్ణయించినప్పుడు "అల్లాఃతో భయపడు, నీతో ఉన్న ముస్లింలతో మంచిగా ప్రవర్తించు" అని అతనికి హితువు చేసేవారు. మళ్ళి (ఒకసారి) ఇలా చెప్పారు: "అల్లాః పేరుతో పోరాడండి. అల్లాఃను తిరస్కరించినవానితో పోరాడండి. యుద్ధ ధనం దొంగలించకండి. వాగ్దాన వ్యతిరేకం చేయకండి. హతుని అవాయవాలను కోయకండి. బాలలను హతమార్చకండి. ముష్రికులైన (బహుదైవారాధకులైన) నీ శత్రువులు కలసినప్పుడు మూడు విషయాలు వారి ముందు ప్రస్తావించు: అందులో ఏ ఒక్కదాన్ని స్వీకరించినా, దాన్ని మీరు ఒప్పుకోండి. యుద్ధం నుండి దూరంగా ఉండండి.

మొదట వారికి ఇస్లాం గురించి బోధించు. వారు ఇస్లాం స్వీకరిస్తే, వారిని వారు ఉండే (దారుల్ కుఫ్ర్) ప్రాంతం నుండి ముస్లింలుండే (దారుల్ ఇస్లాం) ప్రాంతానికి వలస పోవాలని చెప్పు. వారు వలస వెళితే, ముందు నుండి అక్కడ (దారుల్ ఇస్లాంలో) ఉన్నవారికి లభించే లాంటి హక్కులు

మీకు లభించును. వారి పై ఉన్నటువంటి బాధ్యతలు మీపై ఉండును[1]. వలస పోవుటకు నిరాకరిస్తే, వారితో ఎడారి అరబ్బుల తీరులో ప్రవర్తించ బడును. అనగా అల్లాః ఆదేశాలు వారిపై జారి అగును. యుద్ధఫలంలో వారికి ఎలాంటి భాగం ఉండదు. వారు యుద్ధంలో పాల్గొంటే తప్ప. (అప్పుడు భాగం ఉండును). ఇస్లాం స్వీకరించకున్నట్లయితే పన్ను (కప్పం) చెల్లించండని తెలుపు. చెల్లిస్తామని ఒప్పుకుంటే, వారి మాటను నమ్ము. వారిపై యుద్ధానికి సిద్ధం కావద్దు. ఇది కూడా నిరాకరిస్తే, అప్పుడు అల్లాఃతో సహాయాన్ని అర్థించి, పోరాడు.

కోటలో ఉన్న (శత్రువులను) నీవు ముట్టడించినప్పుడు, అల్లాః ఆయన ప్రవక్త పూచి మీద (వారితో సంధి చేయండని) నీతో వారు కోరితే, నీవు వారికి అల్లాః ఆయన ప్రవక్త పూచి ఇవ్వకు. స్వయం నీ పూచి, నీస్నేహితుల పూచి మీద (సంధి చేయుము). అల్లాః ఆయన ప్రవక్త పూచికి వ్యతిరేకం చేయుటకన్నా మీ పూచి, మీ స్నేహితుల పూచికి వ్యతిరేకము చేయుట సులభము. కోటలో ఉన్న శత్రువులను ముట్టడించినప్పుడు అల్లాః యొక్క తీర్పు ప్రకారం (మీతో సంధి) కోరితే, అలా చేయకు. నీ తీర్పు ప్రకారం (సంధికి) సిద్ధం కావాలని చెప్పుము.. ఎందుకనగా నీవు అల్లాః తీర్పు ప్రకారం (తీర్పు చేయగలవని) నీకు తెలుసా?. (ముస్లిం).

## ముఖ్యాంశాలు:

1- అల్లాః పూచి, ఆయన ప్రవక్త పూచి మరియు ముస్లిముల పూచి మధ్యలో వ్యత్యాసం ఉంది.

---

1 (ఇది. సంపూర్ణ న్యాయం. స్వదేశియులకే అన్ని హక్కులు అనుట న్యాయం కాదు. స్వదేశియులకు లభించే యుద్ధ ఫలం వారికి లభిస్తుంది. స్వదేశియులు చేయునటివంటి యుద్ధం. అందులో సహాయం వారూ చేయాలి. (القول المفيد لابن عثيمين)

2- రెండు అపాయాలు ఎదురైనప్పుడు అందులో (ఏ ఒకటి చేయక తప్పనప్పుడు) తేలికైనదాన్ని చేసుకోవాలి.

3- అల్లాః పేరుతో యుద్ధం చేయాలి.

4- అల్లాఃను తిరస్కరించినవారితో పోరాడండి.

5- అల్లాః సహాయాన్ని అర్థించి, వారితో పోరాడండి.

6- అల్లాః తీర్పులో, పండితుల (నాయకుల) తీర్పులో వ్యత్యాసం ఉంది.

7- ప్రవక్త సహచరుడు కూడా ఏదైనా తీర్పు చేసినప్పుడు అది అల్లాః తీర్పుకు అనుకూలంగా ఉంటుందా లేక ప్రతికూలంగా ఉంటుందా అన్న విషయం అతనికి తెలియదు.

## తాత్పర్యం:

శత్రువులకు అల్లాః మరియు ఆయన ప్రవక్త పూచి ఇచ్చి, దానికి వ్యతిరేకం చేయుట లాంటి పరిస్థితుల నుండి జాగ్రత్తగా ఉండాలన్నదే ఈ అధ్యాయం యొక్క ప్రస్తావన ఉద్దేశం. ఎప్పుడు ఇలాంటి పరిస్థితి సంభవిస్తుందో, అప్పుడు ముస్లింలు అల్లాః, ఆయన ప్రవక్త పూచి విలువను కాపాడ లేదని, అల్లాః గౌరవమును విడనాడారని మరియు రెండు అపాయాలు ఎదురైన సందర్భంలో (చిన్నదాన్ని ఎదురుకోవాలన్న హితువు మరచి) పెద్ద దానికి గురైన-వారయ్యారన్న భావం. ఇంకా ఇది స్వయంగా మన ధర్మాన్ని మనం హేళన చేసినట్లు, మన ధర్మం పట్ల అవిశ్వాసులకు అసహ్యం కలిగించినట్లు అగును. అదే వాటిని పూర్తి చేయుట, ప్రత్యేకంగా మరీ దృఢముగా చేసిన ప్రమాణాలను తప్పక పూర్తి చేయుట వలన స్వయంగా మన ఇస్లాం యొక్క మంచితనాన్ని (మన ఆచరణ ద్వారా) వారి ముందు ఉంచిన వాళ్ళ మగుదుము. ఇలా వారిలోని న్యాయశీలురు ఇస్లాంను సరియైన పద్ధతిలో అర్థంచేసుకోగలరు. తదుపరి దాన్ని గౌరవించి, అనుసరించ గలరు.

## 64వ అధ్యాయం:

# అల్లాః పై ప్రమాణం చేయుట

జుందుబ్ బిన్ అబ్దుల్లాః రజియల్లాహు అన్హు కథనం: ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించారు: "ఒక వ్యక్తి "అల్లాః ప్రమాణంగా, అల్లాః ఫలాన వ్యక్తిని క్షమించడు" అని అన్నాడు. అప్పుడు అల్లాః అన్నాడు: "నేను ఫలాన వ్యక్తిని క్షమించనని నా పేరున, నాపై ప్రమాణం చేసేవాడెవడు ఇతను. నేను నిశ్చయంగా అతడ్ని (ఫలాన వ్యక్తిని) క్షమించాను. నీ (ప్రమాణం చేసినవాని) కర్మలను వ్యర్థం చేసాను. (ముస్లిం).

అబూ హురైరా రజియల్లాహు అన్హు ఉల్లేఖించిన హదీసులో ఉంది: ఆ పదాలు పలికినవాడు ఒక ఆబిద్. (నిరంతరం ఆరాధనలో ఉండేవాడు). మళ్ళీ అబూ హురైరా చెప్పారు: "అతను పలికిన ఒక మాట, అది అతని ఇహ పర రెండు లోకాల్ని నాశనం చేసింది". (అబూ దావూద్).

## ముఖ్యాంశాలు:

1- అల్లాః పై ప్రమాణం చేయుట నుండి హెచ్చరించబడింది.

2- నరకం మన చెప్పుల వారు కంటే దగ్గరగా ఉంది.

3- స్వర్గం కూడా అలాగే.

4- "కొన్ని సందర్భాల్లో మానవుడు మాట్లాడే మాట వల్ల, అతను నరకంలోని అతి క్రింది భాగంలో పడిపోతాడు" అని ఉల్లేఖించబడిన హదీసు యొక్క సాక్ష్యాధారం ఉంది ఈ అధ్యాయంలో.

5- ఒకప్పుడు మానవుడు ఏ విషయాన్ని అతి అసహ్యకరమైనదిగా, విలువలేనిదిగా భావిస్తాడో, దాని వలనే అతన్ని (అల్లాః) మన్నిస్తాడు.

## తాత్పర్యం:

ఇది, దీని తరువాత అధ్యాయంలో వచ్చిన విషయం వాస్తవంగా అల్లాః పట్ల ఉండవలసిన మర్యాదకు వ్యతిరేకం. తౌహీద్ కు విరుద్ధం కూడాను. అల్లాః పై ప్రమాణం అనేది ఎక్కువ శాతం మానవునిలో వచ్చేది, తన కర్మలపై తనకు తాను అధికంగా అనవసరంగా సంబర పడినప్పుడు. అహంకార భావానికి గురైనప్పుడు. ఇలాంటి వాటి నుండి జాగ్రత్త పడనంత వరకు విశ్వాసం సంపూర్ణం కాదు.

## 65వ అధ్యాయం:

## తన దాసుల ఎదుట అల్లాఃను సిఫారసుగా చేయుట ఎంత మాత్రం సమ్మతం కాదు

జుబైర్ బిన్ ముత్ఇమ్ ﷺ కథనం: ఒక యడారిలో ఉండే అరబ్బు వ్యక్తి (పల్లెటూరి మనిషి) ప్రవక్త వద్దకు వచ్చి "(పోయేవారి) ప్రాణాలు పోతున్నాయి. (ఉండేవారి) కడుపులు మండుతున్నాయి. ధనసంపద మట్టిలో కలసిపోతుంది. మీ ప్రభువుతో వర్షానికై అర్థించండి. మేము అల్లాఃను మీ ఎదుటకు సిఫారసుగా ఉంచుతాము, మిమ్మల్ని అల్లాః వద్ద సిఫారసుగా ఉంచుతాము" అని అన్నాడు. ఇది విన్న వెంటనే ప్రవక్త ﷺ "సుబ్ హానల్లాః, సుబ్ హానల్లాః" అని అంటూ పోయారు. దాని ప్రభావం చివరికి సహచరుల ముఖాల మీద ప్రతిబింబించింది. మళ్ళీ ప్రవక్త ﷺ "నీ పాడుగాను! అల్లాః అంటే తెలుసా? ఇలాంటి మాటలకు (గీతపై ఉన్న పదాలు) అల్లాః ఉన్నతుడు, గొప్పవాడు. అల్లాఃను ఒకరి ఎదుట సిఫారసుగా ఉంచరాదు సుమా" అని బోధించారు. (అబూ దావూద్).

## ముఖ్యాంశాలు:

1- అల్లాహ్‌ను మీ వద్దకు సిఫారసిగా చేస్తున్నాము అన్న వ్యక్తి పట్ల (సుబ్ హానల్లాహ్ అంటూ) అది మంచిది కాదని వ్యక్తం చేశారు.

2- (ఆ యడారి అరబ్బు అన్న మాటకు) ప్రవక్త ﷺ ముఖ ప్రతిబింబాలు మారాయి, మారినట్లు సహచరుల ముఖాల ద్వారా కూడా స్పష్టం అయ్యింది.

3- "మిమ్మల్ని అల్లాహ్ వద్ద సిఫారసుగా ఉంచుతాము" అన్న అతని మాటను ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం 'తప్పు' అని చెప్పలేదు. (ఎందుకనగా ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత కాలంలో అలా అనుట ధర్మసమ్మతమే).

4- ఈ సందర్భంలో 'సుబ్ హానల్లాహ్' అనుట ఎంత సముచితమో అర్థమయింది.

5- ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత కాలంలో సహచరులు వర్షం కొరకు దుఆ చేయాలని ఆయనతో కోరేవారు.

## తాత్పర్యం:

అల్లాహ్ చాలా గొప్పవాడు. ఆయన్ను సిఫారసు చేయుటకు ఆయన దాసుల ఎదుట ప్రస్తావించుట. ఇది ఆయన గొప్పతనానికి విరుద్ధం. సామాన్యంగా ఎవరి ఎదుట సిఫారసు చేయబడుతుందో అతను సిఫారసు చేసే వ్యక్తి కంటే ఉన్నత స్థానంలో ఉంటాడు. ఇలా అల్లాహ్‌ను ఆయన దాసుల ఎదుట సిఫారసు కొరకు నిలబెట్టుట అల్లాహ్ అమర్యాద అగును. ఎప్పుడు అలా చేయకూడదు. సిఫారసు చేసేవారు అల్లాహ్ వద్ద ఆయన అనుమతి లేనిది సిఫారసు చేయలేరు. వారందరు భయపడుతుంటారు. ఇక అల్లాహ్‌ను వారి ఎదుట సిఫారసిగా నిలబెట్టుట ఎలా సంభవం, ఆలోచించండి. ఆయన ఎంత గొప్పవాడో తెలియదా? సర్వ జగత్తు ఆయన ముందు తలవంచి, విధేయత చూపుతుంది.

## 66వ అధ్యాయం:

## ప్రవక్త ద్వారా తౌహీద్ రక్షణ మరియు షిర్క్ మార్గాలను మూసివేయుట

అబ్దుల్లాః బిన్ షిఖ్ఖీర్ ﷺ కథనం: బనీ ఆమిర్ సంఘంతో నేను ప్రవక్త ﷺ వద్దకు వెళ్ళాను. "మీరు మా సయ్యిద్" అని మేమన్నాము. అప్పుడు ప్రవక్త ﷺ "శుభం గలవాడు, గొప్పవాడైన అల్లాఃయే సయ్యిద్" అని చెప్పారు. "మాలో మీరు ఎక్కువ ఘనత, ఉన్నత స్థానం గలవారు" అని వారన్నారు. "ఇలాంటి సముచితమైన పదాలు పలకండి .పరవాలేదు. కాని షైతాన్ వలలో పడకుండా జాగ్రత్తగా ఉండండని" ప్రవక్త ﷺ చెప్పారు. (అబూ దావూద్).

అనసు రజియల్లాహు అన్హు కథనం: కొందరు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి, "మాలో శ్రేష్ఠులు, మాలో శ్రేష్ఠులైన వారి కుమారులు, మాలోని సయ్యిద్, మాలోని సయ్యిద్ యొక్క కుమారులైన ఓ ప్రవక్తా!" అని అన్నారు. అది విని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం "ఓ ప్రజలారా! మీరనే మాటలు అనండి. కాని షైతాన్ మిమ్మల్ని మనోవాంఛలకు గురి చేసి, దుర్మార్గంలో పడవేయకుండా జాగ్రత్త పడండి. నేను ముహమ్మద్. అల్లాః దాసుడిని, ఆయన ప్రవక్తని. అల్లాః నన్ను ఏ స్థానంలో ఉంచాడో, దానికి మీరు మితిమీరుట నాకు ఎంత మాత్రం ఇష్టం లేదు. (నసాయి).

### ముఖ్యాంశాలు:

1- 'గులువ్వు' (మితిమీరుట) నుండి హెచ్చరించబడింది.

2- 'మీరు సయ్యిద్' అని ఎవరిని అనబడిందో, అతను జవాబులో ఏమనాలనేది తెలిసింది.

3- వారు అన్న మాట తప్పేమి కాదు. అయినా షైతాన్ వలలో పడకుండా జాగ్రత్తగా ఉండండి అని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హెచ్చరించారు.

4- అల్లాః నాకు ప్రసాదించిన స్థానాని కంటే మీరు నన్ను ఇంకాపైకి ఎత్తకండి అన్న దాని భావం స్పష్టంగా ఉంది.

## తాత్పర్యము:

ఇలాంటి అధ్యాయం వెనుకటి పేజిల్లో మీరు చదివారు. కాని సందర్భాన్ని బట్టి రచయితగారు మళ్ళీ ప్రస్తావించినారు. షిర్క్ వరకు చేర్పించే మార్గాలను మూసివేయనంత వరకు తౌహీద్ సంపూర్ణం కాదు. అది భద్రంగా ఉండదు. ఈ అధ్యాయం మరియు వెనక చదివిన ఇలాంటి అధ్యాయంలో తేడా ఏమనగా: అది షిర్క్ వరకు చేర్పించే కర్మలతో, చేష్టలతో తౌహీద్ను కాపాడాలని. ఇది వాఙ్మాలిక సంబంధమైన షిర్క్ తో తౌహీద్నుకాపాడాలని.

షిర్క్ లో పడవేసే 'గులువ్వు' వరకు చేర్పించే ప్రతి మాట/పలుకు నుండి దూరంగా ఉండనంత వరకు తౌహీద్ సంపూర్ణం కాదు.

సారాంశమేమనగా: తౌహీద్ దాని షరతులతో, పునాదులతో, దాన్ని సంపూర్ణం చేయు విషయాలతో కూడి ఉండనంత వరకు మరియు దానికి విరుద్ధమైనవాటి నుండి, లోపము కలిగించేవాటి నుండి, బాహ్యంగా, గోప్యంగా, మాటల, చేష్టల ద్వారా, మరియు దృఢసంకల్పంతో, నమ్మకంతో దూరముండనంత వరకు సంపూర్ణం కాదు.

## 67వ అధ్యాయం:

**అల్లాః ఆదేశం: ﴾వారసలు అల్లాఃకు తగిన విధంగా విలువ నివ్వలేదు. ప్రళయదినాన యావత్తు భూమండలం ఆయన**

పిడికిలిలో ఇమిడి ఉంటుంది. ఆకాశాలు ఆయన కుడి చేతిలో చుట్టబడి ఉంటాయి. వారు చేస్తున్న షిర్కు (బహుదైవారాధన)కు ఆయన ఎంతో అతీతుడు﴾. (39: జుమర్: 67).

అబ్దుల్లాః బిన్ మస్ఊద్ కథనం: యూద మత పండితుడొకడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి వచ్చి ఇలా అన్నాడు: "ముహమ్మద్! మా గ్రంథాలలో ఈ విధంగా వ్రాసి ఉంది - అల్లాః (ప్రళయదినాన) ఒక వ్రేలి పై సప్తాకాశాలను, మరొక వ్రేలిపై భూమండలాలను, వేరొక వ్రేలిపై వృక్షాలను, ఇంకొక వ్రేలిపై నేలను, ఒక వ్రేలిపై నీటిని, మిగిలిన సమస్త సృష్టి రాసుల్ని ఒక వ్రేలిపై ఎత్తి పట్టుకొని "నేనే విశ్వ సామ్రాజ్యాధినేతను" అని అంటాడు".

ప్రవక్త ﷺ అతని మాట విని వాటిని ధృవపరుస్తున్నట్లు ఉల్లాసంతో నవ్వారు. ఆ నవ్వులో ఆయన చిగుళ్ళు కుడా కన్పించాయి. ఆ తరువాత ప్రవక్త ﷺ ఈ ఆయతు పఠించారు. ﴿వారు అసలు అల్లాఃకు తగిన విధంగా విలువనివ్వలేదు. ప్రళయదినాన యావత్తు భూమండలం ఆయన పిడికిలిలో ఇమిడి ఉంటుంది. ఆకాశాలు ఆయన కుడి చేతిలో చుట్టబడి ఉంటాయి. వారు చేస్తున్న షిర్కు (బహుదైవారాధన)కు ఆయన ఎంతో అతీతుడు﴾. (39: జుమర్: 67). (లూలు: 1774).

ముస్లింలో ఉంది: "పర్వతాలు, వృక్షాలు ఒక వ్రేలిపై ఎత్తిపట్టుకుంటాడు. మళ్ళీ వాటిని గట్టిగా ఊపి, "నేనే విశ్వ సామ్రాజ్యాధినేతను, నేనే అల్లాఃను".

బుఖారిలో ఉంది: "ఆకాశాల్ని ఒక వ్రేలిపై, నీటిని, నేలను ఇంకొక వ్రేలిపై, మిగిలిన సృష్టినంతా మరొక వ్రేలిపై తీసుకుంటాడు".

ముస్లింలో ఇబ్నె ఉమర్ యొక్క 'మర్ఫూఅ్' ఉల్లేఖనం ఇలా ఉంది: "అల్లాః ప్రళయదినాన ఆకాశాల్ని చుట్టి తన కుడి చేతిలో తీసుకుంటాడు. మళ్ళీ "నేనే విశ్వసామ్రాజ్యాధినేతను, (ప్రపంచంలో) విర్రవీగే,

అహంకారానికి గురైన రాజులు ఎక్కడున్నారు? అని ప్రశ్నిస్తాడు. ఆ తరువాత సప్త భూమండలాల్ని చుట్టి తన ఎడమ చేతిలో తీసుకుంటాడు. మళ్ళీ "నేనే విశ్వసామ్రాజ్యాధినేతను, (ప్రపంచంలో) విర్రవీగే, అహంకారానికి గురైన రాజులు ఎక్కడున్నారు? అని ప్రశ్నిస్తాడు.

ఇబ్ను అబ్బాస్ రజియల్లాహు అన్హు ఉల్లేఖనలో ఉంది: "మీ చేతిలో ఒక రవ్వగింజ ఉన్నతీరు, రహ్మాన్ అరచేతిలో సప్తాకాశాలు, సప్త భూమండలాలుండును'. (ఇబ్ను జరీర్ : **24/17.** ఇబ్ తాలుత్ తస్ దీద్ : **170**).

ఇబ్ను జరీర్ కథనం: నాకు యూనుసు హదీసు వినిపించారు, మాకు ఇబ్ను వహబ్ తెలిపారు, ఇబ్ను జైద్ చెప్పారు, నాకు నా తండ్రి హదీసు వినిపించారు, ప్రవక్త ﷺ ప్రవచించారు: "(అల్లాః యొక్క) కుర్చీ ఎదుట సప్తాకాశాలు ఒక డాలులో ఏడు దిర్హంలు వేసినట్లు". (ఇబ్ను జరీర్ : **3/7.** ఇబ్ తాలుత్ తస్ దీద్ : **170.** ఫీహి అబ్దుర్ రహ్మాన్ బిన్ జైద్ జఈఫ్).

అబూ జర్ గిఫారి కథనం: నేను ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పగా విన్నాను: "అర్ష్ (అల్లాః సింహాసనము) ఎదుట కుర్చీ, ఒక విశాలమైన యడారి భూమిలో ఒక ఇనుప కడం (వ్రేళ్ళ మెట్టు) పడి ఉన్నట్లే". (బైహఖి ఫిల్ అస్మా...: **404.** ఇబ్ను కసీర్).

అబ్దుల్లాః బిన్ మస్ఊద్ కథనం: "మొదటి ఆకాశం మరియు రెండవ ఆకాశం మధ్య ఐదు వందల సంవత్సరాల దూరముంది. అదే విధంగా ప్రతీ రెండు ఆకాశాల మధ్య. ఏడవ ఆకాశము మరియు కుర్చీ మధ్య ఐదు వందల సంవత్సరాల దూరము. కుర్సీ మరియు నీళ్ల మధ్య ఐదు వందల సంవత్సరాల దూరము. అర్ష్ నీళ్ళపై ఉంది. అల్లాః అర్ష్ పై ఉన్నాడు. మీరు చేసే కర్మలు అల్లాఃకు గోప్యంగా ఏమి లేవు". (ఈ హదీసు ఇబ్ను మహ్దీ, హమ్మాద్ బిన్ సల్మాతో, ఆయన ఆసింతో, ఆయన జుర్ తో, ఆయన అబ్దుల్లాఃతో ఉల్లేఖించారు. అదే విధంగా మసూది, ఆసింతో, ఆయన అబూ వాయిల్ తో, ఆయన అబ్దుల్లాఃతో ఉల్లేఖించారు. ఈ విషయం హాఫిజ్

జహ్ బి తెలుపుతూ, ఈ హదీసు ఉల్లేఖన పరంపరాలు ఇంకెన్నో ఉన్నాయి అని చెప్పాడు.

అబ్బాసుబ్ను అబ్దుల్ ముత్తలిబ్ కథనం: ఒకసారి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం "భూమ్యాకాశాల మధ్య దూరము ఎంతో మీకు తెలుసా?" అని అడిగారు. "అల్లాః ఆయన ప్రవక్తకే బాగా తెలుసు" అన్నాము. అప్పుడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు: "వాటి మధ్య ఐదు వందల సంవత్సరాల దూరముంది. ప్రతి రెండు ఆకాశాల మధ్య అంతే దూరముంది. ప్రతి ఆకాశము యొక్క స్థూలము కూడా అంతే ఉంది. ఏడవ ఆకాశము మరియు అర్ష్ మధ్య సముద్రం ఉంది. సముద్రం పై భాగము మరియు క్రింది భాగము మధ్య దూరము భూమ్యాకాశాల మధ్య ఉన్నంత దూరము. అల్లాః దానిపై ఉన్నాడు. మానవులు చేసే కర్మలు ఆయనకు గోప్యంగా లేవు". (అహ్మద్: **1/206.** అబూ దావూద్).

## ముఖ్యాంశాలు:

1- భూమండలం ఆయన పిడికిలిలో ఉంది అనే వాక్యం యొక్క వివరణ తెలిసింది.

2- ఈ అధ్యాయంలో తెలుపబడిన విషయాలు యూదుల (మత గ్రంథాల్లో) ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో కూడా ఉండినవి. వారు వాటిని తిరస్కరించనూ లేదు. దానికి వేరే భావం తెలుపనూ లేదు.

3- యూద మత పండితుడు ఆ విషయం ప్రస్తావించిన తరువాత, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దాన్ని ధృవికరించారు. ఖుర్ఆన్ వాక్యాలు అవతరించాయి.

4- ఈ గొప్ప విషయం ఆ యూద మత పండితుడు చెప్పినందుకు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నవ్వారు.

5- అల్లాఃకు రెండు చేతులున్నవని మరియు కుడి చేతిలో ఆకాశాలు, మరో చేతిలో భూమండలాలు ఉండునని తెలిసింది.

6- ఎడమ చేయి ఉంది అని కూడా తెలిసింది.

7- ప్రపంచంలో విర్రవీగిన, తలబిరుసుతనానికి, అహంకారానికి గురైనవారు ఎక్కడ ఉన్నారు? అని అప్పుడు అల్లాః అంటాడు.

8- మనిషి చేతిలో రవ్వ గింజ ఉన్నట్లు, అల్లాః చేతిలో భూమ్యాకాశాలు ఉండును.

9- కుర్సీ ఆకాశము కన్నా చాల పెద్దది.

10- అర్ష్ కుర్సీ కన్నా పెద్దది.

11- అర్ష్ వేరు, కుర్సీ మరియు నీళ్ళు వేరు.

12- ప్రతి రెండు ఆకాశాల మధ్య దూరము తెలుపబడింది.

13- ఏడవ ఆకాశం మరియు కుర్సీ మధ్య దూరము తెలుపబడింది.

14- కుర్సీ మరియు నీళ్ల మధ్య దూరము తెలుపబడింది.

15- అల్లాః యొక్క అర్ష్ నీళ్ళపై ఉంది.

16- అల్లాః అర్ష్‌పై ఉన్నాడు.

17- భూమ్యాకాశాల మధ్య దూరము తెలిసింది.

18- ప్రతి ఆకాశము యొక్క స్థూలము (దొడ్డు) ఐదు వందల సంవత్సరాల దూరము.

19- ఏడవ ఆకాశము మరియు అర్ష్ మధ్యలో ఉన్న లోతు ఐదు వందల సంవత్సరాల దూరము.

# విషయసూచిక


| క్ర | | పేజి | క్ర | | పేజి |
|---|---|---|---|---|---|
| 1 | ఏకత్వపు బాటకు సత్యమైన మాట | 3 | 2 | తౌహీద్ ఘనత | 9 |
| 3 | విచారణ లేకుండా స్వర్గం | 14 | 4 | షిర్క్ నుండి భయపడుట | 19 |
| 5 | అల్లాహ్ వైపు పిలుపు | 21 | 6 | లాఇలాహ ఇల్లల్లాహ్ భావం | 26 |
| 7 | కష్టం రాకుండా కడాలు.. | 29 | 8 | మంత్రాలు, తాయత్తులు.. | 33 |
| 9 | చెట్లు, రాళ్ళతో శుభం...... | 36 | 10 | జంతు బలిదానం ఎవరికో... | 40 |
| 11 | అల్లాహ్‌యేతరుల కోసం జిబహ్ చేసే చోట.............. | 43 | 12 | అల్లాహ్ తప్ప ఇతరులకు మొక్కు కొనుట షిర్క్ | 45 |
| 13 | అల్లాహ్‌యేతరుల శరణు | 46 | 14 | అల్లాహ్‌యేతరులతో దుఆ | 47 |
| 15 | లాభనష్టాలు ఎవరి..........? | 52 | 16 | దైవదూతల భయం | 55 |
| 17 | సిఫారసు | 58 | 18 | మార్గదర్శకత్వం ఎవరి....? | 61 |
| 19 | ప్రేమలో హద్దు మీరుట | 64 | 20 | పుణ్యపురుషుల ఆరాధన | 68 |
| 21 | పుణ్యపురుషుల సమాధి...... | 73 | 22 | తౌహీద్ రక్షణకై ప్రవక్త కృషి.. | 74 |
| 23 | విగ్రహాల పూజ - మనం | 77 | 24 | ఇంద్రజాలం | |
| 25 | ఇంద్రజాలం యొక్క రకాలు | 83 | 26 | జ్యోతిష్యం......... | 85 |
| 27 | ఇంద్రజాలంతో చికిత్స.... | 88 | 28 | అపశకునం | 89 |
| 29 | జ్యోతిష్యశాస్త్రం | 93 | 30 | నక్షత్రబలంతో వర్షం......... | 95 |
| 31 | అల్లాహ్ పట్ల ప్రేమ | 98 | 32 | అల్లాహ్ పట్ల భయం | 102 |
| 33 | అల్లాహ్ పై నమ్మకం | 104 | 34 | అల్లాహ్ యొక్క ఎత్తుగడ.. | 106 |
| 35 | విధివ్రాతపై సహనం | 109 | 36 | ప్రదర్శనాబుద్ధి | 112 |
| 37 | ప్రాపంచికుద్దేశంతో పని.... | 115 | 38 | పండితులను ప్రభు చేసు... | 117 |
| 39 | అజ్ఞానకాలం ....అనుసర.. | 120 | 40 | దైవ నామాలను తిరస్క.... | 122 |

| | | | | | |
|---|---|---|---|---|---|
| 41 | అల్లాహ్ అనుగ్రహాలు...... | 123 | 42 | అల్లాహ్‌కు సాటి కల్పించుట | 125 |
| 43 | అల్లాహ్ ప్రమాణంతో తృప్తి | 128 | 44 | అల్లాహ్ మరియు నీవు కోరినట్లు అని పలుకవద్దు | 129 |
| 45 | కాలాన్ని దూషించుట..... | 131 | 46 | నిషిద్ధమైన బిరుదులు | 133 |
| 47 | పేర్లు మార్చుట...... | 134 | 48 | ఖుర్ఆన్, ......తో పరిహాసం | 135 |
| 49 | సర్వానుగ్రహాలు అల్లాహ్... | 137 | 50 | సంతాన ప్రసాదం అల్లాహ్.... | 142 |
| 51 | అల్లాహ్ మంచి నామాలు | 143 | 52 | అల్లాహ్‌కు సలాం అని......... | 146 |
| 53 | నీకిష్టమైతే క్షమించు ...... | 147 | 54 | నా దాసుడు నా దాసి....... | 148 |
| 55 | అల్లా: పేరుతో అడిగేవారిని... | 149 | 56 | అల్లాహ్‌తో స్వర్గం అడగాలి | 150 |
| 57 | 'ఒకవేళ, అట్లైనచో' అన.... | 151 | 58 | గాలిని దూషించకండి.. | 154 |
| 59 | అల్లాహ్ పట్ల చెడు నమ్మకం | 155 | 60 | విధివ్రాతను తిరస్కరించు... | 158 |
| 61 | ఫోటోగ్రాఫర్లు, చిత్రకారు.... | 160 | 62 | అధికంగా ప్రమాణాలు....... | 162 |
| 63 | అల్లాహ్, ప్రవక్తతో ...వాగ్దానం | 165 | 64 | అల్లాహ్‌పై ప్రమాణం....... | 168 |
| 65 | దాసుల ఎదుట అల్లాహ్ ను సిఫారసుగా చేయుట | 169 | 66 | ప్రవక్త ద్వారా తౌహీద్ రక్షణ, షిర్క్ మార్గాల మూసివేత | 171 |
| 67 | అల్లాహ్ ఔన్నత్యం............ | 172 | 68 | విషయసూచిక | 177 |

بسم الله الرحمن الرحيم

تشرف بإعداد هذا الكتاب

# شعبة توعية الجاليات بالزلفي


وزارة الشؤون الإسلامية والأوقاف والدعوة والإرشاد
الزلفي ١١٩٣٢ - المنطقة الصناعية - ص.ب: ١٨٢
ت: ٠٦٤٢٢٥٦٥٧ - فاكس: ٤٢٢٤٢٣٤
حساب الطباعة: ١/٦٩٦٠ - الحساب العام: ٣/٦٩٥٩
شركة الراجحي المصرفية - فرع الزلفي



حقوق الطبع محفوظة

لا يسمح بطبع أي من مطبوعاتنا إلا للتوزيع المجاني فقط.
بشرط عدم التصرف في أي شيء عدا شكل الغلاف الخارجي


ఈ చిరు పుస్తక ప్రచురణ బాధ్యత

ఫారెనర్స్ ఇస్లామిక్ గైడెన్స్ ఆఫీసువారు వహించారు


*P.O. Box: 182 ZULFI 11932 , Saudi Arabia,*
*Tel: 06 422 5657, Fax: 06 422 4234.*



అన్ని హక్కులు ప్రకాశకులవి.

కాని అల్లాహ్ ప్రసన్నత కొరకు ప్రచురించి, పంపిని చేయాలనుకునేవారు కవరుపేజి తప్ప పుస్తకములో ఏలాంటి మార్పు చేయకుండా ప్రచురించవచ్చును.

# القول السديد شرح كتاب التوحيد

ترجمه للغة التلغو

## شعبة توعية الجاليات في الزلفي

الطبعة الأولى: ٤/١٤٢٥

ح المكتب التعاوني للدعوة والإرشاد وتوعية الجاليات بالزلفي

فهرسة مكتبة الملك فهد الوطنية أثناء النشر

المكتب التعاوني للدعوة والإرشاد وتوعية الجاليات بالزلفي

القول السديد شرح كتاب التوحيد / شعبة توعية الجاليات بالزلفي.
الزلفي ١٤٢٥

....ص ؛ ...سم

ردمك: ١-٣٩-٨٦٤-٩٩٦٠

(النص باللغة التلغو)

١- التوحيد ، أ- العنوان

ديوي ٢٤٠ ١٤٢٤/٥١٧١

رقم الايداع: ١٤٢٤/٥١٧١

ردمك: ١-٣٩-٨٦٤-٩٩٦٠

الصف والإخراج: **شعبة توعية الجاليات في الزلفي**

مطبعة دار طيبة ـ الرياض ـ ت: ٤٢٨٣٨٤٠